# ఉత్తమ తెలుగు వాన కథలు

సంపాదకత్వం

మహమ్మద్ ఖదీర్‌బాబు



# ఉత్తమ
# తెలుగు
# వాన కథలు

సంపాదకత్వం

మహమ్మద్ ఖదీర్‌బాబు

ఛాయ ప్రచురణలు
హైదరాబాద్


# Best Rain Stories in Telugu

Edited by

Mohammed Khadeer Babu

# ఉత్తమ తెలుగు వాన కథలు

సంపాదకత్వం



Published By:

**Chaaya Resources Center**, Hyderabad

Ph: (040)-23742711 Mobile: +91-98480 23384

Email ID: chaayaresourcescenter@gmail.com

Sole Distributors:

**Analpa Book Company**, Secunderabad - 500 094

Ph: +91-70938 00678

Email ID: analpabooks@gmail.com

Published:

October, 2017

Cover:

**Lepakshi**

Cover Illustration:

**Anwar**

Layout:

**Sampangi Mallesh**

Printed at:

**Anupama**, Hyderabad

Price:

Rs. 195/-

పబ్లిషర్స్ నోట్

# వాన కథలై వచ్చిన వేళ

విత్తనం బొజ్జలో నుంచి మొక్క పాపాయిని  నేల పొత్తిళ్ళలోకి తెచ్చి, పెంచి పెద్ద చేసే దేవతే కదా వానంటే.  మేఘాలు వెండి దారాలతో భూమికి ఆకుపచ్చని జీవాన్ని నేయడమే కదా వానంటే. ప్రకృతి పసి పాపాయై  చేసే అల్లరి చప్పుళ్లే కాదు, కోపంతో ముఖం చాటేసి నిర్దాక్షిణ్యంగా జీవితాల్ని చిదిమి పారేసే మృత్యువు కూడా వానే. ఆనందం, ఆశ్చర్యం, భయం, బీభత్సం, విషాదం, దుఃఖం వానకున్న అనేక ముఖాలు. కళ్ళకు కనిపించే ప్రాణులతో పాటు, కనిపించని కోట్లాది జీవరాశుల బతుకులు  శాసించేదే వాన.  అలాంటి వాన నేపథ్యంలో తెలుగులో అనేకానేక కథలు వచ్చాయి. అందులో గుండెలు తడి చేసి, ఆలోచనలను తడిమే కథలన్నీ ఒక దరికి చేరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనే ఈ పుస్తకం.

కథలు ఎంపిక చేసింది, వాటిని ఒద్దికగా కూర్చింది, రచయితల అనుమతులు, దివంగత రచయితల వారసుల అంగీకారములు తీసుకున్నది, సర్వం తానైనది ప్రముఖ రచయిత మహమ్మద్ ఖదీర్‌బాబు. ఒక్క మాటలో చెప్పాలంటే కల ఖదీర్‌ది, ఆవిష్కరించినది ఛాయా. మాకు తెలిసి తెలుగులో ఒక రుతు స్పర్శను నేపథ్యంగా చేసుకొని కథాసంకలనాలు వచ్చిన జ్ఞాపకం లేదు. అలాంటిది ఇది మొదటిది అయితే గనక అంతకుమించిన ఆనందం లేదు. ఇందుకు సహకరించిన ప్రతీ రచయితకీ,  వారసులకీ, తమ వంతు సహకారాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు.  ఖదీర్‌కి ఏమి చెప్పినా మాకు మేము చెప్పుకున్నట్టే! ఈ సంకలనం మా రెండో ప్రచురణగా రావడం చాలా గర్వంగా ఉందని డప్పు కొట్టి మరీ చెబుతున్నాము.  మీరు కూడా అవును అంటారనుకుంటున్నాము.

కృష్ణ మోహన్‌బాబు

డైరెక్టర్, ఛాయా రిసోర్సెస్ సెంటర్

సంపాదకుడి మాట

# వర్ష కథాధారలలో

ఏదో పురా శాసనాన్ని అమలు చేస్తున్నట్టుగా కురుస్తోంది వాన– అని ఉంటుంది ఏదో కథలో.

అవును.

ఈ వాన ఆదిమకాలం నుంచి, మానవుని ఊహకు అందని కాలం నుంచి, మానవుని రాక కోసం ఎదురు చూస్తూ, మానవుని ఆవిర్భావానికి ముందే సిద్ధమయ్యి, మానవునితో పాటు కలిసి ప్రయాణించడానికి కురుస్తూనే ఉంది.

గాఢమైన చీకట్లలో, నడి మధ్యాహ్నపు పూట, ఏటవాలు ఎండల సాయంత్రాలలో, వేకువలో, నిదుర సమయాలలో, అగాధాలు నిండిన సముద్రాల మీద, కన్ను పొడుచుకున్నా ఏమీ కానరాని ఘోరారణ్యాల మీద, నిర్జీవమైన పర్వత సానువుల మీద, పొట్టలకు రజనును రాసుకుంటూ పాములు తిరిగే ఎడారుల మీద, నదుల మీద... సరస్సుల మీద... బావులలో... కాలు నిలువని కాలువల మీద ఇది కురుస్తూనే ఉంది.

ఇది మనిషి నేస్తం. ఇది మనిషి శత్రువు. ఇది మనిషికి అందని కల. ఇది చటుక్కున అందే చేరుమాలు. ఇది అతి. ఇది అత్యల్పం. ఇది సగటు. ఇది

అంచనాకు అందని తల తిక్క.

మనిషి ఎండ కావాలని మొక్కాడో లేదో తెలియదు. మనిషి చలి కోసం ప్రణమిల్లాడో లేదో తెలియదు. కాని వానను ఆశించి మాత్రం రెండు చేతులూ జోడించాడు. పూజలు చేశాడు. పారాయణాలు చేశాడు. యజ్ఞాలు యగాలు చేసి వానను తన కవల సోదరుడిగా చేసుకున్నాడు. వాన నవ్వితే తను. వాన ఏడిస్తే తను. వాన కానరాకపోతే అంధుడిలా తను.

వాన ప్రాణధార. వాన జీవధార. వాన జీవితాన్ని తడిపే, ముంచే, తేల్చే, కడిగే, మురికి చేసే, నూకలిచ్చే, నాశము చేసే యక్షిణి.

అందుకే మనిషి వాన ఎరుకతో ఉన్నాడు. వానను ఎరుకగా చేసుకుని బతికాడు. కాలాన్ని విభజించుకుని రుతువులను నిర్వచించుకుని వర్షరుతువు నుంచి వర్షరుతువు వరకు తన జీవితాన్ని నిర్మించుకున్నాడు. దానికి తన తత్త్వంలో చోటిచ్చాడు. కళలో చోటిచ్చాడు. పిల్లల పాటలలో పద్యాలలో ఆటలలో కట్టుబొట్లలో కట్టడాల్లో ప్రాధాన్యం ఇచ్చాడు.

వానను కథ చేసుకున్నాడు.

లేదా వాన కురసే సమయాలను కథలు చెప్పుకోవడానికి అనువయ్యే కథా సమయాలుగా చేసుకున్నాడు.

వాన పడుతున్నప్పుడు మాటలు నడుస్తాయి. కథలు నడుస్తాయి. కబుర్లు నడుస్తాయి. జ్ఞాపకాలు నడుస్తాయి. రెండు కాళ్లకు నీటి సంకెలలను వేసి మనిషిని బిగించి కూచోబెట్టిన వాన అతడికి ఇతరులను చూసే వ్యవధి ఇచ్చింది. తనను తాను తరచి చూసుకునే సమయం ఇచ్చింది. కనుగొనడానికి, సత్యం బోధ పరుచుకోవడానికి, నిత్య జీవితాన్ని వ్యాఖ్యానించుకోవడానికి, తక్షణ తాత్త్విక దర్శనానికి వీలు కల్పించింది.

అదంతా మనం ఈ సంకలనంలో ఉన్న కథలలో చూస్తాం.

ఎటువంటి కథలు ఇవి. గొప్ప కథలు. ఉన్నతమైన కథలు. వానను అంతెత్తున నిలబెట్టి ఒకసారి... మనిషిని అంతే ఎత్తున నిలబెట్టి మరోసారి... వానను నీటి పాలు చేసి ఒకసారి... మనిషిని అంతకన్నా అధమపాలు చేసి మరోసారి... ఇంత హోరున, ఇంత తాకిడితో, ఇంత గట్టిగా, గోడలు బద్దలు కొట్టే, రుద్ది రుద్ది శుభ్రం చేసే వాన కథలు మరో భాషలో ఇన్ని ఉంటాయా ఉండి ఉంటాయా సందేహమే. ఉన్నా అవన్నీ ఇలా ఒక్కచోట చేరాయా అన్నది కూడా సందేహమే.

తెలుగు కథ చిరపుంజీ వలే వాన కథలతో సమృద్ధిగా ఉంది. అందుకు ఈ సంకలనం తడిసి ముద్దయిన పుటలతో సాక్ష్యం పలుకుతోంది. ఈ కథలలో సమీపాలు సామ్యాలు ఉన్నాయి. ఈ కథలలో దూరాలు వైరుధ్యాలు ఉన్నాయి. ఈ కథలలో తడీ చెమ్మా ఉన్నాయి. ఇవి ఒక గుండె దుఃఖాన్ని పుట్టిస్తాయి. మరో హృదయాన తెరిపినపడ్డ నిట్టూర్పు.

ఒక బిచ్చగత్తె మీద కురిసిన వాన, ఒక వెలయాలి విటుని ఎదురు చూపుల ఇంటి పై కురిసిన వాన, ఒక అదృష్ట దురదృష్టాల మధ్యతరగతి మందభాగ్యుడిపై కురిసే వాన, ఒక రోడ్డువార కాకహోటల్ కబుర్లపై కురిసే వాన, ఒక ఆకలి కడుపు బానిసపై కురిసే వాన, చెమ్మగిల్లి వేళ్లు కొంకర్లు తిరుగగా పాలగ్లాసు ఓదార్పువేడికి కూడా నోచని ఒక దీనురాలిపై కురిసిన వాన, ఒక దొంగపై కురిసిన వాన, ఒక ఆడపిల్ల తండ్రిపై కురిసే వానను మీరు చూస్తారు.

చాలా నిర్దాక్షిణ్యమైన వానను చూస్తారు.

చాలా ఆదరంతో నిండిన వానను చూస్తారు.

పాత విశ్వాసాలను కూల్చి కొత్త నమ్మకాలను నిలబెట్టే వానను, స్థిరపడ్డ మానసిక ప్రతిబంధకాలను తుడిచి పారేసి ధైర్యాన్ని నూరి పోసే వానను, ఈ క్షణమే శాశ్వతం అని సాక్షాత్కారం కలిగించిన వానను, నగరాన్ని పద చిత్రాలుగా మలచిన వాననూ చూస్తారు.

ఈ కథలలో వాన నదులపై ఎలా కురుస్తోందో ఆ సన్నివేశంలో మానసమందు ఏ అనుభూతి చెలరేగుతుందో మీరు చదవాలి. ఈ కథలలో సరస్సుల మీది వాన ఎలా దారి తప్పిస్తుందో ఆ రాత్రి దేవదేవుడినే ఎలా భువికి దింపి దోవ చూపిస్తుందో కూడా మీరు చదవాలి.

బయట వాన కురుస్తుంటే– లోన ఆడపిల్ల ఒంటరిగా తోడు ఉంటే– మగవాడు మరి అదే ఆలోచన చేస్తే– అందుకు అంగీకరం ఉంటుందని అనుకుంటే ఛళ్లుఛళ్లుమనే వాననే కాదు ఛళ్లున చరిచే ఆమె అభిప్రాయాన్ని కూడా తరచి చూడాలి.

ఒక వాన ఒకణ్ణి తను వదిలిపెట్టిన ఇంటిని జ్ఞాపకం చేసి అతణ్ణి ఆ ఇంటి దాకా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే ఒక వాన అలా పారిపోయినవాడు ఇల్లు చేరుకుంటే ఏమవుతుందో చూపిస్తుంది.

వాన చింత మనుషులకే కాదు గడ్డికీ గునుగుకీ రెక్కలకూ పిట్టలకూ కూడా ఉంటుంది. ఒక నడి వేసవిలో నిట్ట నిలువునా వాన పడుతుంది. ఈ సమయంలో

ఈ వాన ఏమిటి అనుకుంటాం. అది మన కోసమా? కాదు. దీనంగా మొర పెట్టుకున్న మూగజీవాల గొంతు తడుపుకి. ఒక లేచివురు అంతిమ శ్వాస నిలువరింతకి. వాన కోసం జీవరాశి శోధన కూడా కథే. అలాంటి కథనూ మీరు చూస్తారు.

ఈ కథల్లో మీరు ఎంతకీ దొరక్క పదహారుసార్లు ఏమార్చి ప్రత్యక్షం కాని పాత్రలా ఉంటూనే కథంతా నడిపే శాడిస్టిక్ రాయలసీమ వాననీ, కురవాల్సిన తుది క్షణాల్లోనైనా కురిసి ఆనందబాష్పాలు రాల్చేలా చేసే కరుణామయి తెలంగాణ వాననీ చూస్తారు. రెండు చోట్లా ఉన్నది రైతే. రైతు ఉచ్ఛ్వాస వాన. తుది శ్వాసా వానే.

ఎన్నో వానలు. ఎన్నో కథలు. కాని వాన నీటిలో కాగితపు పడవను తయారు చేసుకుని ప్రయాణించాలనే మనిషిని ఈ కథలలో బహుశా భారతీయ భాషలలో మరెక్కడా లేనట్టుగా మీరు చూస్తారు. వాన నీటిపై కాగితపు పడవ ప్రయాణం! ఏమిటి అర్థం? జీవితంలో కష్టం తప్పనిసరి. వాన తప్పనిసరి. ఆశ తప్ప మరే ఆదరువు లేనివారికి కాగితపు పడవే పడవ. ఆ పడవ గమ్యం చేర్చదు. కాని అలాంటి పడవైనా ఉందని అనుకోవడం ఎంత ఓదార్పు. తెలుగు కథ ఇలాంటి వంద సెంటీమీటర్ల వాన కథలతో బలాన్ని సమకూర్చుకుంది.

ఇవి ఉత్త చినుకులేనా. వాన ధారలేనా. హోరు గాలులేనా. ముసురుతో చుట్టుముట్టే జడి తలపులేనా. అంతమాత్రపువే కావు. ఈ కథల్లో మీరు రకరకాల జీవభాషలలో తడిసిన వానను చూస్తారు. వాన సవ్వడి కంటే మధురమైన మాండలికాన్ని వింటారు. నాలుకలు తిప్పిన మాటలు. కంఠాన తడిసిన యాసలూ. ఈ వాన మన సొంతం. ఇంత సంపన్నమైన భాష కూడా మన సొంతం. ఈ వరండాలో ఈ భాష పలుకుతూ ఆ చూరులో ఆ భాషను ధార కడుతూ ఒకటే వాన. అచ్చ తెనుగు వర్షం. గొప్ప తెలుగు వర్షం.

అయినా ఇంకా చాలా వానలను మనం చూడాల్సి ఉంది.

చాలా హోరులను అనుభూతించాల్సి ఉంది.

తెలుగు కథ చాలా వానలకు బాకీ తీర్చాల్సి ఉంది.

బొగ్గు గనుల మీద ఎడ తెరిపి లేకుండా కురిసే వాన, గోండు తండాలపై రేపవలూ కురిసే వాన, అడవి లోపలి తుపాకులపై అర్ధరాత్రి చెప్పాపెట్టకుండా ఉరిమే వాన, చార్మినారు గోడలకానుకుని కూర్చున్న అత్తరు వాలాపై అదాటున కుమ్మరించే వాన, బెస్త పడవల వీపుల మీద తీరం పొడువునా సాగే ఉక్కిరి బిక్కిరి

వాన, కనకదుర్గ పాదాల చెంత కుంకమ అమ్మే అవ్వ వదనం పై చిందే పెత్తనపు వాన, వీధుల్లో వరద పారగా ఛత్రీని అలాగే పట్టి దాని కిందనే తెగిన చెప్పును కుట్టే సూది దారాలపై చిట్లే పైవర్గపు వాన, శేషాచలం సానువుల్లో చిలుం ముట్టించే వాన, అరకు సీమలలో పసుపుపూలను పూసే వాన, అసంఖ్యాక ఆడవాళ్ల గుండెల్లో మేట వేసి జడురాలిగా మారి కదలక మెదలక కురవడమే మర్చిపోయిన వాన, మంచి మగవాడి వెచ్చని అశ్రువు వంటి వాన... ఎన్నో వానలకు కథల్లో చోటు ఉంది. చోటు ఇవ్వాల్సి ఉంది.

ఈ సంకలనంలో చాలా చోట్ల వాన గెలవడం మీకు కనిపిస్తుంది.

కాని అంతిమంగా మనిషే గెలుస్తాడని, మనిషి మీద నమ్మకం ఏర్పరచుకోవచ్చని, మనకు సాటి మనిషి తప్ప నమ్మదగ్గ మరే హేతువూ లేదని ఈ వాన రూఢీ పరుస్తుంది.

ఇంతకంటే ఏం కావాలి?

ఇంతకుమించిన పునరాభయం కన్నా పాఠకులకు వేరే ఏం చేరవేయాలి?

అందుకే ఈ సంకలనం ఎడిట్ చేసినందుకు నాకు ఆనందంగా ఉంది.

తుఫాను వాన తప్ప గతితో కురిసే వాన చూడని ప్రాంతం నుంచి వచ్చినవాణ్ణి. ఆ లోటునీ ఆ తలమునకల తలంపుని ఇలా వ్యక్తపరచడం కూడా నాకు బాగుంది. మనిషిని శుభ్రపరచడానికి ఈ నీళ్ల చీపురిని ఒక సాహిత్యరూపంగా రచయితలు ఎలా ఉపయోగించారా అని చూడటంలోని కుతూహలం కూడా ఈ సంకలనం తేవడానికి ఒక కారణం.

ఇందులో చేరదగ్గ మరో నాలుగైదు కథలైనా ఉన్నాయి. కాని ఇప్పటికే సంకలనం పరిమాణం దృష్ట్యా వాటిని తీసుకోలేకపోయాను. రాబోయే రోజుల్లో మరిన్ని వాన కథలు వచ్చి ఇలాంటి మరో సంకలనం వస్తుందని ఆశిస్తాను. ఒకటి రెండు కథల అనుమతి కోసం రచయితలను, వారి వారసులను సంప్రదించడానికి ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నించినా కాంటాక్ట్ దొరకలేదు. వారు ఈ ప్రయత్నాన్ని అర్థం చేసుకుని మన్నిస్తారని భావిస్తాను. అలాగే తల మీద తువ్వాలైనా లేక ఉత్త చేతులు కప్పుకుని దిక్కులు చూస్తూ నిలబడ్డ నా కథ ఈ ఉత్తమమైన కథల సరసన తల దాచుకోవాలని ఆశించడం తబ్బిబ్బుతో కూడిన ప్రాప్తమనే అనుకుంటాను.

మరో విషయం.

ప్రయత్నిస్తే వాన కథలో రాదు. వానే ప్రయత్నించి తాను కథలో జొరబడాలి. ఈ ఒక్క కారణం రీత్యా వందల కొద్ది కథలు రాసిన తెలుగు మహా రచయితల కథలలో ఒక్క వాన కథ కూడా లేకపోవడం మనం గమనిస్తాం. కనుక వానను ఎంచుకునే అదృష్టం అందరికీ దక్కదు. వాన తాను ఎంచుకునే అదృష్టం అందరు కథకులకూ ఇవ్వదు. ఆ మేరకు ఈ సంకలనం కథలు రాసే రాయబోయే రచయితలకు తప్పనిసరి అభ్యాసం అని కూడా భావిస్తాను.

ఈ కళకళమని– జలజలమని– హోరుహోరున గోల చేసే– అమ్మఒడి కన్నా మెత్తగా నెమ్మదించే వాన కథలలోకి గొడుగూ తొడుగూ లేకుండా ప్రవేశించండి.

ముగిసే సమయానికి కచ్చితంగా మీరు మునుపటి మనిషిలా మాత్రం ఉండరు.

సంస్కారాల ఉన్నతీకరణ కోసం కురిసిన ఈ కథలలోకి నలుపెక్కిన మేఘాలతో స్వాగతం.

ఆగస్టు 29, 2017.

# ఇది కుమ్మరింత


1. గాలివాన • పాలగుమ్మి పద్మరాజు • 15

2. వర్షం • రావి శాస్త్రి • 31

3. ఊరి చివరి ఇల్లు • దేవరకొండ బాలగంగాధర తిలక్ • 41

4. డబ్బు • బీనా దేవి • 71

5. అదృష్టహీనుడు • శారద • 81


6. రెండు గంగలు • సత్యం శంకరమంచి • 91

7. పాలు • బి.ఎస్.రాములు • 95

8. అతడి పేరు మనిషి • మహేంద్ర • 109

9. గాలివాన • ఎ.ఎం.అయోధ్యా రెడ్డి • 123

10. పేగు కాలిన వాసన • జగన్నాథ శర్మ • 131

# ఇదీ కుండపోత


11. గోడ • కుప్పిలి పద్మ • 143

12. వాన రాలే • స్వామి • 153

13. ముసురు పట్టిన రాత్రి • గుమ్మా ప్రసన్నకుమార్ • 165

14. అతడు మనిషి • అద్దేపల్లి ప్రభాకర్ • 177

15. నిశ్శబ్దపు పాట – శ్రీకాంత్ • 193


16. ఉత్తర పొద్దు • స.వెం.రమేశ్ • 209


17. వాన కురిసింది • గంగుల నరసింహారెడ్డి • 219

18. మృగశిర • అజయ్ ప్రసాద్ • 231

19. నగరంలో వాన • పూడూరి రాజిరెడ్డి • 243

20. ఒక సాయంత్రపు అదృష్టం • మహమ్మద్ ఖదీర్‌బాబు • 249



# గాలి వాన

## పాలగుమ్మి పద్మరాజు

● రచనా కాలం: 1951

**పాలగుమ్మి పద్మరాజు:** సర్వ కాలాలకూ సర్వ దేశాలకూ కూడా అందగలిగే కథలు కొన్నయినా సృజించగల తెలుగు కథకులు ఉన్నారని నిరూపించిన రచయిత. వీరి 'గాలి వాన' కథ ప్రపంచ కథల పోటీలో రెండవ బహుమతి దక్కించుకుని తెలుగు కథకు ఆత్మవిశ్వాసపు కొనసాగింపును ఇచ్చింది. 'పడవ ప్రయాణం' వీరి విఖ్యాతమైన మరోకథ. స్వస్థలం ప.గో.జిల్లా అత్తిలి. లెక్చరర్‌గా సొంత ప్రాంతంలోనూ ఆ తర్వాత సినిమా రచయితగా మద్రాసులోనూ జీవనం గడిపారు. దాసరి నారాయణరావు తీసిన పదుల కొద్ది సినిమాలలో వీరి ప్రమేయం ఉంది. పాటలు, పద్యాలు, నవలలు కూడా రాశారు. 1983లో తన 68వ ఏట మరణం.

మబ్బు మసగ్గా అలుముకు పోయింది. రైలు చాలా ఆలస్యంగా వచ్చింది. రావుగారు రెండోతరగతి పెట్టె ఎక్కుతుంటే, ఆయనకు తన ఇల్లు ఆ యింట్లో అలవాటు పడ్డ సుఖాలు అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆయన చదువుకునే గది అతి శుభ్రంగా తుడిచి ఉంది. అందులో నల్లవిరుగుడు చేవతో చేసిన రాతబల్ల. దానిమీద ఒక మూలంగా ఆకుపచ్చ గొట్టంతో దీపం వెలుగుతూ ఉంటుంది. ఆయన కుర్చీ మెత్తలో కూర్చునేచోట అనుకూలమైన పల్లాలు ఏర్పడ్డాయి. సోఫాలో ఉన్నట్లు కూడా తెలియకుండా ఆయన భార్య కూర్చుని ఉంటుంది. ఆయనకు నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడ, యిద్దరు మగవాళ్ళని చూస్తే ఆయనకు ఎంతో గర్వం.

రైలుపెట్టెలో మూడు మెత్తలూ ఎవరో ఆక్రమించుకుని పరుపులు పరచు కున్నారు. తను ఎక్కినందుకు అందులో ఉన్న నలుగురు ప్రయాణీకులు చిరాకు పడుతున్నట్టు రావుగారు వాళ్ళ ముఖాలు చూడకుండానే గ్రహించారు. ఇంకో పెట్టెలోకి వెడితే బాగుంటుందని ఆయనకు అనిపించింది. కాని కూలివాడు ఆయన బెడ్డింగూ, పెట్టె, గొడుగు పైబల్ల మీద పెట్టి వెళ్ళిపోయాడు. రైలు కదిలిపోయింది. ఒక పెద్దమనిషి పరుపు కొంచెం మడిచి రావుగారికి చోటు చేశాడు. రావుగారు కూర్చుని పరిసరాలు వీక్షించడం ప్రారంభించారు.

నలుగురూ దూరప్రయాణీకులని ఆయన గ్రహించారు. బూట్లు మేజోళ్ళతో సహా బల్లల కిందకు తోసివేయబడి ఉన్నాయి. కోట్లు, పాంట్లు, చొక్కాలు, పైకొంకెలకు తగిలించి ఉన్నాయి. వదులైన పైజమాలను ముగ్గురు మగ ప్రయాణీకులు తొడుక్కున్నాడు. వస్తువులన్నీ యిటూ అటూ తొందర లేనట్లు

పరిచి ఉన్నాయి. కిటికీల పక్కన ఉన్న రెండు మెత్తల మీద ఇద్దరు పెద్ద వయసువాళ్ళు కూచున్నారు. లోపలగా ఉండే నిడుపైన బల్ల మీద ఒక యువకుడు, ఒక యువతీ కూర్చుని ఉన్నారు. యువతి ఆ యువకుని భార్య అయి ఉంటుంది. సిగరెట్టు పొగ మెత్తని ఘాటు రావుగారి నాసికా రంధ్రాలలోకి తెలియకుండా ప్రవేశించి ఒక క్షణంపాటు ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

రైలుపెట్టెలో సిగరెట్టు పొగను గురించి రావుగారికి తీవ్రమైన అభిప్రాయా లున్నాయి. అసలు ఆయన వేదాంతి. ఆయనకొక అభిమాన సిద్ధాంతముంది. వేదాంతం జీవితంతోటీ, జీవన విధానంతోటీ వ్యక్తికీ సంఘానికీ మధ్య ఏర్పడే రకరకాల సమస్యలతోటీ అనుబంధించి ఉంటుందని ఆయన వాదం. ఆయన ప్రకారం వేదాంతానికి జీవితానికి నిశితమైన మానవానుభవాలకి కూడా అతీతమైన విషయాలతో ఏమీ సంబంధం లేదు. ఆయన జీవితం సుఖంగా మిట్టపల్లాలు లేకుండా గడిచిపోయింది. అసంతృప్తి వల్ల ఆయన జీవితాన్ని గురించి అమితమైన ఉత్సాహంతోటీ పవిత్రమైన ఉద్రేకంతోటీ మాట్లాడగలడు. ఒక్క వేదాంతిగానే కాకుండా, మంచివక్తగా కూడా ఆయన ప్రఖ్యాతి పొందారు. ఆయన తన వేదాంతాన్ని అనుపమానంగా ఉద్విగ్నుడై వివరిస్తూ ఉంటారు. అసలు ఈ ప్రయాణం చేస్తున్నది ఒక ఉపన్యాసం ఇవ్వడం కోసం. 'ఆస్తిక మహాసమాజం' అని పేరు పెట్టుకున్న ఒక సంస్థ ఆహ్వానం మీద ఆయన వెడు తున్నారు. ఉపన్యాసం: సామ్యవాదమూ రమ్యరసామోదము అనే విషయాన్ని గురించి. ఆయన అభిప్రాయం సామ్యవాదంలో ఈ రమ్యరసాత్మ ఉందనో లేక ఆ రెండు పరస్పర విరుద్ధమైనవి కావడం చేత వాటికి ఒక సమన్వయం కల్పిం చాలనో అన్నది తెలుసుకోవాలంటే ఆయన ఉపన్యాసం వినవలసిందే.

రావుగారు యువదంపతుల వేపు చూశారు. యువతి ముఖం చాలా బరువుగా ఉంది. ఆమెకు కాస్త ఉత్సాహం కలగడానికి కాబోలు యువకుడు నవ్వుతూ ఆమె చెవిలో ఏదో అన్నాడు. బహుశా తన భర్తతో కూడా అతను ఉద్యోగంతో ఉన్న ఏ దూరదేశానికో మొదటిసారి ఆమె వెడుతున్నట్లుంది. రావుగారికి ఈ మధ్యనే తాను ఇచ్చిన ఉపన్యాసం జ్ఞాపకం వచ్చింది. 'సత్యము తత్వము'. ఆయన ఉపన్యాసాల శీర్షికలు శబ్దాలంకారాలను బట్టి నిర్ణయమవుతాయిగాని, అర్థ స్ఫురణను బట్టి కాదని ఆయన స్నేహితులు కొందరు ఆయన్ని వేళాకోళం చేస్తుంటారు. అది నిజం కాదని ఆయననలేదు. కాని ధ్వనిని బట్టి అర్థం అనుసరిస్తోందని మాత్రం సమాధానం చెబుతుంటారు. ఆయన ఇచ్చిన ఉపన్యాసాలలో చాలా అందమయినది 'ప్రకృతి పరిష్కృతి'.

గాలి పెరిగింది. బలంగా కిటికీ తలుపుల మీద మొత్తుతోంది. ఉన్నట్టుండి పెట్టెలో చీకటిగా అయిపోయింది. ఇంకా సాయంత్రం అయివుండదు. రావుగారి ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి కనిపించీ కనిపించని దీపపు వెలుగులో ఒక అపరాధ పరిశోధక నవలను తదైక్యంతో చదువుతున్నాడు. చటుక్కుని అతను ముఖం ఎత్తి టైం ఎంత అయి ఉంటుంది అని రావుగారిని అడిగాడు. రావుగారు ఒక క్షణం ఆలోచించారు. ఆయన చేతి గడియారం ఉన్నా కూడా 'మూడు గంటలు అయి ఉండవచ్చు' అన్నారు.

'ఎంత చీకటిగా అయిపోయింది!' అన్నాడు పెద్దమనిషి. రావుగారు సమాధానం చెప్పకుండా ఆ పెద్దమనిషి వేపు చూచారు. ఆయనకు రావుగారి వయస్సు ఉంటుంది. ఏభై ఏళ్ళ మనిషి. ఒక అపరాధ పరిశోధక నవల చదువుతూ ఆనందించటం రావుగారికి వింతగా కన్పించింది. ఎదురుగా కూచున్న ముసలాయన గంభీరంగా చుట్ట కాలుస్తూ దాని రుచి ఆస్వాదిస్తున్నాడు. కొందరు మనుష్యుల స్వభావాలే అంత అనుకున్నారు రావుగారు. ఎదురుగా కూర్చున్న ముసలాయన రావుగారి కంటే పెద్దవాడయి ఉంటాడు. కాని ఆయన ముఖంలో కుర్రవాళ్ళకి సహజమైన చురుకుతనం ఉంది. అయినా ఆ ముఖం ఆయన వయసును మాటుపరచడం లేదు. వాలిపోయిన దవడలు, ముడతలుపడ్డ నుదురు వయస్సును చాటుతూనే ఉన్నాయి. రావుగారికి ఉపన్యాసానికి ఇంకొక విషయం స్ఫురించింది. 'వయో విపాకము మనో వివేకము'.

తాను చాలా ఆరోగ్యవంతుడని రావుగారికి గర్వం. ఆయన జుట్టు వత్తుగా నల్లగా ఉంటుంది. ఆయన భార్య ఆయనకంటే పెద్దదిలా కన్పిస్తుంది. తెలియని వారు ఆమె ఆయన అప్పగారో, తల్లో అని భ్రమపడుతూ ఉంటారని ఆయన తరచుగా వేళాకోళం ఆడుతుంటారు. ఆయనకొక ఇరవయిదేళ్ళ కొడుకున్నాడనీ, ఆ కొడుక్కి అప్పుడే ఇద్దరు చక్కని పిల్లలున్నారనీ, అతను యీ మధ్యనే తండ్రిగారి న్యాయవాద వృత్తినంతనీ తనే చూసుకోడం ప్రారంభించాడనీ, రావుగారిని చూసిన వాళ్ళెవరూ అనుకోరు. ఆయనంత ఆర్జన వున్న వాళ్ళెవరూ వయస్సులో న్యాయవాద వృత్తి నుండి విరమించలేరు. ఆయన తన జీవితంలో కొన్ని నియమాలను పాటించాలని నిశ్చయించుకున్నారు. వాటిని అతిక్రమించకుండా ఉండగల సాహసం ఆయనకు ఉంది. నీతి, నియమాలను గురించి ఆయనకు పిచ్చి పట్టుదల లేదు. కాని మనిషి నడవడిని దిద్దడానికి కొన్ని నియమాలు ఉండి తీరాలని ఆయన అభిప్రాయం. ఆయన పిల్లలను నెలకొకసారి సినిమాలకు వెళ్ళనిస్తారు. అంతకంటే తరచుగా మాత్రం ఎన్నడూ వెళ్ళనివ్వలేదు. కుర్రవాళ్ళ

హృదయాల్లో ఉండే కోరికల ఎడల ఆయనకు సానుభూతి ఉంది. ఆ కోరికలు తీరడం కూడా వాళ్ళ హృదయ పరిపక్వానికి అవసరమని ఆయన నమ్మకం. అయినా కోరికలు వాళ్ళ ఆత్మను బంధించేటంత బలంగా ఉండకూడదని ఆయన అభిప్రాయం. ఆయన తన ఇంట్లో తు.చ.తప్పని క్రమపద్ధతి చాలా శ్రమపడి అమలులో పెట్టారు. ఆ క్రమపద్ధతి ఆయన మనస్సుకీ శరీరానికీ కూడా ఎంతో శాంతి, సుఖం సమకూరుస్తోంది.

అన్ని కిటీకీల తలుపులూ మూసి ఉన్నాయి. గాలి అవతల అరుస్తోంది. జల్లు కూడా ప్రారంభించింది. వాన చినుకులు గాలిబలం వల్ల కిటికీ సందుల్లో నుంచి చొచ్చుకొని వస్తున్నాయి. స్పర్శకు అన్నీ చల్లగా ఉన్నాయి. యువకుడు యువతికి కొంచెం దగ్గరగా జరగబోయాడు. యువతి ఇటూ అటూ చూచి దూరంగా జరిగింది.

'దారుణంగా ఉందే ఈ గాలివాన' అన్నాడు యువకుడు. రావుగారి పక్కనున్న పెద్దమనిషి ముఖం పైకెత్తి, ఏదో చెప్పబోయి, మానివేసి మళ్ళీ చదువు ప్రారంభించాడు. యువకుడు సిగిరెట్టు ముట్టించాడు. యువతి ముఖం చిట్లించి దూరంగా జరిగింది. యువకుడు ఒక చిరునవ్వు నవ్వి సిగరెట్లు కాలుస్తూనే కూర్చున్నాడు. చక్కగా దువ్విన యువతి తలకట్టులో నించి ముంగురులు విడిపోయి ఆమె నుదుటి మీద, చెక్కిళ్ళ మీద కదులుతున్నాయి. తన కుమార్తెలు తల దువ్వుకునే పద్ధతి రావుగారే నిర్ణయించారు. ఆ సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చింది. వాళ్ళ అలవాట్లు, నోములు, వ్రతాలు, స్నేహాలు, దుస్తులు వేసుకునే పద్ధతి అన్నీ కూడా అందాన్ని గురించీ మర్యాదను గురించీ రావుగారికున్న అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయమైపోయాయి.

ఎదురుగా కూర్చున్న ముసలాయన తన పరువుచుట్టలో నుంచి బూడిదరంగు ఫ్లానిలు చొక్కా తీసి తొడుక్కున్నాడు. ఆయన తన చొక్కాలోనూ ఆ చారల పైజామాలోనూ నిజంగా చిత్రంగా కనబడుతున్నాడు. ఆయన ఫ్లాస్క్‌లో నుంచి వేడి వేడి ఒక కప్పు పోసుకుని తాగడం ప్రారంభించాడు. రావుగారికి తన పెట్టెలో ఒవల్టిన్‌తో ఉన్న ఫ్లాస్క్ జ్ఞాపకం వచ్చింది. అది తీసి ఒవల్టిన్ ఆయన ఆప్యాయంగా చప్పరించడం ప్రారంభించారు. రావుగారికి ఒవల్టిన్ అంటే చాలా యిష్టం. కాని ఆ యిష్టానికి హద్దు మించి ఆయన ఎన్నడూ వశుడైపోలేదు. ఆ మధురమైన పానీయాన్ని ఆయన రోజుకి రెండుసార్లు ఒక్కొక్క కప్పు చొప్పున తాగుతారు.

గాలి అంతకంతకు భయంకరంగా వీస్తోంది. పెద్ద చినుకులు హోరుగా రైలు పెట్టె మీద మొత్తుతున్నాయి. ఆ హోరులో రైలు నడిచే చప్పుడు కూడా మాటుపడి పోయింది. రైలు కదులుతున్నట్టు రావుగారికి ఒక్క కుదుపు వల్ల తప్ప తెలియడం లేదు.

'తుఫానులా ఉంది' అన్నాడు యువకుడు భార్యతో. ఆమె సమాధానం చెప్పకుండా ఒక రగ్గు దగ్గరగా కప్పుకుంది. ఆమె ముఖంలో పెద్ద బెంగ ఏదో ప్రతిఫలిస్తుంది. గాలివానను గురించి రావుగారి మనసులో అదురు ప్రారంభమైంది.

పెట్టె తలుపు తెరచుకుంది. ఒక్కసారి గాలీ వానా పెట్టలోకి చొచ్చుకొచ్చాయి. చినిగిపోయి తడిసిపోయిన గుడ్డలతో ఒక ఆమె పెట్టెలోకి ప్రవేశించింది. లోపల ఉన్నవారు చెప్పే అభ్యంతరాలు లక్ష్యపెట్టకుండా తలుపు మూసి ఒక మూల నీరు కారుతూ ఆమె నిలబడింది. ముసలాయన తగినంత కోపం తెప్పించుకుని 'ఇది పరువుల పెట్టి అని తెలియదూ' అన్నాడు.

'బాబ్బాబు. తాతగారు. ముష్టిముండకి కొంత నిలబట్టాకి సోటివ్వరా బాబుగారూ. దయగల బాబులు. బిడ్డలుగన్న తండ్రులు. ముష్టిముండకి మీ కానీ పారేయండి బాబు. ఆకలి కడుపులో సిచ్చెడుతంది బాబులు. గొప్ప గొప్ప బాబులు. డబ్బున్న బాబులు. గొప్ప పెభువులే అంతాను. పేదముండని ఇల్లా ఆకలితో సచ్చిపోనివ్వరు బాబులు'.....

రావుగారు ఆమె వేపు చూశారు. ఆమె కళ్ళలో తమాషాగా మెరిసే ఒక తళుకుంది. ఆ తళుకు రావుగారి హృదయంలో నిరోధభావాన్ని రేకెత్తించింది. ఆమె వయస్సు సుమారు ముప్పై ఏళ్ళుంటాయి. అంత కడుపు నిండా తిని ఉండి కొవ్వెక్కినట్టు లేకపోయినా ఆకలితో చచ్చిపోతున్నట్లు మాత్రం ఆమె కన్పించడం లేదు. ఎంత అసహాయత ఆమె నటించినా, ఆమెలో స్థైర్యం ఉంది. బిచ్చమెత్తు కోవడం మీద రావుగారికి జాలిలేకపోలేదు. కాని బిచ్చమెత్తడం తప్పని ఆయన నిశ్చితాభిప్రాయం. ఆ అమ్మి ఆయన దగ్గరగా వచ్చి బిచ్చం అడిగితే ఆయన ఇంక అనుమానం లేనంత గట్టిగా 'ఫో' అన్నారు. ఆమె ముఖం అదో మోస్తరుగా పెట్టి రెండో పక్కకు తిరిగింది. ఎదురుగా కూర్చున్న ముసలాయన దగ్గరకు వెళ్ళి వంగి పాదాలు ముట్టుకుంది. ముసలాయన కాళ్ళు వెనక్కి లాక్కున్నాడు వెకిలిగా నవ్వుతూ.

'వెళ్ళు వెళ్ళు' అన్నాడు ముసలాయన.

'అల్లా అనకండి తాతగారు. ఆ బాబంత రాతిగుండె కాదు బాబు నీది. ఆ బాబుగారికి ఇంతమాత్రం జాలిలేదు. ఆకలితో సచ్చిపోతున్న ముండని ముష్టడిగితే 'ఫో' అంటాడు బాబు'...

తన అన్న 'ఫో'ను ఆమె అనుకరించడం పెద్ద పొగరుబోతుతనమని రావుగారికి అనిపించింది. కాని ఆయనకు ఏమనడానికి తోచలేదు. ఇష్టం లేకపోయినా ఆమెవేపు చూస్తూ ఆయన అల్లాగే కూర్చున్నారు. ముసలాయన చిత్రమైన అవస్థలో పడ్డాడు. దానికి ఓ డబ్బు యిచ్చి పంపేస్తే పెట్టెలో నలుగురూ పైకేమీ అనకపోయినా హర్షించరని ఆయన అనుమానం. ఇవ్వకపోతే ఆ ముష్టిది నోరు ఎలా జారవిడుస్తుందోనని భయం. ఇందులో ఏది ఉత్తమమో ఆయనకు తేలలేదు. చివరికి లేని తీవ్రత తెచ్చి పెట్టుకుని ఆమెను పొమ్మనాడు. ముష్టిది గోల ప్రారంభించింది.

'ఇందులో డబ్బున్న దొరలున్నారని, నాబోటి ముష్టిముండని ఆకలితో సచ్చిపోనివ్వరని ఎంతో ఆశగా ఈ పెట్టెలోకొచ్చాన్రా దేవుడా! ఈ రోజు తిండికి సరిపడా అడుక్కుందామనుకున్నాను. ఎంత మోసమైపోయిందిరా దేవుడా! మూడో కలాసు పెట్టెల్లో పేదోళ్ళుంటారు. ఆళ్ళకే ఎక్కువ జాలి ఈ బాబుల కంటే. నా కట్టమంతా ఆళ్ళకి అర్థమవుద్ది. డబ్బున్న బాబులంతా రాతి గుండెలని తెలుసుకోలేకపోయాన్రా దేవుడా! అవతల గాలివాన. రైలు నడుత్తా ఉంది. ఇక్కణ్ణించీ ఎల్లా పోను– ఆ దయగల బాబులున్నసోటికి. ఇక్కణ్ణించి ఎల్లా పోను'..... !

ముష్టిమనిషి అందరి దృష్టిని ఆకర్షించింది. రావుగారి పక్కనున్న పెద్దమనిషి అపరాధ పరిధోధక నవల చదవడం ఆపేశాడు. విచిత్రంగా ఆమె వేపు చూశాడు. 'ఉన్నది ఏమి ఊరు' అని తమిళుల తెలుగులో అడిగాడు. 'ఓ వూరేటి ఓ పల్లేటి బాబు మాబోటి పేదోళ్ళకి. తమబోటి పెబువులకి సెప్పుకోనాకి వూళ్ళుంటాయి. పెద్దపెద్ద లోగిల్లుంటాయి. మీకు గేటు ముందు బంట్రోతులు కూచోని ముష్టోళ్ళని రానీకుండా తరిమేయిత్తారు. బాబులు.. నాబోటి పేదముండకో వూరేటి?'..

'నాలుక చాలా వాడి' అన్నాడాయన రావుగారిని వుద్దేశించి ఇంగ్లీషులో.

బయట చీకటిగా అయిపోయింది. చీకటి పడుతున్న కొద్దీ గాలి మరీ బలంగా వీస్తోంది. రైలు వానపాములా పాకుతోంది. రావుగారు దిగవలసిన స్టేషన్ దగ్గర పడుతోంది. ఆస్తిక సమాజం సభ్యులు ఎవరన్నా స్టేషన్‌కి రాకపోతారా అని రావుగారు ఆశగా అనుకున్నారు. ఆయన మనస్సు తికమకపెడుతోంది. తనూ

తన సామానులు రైలులోంచి దిగాలి. అదీ ప్రకృత సమస్య, సహప్రయాణీకులు సహాయం చేయకపోరు. గాలి అవతల కోపంగా ఉన్న మహాసముద్రంలాగా హోరుమంటోంది. చెట్లు పడిపోతున్న చప్పుడులాంటివి ఎన్నో గోలగా కలిసిపోయి అవతల వినబడుతున్నాయి. కదులుతున్న రైలు, గాలికి కారణభూతమైన మానవ మేధ ఆ గాలివానలో నిరుపయోగంగానూ అత్యల్పంగానూ అనిపించాయి. పెట్టెలో కొంత సుఖంగానే ఉంది. కాని అందులో నించి దిగిపోవాలి.

ముష్టిది పెట్టెలో యువ దంపతులకు ఎదురుగా మధ్యగా కూర్చుంది. కొంచెంసేపు ఆగి, మళ్ళీ ప్రారంభించింది.

'అమ్మో నా సిట్టితల్లి గారున్నరిక్కడ. సిట్టిబాబుగారు కూడా ఉన్నారిక్కడ ఇంకేం! సూడేలేదు ఎర్రిముండని. సిట్టితల్లిగారు! సిట్టిబాబుగారితో సొప్పి ఒక్క డబ్బు యిప్పించు తల్లి! ఎందుకు తల్లీ అల్లామొగం తిప్పుకుంటావు. ఏం? సిట్టితల్లికీ, సిట్టిబాబుకీ సిట్టి తగాదా వొచ్చిందా? సిట్టిబాబుగారు అత్తమానూ చిగరట్లు తాగుతారు. సిట్టితల్లి తాగనీకూడదు. అబ్బో! సిట్టితల్లికి నవ్వొత్తా వుంది'

యువతి చిరునవ్వు ఆపుకోలేక పోయింది. యువకుడు కడుపు నిండా నవ్వాడు. అన్నాడు–

'మాతో కూడా వచ్చేయకూడదూ నువ్వు? పనీపాటా చేస్తూ ఉందుగాని. తిండి గుడ్డా యిస్తామ్'

'ఏదో యిచ్చి దాన్ని పంపెయ్యకూడదూ?' అంది యువతి భర్తనుద్దేశించి.

'నాకు తెలుసు. సిట్టితల్లి గుండె జాలిగుండె. తాతగారు ఇప్పుడు నాకో అణాకి తక్కువ ఇవ్వరు. ఎర్రిముండని ఆ బాబుకంత చిరాకు వచ్చేలాగ చెయ్యకూడదు. తాతగారంత మంచిబాబు ఎక్కడా వుండరు. తాతగారు జాలిగల పెభువు'...

రావుగారు తప్ప తక్కిన అందరూ ఆమెకు ఏదో యిచ్చారు. ఆమె మాటలు వింటుంటే అందరికీ సరదాగా వుంది. కాని రావుగారి మనస్సు ఇతర విషయాలతో నిండిపోయింది. ఆయన గాలివానను గురించీ, తను రైలులోంచీ దిగడాన్ని గురించీ ఆలోచిస్తున్నారు.

రైలు ఆగినట్టు రావుగారికి ఒక ముహూర్తం పాటు తెలియలేదు. సరిగ్గా ఆపుడే గాలివాన మరీ తీవ్రమయంది. ఆయన గొడుగు ఒక చేత్తోబట్టుకు లేచారు. తలుపు తెరవడంతోటే గాలి ఆయన్ను తీవ్రంగా వెనక్కు నెట్టివేసింది. ఆయన తూలి పోయారు. ముష్టిమనిషి ఆయన సామానులు దింపిపెడతానంది. రావుగారికి ఆ సందర్భంలో మంచిచెడ్డలు ఆలోచించడానికి సావకాశం లేదు. ఆమె

సహాయాన్ని అంగీకరించక తప్పలేదు. కాని ఏదో అస్పష్టమైన నియమాన్ని ఉల్లంఘిస్తున్నట్లు ఆయన మనస్సులో కొంచెం బాధ కలిగింది. కానీ రైలు దిగి ఆయన స్టేషనులోకి పరుగెత్తి వెళ్ళిపోయారు. ముష్టి ఆమె ఆయన సామానుల బరువుతో తూలుతూ ఆయన వెనకాల వచ్చింది. సామానులు వెయింటింగు రూములో పెట్టింది. స్టేషనులో ఎక్కడా ఒక్క దీపం లేదు. రావుగారు కొంత డబ్బు తీసి ఆమెకు ఇవ్వబోయారు. ఆమె వద్దనలేదు గాని ఏదో వినబడకుండా అని చటుక్కుని మాయమయి పోయింది.

స్తబ్దుడై రావుగారు మళ్ళీ గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. గింగురుమనే ఆ గాలిలో కాళ్ళు పట్టు తప్పిపోతున్నాయి. గుడ్డలన్నీ తడిసిపోయాయి. పెట్టి తీసి చేత్తో యిటూ అటూ తడిమారు. బాటరీలైటు చేతికి తగిలింది. పట్టరాని సంతోషం వచ్చింది. రావుగారికి తన పెట్టెలో ఒక లైటున్నదన్న సంగతి గుర్తులేదు. తడిబట్టలు విప్పి పొడిబట్టలు కట్టుకున్నారు. ఊలు స్వెట్టరు తొడుక్కున్నారు. మఫ్లరు చెవులకూ తలకూ చుట్టుకున్నారు. పెట్టితాళం వెయ్యడం కూడా మరిచిపోయి కుర్చీలో కూర్చున్నారు. తన స్థితిని గురించి ఆలోచించడం కూడా ఆయనకు ఇష్టంలేదు. ఇంతలో రైలు దీపాలు కదిలాయి. స్టేషనులో ఎవరో ఒకరు వుండి తీరాలని నిశ్చయించుకుని బయటకి వచ్చారు. ఇద్దరు ఎవరో ప్లాట్‌ఫాం దాటి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. రావుగారు గొంతెత్తి పిలిచారు. ఇద్దరూ ఆగారు. ఒకరు స్టేషను మాస్టరుగారనీ ఇంకొకరు బంట్రోతని రావుగారు గుర్తించారు.

'నేను వూర్లోకి వెళ్ళాలి' అన్నారు రావుగారు ఆదుర్దాగా.

'చాలా కష్టం. రోడ్డు మీద అంగుళం అంగుళానికి చెట్లు పడి వున్నాయి. టెలిఫోను తీగలు తెగిపోయాయి. ఒకచోటికి ఇంకోచోటికి కబురు తెలియడం కూడా అసంభవం. వచ్చే స్టేషనులో రాత్రికి రైలు ఆగి పోతుంది. గాలివాన చాలా తీవ్రంగా ఉంటుందనీ, 36 గంటల వరకూ తగ్గదనీ మాకు వార్త వచ్చింది'.

'కానీ స్టేషన్‌లో యింకెవ్వరూ లేరే'

'నేనేం చేస్తాను? ఎల్లాగో స్టేషనులోనే మీరు గడపాలి'

స్టేషను మాస్టరు వెళ్ళిపోయాడు. రావుగారు వెయిటింగు రూంలోకి వెళ్ళిపోయారు. పడకకుర్చీలో కూలబడిపోయారు. గది తలుపులు మూసేస్తే గాలివాన లోపలికి రాకుండా వుంటుందని ఆయనకు తోచలేదు. రెండు కిటికీ తలుపులు ముక్కలై పోయాయి. కొన్ని పెంకులెగిరిపోయాయి. ఏవో క్రూర శక్తులు

విజృంభించి మానవుడు నిర్మించినవీ, దేవుడు సృష్టించినవీ కూడా భూమి మీద లేకుండా రూపుమాపడానికి పూనుకున్నట్లు అనిపిస్తోంది. ఈ గందరగోళంలో మనస్థైర్యాన్ని చేకూర్చే వేదాంతమేదీ రావుగారికి తోచలేదు. క్రమశిక్షణ నియమాలు, విలువలు అన్నీ కూడా మానవాతీతమైన కొన్నిశక్తులు విజృంభించి నపుడు అర్థరహితం అయిపోతాయని ఆయనకు జీవితంలో మొదటిసారి అనుభవంలోకి వచ్చింది. ప్రకృతి చెలరేగి సర్వనాశనానికొడిగట్టినట్లయితే మానవుడు తన్ను తానెలా రక్షించుకోగల్గుతాడు?

ఎన్నడూ ఎరగని భీతి రావుగారి మనసును ఆవరించింది. ఆ బాధ దుర్భరంగా ఉంది. చుట్టుపక్కల ఎక్కడా మానవ హృదయమున్నది లేదు. స్టేషన్ భీతావాహంగా వుండి గాలివాన ఉగ్రరూపం దాల్చింది. ఆయన మనస్సు ఒక పీడకలలో చిక్కుకున్నట్లు ఉక్కిరిబిక్కిరైపోయింది. ఆ గదిలో యింకో వస్తువేదో వున్నట్లు రావుగారికి కనిపించింది. తెరచిన తలుపులో నుంచి లోపలికేదో ప్రవేశించినట్టుగా. చేతిలో దీపం వెలిగించి ఆయన ఆ వేపు చూశారు. ముష్టి ఆమె గజగజ వణుకుతూ నీరు కారుతూ వొకమూల నిలబడి ఉంది. ఆమె తడి వెంట్రుకలు ముఖాన్నీ చెక్కిళ్ళనీ అంటుకున్నాయి. వాటి వెంట నీరు కారుతోంది.

'బాబుగారు! తలుపు ముయ్యలేదే! కొంచెం వెచ్చగా వుంటుంది' అంది ఆమె గొంతుక బాగా పెద్దది చేసి.

ఆయన ఒక యంత్రం లాగా లేచి తలుపు ముయ్యడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. ఆమె సహాయం చేసింది. ఎలాగో తలుపు మూసి లోపల గడియవేశారు. కానీ గాలి ఒక్కసారి వూపింది. గడియ వూడిపోయింది. ఇద్దరూ మళ్ళీ తలుపులు మూసి గదిలో ఉన్న కర్రసామాను అంతా కొన్ని కుర్చీలూ, ఒక బీరువ, బరువైన డ్రాయరూ తలుపుకి అడ్డంగా చేర్చారు. తలుపులు ముయ్యాలని తనకు తోచకపోవడం రావుగారికి వింతగా తోచింది. ఇపుడు కొంత వెచ్చగా ఉంది. భయం తగ్గింది. ఎక్కడో పెద్ద చప్పుడైంది. ఏదో పడిపోయింది. స్టేషన్ లోపలే పడిపోయిందేమో?

'ఏం గాలివానండీ బాబుగారూ! నేను పుట్టిన్నాటి నుండి యింత గాలివాన నేను చూడలేదు' అంది ముష్టి ఆమె గొంతులో ఏమీ బెదురు లేకుండా.

అంత ప్రశాంతంగా ఆమె ఎట్లా మాట్లాడగల్గుతూందో ఆయనకు అర్థం కాలేదు. ఆమె వేపు దీపం వేసి చూశారు. మూలగా చలిచేత మడిచిపెట్టుకొని వొణుకుతూ ఆమె కూచుంది. రావుగారు పెట్టె తీసి తన పంచ ఒకటి తీసి ఆమె

వేపు విసిరి 'తడిబట్ట విడిచి యిది కట్టుకో' అన్నారు. ఆయనన్నదేమీ ఆమెకు వినిపించలేదుగాని పొడిబట్ట యిచ్చినందుకు కృతజ్ఞత చూపిస్తూ బట్ట మార్చుకుంది. ఆ మూలే పొడిగా ఉన్నచోట కూర్చుంది.

రావుగారికి తనకు ఆకలి వేస్తున్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఆయన పెట్టె తీసి అందులో వున్న బిస్కెట్ల పొట్లం తీశారు. ఒకటొకటి చొప్పున నమలడం ప్రారంభించారు. ఆ మూల కూర్చున్న ఆమె ముఖం వేపు చూశారు. ఆమెకు కూడా ఆకలి వేస్తున్నదేమోనని ఆయనకు స్ఫురించింది. 'బిస్కట్లు తింటావా?' అని అడిగారు. 'ఏంటన్నారు?' అన్నదామె గట్టిగా. ఆ గాలిహోరులో ఒకరు మాట్లాడితే ఒకరికి వినిపించలేదు. ఆయన దగ్గరగా వచ్చి కొన్ని బిస్కట్లిచ్చారు. 'ఇవ్వే వున్నాయి, తినడానికి' అన్నారు రావుగారు ఏదో పొరబాటు చేసినట్లుగా. కాని అసలు లేనిదానికంటే నయం కాదూ? తన చోటికి తిరిగి వెళ్ళి పెట్టె మీద కూర్చున్నారు. కుర్చీలు తలుపుకి అడ్డం పెట్టి వున్నాయి. ఆమె గదిలో ఉండడం వల్ల కొంచెం ధైర్యం వచ్చింది. ఎవరూ లేకపోవడం కంటే ఆమె ఉండడం కొంత నయం. ఆమె దేన్ని గురించీ బాధపడదు. గాలివానను గురించి కూడా. జీవితంలో కష్టనిష్ఠూరాలు బాగా ఆమెకు అనుభవమై వుంటాయి. అంచేత ఆమె ఏ పరిస్థితినైనా కంగారు పడకుండా ఎదుర్కోగలదు. రావుగారు గడియారం వంక చూచారు. తొమ్మిది గంటలయింది. అయినా రైలు దిగిన తర్వాత కొన్ని యుగాలు గడిచినట్టు ఆయనకనిపించింది. ఆయన వచ్చే స్టేషను వరకు మిగతా వారితో కూడా ప్రయాణం సాగించి వుంటే బాగుండును. పెద్ద గాలివాన చెలరేగుతుందనీ, తను దిగేది ఒక చిన్న స్టేషన్ అనీ ఆ కంగారులో ఆయనకు స్ఫురించలేదు. స్టేషన్ నుంచి వూరు సుమారు రెండుమైళ్ళు ఉంటుంది. వూరికి తర్వాతి స్టేషన్ నుంచైనా చేరుకుని వుండవచ్చు. అన్ని విషయాలను కొన్ని సూత్రాలలో బంధించడం అలవాటయిన ఆయన మనస్సు గాలి యొక్క వేగాన్ని గురించి యోచించింది. బహుశా గంటకు 80 లేక 100 మైళ్ళు వుండవచ్చు. గాలివేగం, పెద్ద భయం ఆయన మనస్సును ఆవరించింది. ఆ గది కూలిపోవచ్చు. బయటకి పోయే ఒక్క దారీ కుర్చీలతోటీ, బల్లలతోటీ మూసి ఉంది. ముష్టి మనిషి కూచున్న చోటికి ఆయన కంగారుగా పరుగెత్తారు.

'ఈ యిల్లు కూలిపోదుగా?' అని ఆయన అడిగారు.

'ఎవరు చెప్పగలరు? యిల్లు గట్టిగానే వున్నట్టుంది. గాలి బలం ఎక్కువైతే ఏది అగుద్దీ?'

ఆమె మాటల్లో ధైర్యాన్ని కలిగించేది ఏదీ లేకపోయినా ఆమె గొంతులో ఏదో ఒక చనువూ స్థైర్యం ధ్వనించింది. ఆయన పెట్టి దగ్గరకు పోయి కూర్చున్నారు. ఆయన కూర్చున్న మూలకు నెమ్మదిగా ఆమె కూడా చేరింది. 'అక్కడ కూర్చుంటే ఒకరి మాటా ఒకరికి వినపడదు' అంది.

'గాలివాన యింత ముదిరిపోతుందని నేననుకోలేదు'

'బాబుగారు ఎందుకలా భయపడతారు' అందామె. 'ఒక్కరుండే కంటే ఇద్దరమున్నాంగదా. టికెట్టు కలెక్టరు దొంగముండావాడు. రైలు కదులుతుంటే నన్ను దింపేశాడు. ఏం చేయను. ఇక్కడుండి పోయాను. అయినా నాకేటి విసారం? బాబుగారు చుట్టవెట్టుకోనాకి ఓ పొడిగుడ్డిచ్చాడు. ఏదో కొంత ఆకలికి మేత పడేశాడు. వచ్చే టేసనులో ఈ మాత్రం సుకమయినా ఉంటాదని ఎలా అనుకోగలను? వున్నంతలో సుకంగా వుండాలి బాబుగారూ! అది లేదని యిది కాదని సీకాకుపడితే ఏం లాభం?'

ఆమె గొంతు అలా మోగుతుంటే ఆయన మనస్సు కాస్త స్థిమిత పడింది. ఆమె భౌతికదేహాన్ని చూస్తే ఆయన కసహ్యం. ఆయన మనస్సుకీ, ఆమె మనస్సుకీ ఎంతో అంతరం వుంది. అయినా ఆ భయంకరమైన రాత్రి తనకు తోడుగా ఆమె ఉన్నందుకు కృతజ్ఞత ఆయన మనసులో నిండింది.

'నీకెవరు చుట్టాలు లేరా?' అన్నారాయన. వెంటనే యింత చనువుగా ప్రశ్న వేసినందుకు నొచ్చుకున్నారు. తను రైలులో ఆమెకు ఒక కానీ కూడా యివ్వనందుకు ఆమెకు తనమీద ఏమన్నా కోపముందేమోనని ఆయన అనుమానం. కాని ఆమె మాటల్లోగానీ, చేతల్లోగానీ కోపం కనబడలేదు. గట్టిగా గొంతు ఎత్తి మాట్టాడ వలసిన అవసరం లేకుండా ఆమె కొంచెం ఆయన దగ్గరగా జరిగింది.

'సుట్టాలందరికీ వుంటారు. ఏం లాభం బాబుగారూ? మా అయ్య తాగతాడు. ఆడే మా అమ్మని సంపేశాడంటారు. నాకు మనువు అవలేదు. కానీండి బాబుగారు ఓ దొంగముండావాడితో సేవితం కలిసింది. నాకు ఇద్దరు పిల్లలండి బాబుగారు. ఆడికి జూదం, తాగుడు అలవాటయి పోయాయండి. రోజూ ఏలకి ఏలు నెగ్గుతుంటాడు. పోతుంటాయి. ఏం జెయ్యను బాబుగారు? ఇంట్లో తిండికి తిప్పలకీ నా సంపాదనే. పిల్లలింకా చిన్నోళ్ళు బిచ్చమెత్తుకోనాకి. మావోడికి రోజుకి పావలా ఇత్తానండి తాగుడికి. ఆడికి నన్ను సూత్తే అడలు బాబుగారు. తాగుడు లేకపోతే నా ఎదురుగా నిలబడి తట్టుకోలేడండి. అందుకే తాగుతాడు బాబుగారు! అసలు అందరికీ తాగుడు అలాగే అలవాటవుద్దండి'.

'నువ్వు ఏ మాత్రం సంపాదిస్తావు?'

'ఒక్కరోజు ఐదు రూపాయలు దాకా దొరుకుద్ది. ఒకరోజు కానీ కూడా వుండదు. అయినా బాబుగారు! నేనడిగితే ఎవరూ లేరనరండీ మీరు తప్పితే. కొంతసేపు ఆరితో సరదాగా మాట్టాడితే యిచ్చేత్తారండీ'

రావుగారు అనుకోకుండానే ఆమె ముఖం మీదికి దీపం వేశారు. అమె కొంచెంగా నవ్వింది. ఎవరినైనా సరే ఆమె కిందా మీదా పెట్టేయగలదు. అయినా ఆమెకు మనస్సులో అంత లోతుగా యిష్టాలు అయిష్టాలు లేనట్టు ఆయనకు అనిపించింది. జరుగుతున్న ఆ క్షణంతోనే ఆమెకు సజీవమైన అనుబంధం, గడచిన కాలపు స్మృతుల బరువుగానీ, రాబోయే రోజుల గూర్చిన ఆశలుగానీ, ఆమెకు లేవు. ఆమె నడవడిని నిర్ణయించే సూత్రాలు లేవు. ఆ సూత్రాలలో నిషేధాలసలే లేవు. నిత్యమూ ధర్మాధర్మ చింతతో బాధపడే అంతరాత్మగానీ, నాగరికులకు సహజమైన సంకీర్ణ మనస్తత్వంగానీ ఆమెకు లేవు. తను ఎన్నడూ ఎరగని మగవాడిక్కూడా ఆమె శరీరాన్ని అర్పించి తేలికైన మనస్సుతో ఆమె సుఖించగలదు. ఆయన ఆమె కొంటె చిరునవ్వుని యింకా అలానే చూస్తూ కూచున్నారు. 'ఏటండి బాబుగారూ! నాకేసలా చూత్తారు?' అంది ఆమె. 'మునుపున్నంత రంగుగా యిపుడు లేనండి' అంది.

వెంటనే ఆయన తనలోకి ముడుచుకుపోయారు. తన మనస్సులో అశ్లీలమయిన భావాలు వుంటాయన్నట్లు ఆమె సూచించినందుకు ఆమె మీద అసహ్యం కలిగింది.

'నీ వేవు చూడ్డం లేదు నేను' అన్నారాయన గట్టిగా. 'దీపం ఆర్పడం మరిచి పోయాను' అన్నారు.

అకస్మాత్తుగా పెద్ద చప్పుడైంది. గది తలుపులు ఒక్క వూపులో తెరచుకున్నాయి. అడ్డుగా పెట్టిన సామాను చెల్లాచెదరైపోయింది. ఒక తలుపు పూర్తిగా ఊడిపోయి ఒక కుర్చీ మీద నుంచి పల్టీ కొట్టింది. రావుగారి గుండె గొంతుకలో అడ్డింది. శక్తి కొద్దీ ఒక మూలకి గెంతి, పిచ్చిగా ఆయన ముష్టి ఆమెని కౌగిలించుకున్నారు. వెంటనే తెలివి తెచ్చుకుని చాలా సిగ్గుపడ్డారు. కాని ఆమె ఆయన చెయ్యిపట్టుకు నడిపించుకుని పెడితే మాట్లాడకుండా వెళ్ళారు. గుమ్మం పక్కనున్న మూలకి, ఆమె ఆయనను తీసుకువెళ్ళి ఆ మూలలో కూచోబెట్టింది. తను కూడా దగ్గరగా కూర్చుని చేతులాయన చుట్టూ చుట్టింది. ఆ కౌగిలింతలో సంకోచాలేమీ లేవు. ఆయన మనస్సులో ప్రళయమంతటి మధన జరుగుతోంది. కాని ఆ వెచ్చదనం

ఆయనకు ప్రాణావసరం. అంచేత ఆయన కాదనలేదు.

'సరిగ్గా కూకుని నా సుట్టూ సేతులేసుకోండి. కొంత ఎచ్చగుంటది. పాపం! బాబుగారు ఒణికిపోతన్నారు'.

ఆ మాటలు చాలా వెగటుగా ధ్వనించాయి రావుగారికి. ఆమె మరీ దగ్గరగా జరిగి ఆయన వొళ్ళోకి వాలింది. ఆమె రొమ్ముల బరువు ఆయన మోకాళ్ళ మీద ఆన్చింది. మోకాళ్ళు మరికాస్త దగ్గరగా ఆయన ముడుచుకుని దీర్ఘంగా అవమానకరమైన ఆలోచనా పరంపరలో మునిగిపోయారు. ఆమె ఇలా మాట్టాడుతూనే ఉంది.

'ఈ మూల బయం లేదండి. బాబుగారికి సక్కని కూతుళ్ళుంటారు యింటికాడ. బాబుగారు ఆరిని తలుసుకుంటున్నారు. మా గుడిసి ఎగిరి పోయుంటది. మా పిల్లలేమైపోయారో. ఇరుగు పొరుగోళ్ళు సూత్తుంటార్లెండి. మావోడు వట్టి ఎదవ. ఎందుకూ పనికిరాడు. చిత్తుగా తాగి పడుంటే గుడిసి ఎగిరిపోతే ఆడికేం తెలుత్తాది? పిల్లలెట్టా వున్నారో యేమో?'

ఒక మానవ హృదయంలో నించి వెలువడిన యీ వేదన వింటుంటే ఆయన హృదయం చుట్టూ పెట్టుకున్న గోడలన్నీ మాయమైపోయాయి. పెద్ద ఆవేదనతో ఆ ముష్టి ఆమెను గట్టిగా దగ్గరగా అదుముకున్నారు. ఆయన ఆవేదన తనకు అర్థమైనట్లు ఆయన మోకాళ్ళ మీద మెల్లగా తట్టింది. క్రమంగా ఆయన మనస్సు ఆలోచించడం మానేసింది. గాలి చేసే అంతులేని గోల మనస్సు పొలిమేరల్లోకి పోయింది. ఆయన కాళ్ళ మీద గుండెల మీద అనుకున్న మానవ శరీరపు వెచ్చదనం వొక్కటే ఆయనకు గుర్తుంది.

కాలం అతిమెల్లగా జరుగుతోంది. కాని ఆ సంగతి ఆయనకు తెలియదు. గాలివాన బలం హెచ్చింది. అన్ని పక్కల నించీ పెద్ద పెద్ద శబ్దాలు వినబడుతున్నై. తెల్లవారేసరికి ఒక చెట్టయినా నిలబడివుంటుందా అనిపిస్తోంది. కొంచెం యించుమించుగా పైకప్పు పెంకులన్నీ గాలికి ఎగిరిపోయాయి. కాని గాలి వల్ల వాన వారిద్దరి నుంచీ దూరంగా రెండో పక్కకి పడుతోంది.

కొంత సేపటికి రావుగారి కాళ్ళు తిమ్మిరెక్కాయి. పడుకొని ఉన్న ఆ మూర్తి కదలకుండా మెల్లగా ఆయన కాళ్ళు కదుపుకున్నారు. మెల్లగా మనస్సు మేలుకుంది. లైటు వెలిగించి ఆమె ముఖం వంక చూశారు. నిద్రలో ఆ ముఖం అమాయకంగా, నిశ్చితంగా వుంది. స్వచ్ఛమైన నిసర్గమైన ఒక శోభ ఆమె ముఖంలో దివ్యత్వం స్ఫురింపజేసింది.

గాలివాన జోరు హెచ్చింది. కాని ఆయన మనస్సులో అమితమైన శాంతి నిండింది. శరీరం అలసిపోయి విశ్రాంతి కోరింది. క్రమంగా ఆయన పరిసరాలను మరచిపోయి నిద్రలో మునిగిపోయారు. ఆయనకు మళ్ళీ మెలకువ వచ్చేసరికి వాన తగ్గింది. గాలి మాత్రం బలంగా వీస్తోంది. ముష్టి ఆమె లేచి వెళ్ళిపోయింది. గడియారం వేపు చూచుకున్నారు. ఐదుగంటలయింది. లేచి నిలబడ్డారు. మోకాళ్ళు పట్టేశాయి. అనుకోకుండానే జేబులు తడుముకున్నారు. ఆయనకు స్ఫురించిన మొదటిమాట 'దొంగముండ'! కాని ఆమె అల్లా దొంగతనం చేసి వుంటుందను కోవడం ఆయనకు యిష్టం లేదు. గదిలో నాల్గుమూలలా వెతికారు. కనబడలేదు. గడచిన రాత్రి కంగారులో ఎక్కడన్నా పడిపోయిందనుకున్నారు. గదిలో నుంచి బయటకి వచ్చారు. బయట దృశ్యం బీభత్సంగా వుంది. ప్లాట్‌ఫాం తప్ప చుట్టుపక్కలంతా నీటిమయం. కొందరు దూరంగా రైలుగట్టు వెంబడి నడిచి వస్తున్నారు. బహుశా వూళ్ళో నుంచి అయివుంటుంది. కొందరు దెబ్బలు తిన్న వాళ్ళు స్టేషను రెండోపక్కన కింద పడుకుని వున్నారు. దూరాన్నుంచి చూసి ఆయన మొగం తిప్పుకున్నారు. ఏదో హాస్పిటల్‌లో తెల్లగా శుభ్రంగా వరుసల్లో పడుకోబెట్టినపుడు తప్ప అంత నగ్నంగా మనిషి బాధపడడం ఆయనెపుడూ చూడలేదు. ఆయనకు వికారం వచ్చింది. వెనక్కు తిరిగారు.

టిక్కెట్లు అమ్మే గది పూర్తిగా కూలిపోయింది. గది తలుపులు ఎక్కడా కనబడ్డం లేదు. లోపల ఏవో కుర్చీలూ, బల్లలూ చిందరవందరగా పడిపోయి వున్నాయి. వెయింటింగు రూము కూలిపోతే ఏమైయుండునని ఆయన అనుకున్నారు. ఆ కల్లోలాన్ని శూన్యంగా చూస్తూ ఆయన నిలబడిపోయారు.

లోపల చీకటికి కళ్ళు కాస్త అలవాటు పడ్డాక ఆ సామాను కింద ఏదో శరీరం అస్పష్టంగా ఆనింది. దీపం వేసి చూశారు. ముష్టి ఆమె.

ఆయన తట్టుకోలేక పోయారు. వంగి నుదురు తాకి చూచారు. చల్లగా చచ్చిపోయి ఉంది. చేతులు రెండూ ఇవతలకు ఉన్నాయి. ఒక చేతిలో ఆయన పర్సుంది. రెండోచేతిలో కొన్ని నోట్లు, కొంత చిల్లరా వుంది. బహుశా టిక్కట్లు అమ్మిన డబ్బై వుంటుంది. గుమస్తా ఆ డబ్బు డ్రాయర్లో పెట్టి రాత్రి తొందరగా యింటికి పోయుంటాడు.

రావుగారు అకస్మాత్తుగా చిన్నపిల్లాడి వలె ఏడుపు ప్రారంభించారు. చల్లని ఆ నుదురు ముద్దుపెట్టుకున్నారు. గడిచిన రాత్రి ప్రతీ చిన్న విషయం ఆయనకు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వచ్చింది. తనకు ఆత్మ స్థైర్యాన్నీ, శాంతినీ, గాలివానకు


తట్టుకోగల శక్తినీ చేకూర్చిన ఆ మూర్తి అక్కడ పడిపోయి వుంది. ఆ గాలివానకు ఆమె బలి అయిపోయింది. ఆయన హృదయం తుఫానులో సముద్రంలాగా ఆవేదనతో పొంగి పొరలింది. తనకు జీవితంలో మిగిలిన ఒక్క ఆనందం శాశ్వతంగా పోయినట్లు ఆయనకు అనిపించింది. తన పర్సు దొంగిలించినందుకు గానీ, అంత గాలివానలో డబ్బేమన్నా దొరికితే తీసుకోవచ్చునని టిక్కెట్లు గదిలోకి వెళ్లినందుకుగానీ ఆయన ఆమెను మనస్సులో కూడా దూషించలేదు. ఆమె ఆఖరుతత్వం ఆయనకు తెలుసు. ఇప్పుడు ఆమె చిలిపితనాలు, కొంటెతనాలు ఆయనకు ప్రేమపాత్రాలయాయి. ఆయనలో లోతుగా మాటుపడియున్న మానవతత్వాన్ని ఈ జీవి వికసింపజేసింది. ఆయన భార్యగానీ, ఆయన పిల్లల్లో ఎవరుగానీ ఈమె వచ్చినంత దగ్గరగా రాలేదు. ఆయన విలువలు, నియమాలు, ధర్మచింతా, వేదాంతం అన్నీ త్యజిస్తాడాయన ఈ వ్యక్తికి ప్రాణం పొయ్యగలిగితే.

అవతల మనుష్యులు వస్తున్న సవ్వడి వినిపించింది.

రావుగారు కళ్ళు తుడుచుకొని ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డారు.

తర్వాత ఒక నిశ్చయంతో ఆమె వేళ్ళ సందులోని డబ్బుతీసి తెరచి ఉన్న డ్రాయర్‌లో వేసి డ్రాయర్ మూశారు. కానీ తన పర్సు ఆయన చేతిలోంచి విడదీయడానికి ఆయనకు మనస్సు వొప్పలేదు. తనకు సంబంధించినదేదో ఒక చిహ్నంగా ఆమె శరీరంతో ఉండిపోవాలని ఆయనకు అనిపించింది. కానీ ఇతరులు ఆమె దొంగతనం చేసిందని అనుకుంటే ఆయన భరించలేరు. అంచేత జాగ్రత్తగా ఆ పర్సులోంచి తన పేరుగల కార్డు తీసి వేసి బరువైన హృదయంతో అక్కణ్ణించి వెళ్లిపోయారు.





# వర్షం

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

● రచనా కాలం: 1959

**రావిశాస్త్రి:** సమాజంలో సాగిన జబర్దస్తీల మీద కలాన్ని కరవాలంలా తిప్పిన వీరుడు. నిజ జీవితంలో అడ్వకేటు. కాని రచనలలో బీదల, దీనుల వకాల్తాధారి. 'కార్నర్ సీటు', 'మామిడి చెట్టు', 'పిపీలికం' వంటి ఎన్నో గొప్ప కథలు ఉన్నాయి. 'అల్పజీవి' నవల ప్రసిద్ధం. పూర్తి పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. నిలువెత్తు పేజీల సాహిత్యాన్ని ఇరు చేతులతో రాసేశారా అన్నంత విరివిగా రాశారు. తట్టలో ఉన్నవన్నీ నిక్కమైన నీలాలే. జీవభాషతో పాటు ఉలికిపాటును కలుగజేసే విస్తారమైన పోలికలను రచనలో ఇమడ్చడం వీరి శైలి. దానిని అనుకరించడం ఒక తరానికి ఫ్యాషన్‌గా మారింది. స్వస్థలం అనకాపల్లి. జీవితం వైజాగ్‌లో గడిచింది. 1993లో తన 71వ ఏట మరణం.

వర్షం దబాయించి జబర్‌దస్తీ చేస్తోంది. సాయంకాలం అవుతోంది. మబ్బుల వల్ల మామూలు కంటే చీకటి ఎక్కువగా ఉంది. రోడ్డుపక్క కమ్మలపాక టీ దుకాణంలో చీకటి చికాగ్గా ఉంది. అడివిపాలెం నుంచి వచ్చి తన దుకాణంలో చిక్కుకుపోయిన సిటీబాబుని ఉద్దేశించి–

''మూడ్రోజులక్కాని ఒగ్గదీ ఒరసం'' అన్నాడు దుకాణం తాత. ఒగ్గితే సెవి కదపా యిస్తానన్నాడు.

బల్ల మీద దిగులుపడి కూర్చుండిపోయేడు సిటీబాబు అనబడే పురుషోత్తం.

'టేసన్‌కి కదు బాబూ ఎళ్లాలన్నావు?'

ఆకాశం మెరుపుతో చీల్చుకొంది.

'అవును'

'అబ్బో. ఎక్కడ, రొండుకోసులుందే'

పిడుగుపడ్డట్టుగా ఉరిమింది.

'ఏవిటీ?'

'రొండు కోసులుందయ్యా బాబూ. బొగ్గుల కోసం కుర్రోణ్ని అక్కడికే తగిల్నాను. సదువుకోనేదుగాని నా కెరికే. రెండు కోసులుంది' అది రెండు వేల మైళ్ల దూరం అన్నట్టుగా చెప్పాడు దుకాణం తాత.

'బస్సు దొరకదా?' అని హీనస్వరంతో అడిగాడు పురుషోత్తం.

'ఈ వరసంలో బస్సు రాగల్దా? ఎర్రేటి నీకు? ఉత్తప్పుడే రాదు. మా కుర్రాడు నడిసే ఎల్నాడు'

పురుషోత్తానికి కొంచెం గాభరా వేసింది. అత్యవసరమైన పని మీద అతను కలకత్తా వెళ్లవలసి ఉంది. మూడు రోజుల లోపల అక్కడికి వెళ్లాలీ అంటే మరో రెండు గంటల్లో అతను స్టేషన్ చేరుకోవాలి. బస్సు రాదట. బళ్లు కనిపించవు. వర్షం చూస్తే పెను ప్రళయంలా ఉంది.

'నేను కలకత్తా వెళ్లాలే.'

'ఏ వూరూ?'

'కలకత్తా'

'అబ్బో! శానా దూరవే! అక్కడికెళ్లాలా నువ్వు?'

'అవును'

'ఎళ్ళలేవు'

చాలా ఖచ్చితంగా చెప్పాడు దుకాణం తాత. దిగులు పడి కూర్చుండిపోయాడు పురుషోత్తం. కత్తుల్లా మెరుపులు మెరుస్తున్నాయి. కొండలు బద్దలయినట్టు ఉరుములు ఉరుముతున్నాయి. శివాలెత్తి గాలి పరిగెడుతోంది. పగ పట్టినట్టుగా వర్షం తెగపడుతోంది. చీకటి పట్టిన పాకలో, కొత్త పంట్లాం, కొత్త చొక్కా, కొత్త జోళ్లు బాగా కనిపిస్తున్నాయి. ఆ మూడూ పురుషోత్తం వేసుకున్నాడు. అతన్ని బాగా చూడాలీ అంటే దీపం వెలిగించి చూడాలి. అతను చక్కనివాడా? ఒప్పుకొనేవాళ్లు తక్కువ. అతని నడుం మాత్రం చక్కగా సన్నగా ఉంటుంది. అతను సింహ మధ్యముడే కాని సింహంలా ఉండడు. అతని పదిహేనో యేట 'ఇరవయ్యేళ్లుండవా?' అని చాలామంది అనుకొనేవారు. దుకాణం తాతని ఆ సమయంలో అడిగితే 'నలభై దగ్గిరుండవా' అని అడగ్గలడు. పురుషోత్తం పాతిక సంవత్సరాల క్రితం పుట్టాడన్న సంగతి, ఆ పుట్టుక తెలిసినవాళ్లకి తప్ప మరొకరికి తెలియదు. అతను ఎదగని పడ్డలా ఉండిపోయాడు.

ఆ సమయంలో ఆ దుకాణంలో దూరేందుకు అతగాడు ఆ ముందురోజు బయల్దేరాడు. పయనమవడం కలకత్తాకనే పయనమయ్యాడు. అంతలో అతని మేనమామ గాలీధూళీలా వచ్చి పడ్డాడు. ఆ మేనమామ అందరికీ ఉచితంగా సలహాలివ్వగలడు; అవలీలగా పనులు పురమాయించగలడు. అతగాడు వచ్చిపడి 'నీకు పెళ్ళి కావాలనే సంగతి నీకేమైనా తెలుసా?' అని పురుషోత్తాన్ని ప్రశ్నించి టకాయించాడు. టకాయించి 'వెళ్లు వెళ్లు. మంచిది, వయసుది, డబ్బుది అడవిపాలెంలో మస్సబు కూతురుంది. పిల్లని చూసేసి అలా కలకత్తా వెళ్లిపోవచ్చు. వెళ్లు వెళ్లు.. వెళ్లి చూడు' అని మేనల్లుణి వెంట తరిమాడు. దాన్తో చేతిలో పెద్ద

సంచీ పట్టుకొని అడవిపాలెంలో బంధువులింట్లో ప్రత్యక్షమై సాయంకాలం మన్సబుగారింట్లో కొత్తబట్టల్తో పెళ్లికూతురి ముందు ప్రత్యక్షమయాడు పురుషోత్తం. ఆ పిల్ల తన చూపుతో అతనికొక చిక్కుప్రశ్న వేసింది.

మునసుబుగారిది పాతకాలపు పెంకుటిల్లు. లోపల వరండాలో చాప మీద కూర్చోబెట్టారు పెళ్లి కుమార్తెని. ఆ పిల్ల మఠం వేసుకొని కూర్చొంది. పక్కనే వాకిట్లో తులసి కోట పక్క దండెం మీద తెల్ల చీర ఒకటి ఆరవేసి ఉంది. వాకిట్లో తోమిన ఇత్తడి గిన్నెలు తడితో మెరుస్తున్నాయి. ఇంటి వెనక మామిడి చెట్టొకటి చీకటిగా ఆకుపచ్చగా కనిపిస్తోంది. దాని పక్కనే కొబ్బరి చెట్టొకటి నిటారుగా ఎత్తుగా గంభీరంగా మామిడి చెట్టు కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా నిల్చొంది. అస్తమించడానికి తటపటాయిస్తూ దూరాన్న సూర్యుడు ఆకాశంలో అవతల గుమ్మం దగ్గర నిల్చున్నాడు. అంతలో గది తలుపులన్నీ గప్పున తెరిచి ఆకాశమంతటా కుంకాన్నెవరో కుమ్మరించారు. అంతట చెట్టున మామిడి చిగుళ్లు, చెట్టున కొబ్బరికొమ్మలు సంతోషంతో మూగనవ్వు నవ్వాయి. ఆర వేసిన తెల్ల చీర వెలుగుని వరండా అంతటా ఎర్రగా గుప్పును వెదజల్లింది. మెరిసే ఇత్తడి గిన్నెలు రాగిరంగు కలుపుకొని బంగారంలా మెరిశాయి. తులసికోటలో తులసిమొక్క నర్తకిలా నిల్చొంది.

దీపపు వెలుగున దేవీవిగ్రహంలా కనిపిస్తోంది పెళ్లికూతురు. ఆమె తల కొంచెం దించి, రెప్పలు కొంచెం పైకెత్తి పురుషోత్తాన్ని నిదానంగా పరిశీలనగా చూసింది. ఆమె కళ్లు విశాలంగా స్వచ్ఛమైన నీటితో నిండిన తటాకాల్లా ఉన్నాయి. మారుమూల కుగ్రామంలోనే ఉన్నప్పటికీ ఆ తటాకాలు మెరిసే చుక్కల్నీ వెలిగే చంద్రుణ్ణీ మండే సూర్యుణ్ణీ కూడా సుస్పష్టంగా చూడగలవు. అవి చాలాదూరం చూడగలవు.

ఏవేవో ప్రశ్నలు వేసి కూతురి చేత జవాబులు చెప్పిస్తోంది తల్లి. ఆ పిల్ల సన్నంగానే మాట్లాతోందిగాని గుహలో మాట్లాడినట్టుగా గంభీరంగా మాట్లాడుతోంది. ఇంటర్వ్యూ ముగిశాక పురుషోత్తం లేచి నిల్చున్నప్పుడు ఆమె చాప మీద కూర్చునే అతణ్ణి నిదానంగా మరోసారి బరువుగా రెప్పలు కొంచెం పైకి వంచి చూసింది. చూసి నెమ్మదిగా నిల్చొని లోనికి వెళ్లిపోయింది. ఆమె చూపు అతన్లో ఏదో అలజడి పుట్టించింది. కాని తనకేమీ సరిగా అర్థం కాలేదు.

మర్నాడు బంధువులింట్లో మధ్యాహ్నం భోజనం చేసి రెండెడ్ల బండి ఎక్కి రోడ్డు జంక్షన్‌కి బయల్దేరాడు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. మువ్వలు చప్పుడు చేస్తూ ఎడ్లు ముందుకు సాగాయి. దార్లోనే ఉన్న మన్సబు గారింటిని బండి దాటుతుండగా ఆ అమ్మాయి ఎందుకోసమో వీధినడవలోకి వచ్చి బండి చూచి ఇంట్లోకి వెళ్లిపో

కుండా అక్కడే ఆగి గుమ్మాన్ని ఓ చేత్తో ఆనుకొని నిశ్చలంగా నిల్చుని అతణ్ని నిశ్చలంగా చూసింది. బండీ ముందుకి సాగిపోయింది. ఆమె దూరాన్న ఉండి పోయింది. కాని ఆ చూపు అతణ్ని వెంట తరుముతోంది. మరో విధంగా చెప్పాలంటే ఆ చూపు అతన్లో గోతులు తవ్వుతోంది. కొన్నాళ్ల క్రితం పురుషోత్తం జబ్బుపడి ఆస్పత్రికి వెళ్లాడు. అప్పుడతను చాల నీరసపడి చిక్కిపోయున్నాడు. ఆస్పత్రిలో డాక్టర్ల వెనక నుంచి ఓ నర్సు ముందుకొచ్చి 'ఇలా రా' అని అతణ్ని తూకపు మెషీను దగ్గరికి తీసుకువెళ్లింది. తీసుకువెళ్తూ తనని ఆమె చూడ్డం అతను గమనించాడు. ఆమె చాలా లేతగా ఉంది. రోగుల బాధలకి బాగా అలవాటుపడి పోగా ఆమె ఇంకా అమానుషంగా తయారవలేదు. ఆమె కళ్లు చాలా చిన్నవి. ఆమె చూపులో అర్థం అతనికి తూకం మెషీను చూసేదాకా బోధపడలేదు. దాన్ని చూశాక 'ఓహో! ఈమె నా బరువెంతో అంచనా కడుతోంది' అనుకున్నాడు. మెషీన్ మీంచి అతను దిగిన తరువాత ఆమె జాలిగా చూసి, హెచ్చరికగా నవ్వి, 'మరేం భయం లేదు. ధైర్యంగా ఉండు, నిమిషంలో నయమవుతుంది జబ్బు' అని హుషారిచ్చింది. కృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియక అతనప్పుడు కంటతడి పెట్టాడు.

బండిలో కూర్చుని వెళ్తూంటే ఆ లేత నర్సెందుకోగాని గుర్తుకొచ్చింది పురుషోత్తానికి. దూరంలో నల్లకొండలు, ఇవతల కొబ్బరి తోటలు, పక్కన పచ్చని చేలు, పైన తెల్లటిమేఘాల చాందినీ, అంతా అలా చూస్తోనే అతడు ఆలోచనలో పడిపోయాడు. నేను సరియైన బరువు లేనా? అని ఓసారి అనుకున్నాడు. కాని అతనికేమీ సరిగా అర్థం కావడం లేదు. తడికర్రకి నిప్పంటనట్టుగా అతని మనసు రాజుకోవడం లేదు. బండి తాజుగా వెళ్తోంది. 'ఒహోయ్! హోయ్ హోయ్' మంటూ బండివాడు ఎడ్లని ఆపేటప్పటికి త్రుళ్లిపడి బండిలోంచి దిగేడు పురుషోత్తం.

ఆ సమయంలో ఎక్కడో ఆకాశం దద్దరిల్లింది. తోటల్లో గాలి గలగలమంది. రివ్వు రివ్వుమంది. పురుషోత్తం ఆకాశం కేసి చూశాడు. తెల్లమబ్బుల్ని గాలి తుడిచి పారేసింది. ఓ పక్క నల్లమబ్బులు లావాలా, పెనుగడ్డలా పెల్లుబికి, వాహినిగా విజృంభించి ముందుకొస్తున్నాయి.

నాటురోడ్డూ ట్రంకురోడ్డూ కలిసేచోట రోడ్డుపక్క అధికారిలా నిల్చున్న చింతచెట్టు ఈదురుగాలికి తల విసిరి ఆకాశాన్ని ఎదిరిస్తోంది. చెట్టు కింద కమ్మలపాక చలిగాలికి ముసలమ్మ వణికినట్టు వణుకుతోంది. అంతలోనే మబ్బులు ముంచుకొచ్చాయి. ఎండ వేడికి పలక మీది నీరు మాయమైనట్టు ఎండంతా కూడా చూస్తోండగా మాయమయింది. పొలాల మీద మబ్బుల నీడ ప్రవాహంలో పరిగెట్టింది.

బండివాడు గాలినీ ధూళినీ బూతులు తిడుతూ బండిని మళ్లించి మొత్తాల

మీదికి చెంగున ఎగిరాడు. ధూళిని చీలుస్తూ ఎడ్లు దౌడు తీశాయి. పురుషోత్తం ఎదురుగా ఉన్న కమ్మలపాకలోకి దూరేసరికి వర్షం దడదడ లాడుతూ దిగింది. జోరుగా వీస్తోన్న గాలి మరికొంత జోరు చేసేసరికి, ప్రవాహం ఒక్కసారిగా పల్లానికి దిగినట్టు, వర్షపు ధార పాకని ముంచేసి హోరుమంటూ ముందుకు పోయింది.

కమ్మలపాక 'టీ' దుకాణంలో బల్ల మీద గంట పైనుంచీ కూర్చున్నాడు పురుషోత్తం. 'టీ' బల్ల మీద గళాసులు పనిలేక పడున్నాయి. కెటిల్ వంటిదొకటి పొయ్యి మీద పడుకుంది. పొయ్యిలో నిప్పు చల్లబడిపోతోంది. దుకాణం అంతా తీరుబాటుగా ఉంది. టీ చెయ్యడం తన పని కానట్టుగా ముక్కాలి పీట మీద ముసలి పిల్లిలా కూర్చున్న దుకాణం తాత ఆరిపోయిన చుట్టని రెండు పీల్పులు పీల్చి, అంటించకుండా దాన్ని టీ బల్ల మీద పెట్టి 'ఏ వూరు బాబూ మన్ది?' అని పురుషోత్తాన్ని మొదటి ప్రశ్నగా అడిగాడు.

తరువాత వరుసగా, నెమ్మదిగా– కమ్మలచూరు నుంచి వానజల్లుకి ఒకటొకటిగా నీటిబొట్లు తాజుగా కిందికి దిగినట్టు – ప్రశ్నల్ని వరసగా దింపడం ప్రారంభించాడు. జవాబివ్వకపోతే ఏం కొంప మునిగిపోతుందో అన్నట్టు వాటన్నింటికీ పురుషోత్తం జవాబిస్తున్నాడు.

అన్నీ తెలుసుకుని, ఆఖరికి, నువ్వు వెళ్లదల్చుకున్న చోటికి వెళ్లలేవు అని ఖచ్చితంగా పురుషోత్తంతో చెప్పేసి అందు గురించి సంతృప్తి పడి నవ్వుకున్నాడు దుకాణం తాత.

పైన వర్షం జోరు చేస్తోంది. గాలి గీ కొడుతోంది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తున్నాయి. ఉరుములు బద్దలు కొడుతున్నాయి. కొండలన్నీ వాన తాకిడికి మొండికెత్తి నిల్చున్నాయి. చెట్లన్నీ తిరగబడుతున్నాయి. దుకాణంలో పొయ్యిలో నిప్పుకి గాలి అందడం లేదు. మీద నుంచి కురిసే నీరు మాత్రం కెటిల్ మీంచి జారి నిప్పుల్లో ఇంకుతోంది.

నవ్విన నవ్వుని మాసిన గడ్డంలో మాయం చేసేసి 'బొగ్గులకెళ్లాడు. కుర్రోడింకా రానేదు బాబూ. ఎక్కడుండిపోనాడో ఏటో' అన్నాడు దుకాణం తాత.

'అయితే బస్సు రాదంటావా?' అన్నాడు పురుషోత్తం.

'ఆ మాటకొస్తే రెయిల్ గాడీనే రాదు. ముండమోపి బస్సు నెక్కేటి?' అని, ప్రపంచమంతా ఆ విధంగా వర్షం వల్ల స్తంభించిపోయినందుకు హర్షం వెలిబుచ్చాడు దుకాణం తాత.

గాలికీ వానకీ పాక మీద పాములు జారినట్టుగా చప్పుడౌతోంది. ట్రెయిన్

రావడానికి పూర్తిగా రెండు గంటలైనా వ్యవధి లేదు.

'పెందలకాడే బయలెల్లి నడిచేసినా అందేద్దువు. మరింకిప్పుడీల్లేదు. ఏళ్లూ పూళ్లూ ఏకవే మరింక.'

నడిచి వెళ్లడానికి వీలుపడనందుక్కూడా హర్షం వెలిబుచ్చాడు దుకాణం తాత.

బాధింపబడుతూ అలానే కూర్చున్నాడు పురుషోత్తం. బొగ్గుల కోసం పయనమైన కొడకడింకా రానేదని దుకాణం తాత విసుక్కుంటున్నాడు. పాకంతా తడిసి ముద్దయింది. చలి హెచ్చూ, చలి గాలి జోరూ అయ్యాయి. పైన వర్షం పడుతోంది.

'పడకేటి చేస్ది బాబూ? దాని టయాం అది'

ట్రెయిన్ రాడానికి రెండు గంటలైనా వ్యవధి లేదు. రెండు కోసుల దూరం అలానే ఉండిపోయింది. బస్సు ఎక్కడో ఆగిపోయింది. ఆకాశం విరుచుకు పడిపోతోంది. పురుషోత్తం లేచి నిల్చున్నాడు.

'నరమానవుడన్నవోడు బైట అడుగెట్టడానికీల్లేదు'

రెస్టు లేనివాళ్ళా పురుషోత్తం అటూ ఇటూ తిరిగాడు. పని లేక గింజుకున్న వాళ్లా గింజుకున్నాడు.

'అగ్గుందా బాబూ?'

'లేదు'

'ఉండదనే అనుకున్నాన్లే. నీట్లో అగ్గి పుట్టించాల గాని మరి దొరకదు. ఈడు జూస్తే ఇంకా రానేదు. ఎక్కడ చిక్కడిపోనాడో ఏటో? గేటు కాణ్నుండి బొగ్గులు పట్టుకొస్తానని పారెల్లాడు బాబూ. కుర్రోడేగాని శండసేసనమ్ముండ కుడుకులే! ఒరసవేనన్న మాటేటి. దిమదిమలాడుతూ ఏనుగులు దిగేసినా నెక్కసెయ్డు'

కుర్రవాడు వెళ్లడం, బొగ్గులు తేవడం, ఏనుగులు దిగడం – వీటి గురించి వినడం లేదు పురుషోత్తం. చుట్టూ పాకంతా బందిఖానాలా అవుపిస్తోందతనికి. ఇనప ఊచలు దిగ్గొడుతున్నట్టుగా వర్షధారలు చుట్టూ దిగుతున్నాయి. అతను ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. పరిస్థితులకి చిరాకుపడి పోతున్నాడు.

వెళ్లువెళ్లంటే వెళ్ళిపోయివచ్చాడు తను. ముందు కలకత్తానే వెళ్లి అక్కడి పరిస్థితులు చూసుకొని ఆ తరవాతే వచ్చి పెళ్లికూతుర్ని చూడవలసింది. ఎప్పుడూ ఇలాగే అవుతోంది. ఆ పిల్ల కరెక్టుగానే ఆచోకీ కట్టినట్టుంది.

ఛ! తనెప్పుడూ ఇంతే.

కలకత్తా రావాలిస్మా అన్నారు.

ఒస్తున్నానన్నాడు.

అడివిపాలెం ఫో అన్నాడు మావ. పోతున్నానన్నాడు.

చిన్నప్పటి నుంచీ కూడా ఇంతే. చదువుకోకపోతే చెడిపోతావు చదువుకో అన్నారు. చదువుకుంటానన్నాడు. బుద్ధిగా ఉండకపోతే బాగుపడవుస్మీ అన్నారు. బుద్ధిగా ఉంటానని లెంపలు వేసుకున్నాడు. మజా లేని వెధవలు మంచిగానే ఉంటారు మరి అన్నాడొక స్నేహితుడు. అవునవునని తను ఒప్పుకున్నాడు. ఇలాగే అన్నీను.

ఈత రాకుండా నీట్లోకి దిగేవు జాగ్రత్త!

'దిగను'.

దీపం లేకుండా చీకట్లో నడిచేవు జాగ్రత్త!

'నడవను'.

చక్కని రాజమార్గాలుండగా సందులంట తిరిగేవు జాగ్రత్త!

'తిరగను'.

వాళ్లెలా చస్తే నీకెందుకు? వాళ్ల జట్టీల్లోకి నువ్వు వెళ్ళేవు జాగ్రత్త!

'వెళ్లను'.

అన్యాయం, అధర్మం! నీకేలదంతా? నీ పని నువ్వు చూచుకో. లేకపోతే తన్నులు తగిలేను జాగ్రత్త!

'అదంతా నాకెందుకు? ఆ తన్నులు నాకెందుకు? నా పని నే చూసుకుంటాను'.

టైఫాయిడ్, న్యుమోనియా, మరేదో మరేదో ఏదైనా ఒస్తుంది. వర్షంలో చొరబడేవు జాగ్రత్త!

'చొరబణ్ను. ఇక్కడే ఉంటాను.'

తుళ్లిపడ్డాడు పురుషోత్తం. మరైతే కలకత్తా వెళ్లడం ఎలాగ? గంటన్నర కంటే మరింక టైము లేదు. ఏం చెయ్యడానికీ పాలుపోక పురుషోత్తం మళ్లీ బల్ల మీద కూర్చోబోతూ వుండగా దుకాణం తాత చూరి కింద నించి రోడ్డువైపు చూసి 'ఆ! ఒస్తడొస్తన్డు హది గదీ! రేసుకుక్కే! పా(రా! పా(రా!' అని వుత్సాహంతో కేకలు వేసేడు. పురుషోత్తం కూడా వంగొని, చూరు కింద నుంచి చూశాడు.

ఎదురుగా తిన్నగా దూరానికీ కనిపిస్తోంది రోడ్డు. రెండు పక్కలా ఉన్న చెట్లు సిపాయిల్లా నిల్చొని అలజడి చేస్తున్నాయి. రోడ్డంతా నీటితో ఏటి కాలవలా

ఉంది. అందు మీద ఆరని నిప్పుతునకలా, నీటి మీద బోటులా, చెట్లని చీల్చుకొని బాట వేసుకొని వస్తున్నట్టుగా ఓ కుర్రవాడు భుజాన మూట వేసుకొని పరిగెట్టుకొని కొట్‌కొస్తున్నాడు.

కుర్రవాడికి హుషారిచ్చిన తరువాత దుకాణం తాత బుగ్గలు పూరించి పొయ్యి ఊది 'ఆరిపోనా దనుకున్నాను, అగ్గుందిరా బాబూ' అని ఇంకా జోరుగా ఊదడం ప్రారంభించాడు.

కుర్రవాడు పరిగెట్టి పరిగెట్టి పాకలోకి ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు.

'ఒచ్చేసినాన్తాతా' అని వచ్చీ రావడంతో కేక వేసి, మూట నుండి భుజాన్ని సుళువుగా తప్పించి, బొగ్గుల మూటని చక్కున కిందకి విసిరాడు.

కుర్రవాడికి పన్నెండేళ్లకి మించి ఉండదు వయసు. సరిగ్గా రేచుకుక్కలాగే ఉన్నాడు. అర నిమిషంలో, జుట్టు నుంచి నీటిని నొక్కేసి, బట్టల్నించి నీటిని పిండేసి ఆ పాకలో పొడిగా గెంతులు వేశాడు.

'ఒరసంలో దార్లో సత్తే ఏటిజేద్దువురా మనవడా' అన్నాడు దుకాణం తాత బొగ్గుల మూట విప్పుతూ. మూట విప్పగానే రాక్షసి బొగ్గులు నిగనిగ మెరిశాయి. 'ఒరసవా! మనసంగత్తెల్దేటి తాతా? ఒరసాన్ని సంపిడిసి పెడతాడీ పోతురాజు' అని మూడు లోకాలూ ఏలేవాళ్లా జవాబు చెప్పి, పొయ్యి విసరడానికి విర్రవీగుతూ వెళ్లాడు కుర్రవాడు.

ఆ పాకలో పాతుకుపోయినట్టుగా నిశ్చలుడై నిల్చుండిపోయేడు పురుషోత్తం.

ఆకాశం ఒక్కసారి గప్పున మెరిసింది. అంతవరకూ పురుషోత్తాన్ని వెంట తరిమిన పెళ్ళికుమార్తె చూపు ఆ క్షణంలో అతని ముందుకొచ్చి మూర్తీభవించి నిల్చొంది. ఆమె చూచిన చూపు, ఆనాటి నర్సు నవ్విన లేనవ్వు; చిగిర్చిన మామిడి మొక్క, ఎగసిన కొబ్బరి చెట్టు; ఈదురుగాలి, హోరున వర్షం; నీటిలో నిప్పు, మనిషిలో జ్వాల– అన్నీ అతనికి అర్థమయ్యాయి. అర్థయుక్తంగా, స్పష్టంగా తెరమీద కథలా అతనికంతా బోధపడింది. అంతా చూస్తూ అతనలా నిల్చుండిపోయాడు.

పైన వర్షపు ధారలు స్తంభించినట్టుగా అలానే ఉండిపోయేయా అన్నట్టుగా అనిపిస్తోంది. ఆకాశం ఇంకా దట్టంగా మూసుకొంటోంటే గాలి పల్చబడ్డం లేదు. గుర్రాల్ని కట్టుకొని ఝూంమ్మని అన్నింటినీ తొక్కుకుపోతోంది ఈదురు గాలి. మెరుపులు పిడుగులయి అందిన దాన్నల్లా హతమార్చేస్తున్నాయి. మబ్బులు కమ్మినకొద్దీ పాకలో చీకటి చిక్కనవుతోంది.

పొయ్యి విసురుతూన్న కుర్రవాడు ఇనుంలా ఎర్రగా మెరుస్తున్నాడు.

కొద్దిసేపయింది.

అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూన్న దుకాణం తాత ఏదో గుర్తుకొచ్చి నట్టుగా టక్కున ఆగి, కళ్లు చిట్లించి, అటూ ఇటూ చూసి, మనవణ్ని 'పోతురాజొరే' అని పిల్చి 'ఇప్పుడిక్కడున్నాడు! చిట్టిబాబెక్కడికి పోనాడ్రా' అని ఆశ్చర్యపడుతూ, చిట్టిబాబుని ఎన్నెమ్మకాని ఎత్తుకుపోయిందా? అన్నట్టుగా అడిగాడు.

'అడుగో' అన్నాడు పోతురాజు.

'ఏడీ?'


'అడుగడుగడుగో' అని రోడ్డువైపు చూపించాడు పోతురాజు.

'ఏటి?! పప్పుముద్దనా సతికిలబడిపోన్డు. ఒరసం ఒగ్గనట్టు పాకొగ్గడనుకున్నా న్రోరె. ఆ.. ఆ.. కదిల్నాడే' అంటూ మోకాళ్లు వంచి వీపు విరిచి చూర్లోంచి పైకి చూశాడు దుకాణం తాత.

మసక చీకట్లో తిన్నగా సూటిగా, ఈదురుగాలి కెదురుగా, వర్షాన్ని సరకు చేయకుండా, తెరల్ని ఛేదించుకొంటూ చకచకా ముందుకు వెళ్తున్నాడు పురుషోత్తం.

అతణ్ని చూసి తలపంకించి, హసించి 'సెబాసో' అని మెచ్చుకున్నాడు దుకాణం తాత.





# ఊరి చివరి ఇల్లు

## దేవరకొండ బాలగంగాధర తిలక్

● రచనా కాలం: 1961

**తిలక్ :** తెలుగు కవిత్వాభిమానులు మోహించి ప్రేమించి పలవరించి కలవరించిన కలం. కాని కథకుడిగా కూడా అంతే సమర్థులైనవారు. వీరి 'నల్లజర్ల రోడ్డు' అంతర్జాతీయ స్థాయి కథలకు ఏమాత్రం తీసి పోదు. మధ్యతరగతి దుర్బలత్వాన్ని, మానవ మానసిక దీనత్వాన్ని కథనం చేశారు. స్వస్థలం ప.గో.జిల్లా తణుకు. జీవితం అక్కడే గడిచింది. 1966లో తన 45వ ఏట మరణించినప్పటికీ ఎక్కడ వెన్నెల విరగబూసినా ఆ వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లలు మరెక్కడ గోచరమైనా చప్పున జ్ఞప్తికొస్తూ సజీవుడవుతూ ఉంటారు. ఎందుకంటే 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లలు' అని ఈయన మాత్రమే అనగలిగారు.

హోరున వర్షం కురుస్తోంది. ఆకాశమంతా దట్టమైన నల్లని మబ్బులతో నిండి వుంది. ఊరికి శివారున ఉన్న ఆ పెద్ద పెంకుటిల్లు వర్షంలో మరీ ఒంటరిగా నిస్సహాయంగా ఉన్నట్లుంది. చూరు వంగిపోయింది. గోడల నుండి పెద్దపెద్ద బెల్లులు విరిగి పడిపోయాయి. వేగంతో శ్రమించిపోయే కాలానికి, పదార్థం మొండితనానికి జరుగుతున్న అనాది యుద్ధానికి చిహ్నంగా నిలిచినట్టుంది ఆ ఇల్లు.

ఊరి కింద దూరంగా ఈ ఇల్లెందుకు వుందో ఎవరికీ తెలియదు. కొత్తగా చూసినవాళ్ళు ఈ యింట్లో ఎవరూ నివాసం ఉండడం లేదనుకుంటారు. కాని కాస్త నిదానించి చూస్తే గుమ్మాలకి, కిటికీలకి రంగులూ, తెరలూ వేసి ఉంటాయి. ఇంటికి ఇటూ అటూ మైళ్ళకొద్దీ పొలాలు పరచుకుని వున్నాయి. అక్కడక్కడ పెద్దపెద్ద చింతచెట్లూ తుమ్మచెట్లు కూడా భారంగా భూమి మీదకు వంగి వున్నాయి. వారం పదిరోజుల్నుండి వర్షం అవిరామంగా ఏకధారగా కురుస్తోన్నందు వలన ఆ ప్రదేశమంతా జలమయమైపోయింది. పొలాలన్నీ నీటిలో మునిగిపోయి వున్నాయి. వరి మొక్కల చివళ్ళు మాత్రం కొన్నిచోట్ల నీటిపైకి కనబడుతున్నాయి.

సాయంత్రం నాలుగు గంటలయినా నల్లని మబ్బుల మూలాన్ని చీకటి పడిపోయినట్టు వుంది. ఇంట్లో చీకటి మరీ చిక్కబడుతోంది. మండువాలో ముక్కాలి పీట మీద ఒక యువతి కూర్చుని కిటికీ లోంచి ఎదురుగా ఉన్న రోడ్డుకేసి చూస్తూ వుంది. ఆమె అలాగ చాలాసేపటి నుండి చూస్తోంది. ఇరవై రెండు – యిరవై మూడు సంవత్సరాల వయస్సుంటుంది. తెల్లని చీర కట్టుకుని వుంది.

ఆమె చూపులో ఒకరి కోసం నిరీక్షణ కాని, ఏ విధమైన కుతూహలం కానీ లేదు. శూన్యంగా విరక్తంగా వున్నాయి ఆ చూపులు. ఎదురుగా ఉన్న వర్షం దృశ్యం ఆమెలోని దిగులుని మరింత ఎక్కువ చేస్తోంది. రోడ్డంతా గతుకులతో గోతులతో అసహ్యంగా వుంది. గోతులన్నీ వరదనీటిలో నిండి వున్నాయి. రోడ్డుకీ యింటికీ మధ్య ఉన్న పల్లపు నేలలో వర్షపు నీరు చేరుకుని చిన్న మడుగులా తయారయింది.

ఆమె అలాగ చాలాసేపటి నుండి చూస్తూ కూర్చుని వుంది – గంట నుండి – రెండు గంటల నుండి – బద్ధకంగా బరువుగా దీనంగా దిగులుగా. చూరు మీద వేసిన రేకు మీద వర్షంపడి టపటపమని మోటుగా చప్పుడవుతోంది. చూరు కిందికి వర్షం ధారలు ధారలుగా జాలరు జాలరులాగ మీదికి పడుతోంది. మధ్యమధ్య వర్షపు జోరు తగ్గుతోంది. కాని అంతలోనే హెచ్చిపోతోంది. వర్షం హెచ్చడంతో గాలి కూడా పెట్రేగిపోతోంది. విసురుగా వీచే గాలికి తెలీకుండా ఆమె వొంటి మీదికి పైట లాక్కుంటోంది. మొహాన పడే ముంగురుల్ని చేతివేళ్ళతో వెనక్కి నెట్టుతోంది.

ఇంటి లోపల్నుంచి మండువాలోకి ఓ ముసలి మనిషి వచ్చింది. ఆమె దేహంలో ఎక్కడా రక్తమూ, మాంసమూ వున్నట్టు లేదు. చర్మం ఎండిపోయి ఎముకలకి కట్టి లాగినట్టుగా వుంది. మొహం వికృతంగా వుంది. నోరు పెద్దదిగా అసహ్యంగా వుంది. గుంటలాంటి కళ్ళు, ముడతలు పడిన రెప్పల సందుల్లోంచి ఆ కళ్ళు ఏవో తెల్లని పురుగుల్లాగా కదులుతున్నాయి.

యువతిని ముసలి కొంతసేపు పరీక్షగా చూసింది. నాలుగడుగులు వేసి ఆమె దగ్గరగా వచ్చింది. చిన్నగా దగ్గింది. యువతి ఆమె రాకని గమనించలేదు. ముసలిది ఆమె భుజం మీద చెయ్యి వేసి 'పద పిల్లా పద. లోపలికి పోయి పడుకో. ఏవిటి చూస్తావిలాగ?' అంది. యువతి మాట్లాడలేదు.

'నీకే చెప్తున్నాను. ఈ చలిగాలికి దగ్గో, జ్వరమో వచ్చిందంటే చచ్చినంత పనవుతుంది. లే లోపలికెళ్ళి పడుకో.'

యువతి కిటికీలోంచి నిశ్చలంగా రోడ్డువైపు చూస్తూ వుంది.

'నా మాట వినవు. ఎందుకు వింటావులే! ఎప్పుడేనా విన్నావు కనకనా! పోనీలే నాకెందుకు?' అంటూ ముసలిది లోపలికి వెళుతూ ఆగి 'శాలువా తీసుకురానా పిల్లా?' అని అడిగింది.

'వద్దు' అంది యువతి. ఆమె గొంతులో కూడా అదే శూన్యత అదే విరక్తి. ముసలిది గొణుక్కుంటూ లోపలికి వెళ్ళింది. మళ్ళీ కాసేపట్లో తిరిగి వచ్చింది.

'పోనీ పిల్లా, కాస్త టీ చేసి తీసుకురానా?' అంది.

'వద్దు' అంది యువతి ముక్తసరిగా.

'సోద్యం, సోద్యం' అంటూ ముసలిది లోపలికి వెళ్ళిపోయింది. వాన ఎక్కువయింది. వానతోపాటు గాలి ఉధృతంగా వీచింది. గుమ్మాలవీ కిటికీలవీ తలుపులు టపటపమని కొట్టుకున్నాయి. దూరంగా ఉరుములు మెరుపులు.

పది నిమిషాల్లో ముసలిది చేత్తో టీ కప్పు పట్టుకుని వచ్చింది. యువతికి ఎదురుగా వున్న కిటికీలో పెట్టి 'తాగు పిల్లా, తాగు. పచ్చి వొంటికి టీ నీళ్ళు చాలా మంచివి' అంది. యువతి విసుగ్గా ఆమెకేసి చూసి తల పక్కకి తిప్పుకుంది.

'చచ్చినవాని కోసం ఏడిస్తే ఏమొచ్చిందే పిల్లా. వేలెడులేడు ముదనష్టపు వెధవ. వాడి కోసం బెంగ పెట్టుకుని ఏడ్చేదాన్ని ఎప్పుడూ చూడనే లేదు' అంది ముసల్ది.

ముసలిది ఆగి ఆగి నిలిచి మాట్లాడుతూ వుంది. మాటల్ని చేపల్లాగ కత్తిపీట మీద తరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. కీచుగా ఉన్న గొంతు వొంటి మీద పడి ప్రాకుతున్నట్లుగా వెలపరం పుట్టిస్తుంది.

'వాన కురిసినప్పుడల్లా ఏవేవో జ్ఞాపకం వస్తాయి. కావల్సినవాళ్ళ కోసం, దగ్గరవాళ్ళ కోసం మనసు పోతుంది. వానలో ఒక్కళ్ళం ఉండలేం పిల్లా ఉండలేం – నాకు తెలుసు. అయితే అటువంటి ఆలోచనల వల్ల లాభం ఉండదు పిల్లా! వానంటే భయం నాకు. వెధవ్వాన వెధవ్వాన' అంటూ ముసలిది ఆగింది. ఆమె కళ్ళల్లో కోపం మసిబొగ్గులాగ మండబోయి మాడిపోయింది. 'ఎందుకే ఈ విచారం చచ్చినవాడికోసం? అసలు నీకు పిల్లలెందుకే తెలివితక్కువదానివి కాని, అనుమానం కలగ్గానే ఏం చెప్పాను నీకు? ఎరుకలదాని దగ్గర బలే మందులు న్నాయి తీసుకొస్తానంటే విన్నావా? నువ్వెందుకు వింటావులే నా సలహా! అలాగ పుట్టాడు అర్ధాయుష్షు వెధవ. ఇలాగ మూడు నెలలకే చచ్చాడు.'

యువతి కళ్ళలో బాధ ఆకాశం మీద నల్లని మబ్బులాగా క్రమ్మింది. ముసల్ది వూరుకోలేదు.

'నీ వయస్సులో పిల్లలు పుడితే నీకేసి ఎవడు చూస్తారే ఈరోజుల్లో. వొంటికి బిగువు పోయాక నేనెంతో నువ్వూ అంతే' అసహ్యంగా నవ్వింది ముసలిది.

'నోర్ముయ్యి' అంది యువతి కోపంగా.

'మూస్తాను. మూస్తానులే. నోరు మూసుకుంటే నువ్వూ నేనూ అడుక్కు

తినాల్సిందేగా! ముసలిముండనైనా దేవుడు నాకు బుర్రలో తెలివిచ్చాడే పిల్లా!'

ఓ నిముషం ఆగి ముసలిది 'ఇదిగో పిల్లా. నీకొ్కొడుకు పుట్టగానే సోదికెళ్ళి అడిగాను. అటువంటి వెధవ పిల్లలు బతకరని తెగేసి చెప్పింది సోదె. ఒక తండ్రి, ఒక వంశమూ లేని ముదనష్టపు పిల్లలకి దేవుడు శాపం వుంది శాపం. నీ కొడుకే కాదు, ఈ ఇంట్లో ఎప్పుడూ ఏ పిల్లాడు పుట్టి బతికిన పాపాన పోలేదు' అంది.

యువతి భయంతో విహ్వాలంగా చూసింది.

'నిజంగానా? నిజంగానా అవ్వా?' అని అడిగింది.

'ఆ భయమే వద్దన్నాను. నీ వయస్సూ, నీ అందమూ వుండి భయపడిన ఆడదాన్ని నే నెరుగను. ఇప్పుడు నాలుగురాళ్ళు చేసుకోకపోతే ఇంకెప్పుడే పిల్లా! వచ్చిన ప్రతివాణ్ణి వెళ్ళగొడతావు. ఎవళ్ళో రాజకుమారులు కాని నీకు నచ్చనే నచ్చరు. ఆసరాగా వుంటావని నిన్ను నమ్ముకుని నే బతుకుతున్నాను. నా మాటా, నేను కూడా నీకు చేదయింది' ముసలిదానికి తీవ్రత హెచ్చిపోతోంది. చేతులు వూపుతూ ఇంకా యిలాగ అంది. 'చచ్చినోళ్ళ కోసం చావలేం పిల్లా. నన్ను ముట్టుకోకు నామాల కాకీ అని కూర్చుంటే ఆకలితో మాడి చస్తాం. నీకేం దొరసానిలాగా కబుర్లు చెపుతావ్ . అప్పుడే నే నాదుకోకపోతే నీ గతి ఏమయ్యేదే! చాల్చాలు! వాణ్ణి తలచుకుంటే మాట దక్కదు. మూడు నెలల ముంగి వెధవ చచ్చాడు పీడా వదిలింది.'

యువతి కోపంతో, బాధతో, జేవురించిన మొహంతో కిటికీలో వున్న కప్పు తీసి ముసలిదాని మీద విసిరింది. 'పో ముసలిముండా, పో దెయ్యపు ముండా! నా ఎదట నిలబడకు...' అంటూ వెర్రిగా అరిచింది. ముసలిది ఒడుపుగా దెబ్బ తగలకుండా తప్పుకుని 'పోతాను పోతానే. నే బ్రతికినన్నాళ్ళే నీ కష్టం సుఖం చూసేది. తర్వాత నీ వూసు ఎవరు పట్టించుకుంటారో చూస్తాను' అంటూ కీచుగా ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

యువతి మొహం బాధతో మలినమైంది. కంటి చివరల రెండు నీటి చుక్కలు నిలిచాయి. గుండె బరువెక్కింది. ఇనుపతెర మధ్యలో ఎవరో తన్నిపెట్టి నొక్కుతూన్నట్టు బాధతో 'అమ్మా' అంది.

చీకటి పడుతోంది. పొలాలన్నీ అస్పష్టంగా నల్లరంగులో కలిసిపోతున్నాయి. చుట్టుపక్కన ప్రదేశమంతా నిర్మానుష్యంగా భయంకరంగా ఉంది. యువతి అక్కడే అలాగే కూర్చుని కిటికీలోంచి చూస్తోంది.

ముసలిది మండువాలోకి వచ్చింది.

‘అన్నంలోకి ఏం వండమన్నావ్ పిల్లా?’అంది.

‘ఏదో ఒకటి’

‘ఇప్పుడేనా చెప్పిన మాట విను. చలిగాలి ఎక్కువైంది. వొంటికి మంచిది కాదు. వెళ్ళు, లోపలికి వెళ్ళు.’

‘సర్లే’

‘చిటికెలో వంటచేసి పిలుస్తాను. వేడివేడిగా కూడు తిన్నావంటే బలం వస్తుంది. లోపలికి పోయి శాలువా కప్పుకో’ అంటూ ముసలిది వెళ్ళిపోయింది.

యువతి బరువుగా నిట్టూర్చింది. కాని అక్కడి నుంచి కదలలేదు. అలాగ కిటికీ లోంచి చూస్తూనే వుంది కొండచిలువలాగ మెలికలు తిరిగి తిరిగి చీకట్లో కలిసిపోయిన రోడ్డువైపు. కొంతసేపటికి దూరంగా రోడ్డు మీద ఏదో ఆకారం అస్పష్టంగా కనిపించింది. దగ్గరౌతున్నకొద్దీ చేతిలో సూట్‌కేసూ, మరో చేతిలో గొడుగుతో రోడ్డు బురదలో కాళ్ళీడ్చుకుంటూ వస్తూన్న వ్యక్తి కనిపించాడు. గాలికి గొడుగు తిరగబడి పోతూంది. అతి ప్రయత్నం మీద గొడుగుని ఆ వ్యక్తి సమానంగా ఉంచగలుగుతున్నాడు. ఇంత వర్షంలో ఈ ప్రయాణం సాగించే బుద్ధిహీనుడెవరా అనుకుంది యువతి. అదేకాదు రోడ్డంతా గోతులు పడి వుంది. చీకటి పడ్డాక ఈ దారిన వెళ్ళడం ప్రమాదకరం. ఆ వ్యక్తి తన యిల్లు కూడా దాటిపోయాడు. యువతి చప్పున లేచి మండువాలో నుంచి వీధి అరుగు మీదికి వచ్చింది. చప్పట్లు కొట్టింది. ‘ఏవయ్యోయ్! మిమ్మల్నే ఇలా రండి!’ అని పిలిచింది గట్టిగా.

ప్రయాణీకుడు కొంచెం సేపు తటపటయించాడు. మెల్లగా ఇంటివైపు తిరిగి వస్తున్నాడు. ఇంటి ముందు పల్లంలో మోకాలిబంటి నీరు ఉంది. ప్రయాణీకుడు గొడుగు ముడిచి చంకన పెట్టుకొని మోకాళ్ళపైకి పంచె లాక్కుని భయం భయంగా అడుగు మీద అడుగులేసుకుంటూ కాలవని దాటాడు. అరుగు మీదకి వచ్చి పెట్టెని, గొడుగుని కిందికి దింపి ‘హమ్మయ్యా’ అన్నాడు. ఆ వ్యక్తి ఆజానుబాహుడు. తెల్లని అతని బట్టల మీద బురద చిమ్మి అసహ్యంగా హాస్యాస్పదంగా ఉంది. మొహం సరిగా కనిపించలేదు యువతికి.

‘నన్ను పిలిచారా’ అన్నాడతను అలసిన గొంతుతో.

‘అవును ఎక్కడికి వెడుతున్నారు మీరు?’ అంది యువతి.

‘రైలు స్టేషన్‌కి’

'అబ్బో. స్టేషన్ ఇంకా చాలా దూరం ఉంది' అంది యువతి.

'అయినా వెళ్లక తప్పదుగా' తడిసిన బట్టల్ని పిండుకుంటున్నాడతను.

'ఈ చీకట్లో ఈ రోడ్డు మీద వెళ్లడం ప్రమాదకరం. రోడ్డంతా గోతులు, పైగా పైన ఎక్కడో గండి కూడా పడిందట. ఈ మాట చెబుదామనే పిలిచాను'

'కృతజ్ఞుణ్ణి. కాని నేను వెళ్లక చేయగలిగిందేముంది చెప్పండి. ఈ రోజున బయలుదేరడమే బుద్ధి పొరపాటు. మధ్యాహ్నం కొంచెం తెరిపియిస్తే ఫరవాలేదు కదా అని బయల్దేరాను. ఎవరినడిగినా నాలుగడుగులు వేస్తే స్టేషన్ వచ్చేస్తుందని చెప్పారే. ఏం మనుషులండీ వీళ్ళు! అబ్బ! చేతులు నొప్పి పెడుతున్నాయి' అంటూ వేళ్ళు చాచి ముడుచుకున్నాడు కీళ్ళు సడలేందుకు.

'మీకు దూరమని తెలియదా?'

'తెలియదు. నేను ఈ దారిని రాలేదుగా వచ్చేటప్పుడు? అసలు నేనీ ప్రాంతానికి కొత్తవాణ్ణి. అందులో ఈ వర్షాకాలంలో పల్లెటూళ్ళకి వెళ్ళడం తెలివితక్కువ.'

యువతి చిన్నగా నవ్వింది.

'అయితే ఇప్పుడేం చేస్తారు మీరు?' అంది.

'ఏం చెయ్యను! ఎలాగో అలాగ తంటాలుపడి స్టేషన్‌కి చేరుకుంటాను'

'మీ గొంతు విన్నట్టుగా ఉందే ఎప్పుడో ఎక్కడో' అంది విస్మయాన్ని సూచిస్తూ.

'కంఠధ్వనిలో పోలికలుంటాయిలెండి. కాని మీరు నన్ను కానీ, నేను మిమ్మల్ని కానీ కలుసుకోలేదని నిక్కచ్చిగా చెప్పగలను' అన్నాడా వ్యక్తి.

'ఎలా చెప్పగలరు.' అంది యువతి కుతూహలంతో.

'ఈ ప్రాంతానికి నేనెప్పుడూ రాలేదని చెప్పాను కదా. అదీగాక చాలాకాలం ఈ దేశంలో కూడా లేను' అంటూ ఆ వ్యక్తి తిరిగి పెట్టెనీ, గొడుగునీ చేత పట్టుకున్నాడు.

'నమస్కారం! నేను వెళ్లొస్తాను. రోడ్డు విషయమై మీరు చేసిన హెచ్చరికను మరచిపోను' అన్నాడు.

'మీరు నామాటనర్థం చేసుకోలేదు. మీరింక ప్రయాణం సాగించడం శ్రేయస్కరం కాదు. ఈ రాత్రికి ఇక్కడ పరుండి పొద్దుటే వెడితే మంచిది, మీకభ్యంతరం ఏమీ లేకపోతే' అంది యువతి.

నూతన వ్యక్తి ఆలోచించాడు. 'అంతేనంటారా?' అన్నాడు.

'అవును ఉదయం ఆరుగంటలకి రైలు వుంది. అప్పటికి వర్షం కూడా చాలామట్టుకు తగ్గొచ్చును.'

వర్షం మళ్లీ హెచ్చింది. వానజల్లు వరండాలోకి వచ్చి పడుతోంది. నూతన వ్యక్తి హతాశుడై 'సరే సరే. మీరు సూచించిన మార్గమే ఉత్తమంగా కనపడుతోంది. తెల్లవారాక మున్సిపాలిటీ వాళ్ళు ఏ గోతిలోంచో బురదలోంచో కూరుకుపోయిన నా శవాన్ని పైకి తీయడం అంతగా ఆశించదగినదిగా లేదు. మీ దయకు కృతజ్ఞుణ్ణి' అంటూ సంకోచంగా నవ్వుతూ అన్నాడు.

ఇంతలో ముసలిది దీపం పట్టుకుని వచ్చింది. దీపపు వెలుగులో అతని ఆకారం మరింత స్పష్టంగా కనబడింది. మనిషి ఒడ్డూ పొడుగూ ఉన్నాడు. బుగ్గలు కొంచెం చిక్కినట్టున్నా మొహం అందంగానే ఉంది. చామనచాయ. మొత్తం మీద విగ్రహంలో గాంభీర్యం స్ఫురిస్తోంది. పంచె అంతా బురదతో నిండివుంది.

ముసలిది దీపం పైకెత్తి దగ్గరగా పట్టుకుని పరీక్షగా చూస్తూ 'ఏ వూరు బాబూ మీది?' అంది. దీపకాంతిలో మెరసిన అతని వదనాన్ని చూసి యువతి ఉలిక్కిపడింది. తెల్లబోయి రెండు కళ్ళూ అప్పగించి అలాగ చూస్తూ నిలబడింది. ముసలిది మోచెయ్యితో యువతిని పొడిచి 'దెయ్యం పెట్టినట్టు ఏమిటే ఆ చూపు పిల్లా?' అంది.

యువతి ఇంకా తేరి చూస్తూ 'మీ పేరు?' అంది.

'జగన్నాథం' అన్నాడా వ్యక్తి.

యువతి కళ్ళలో ఆశాభంగం అద్దంలా కనపడింది. అది గమనించిన అతనికి సంకోచం ఎక్కువయింది. 'మీరు నన్నాహ్వానించడంలో ఏదో పొరపాటు జరిగిందనుకుంటాను మీ ధోరణి చూస్తే. ఈ వర్షపు తీవ్రత తగ్గగానే వెళ్ళిపోతాను. నేనేమీ అనుకునేవాణ్ణి కాను' అన్నాడు.

యువతి తనలో కలిగే ఉద్రేకాన్ని అణచుకొని సహజ స్వరంతో 'కాదు కాదు. మీరు నేనెరిగిన ఒక వ్యక్తిలాగ ఉన్నారు. అంతే. మీరు అపార్థం చేసుకుని వెళ్లిపోతే నేను చాలా బాధపడతాను' అంది. వ్యక్తి నిట్టూర్చి పెట్టె కింద పెట్టాడు. ముసలిది తేలికగా పెట్టెని ఎత్తి లోపలికి తీసుకువెళ్ళింది.

యువతి జగన్నాథాన్ని ఒక గది దగ్గరకు తీసుకువెళ్ళి 'అవ్వ ఈ గదిలోనే మీ పెట్టెని పెట్టింది. మీరు బట్టలు మార్చుకుని విశ్రాంతి తీసుకోండి. మీకు

భోజనం ఏర్పాటు చేసి వస్తాను' అని వెళ్ళిపోయింది. జగన్నాథం గదిని నలువైపులా పరీక్షగా చూశాడు. పాతకాలపు పందిరి మంచం ఒకటుంది. దాని మీద తెల్లని పక్కవేసి ఉంది. మంచానికి పక్కగా ఒక ఎత్తైన ముక్కాలిపీట ఉంది. పేముతో అల్లిన కర్ర కుర్చీ కూడా ఉంది. ఒక మూలగా హరికేన్ లాంతరు వెలిగించి ఉంది. అతను తొందర తొందరగా దుస్తులు మార్చుకున్నాడు. అతనికాకలి ఎక్కువగా ఉంది. వొళ్ళంతా చలితో, తేమతో ముద్దకట్టుకు పోయినట్టుంది.

ముసలిది వచ్చి భోజనానికి రమ్మని పిలిచింది. అరిటాకులో అన్నమూ, పదార్థాలూ వడ్డించి ఉన్నాయి. ముసలిది నిశ్శబ్దంగా వడ్డిస్తూ వుంది. ఏదో చెప్పాలని నోరు తెరుస్తుంది. కాని తలుపుచాటుకి చూసి మానివేస్తుంది. ఆకలితో ఉన్న అతనికి భోజనం రుచిగా ఉంది. ముసలిది మాట్లాడబోయి మానివేయడం గమనించి తలుపుచాటుకు చూశాడు. తలుపుచాటుగా యువతి కూర్చుని ఉంది. అతనికేదో విచిత్రమైన అనుభూతి కలిగింది. తనలో తాను నవ్వుకున్నాడు.

భోంచేసి గదిలోకి వెళ్ళగానే ముక్కాలిపీట మీద తమలపాకులూ, వక్కా అమర్చబడిన వెండిపళ్ళెం కనపడింది. అగరువత్తులు వెలిగించబడి గోడకున్న చిన్న చిల్లులో గుచ్చబడి వున్నాయి. తలవని తలంపుగా లభించిన యీ ఆతిథ్యానికి ఆదరానికీ అతనికి విస్మయానందాలు రెండూ కలిగాయి. కాసేపట్లో గుమ్మం వద్ద గాజుల చప్పుడు విన్నాడు. తల పైకెత్తి 'రండి. జన్మలో మీరు చూపిన ఆదరాన్ని మరచిపోలేను. రైల్లోనో, రైలుస్టేషన్‌లోనో తిండి తిప్పలు లేక పడి ఉండవలసిన విధి నుండి తప్పించారు మీరు' అన్నాడు.

ఆమె సిగ్గుపడుతూ వచ్చి కుర్చీలో కూర్చుంది. జరీ అంచు లేత నీలం చీర ధరించింది. జుట్టును వదులు వదులుగా జడ వేసి చివరలు వదిలివేసింది. నొసట సన్నని ఎర్రని తిలకం ఆమె వదనానికి ఆకర్షణతోపాటు ఉదాత్తతను ఆపాది స్తోంది. ఆమె కళ్ళు పెద్దవిగా, జాలిగా, మంచుతో తడిసిన పద్మాల్లా ఉన్నాయి.

'మీరు నా మాట మన్నించి ఆగినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది' అందామె తలవంచుకుని.

'సరే సరే. ఆనందించవలసింది నేను కాని మీరు కాదు. శ్రమంతా మీది. చివరకు మీరు పడుకునే మంచం కూడా నాకిచ్చివేసినట్టే కనపడుతోంది. నిజానికి ఓ చాపా దిండూ యిస్తే నడవలో పడుకుని నిద్రపోతాను. అనవసరంగా నన్ను

చాలా గౌరవించేస్తున్నారు' అని అతను నిర్మలంగా నవ్వాడు.

'కాదు కాదు. నేనూ అవ్వా ఇంకో గదిలో పడుకుంటాం. మీరు చాలా దూరం నుంచి వచ్చినట్టున్నారు' అందామె.

'అవును. అయిదారు మైళ్ళపైనే నడిచాను. ఉదయం అంతా నడిచి పల్లెటూరికి వెళ్లాను. రోడ్డయినా ఏమీ బాగూలేదు. ఈ పెట్టెనీ, గొడుగునీ మోసుకుంటూ యింత వర్షంలో నిజంగా చాలా అలసిపోయాను. మీకు నిజం చెప్పమన్నారా?' అని ఆగాడు జగన్నాథం.

'చెప్పండి.' అందామె ఓరగా చూస్తూ.

'ఈ రోజంతా నాకు భోజనం లేదు. పల్లెకి వెళ్ళిన పనీ జరగలేదు' అన్నాడతను విచారంగా.

'ఏం జరిగింది?'

'నా మిత్రుడొకడు కష్టాలలో ఉన్నాడు. 'నా' అన్నవాళ్ళెవరూ లేరతనికి. జబ్బుతో ఉన్నానని ఒక వెయ్యి రూపాయలు సహాయం చెయ్యమనీ ప్రాధేయ పడుతూ ఉత్తరం రాశాడు. ఆ జాబు నాకు చాలా ఆలస్యంగా అందింది. నేను ఒక్కొక్క ఊరే తిరుగుతూంటే ఆ ఉత్తరం నా వెనకాలే వచ్చింది. చివరికి మొన్ననే ఉత్తరం చేరింది. నేను సొమ్ము తీసుకొని యకాయకీని బయలుదేరి ఈ రోజునే పల్లెకి వెళ్లాను. కాని...'

'కాని..?'

'నా మిత్రుడు నాలుగైదు రోజుల క్రితమే పోయాడు. ఈ పూటకి నన్నాగ మన్నారు వూళ్ళోవాళ్ళు. కాని నాకు మనస్కరించలేదు. బయలుదేరి వచ్చేశాను.'

ఇద్దరూ కొంచెంసేపు మౌనంగా ఉన్నారు. ఈ విషాద కథనానికి దీపకాంతి కూడా కొంచెం తగ్గినట్టనిపించింది వారికి. ఆమె కంగారుగా పైట సర్దుకుని లేవబోయి కూర్చుంది.

'ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. చూడండి. ఆ పెట్టెలో వెయ్యి రూపాయలూ ఉన్నాయి. కాని అతను మాత్రం యిక్కడెక్కడా లేదు' అన్నాడతను నిట్టూరుస్తూ.

గది అవతల చప్పుడయింది. 'ఎవరూ?' అంటూ యువతి గుమ్మం వద్దకు వెళ్ళింది. పక్కగా ముసలిది ఉంది. 'ఏం?' అంది కోపంగా యువతి.

'పాలు కాచమన్నావా పిల్లా?' అడిగింది ముసలిది.

‘ఇందాకనే చెప్పాను కదూ కాచమనీ’ అంటూ యువతి వచ్చి కుర్చీలో కూర్చుంది.

అతను దిండుకు చేరగిలబడి కూర్చున్నాడు. ఒకసారి యింటికప్పునీ, గోడల్నీ చూసి ‘ఊరికింత దూరంగా ఈ యిల్లు ఉండటం తమాషాగా ఉంది’ అన్నాడు. అతను వచ్చే ఆవులింతనాపు చేసుకుని ‘మీకు వివాహమైందా?’ అని అడిగాడు.

హఠాత్తుగా వేసిన ఈ ప్రశ్నకు ఆమె ఉలిక్కిపడి ‘ఏవిటీ?’ అంది.

‘మీకు వివాహమయిందా?’

ఆమె జవాబు చెప్పలేదు. తలవంచుకుంది.

‘తెలిసింది తెలిసింది లేండి. వివాహమైతే యింటి యజమాని ఉండేవారుగా! మీకు పెళ్ళి కాలేదు. అంతేకాదూ?’

ఆమె కాలి బొటనవేలితో నేలని గీస్తోంది.

‘మీరు చాలా సిగ్గుపడిపోతున్నారే’ అంటూ అతను ఆవలింత నాపుచేసుకోబోయాడు. కాని ఆవులింత అతని ప్రయత్నాన్ని జయించి శబ్దం చేసుకుంటూ వచ్చింది. అతను చిటికెవేస్తూ ‘ఇంకా మీరు పెళ్ళి చేసుకోలేదేం?’ అని అడిగాడు.

యువతి కుర్చీలోంచి సంభ్రమంగా లేచి ‘మీకు నిద్ర వస్తున్నట్టుంది. చప్పున పాలు కాచి తీసుకువస్తాను’ అంటూ తొందరగా గదిలోంచి వెళ్ళిపోయింది. సుష్టయిన భోజనమూ, మెత్తని పరుపూ అలసిన అతని నరాలనీ దేహాన్నీ లాలిస్తూంటే, నిద్ర ముంచుకు వచ్చింది. హోరున వర్షమూ, ఒంటరిగా ఉన్న యీ యిల్లూ, యీ రాత్రి, యీ ఆతిథ్యమూ గురించి వింతగా తలచుకుంటూనే నిద్రలోకి జారిపోయాడు. చలిగాలి చూరుని జుయ్యిమని శబ్దం చేస్తూ కొట్టుకుంటోంది. ఇంటి ముందు మడుగులో కప్పలు బెకబెకమని చప్పుడు చేస్తున్నాయి. వర్షం చూరు మీద ఉన్న రేకు మీద పడి డబడబ ధ్వనిస్తోంది. అయినా వీటన్నింటిని మించిన నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంటుంది.

సుమారు ఓ గంటకి అతనికి మెలకువ వచ్చింది. గది తలుపులు తెరచిన చప్పుడయి ఒక కన్ను కొంచెం తెరచి చూశాడు. యువతి అడుగులో అడుగు వేసుకుంటూ చప్పుడు కాకుండా వచ్చింది. ఆమె చేతిలో పాలగ్లాసు ఉంది. మెల్లగా ‘ఏవండి?’ అంది. జగన్నాథం నిద్ర నటించాడు. ఆమె మళ్ళీ ‘ఏవండీ పాలు తీసుకుంటారా?’ అంది. అతనికి మెలకువ రాకపోవడం చూసి పాలగ్లాసు ముక్కాలిపీట మీద పెట్టి అలమారలో వున్న ప్లేటు ఒకటి తీసి మూతపెట్టింది.

అడుగులో అడుగు వేస్తూ గుమ్మం వరకూ వెళ్లింది. ఆమెకేదో ఊహ తోచి ఆగిపోయింది. సంకోచంతో మంచంవైపు చూసింది. అతనంతా కనిపెడుతూనే ఉన్నాడు. ఆమె మూలనున్న దీపం తీసుకుని వత్తి పెద్దది చేసి మంచం దగ్గరకు వచ్చి దీపాన్ని అతని ముఖానికి దాపుగా ఎత్తిపట్టుకొని పరీక్షగా చూస్తూ నిలుచుంది. అతని కుతూహలం ఎక్కువయింది. కాని అనుకోకుండా చటుక్కున కదిలాడు. ఆమె కంగారుగా దీపం కింద పెట్టి వెళ్ళిపోబోయింది. అతను కళ్ళు తెరుచుకుని ఏమీ ఎరగనట్టు 'ఎవరదీ?' అన్నాడు. ఆమె ఆగింది. అతను లేచి కూర్చుని కళ్ళు నులుముకొని 'హో–మీరా?' అన్నాడు. తన చేష్టల్ని పరికించాడేమో అన్న శంకతో తడబడుతూ 'మీకు పాలు తీసుకువచ్చాను' అంది ఆమె.

పాలు తాగుతూ 'మీరెందుకింత దయ చూపిస్తున్నారో అర్థం కావడం లేదు' అన్నాడు.

ఆమె నవ్వి 'మీరు గోరంతలు కొండంతలు చేస్తున్నారు. మేం చేసిందేముంది చెప్పండి. ఇంత భోజనం పెట్టి పడుకోవడానికింత జాగా చూపించడం కూడా ఘనకార్యమంటారా' అంది.

అతను నిట్టూర్చి 'నిజంగా ఘనకార్యమే. నా జీవితంలో ఎన్నో రాత్రులు భోజనమూ వసతీ లేక గడిపినవి ఉన్నాయి' అన్నాడు.

నిద్ర వల్ల చిక్కిన స్వస్థతతో బలంతో అతనిలో ఉత్సాహం ప్రబలింది. ఈ అపరిచిత యువతివైపు తాను నిముష నిముషానికీ ఆకర్షించబడుతున్నట్టు తెలుసుకున్నాడు. ఆమెను పరీక్షగా చూశాడు.

నొసట ముంగురులు చెదరిపడుతున్నాయి. ఇందాకా వదులుగా ఉన్న జడని సిగగా చుట్టింది. ఆమె దేహంలో సౌకుమార్యము యౌవనోల్బణము రెండూ గోచరిస్తున్నాయి. లేత నీలం చీరలో ఆమె వొంటి సొంపులు పొందికగా అమరి వున్నాయి. అన్నిటికన్నా ఆమె కళ్ళు ఎక్కువగా అతన్ని ఆకర్షించాయి. ఆ కళ్ళలో అపారమైన జాలీ కరుణా స్ఫురిస్తున్నాయి. ఏ స్వర్గలోకంలోనో స్వప్నలోకంలోనో విరిసికొన్న ఆ కన్నులు, భూమి మీద ప్రవాస జీవితం అనుభవిస్తూ ఏదో పోగొట్టుకున్నట్టుగా బెదురుగా వెతుకుతున్నట్టు అనిపిస్తుంది. జాలిగా మెత్తగా మన గుండెల్ని తాకుతూ పువ్వులాంటి గొంతుతో పిలుస్తోన్నట్టు ఉంటాయి. తనవైపు జగన్నాథం పరీక్షగా చూస్తోన్నట్టు గుర్తించిన ఆమె బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. తాంబూల సేవనంలో ఎర్రబడిన పెదవుల మధ్య చిన్ననవ్వు ముత్యంలా చిట్లింది.

'అన్నట్టు మీ పేరు ఇంతవరకు తెలియనే తెలియదు' అన్నాడు జగన్నాథం.

'రమ'

'మీరు చదువుకున్నవారిలా కనిపిస్తున్నారు'

'ఏం చదువులెండి. హైస్కూలులో ఆరవఫారం వరకూ చదివాను. అది కూడా పెద్ద చదువేనంటారా' అని ఆమె అతన్ని చూసి 'సరే కబుర్లు పెట్టి మీకు నిద్రాభంగం కలిగించాను. వెళ్ళిపోతాను' అని లేవబోయింది.

'నిద్ర తేలిపోయింది లెండి. అదీగాక కబుర్లు మొదలుపెట్టినవాణ్ణి నేను. నా దోషాన్ని మీరు నెత్తి మీద వేసుకుంటున్నారు' అన్నాడతను.

ఆమె నవ్వి 'భలేవారే' అంది.

'మీ గొంతు హాయిగా ఉంది. మీరు పాడగలరా?'

'అనాధాశ్రమంలో సభల్లో వార్షికోత్సవాల్లో నన్నే పాడమనేవారు. చెట్టులేని చోట ఆముదం చెట్టుని మరి.'

'అనాథాశ్రమమా?' ఆశ్చర్యంగా అడిగాడతను.

'అవును'

'తల్లీ తండ్రీ చిన్నతనం నుంచీ మీకు లేరా'

'లేరు' ఆమె తలవంచుకుంది.

అనుచిత ప్రసక్తి తీసుకువచ్చానేమో అన్న భయంతో మాట మార్చాలని ఏమీ తోచక 'చాలా చలిగా ఉంది' అన్నాడు.

'అవును' అందామె.

అతను ఫక్కున నవ్వాడు.

'ఎందుకలా నవ్వుతారు?' అందామె తెల్లబోయి.

'మరేమీలేదు. ఏ ప్రశ్న అడిగినా నేనే అడుగుతున్నాను. మీరు అవును, కాదు అని ముక్తసరిగా సమాధానం ఇచ్చి ఊరుకుంటున్నారు. నేనెవరినో ఏవిటో తెలుసుకోవాలనే స్త్రీ సహజమైన కుతూహలం కూడా లేదా మీకు?'

ఆమె అతనికేసి వింతగా చూసి ఊరుకుంది.

'నిజం చెప్పండి. ఇందాక నా పేరడిగి తెలుసుకున్నప్పుడు మీలో కలిగిన ఆశాభంగం స్పష్టంగా కనిపించింది ఎంచేత?' జగన్నాథం అడిగాడు.

'మీరు విజయుడిలాగా ఉన్నారు' అని పైటచెంగును వేలికి చుట్టుతోంది.

'విజయుడెవరు.' ఆమె సమాధానం చెప్పేలోగానే మళ్ళీ ఇలా అన్నాడు.

'మీలో నాకొక విచిత్రమైన అందం కనబడుతోంది. మీరంటే నాకు... నాకు..' మాట కోసం జగన్నాథం తడబడ్డాడు.

ఆమె జాలిగా అందంగా చిన్నగా నవ్వింది. అతను మళ్లీ అడిగాడు.

'మీకు పెళ్ళి కాలేదు కదూ'

లేదని ఆమె తల ఊపింది.

'మరి ఎందుకు చేసుకోలేదు మీరు రమా?'

ఆమె మౌనంగానే ఉండిపోయింది.

'ఇలాగ వ్యక్తిగతమైన ప్రశ్నలు వేయడం సభ్యత కాదనుకుంటున్నారు కదూ! అవును చూడండి రమా. ఈ రాత్రీ, ఈ వర్షమూ, ఈ విచిత్ర వాతావరణమూ – ఇవన్నీ మామూలు మర్యాదల్ని వెనక్కినెట్టి స్వచ్ఛంగా స్వేచ్ఛగా హృదయాలు విప్పి మాట్లాడుకోవాలనే వాంఛను ప్రేరేపించడంలేదూ?' అన్నాడతను.

'మీతో మాట్లాడుతూ కూర్చుంటే నాకేదో హాయిగా ఉంది' అందామె.

అతను దూరంగా చూస్తూ అంతకన్నా దూరంగా ఆలోచిస్తూ 'నిజానికి నేను లౌక్యుణ్ణి కాను. ఎప్పుడెలా ప్రవర్తించాలో నాకు తెలియదు. అందుకే జీవితంలో ఏమీ కూడబెట్టలేక పోయాననుకుంటాను' అన్నాడు.

'అంటే' ఆసక్తిగా అడిగిందామె.

'జీవితంలో నేను పరాజయం మీద పరాజయం పొందాను. డబ్బుగాని, వసతిగాని, భార్యాపిల్లల్నిగాని ఏమీ సంపాదించుకోలేదు. అందుకే విసుగెత్తి సైన్యంలో చేరాను'

'సైన్యమా? విజయుడు కూడా సైన్యంలో చేరాడు' అందామె సంభ్రమంగా కుర్చీ నుండి లేచి.

అతను వినలేదు. తన ధోరణిలో చెప్పుకుపోతున్నాడు. 'బర్మా, సింగపూర్, ఇంఫాల రంగాలలో పనిచేశాను. కాని అక్కడ నాకు సుఖం లేదు. తుపాకిమందు వాసనా, చావులూ, యూనిఫారమూ అంతే. అసహ్యం కలిగింది. ఎలాగో అలాగ బయటపడి ఇదివరకు ఆపుచేసిన చదువుని మళ్ళీ మొదలుపెట్టాను. యం.యస్.సి. చివరకంటూ చదివి పరీక్షలకు కూర్చోలేదు.'

'అరె! అలా చేశారెందుకు?'

'ఆ రోజున పరీక్షలనగా నేనద్దెకున్న గది తాలూకా యింటావిడ అటక మీద

నుండి పడింది. తల మీద బలమైన గాయం తగిలి స్పృహ తప్పి పడిపోయింది. ఆమెకు అయిదేళ్ళ పిల్ల ఒకర్తి ఉంది. అస్తమానూ నా గదిలోకి వచ్చి కూర్చుని ఆడుకునేది. పాపం ఆ పిల్ల ఒకటే ఏడుపు. ఇంటావిడని ఆస్పత్రిలో చేర్చారు. డాక్టరు బతుకుతుందో బతకదో చెప్పలేమన్నారు. ఆ పిల్ల సంరక్షణ నా మీద పడింది. రెండుపూటలా ఆస్పత్రికి వెళ్ళి ఆమె బాగోగులు విచారించడమూ, అమ్మ, అమ్మ అంటూ ఏడ్చే ఈ పిల్లని సముదాయించడంతో నా చదువూ, పరీక్షలూ కొండెక్కాయి.'

'ఆవిడ బతికిందా?'

'బతికింది. నేనంటే ఆమెకి చాలా గురి కలిగింది. ఆమె విధవరాలు. పెద్దవయస్సుది కూడా. నన్ను అక్కడే ఉండిపోయి మళ్ళీ చదవమంది. తన తమ్ముడిలా చూసుకుంటాననీ ఎన్నో విధాలా చెప్పింది. కాని నేను వినలేదు.'

'ఇప్పుడు మీరేం చేస్తున్నారు?'

'నన్ను గురించి మీరడిగిన మొదటి ప్రశ్న యిది' అంటూ అతను నవ్వాడు.

ఆమె కూడా నవ్వి 'సరే చెప్పండి' అంది.

'ఒక మందులు తయారు చేసే కంపెనీలో ఉంటున్నాను. కాని ఆ ఉద్యోగమూ చెయ్యాలని లేదు. ఒక చోటుకీ వృత్తికీ అంటిపెట్టుకుని ఉండడం నా స్వభావంలో లేదనుకుంటాను. జిప్సీలని ఉన్నారు చూడండి. వాళ్ళు ఊరూరా తిరుగుతుంటారు. అటువంటి ప్రవృత్తి ఏదో నాలో ఉందనుకుంటాను. ఏవిటో చెప్పలేను. ఈ దేశాన్నే విడిచి వెళ్ళిపోవాలని ఉంది – బర్మాకో, సింగపూర్‌కో.'

'వద్దు వెళ్ళకండి' అని ఆవేశంతో అందామె. చటుక్కున సిగ్గుపడిపోయింది. అతను తెల్లబోయి చూశాడు. ఆమె అర్థం లేకుండా గబగబా వెళ్ళి కిటికీ తలుపులు తెరచింది. చలిగాలి కొరడా ఝుళిపించినట్టుగా లోపలికి వచ్చి తగిలింది.

'అబ్బ! చలి! తలుపులు వేసెయ్యండి' అన్నాడు జగన్నాథం.

'వాన చాలామటుకు తగ్గింది' అంటూ తలుపులు వేసి ఆమె వచ్చి కుర్చీలో కూర్చుంది.

అతను నవ్వుతూ యిలా అన్నాడు. 'ఇందాకట్నుంచీ మీరు నా ప్రశ్నకు జవాబు చెప్పకుండా దాటుకుపోతున్నారు. చెప్పండి మీరు పెళ్ళి చేసుకోరా?'

'నన్నెవరు చేసుకుంటారు?' ఆమె నీరసంగా అంది.

'ఏం? మీకేం తక్కువ?' అన్నాడతను.

ఆమె పెదవులు వణుకుతున్నాయి. అతను గమనించలేదు. అతను మళ్ళీ రెట్టిస్తూ 'ఇంతకాలం మీరు అవివాహితులుగా ఉండడానికి ఏదైనా ప్రత్యేక కారణం ఉందంటారా? లేదా అవివాహితలుగానే వుండదలిచారా?' అన్నాడు.

ఆమె తన ముఖాన్ని రెండు చేతులతో కప్పుకుని 'మీకు తెలియదు. మీకు తెలియదు. మీకు తెలియకూడదు' అంటూ గబగబా గదిలోంచి వెళ్లిపోయింది.

ఆమె వెళ్ళిన వైపే నిశ్చేష్టుడై చూస్తూ ఉండిపోయాడు జగన్నాథం. వెనకాలే వెళ్ళి క్షమించమని అడిగితే బావుంటుందనుకున్నాడు. కాని ఆమె వెంటపడటం కూడా పొరపాటేమో అని సందేహించాడు. ఏమీ తోచక కిటికీ తలుపులు తెరిచాడు. సన్నగా వాన పడుతోంది. దట్టంగా భయంకరంగా ఉంది అవతల చీకటి. ఆకాశాన ఒక నక్షత్రం కూడా లేదు. కప్పల అరుపులు మాత్రం ఘోరంగా అసహ్యంగా వినిపిస్తున్నాయి.

తలుపులు వేసి మంచం మీద మేను వాల్చాడు. ఊరికి దూరంగా ఉన్న ఈ కొంప దెయ్యాలకొంప కాదుకదా అన్న ఆలోచన అతన్ని ఒక నిమేషామాత్రం భయావహుణ్ణి చేసింది. అతనికి చనిపోయిన మిత్రుడు జ్ఞాపకం వచ్చాడు. ఎందుకింత తొందరపడి ఈ స్నేహాల్నీ అనుభవాన్ని వదులుకొని చచ్చిపోయాడు! అతని ఆత్మలాంటిది యింకా ఏదైనా భూమి మీద ఉండి అతృప్తంగా తిరుగు తూంటుందా? ఇంత మిధ్యగా మోసంగా ఉన్న బ్రతుకులో నిజానికి ఎవరికెవరు? ఈ బాంధవ్యాల అనుబంధాల అర్థం ఏమిటి? ఎందుకు రమ అలాగ భయకంపి తురాలై పరుగులెత్తుకుపోయింది? ఎందుకు తాను కష్టపడి ఆర్జించిన వెయ్యి రూపాయలూ చనిపోయే ఒక మిత్రునికి దానం చేయాలని వర్షంలో, గాలిలో బయలుదేరి వచ్చాడు. విజయుడెవరు? అతని పోలికలు తనలో ఎందుకుండాలి? ప్రతి బ్రతుకునీ ఏదో రహస్యంలో చుట్టుబెట్టి అగోచరమూ బలీయమూ అయిన విధి నిరంకుశంగా ఎక్కడికో తెలియని చోటికి నడిపిస్తోన్నట్టు అనిపించింది అతనికి.

అతనికి గుండెలో ఏదో వెలితిగా తోచించి. తనలోని ఈ అస్థిరత్వానికి, అశాంతికి కారణం ఏవిటి? ఇలా వూళ్ళూ దేశాలూ తిరుగుతూ జీవితాంతం వరకూ గడపవలసిందేనా? తనకొక ఇల్లు, తనకోసమై ఎదురుచూసే, జీవించే ప్రాణి – అతడు తనలో తాను నవ్వుకున్నాడు. ఎప్పటికీ తానొకచోట స్థిరంగా ఉండలేదు. ఎప్పుడో ఎక్కడో గాలివాటానికి తాడు తెగిపోయింది. ఇలాగ శూన్యంలో ఏ బాధ్యతా లేకుండా గాలికి కొట్టుకుపోతూంటేనే బావుంటుందేమో?

ఆలోచిస్తూన్న అతనికి కునుకుపట్టింది. అప్పుడు కూడా అతని మనస్సు అవ్యక్తంగా ఆమె కోసమే నిరీక్షిస్తోంది. ఒక గంటలో అతనికి మెలకువ వచ్చింది. గుమ్మం తలుపులు బార్లా తీసి వున్నాయి. నలువైపులా చూశాడు. రమ మళ్ళీ వచ్చిన జాడ లేదు. గోడ మీద గడియారంలో పండ్రెండు దాటింది. అతనికేమీ తోచలేదు. ఆ గదిలో ఒక్కడూ అలాగ వుండడం దుస్సాహసమనిపించింది. మంచం దిగి మెల్లగా అడుగులు వేసుకుంటూ మండువాలోకి వచ్చాడు. ఒక మూలగా కోడిగుడ్డు దీపం మిణుకు మిణుకుమంటూ వుంది. ఆ తక్కువ కాంతిలో మండువాలోని వస్తుజాలం అస్పష్టంగా అసంబద్ధ రూపాలలో కనబడుతోంది. కిటికీకి ఎదురుగా నల్లగా ఒక ఆకారం కనబడింది. ఏమిటా అని దగ్గరకు వెళ్ళినకొలదీ స్త్రీరూపం ప్రస్ఫుటమైంది. రమ కిటికీకి ఎదురుగా కూర్చుని వుంది. విడిపోయిన పొడుగాటి ఆమె కేశపాశం బుజాల్నీ, వీపునీ ఒత్తుగా కప్పింది. అతను దగ్గరగా వెళ్ళి 'రమా' అని పిలిచాడు. ఆమె పక్కకి తిరిగి అతని వైపు చూసింది. దీపకాంతిలో ఆమె కన్నులు జలమయం అయివుండడం చూశాడు. ఆమె కపోలాల మీద అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి.

'ఇదేవిటీ రవమా ఏడుస్తున్నావా?' అన్నాడు జగన్నాథం, వ్యథతో సానుభూతితో. ఆమె చీర చెంగుతో కన్నీరు తుడుచుకుని లేచి నుంచుంది. అతని ప్రయత్నం మీద ఆమె ఏడుపు నాపుకుంటూన్నట్టు అతను గ్రహించాడు. ఆమె చెయ్యి పట్టుకుని 'లోపలికి రండి. ఈ చలిగాలిలో కూర్చుంటే ఉదయానికి ఏ న్యూమోనియానో కూడా రావచ్చును' అంటూ గదిలోకి తీసుకువెళ్ళాడు. 'ఇలాగ మంచం మీద కూర్చోండి. ఈ క్షణంలో మిమ్మల్ని చూస్తే ప్రపంచంలోని బాధ అంతా మీలోనే ముద్దకట్టుకుందా అనిపిస్తుంది' అంటూ ఆమె వద్దువద్దంటున్నా ఆమెను మంచం మీద కూర్చోపెట్టి ఆమెకి కొంచెం దూరంగా కూర్చున్నాడు.

'ఇప్పుడెవరైనా వచ్చి తమ యిరువుర్నీ చూస్తే నేను మిమ్మల్ని హింసిస్తున్న ట్టుగా ఊహించుకుని నన్ను జైల్లో పడేయాలని చూస్తారు. అవునా' అన్నాడతను నవ్వుతూ.

ఆమె కన్నీళ్ళలోంచి నవ్వింది.

'అయితే యిప్పుడు చెప్పండి విజయుడెవరు?' అని అడిగాడతను. ఆమెను మాటలలో పెట్టి హృదయబాధని వెళ్ళబోయించినట్లయితే కొంత ఉపశమనం కలుగుతుందని అతను ఉద్దేశించాడు.

'నా బాల్య స్నేహితుడు' అందామె.

'ఊ!'

'నేను చదువుకునే రోజుల్లో అతని పరిచయం కలిగింది. ఎప్పుడు చూసినా ఎంతో ధైర్యంగా, ఉత్సాహంగా వుండేవాడు. తల్లీ తండ్రీ లేని నన్ను చూసి జాలిపడేవాడు. ఇంట్లో నుంచి డబ్బు దొంగిలించి తీసుకొచ్చి నాకెన్నో కొనిపెట్టేవాడు.'

ఆమె కళ్ళు స్మృతిపూర్వకమైన గర్వంతో మెరిశాయి.

'తర్వాత' అన్నాడతను.

'కాని ఆ దొంగతనాలకి అతను విపరీతంగా కఠినమైన శిక్షల్ని అనుభవించే వాడు. పాపం. అతనికి సవతి తల్లి వుంది. ఆమె చాలా క్రూరురాలు. తండ్రి ఆమెకి దాసుడు. నా కోసమై అతను దెబ్బలు తినడమూ, తిండిలేక మాడడమూ సహించలేకపోయేదాన్ని. అతన్ని బతిమలాడుకునేదాన్ని ఇటువంటి పనులు చెయ్యొద్దని. అతను వినేవాడు కాదు. నీకోసం ఏమైనా చేస్తాను. నీకొక్క నిముషం ఆనందం కలిగించడానికి వెయ్యేళ్ళ నరకాన్నైనా అవలీలగా అనుభవించగలను అనేవాడు. స్కూలు వదలగానే ఒక నిర్ణీత స్థలంలో కలుసుకునేవాళ్ళం. పాటలు పాడేవాళ్ళం. జామపళ్ళూ, రేగిపళ్ళూ తింటూ గంటలు నిమిషాల్లాగా గడిపేవాళ్ళం. స్వచ్ఛమైన అనంతమైన నీలాకాశం కింద వెచ్చని పచ్చని మెత్తని భూమ్మీదా ఎన్నో స్వప్నాలు కనేవాళ్ళం. నన్నే పెళ్ళి చేసుకుంటాననేవాడు. నన్నే ప్రేమించాననేవాడు. చీకటిపడ్డాక అనాథ శరణాలయానికి బిక్కుబిక్కుమంటూ వెళ్ళేదాన్ని. అక్కడ వార్డెన్ పెద్దపులిలాగ నాకోసం కనిపెట్టుకుండేది. భోజనం లేకుండా చీకటి గదిలో నన్ను తోయించి తాళం వేసేది. రాత్రంతా ఏడుస్తూ బాధతో భయంతో గడిపేదాన్ని. కాని తెల్లవారిందా, ఎప్పుడు సాయంత్రమ వుతుంది, ఎప్పుడు విజయుణ్ణి కలుసుకుంటాను? అని నిరీక్షిస్తూ ఉండేదాన్ని. అతనొకడే నా ఆశ. నేను బతకడానికి గల అర్థం.

కాని మనం ఊహించినట్టుగా కోరుకున్నట్టుగా ఎక్కడేనా జరుగుతుందా చెప్పండి. రోడ్డంతా సవ్యంగా చదునుగా ఉన్నట్టే వుంటుంది. కాని మలుపు తిరిగేటప్పటికి బ్రహ్మాండమైన అగాధం నోరు తెరచుకుని అప్రమత్తుడైన పాంథుణ్ణి అమాంతం మింగివేస్తుంది. అక్కడ ఎర్రని అక్షరాలతో 'అపాయం' అని బోర్డు కూడా వుండదు. ఇంటా బయటా కూడా విజయుడికి పరిస్థితులు దుస్సహ మయ్యాయి. బి.ఏ. చదువుతూండగా అతనికి వివాహం చెయ్యడానికి సవతి తల్లి దీక్ష వహించింది. అన్నీ స్థిరపరిచింది. విజయుడెదురు తిరిగాడు.

బెదిరించాడు. ఒక రాత్రి సంభవించిన పెద్ద దెబ్బలాటలో యినుపకమ్మీతో సవతి తల్లి తల మీద బలంగా కొట్టాడు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా వుంది. రాత్రికి రాత్రి విజయుడు పరారీ అయిపోయాడు. తండ్రి పోలీసులకు రిపోర్టు యిచ్చాడు. అతని ఆచూకీ దొరకలేదు. మూడునెలల అనంతరం నాకో ఉత్తరం వచ్చింది. అందులో రెండు వాక్యాలున్నాయి. తాను సైన్యంలో చేరినట్టూ, బతికి బాగుంటే ఎప్పుడో ఒకప్పుడు కలుసుకుంటాననీ మాత్రం రాశాడు. అంతే. యుద్ధం ముగిసింది. ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి కాని ఈనాటి వరకూ అతని జాడలేదు.'

ఆమె గొంతు క్రమక్రమంగా క్షీణమూ గాద్గదికమూ అయిపోయింది. ఆమె కాసేపాగి మళ్ళీ యిలా చెప్పింది. 'ఓసారి చెట్టు మీద నుంచి పడినప్పుడు విజయుడికి నెమరుకణత పక్కగా గాయం తగిలింది. క్రమేణా అది మచ్చగా మారింది' ఆమె జగన్నాథం కేసి తీవ్రంగా చూసింది. 'అదిగో అక్కడ మీకు ఏదో మచ్చ వుంది. మీరు విజయుడు కాదా? చెప్పండి. నిజం చెప్పండి. నన్ను మోసగించకండి. నన్ను బాధపెట్టకండి' ఆమె ఉద్రేకంతో దీనంగా ప్రాధేయ పడుతూ అడిగింది.

జగన్నాథం ఆమెని, పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. శాంతంగా 'నేను నీ విజయుణ్ణి కాదు రమా. అలా చిన్నపిల్లల్లాగ ఉద్రేకపడిపోవడం మంచిది కాదు' అన్నాడు.

గది గుమ్మం దగ్గర ఎవరో నడిచినట్టు చప్పుడయింది. ఇద్దరూ అటువైపు చూశారు. ఎవరూ లేరు. అతను తిరిగి ఆమెను ప్రశ్నించాడు.

'అనాథాశ్రమంలో మిమ్మల్ని ఎవరు చేర్పించారు'.

'నాన్న' అందామె.

'మీ తండ్రి నెరుగుదురా?'

'ఎరుగుదును.'

'ఆయన వుండగా, ఆయనే స్వయంగా మిమ్మల్ని శరణాలయంలో చేర్పించవలసిన అవసరం ఏముంది?'

'అదంతా ఒక గాథ' ఆమె బరువుగా నిట్టూర్చింది.

'అంటే..'

'నాన్న చాలా దుఃఖజీవి. సంస్కారవాదీ. విప్లవవాది కూడా. తక్కువ కులస్థురాలిని పెళ్ళాడడం వలన బంధువర్గమూ, సమాజం, పెద్దలూ అతన్ని

వెలివేశారు. నాన్న ఆ రోజుల్లో ఒక రహస్య విప్లవ సంఘంలో సభ్యుడుగా ఉండేవాడు. ఎన్నోసార్లు జైలుకి వెళ్ళి తప్పించుకువచ్చేవాడు. ఒకసారి పోలీసులకి, ఈ సంఘానికి పెద్ద కొట్లాట జరిగింది. అందులో నాన్న తుపాకి దెబ్బవల్ల గాయపడ్డాడు. దాని ఫలితంగా ఒక కాలు శస్త్రచికిత్స చేసి తీసివేశారు. కుంటివాడూ అనారోగ్యవంతుడూ అయిన తండ్రి అమ్మనూ, నన్నూ పోషించలేకపోయేవాడు. అమ్మ బెంగతో వ్యాధితో మరణించింది. నాన్న చేసిన త్యాగాన్నీ, దేశసేవనీ ఎవరూ గుర్తుంచుకుని కాస్త సహాయమైనా చెయ్యలేదు. కర్ర నాధారంగా చేసుకుని పొరుగూళ్ళు వెళ్ళి యాచన చేసి నన్ను పోషించేవాడు. క్రమేణా నాన్నకి జీవితం మీద విరక్తి కలిగింది. బతకడమే పెద్ద బరువైపోయింది.

ఒక రోజున అర్ధరాత్రి నిద్రపోతూన్న నన్ను లేపి తనతో రమ్మన్నాడు. నాకు అప్పుడు ఏడెనిమిదేళ్ళ వయసు. తనతో కూడా చీకట్లో నడిపించుకు వెళ్ళాడు. చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడలు ఉన్న ఒక పెద్ద యింటికి తీసుకువెళ్ళాడు. అదే అనాథ శరణాలయం. శరణాలయ నిర్వాహకురాల్ని మా నాన్న బాగా ఎరుగునట. ఆవిడకి నన్నప్పగించాడు. ఆమె చేతికొక ఉత్తరం ఇచ్చి పెద్దదాన్న య్యాక నాకిమ్మన్నాడు. ఒక చేత్తో కర్రనానుకుని ఒక చేత్తో నా చుబుకం పట్టుకుని కన్నీళ్ళతో 'అమ్మడూ ఇక నుంచీ ఈవిడే నీకు అమ్మ జాగ్రత్తగా ఉండమ్మా' అని శిరస్సు మీద ముద్దుపెట్టుకుని కర్రని టకటకమని చప్పుడు చేస్తూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. నేను భయంతో 'నాన్న! నాన్న!' అని గట్టిగా అరిచాను. ఆ ఆక్రోశం చీకట్లో మార్మోగింది. ఉదయానికి నాన్న ఆత్మహత్య చేసుకున్నట్టు ఊరంతా చెప్పుకున్నారు.'

ఆమె బాధతో కంపించిపోతూంది. మంచంపట్టెని గట్టిగా నొక్కి పట్టుకుంది. ఇంకా ఇలా చెప్పుకుపోయింది.

'ఇప్పటికీ ఆ పిలుపు చీకటివేళల హృదయ విదారకంగా ప్రతిధ్వనిస్తూన్నట్టే ఉంటుంది నాకు. ఆశ్రమ నిర్వాహకురాలు చాలా దయాహృదయం కల మహిళ. ఆవిడే ఉంటే నా బ్రతుకిలాగ అయిపోయి వుండేది కాదు. కాని రెండు సంవత్సరాల అనంతరం ఆమె కూడా చనిపోయింది.'

'ఆ ఉత్తరంలో ఏమని రాశాడు మీ నాన్న?' అని అడిగాడు జగన్నాథం.

'నేను జీవిత సమరంలో చిత్తుగా ఓడిపోయినానమ్మా. అందుకే నిన్ను దిక్కులేనిదానిగా ఒంటరిదానిగా చేసిపోతున్నాను. కాని ఒక్కటి మాత్రం మరచిపోకు. నీ తండ్రి ఏం చేసినా ఒక ఆదర్శం కోసమూ, ఒక విశ్వాసం

కోసమూ చేశాడు. అంతేకాని నీచమైన మోసమైన ఏ పనీ చెయ్యలేదు. ఏ లోకంలో వున్నా నీ సుఖాన్నీ, అభివృద్ధినీ కాంక్షిస్తుంటాను అని రాసి వుంది' అందామె.

దుఃఖపూరితమైన యీ గాథతో గాలి అంతా బరువెక్కినట్లనిపించింది అతనికి. ఇద్దరూ కొన్ని నిముషాలు మౌనంగా వున్నారు. అతనే మళ్ళీ ప్రశ్నించాడు – 'మరి ఈ వూరు ఎలా వచ్చావు రమా! ఈ అవ్వ ఎవరూ?'

ఆమె సంకోచంతో అశ్రునయనాలనెత్తి చూసింది.

'చెప్పు రమా. నా దగ్గర ఏం చెప్పడానికీ నీకు సంకోచం అనవసరం. ఈ విషాదయాత్రలో నేనూ ఒక సహచరుడినే' అన్నాడు జగన్నాథం.

'విజయరాముడు – అది విజయుడి అసలు పేరు – వెళ్ళిపోయాక నాకు బతుకంతా శూన్యమైపోయింది. చాలాకాలం అతని కోసం వేచి వున్నాను. కొందరు అతను యుద్ధంలో చనిపోయాడన్నారు. అతన్ని తలచుకుని రోజూ ఏడుస్తూ బెంగగా వుండేదాన్ని. ఆశ్రమం అప్పుడు స్వార్థపరుల చేతుల్లో వుండేది. నానా కష్టాలు పడేవాళ్ళం. బ్రతుకు దుర్భరమైపోయింది. అప్పుడు...' ఆగిందామె.

'అప్పుడు?'

'ఒక పెద్దమనిషి తీయని మాటలు చెప్పి నమ్మించి నన్నీ వూరుకు తీసుకువచ్చేశాడు. ఇక్కడ హోటల్లో మకాం పెట్టారు. ఒకరోజున ఉదయం లేచి చూచేటప్పటికి అతగాడు పెట్టెతో బెడ్డింగుతో మాయమయ్యాడు. కట్టుబట్టలతో ఉన్న నన్ను వీధిలోకి గెంటేశారు. అవమానంతో ఆకలితో చచ్చిపోదామనుకుంటూన్న నన్ను అవ్వ చూసింది. అప్పట్నుంచీ ఇక్కడ అవ్వతో ఉంటున్నాను.'

'అవ్వ నీకేమీ కాదన్నమాట'

'కాదు'

'అయితే నువ్విక్కడ...' అని అతను ఏదో అనబోతూంటే ఆమె చేతులతో తన ముఖాన్ని కప్పుకుని – 'ఇంక నన్నేమీ అడగకండి. నన్ను చంపకండి' అని వెర్రిగా కేకలు వేసింది.

జగన్నాథం తెల్లబోయాడు. ఆమె మంచం మీద బోర్లా పడి వెక్కివెక్కి యేడుస్తూంది. ఆమెకి ఉపశమనం బదులు తీవ్రమైన దుఃఖాన్ని కలిగించానే అని బాధపడ్డాడు జగన్నాథం. తెల్లని పక్క మీద ఆమె జుట్టు విప్పి నెమలిపురిలా వుంది. వేటగాడి బాణం చేత దెబ్బతిన్న కపోతంలాగా విలవిలలాడుతోంది ఆమె. అతనికేం చెయ్యాలో తోచలేదు. ఇబ్బందిగా దిక్కులు చూశాడు. అతని

మనస్సు సానుభూతితో, జాలితో నిండిపోయింది. అనుకోకుండా అతని కళ్ళు రెండూ తడి అయినై.

ఎన్నాళ్ళ నుంచి దాచుకున్న ఈ అపరిమిత దుఃఖాన్ని విజయుడిలాగ కనబడే తన ముందు ఒక ఆత్మీయతననుభవించి బహిర్గతం చేసిందనుకున్నాడు. సుకుమారంగా పువ్వులాగ ఉన్న ఈమెకి యింత బరువుని ఇన్నాళ్ళు మోయగల శక్తి ఎక్కడి నుంచి వచ్చిందా అని ఆశ్చర్యపడ్డాడు. ఎన్ని సుఖాలూ, సదుపాయాలూ ఉన్నప్పటికీ మనస్సులోని ఒంటరితనం ఎంత భయంకరంగా ఉంటుందో అతనికి తెలియవచ్చింది. అది పెద్ద సహారా యెడారిలా వ్యాపించి ఉంటుంది. అక్కడ నీళ్లు దొరకవు. అడుగుజాడలు కనపడవు. బ్రతుకు వాసన ఉండదు. అక్కడ మండే కాలే యిసుక మాత్రం అనంతంగా పరుచుకొని ఉంటుంది. ఎవరూ ఆ ఎడారిలో ఉండలేరు. బ్రతుకలేరు. తనలో, రమలో ఆఖరికి అవ్వలో కూడా ఎడారి. ఈ యిసుకలో కాళ్ళు మాడుతూ బ్రతుకునీడ్చుకుంటూ నాలుక పిడచకట్టుకు పోతూంటే ఒయాసిస్సుల కోసం కొనవూపిరితో కూడా వెతుక్కుంటూ ఉంటారు.

ఈ ఆలోచనలతో క్షణమాత్రం అతని సర్వాంగాలూ కంపించాయి. అతను నిలదొక్కుకుని, ఏడూస్తున్న రమకేసి చూశాడు. ఆమె వీపు మీద చెయ్యివేసి 'రమా' అని మృదువుగా పిలిచాడు. ఆమె మాట్లాడలేదు.

'రమా ఒక్క మాట చెప్పనా' – అన్నాడు మళ్ళీ.

'ఏవిటి చెప్పండి' అంది అలాగే బోర్లా పడుకుని.

'ఇక్కడకు వచ్చి నిన్ను చూచినప్పటి నుండీ నాలో ఒక అశాంతి రేగింది. ఇంతవరకూ ఏ సందేహాలు లేకుండా కులాసాగా మొండిగా జీవితాన్ని గడిపేస్తున్నాను. బుద్ధిపూర్వకంగా మనస్సునీ, చర్మాన్నీ మొద్దుబారిపోయేటట్లు చేసుకుంటున్నాను. నిన్ను చూశాక ఎన్నాళ్ళ నుంచో నీ కోసమే వెతుకుతూన్నట్టు అనిపించింది. ఇప్పుడు నేను తెలుసుకున్నాను రమా. నాకు నువ్వు కావాలి' అన్నాడు జగన్నాథం.

రమ ఏడుపునాపింది. లేచి కళ్ళు తుడుచుకుంటూ ఆశ్చర్యంగా అతనికేసి చూసింది.

'చీకట్లో వెళ్ళే పాంథుడికి దీపంకన్న మరో పాంథుడు ఎక్కువ ధైర్యాన్నీ, విశ్వాసాన్ని యివ్వగలడు రమా. మన యిరువురి జీవితాల్ని ఏకం చేసుకున్నట్ల యితే మనకొక ప్రశాంతీ, ధ్యేయమూ కలుగుతాయని ఆశగా ఉంది. నేను నిన్ను – ప్రేమిస్తున్నాను రమా'

'నిజంగానా?' నమ్మలేని కళ్లతో అడిగింది రమ.

'నిజం. తెగిపోయిన దారాల్నీ, తంత్రుల్నీ చేర్చి ముడెట్టుకుంటేగాని జీవితాలు శ్రుతి తప్పి యిలాగే శిథిలమై నామమాత్రం లేకుండా నశించిపోతాయి. నన్ను నమ్ము రమా. నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నీకిష్టమేనా?'

'మరి బర్మా, సింగపూరు ఎక్కడికి వెళ్ళరా?'

'వెళ్ళను. నువ్వు నా భార్యవైతే.'

ఆమె అతని కళ్ళలోని నిజాయితీని, నిశ్చయాన్నీ చూసింది. ఆనందం ఎక్కడ నుంచో సందు చేసుకుని వచ్చి ఆమె ముఖాన్నీ, దేహాన్నీ మెత్తని వెలుతురుతో నింపింది. ఆమె కళ్ళు పెద్దవై ప్రకాశించాయి. ఒక్కసారి సెలవివారగా నవ్వింది. వెర్రి ఆవేశం ఆమెని ఆవరించింది. మైకం కమ్మినట్టయింది. అతన్ని తన వొడిలోనికి లాక్కొని అతని శిరస్సు మీదా, బుగ్గల మీదా, రొమ్ము మీదా గబగబా ముద్దులు పెట్టుకుంది. అతనికూపిరాడక 'అబ్బ వదులు. వదులు రమా' అన్నాడు. ఆమె కిలకిల నవ్వి మంచం మీద నుండి దిగి యిప్పుడే వస్తానంటూ గది నుండి రివ్వున వెళ్ళిపోయింది.

గది దాటగానే ముసలిది కంగారుగా అక్కడి నుండి వెళ్ళిపోవడం చూసింది. దగ్గరగా వెళ్ళి కోపంతో 'అవ్వా నువ్వు చాటుగా నిల్చుని మా మాటలు వింటున్నావా?' అని అడిగింది.

'లేదు పిల్లా లేదు లేదు' తడబడుతూ అంది ముసలిది.

'గుమ్మం దగ్గర ఏం చేస్తున్నావ్ ఇంత రాత్రివేళ?'

'నీతోడు పిల్లా. నేనొక్కమాట వినలేదు. తాళం చెవుల కోసం వెతుక్కుంటూ వచ్చానిలాగ' అంది ముసలిది.

'నీ బుద్ధి మారదు ముసలిపీనుగా' అంటూ విసురుగా ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది రమ.

జగన్నాథం ఒక్కడూ గదిలో మంచం మీద దిండ్లు నానుకుని కూర్చుని ఆమె కోసం నిరీక్షిస్తున్నాడు. అతని మనస్సెంతో తేలికైంది. వర్షం ఎక్కువయింది. రేకు మీద చినుకులు పడిన శబ్దం కూడా ఎక్కువయింది. కొంతసేపటికి రమ గదిలోకి వచ్చింది. రమకన్న ముందుగా సుతారపు అత్తరపు వాసన గదిలోకి వ్యాపించింది. ఆమె ముఖానికి స్నో, పౌడరు ఉపయోగించింది. ఇందాకటి కన్నీటి చారలూ, బాధ యొక్క నీడలూ లేవు. తెల్లని పల్చని చీర కట్టుకుంది. జుట్టు దువ్వుకుని

సిగగా చుట్టుకుంది. నవ్వుతూ, సిగ్గుతో, హాయిగా రాజహంసలా వచ్చే ఆమెని చూడగానే అతని హృదయం ఆనందంతో నిండింది.

అతను లేని ఆమెను మంచి మీద పరుండబెట్టి పక్కనే కూర్చున్నాడు. ఆమె కళ్ళలోకి చూస్తూ 'నువ్వు అమాయకురాలివి రమా. ఇంక నిన్నెప్పుడూ ఏడవనివ్వను. ఏడుపు నీ బ్రతుకులో రానివ్వను' అన్నాడు.

ఆమె తన చేతివేళ్ళనతని వేళ్ళలోంచి పోనిచ్చి 'మీరు నన్ను తప్పక పెళ్ళి చేసుకుంటారు కదూ. ఇక్కడ నుంచి వెళ్ళిపోతాం కదూ' అంది.

'తప్పకుండా ఈ వర్షం తగ్గగానే బయలుదేరి వెళ్ళి అన్ని ఏర్పాట్లూ చేసి ఒక వారం రోజుల్లో నిన్ను తీసుకువెళ్ళడానికి వస్తాను.'

'మీరు రాకపోతే' భయంగా అడిగింది రమ. ఆమె కళ్ళలో భయం సుళ్ళు తిరగడం చూశాడు జగన్నాథం.

'ఎందుకు రాను రమా. నీకిటువంటి అనుమానం ఎందుకు కలగాలి?' అన్నాడు.

'అయితే వొట్టెయ్యండి' అంది రమ.

అతడు నవ్వుతూ ఒట్టు వేశాడు. ఆమె నిట్టూర్చి కన్నులు మూసుకుంది. మనస్సు యొక్క అగాధపు చీకటి లోయలో కాంతిమార్గం తెరచుకుంటూన్నట్ట నిపించింది. ఎర్రని ఆమె పెదవులు దేని కోసమో వెతుకుతూన్నట్లు కదిలాయి. ఆమె ముఖంలో తృప్తి వెయ్యిరేకుల పద్మంలా విరిసింది.

'నువ్వు చాలా అలసిపోయావు; కాసేపు నిద్రపో రమా' అన్నాడు జగన్నాథం.

'మీరు?' అడిగింది రమ.

'నేనిలాగే కూర్చుని ఆలోచిస్తుంటాను.'

'నాకు కాపలా కాస్తుంటారా?' అని నవ్వింది రమ కన్నులు మూసుకునే.

'అవును. ఎవరి సొమ్ముని వాళ్ళు భద్రంగా చూసుకోవాలి కదా' అన్నాడు జగన్నాథం.

పెంకితనంలో వికసించడానికి ఒప్పుకోని ఎర్రని మొగ్గలాగ ఉన్నాయి ఆమె పెదవులు. జగన్నాథం వంగి ఆమె పెదవుల్ని మెల్లగా మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు. రమ అతని చేతిని తీసుకుని తన గుండెల మీద పెట్టుకుంది. అతని చేతి మీద తన చేయి వేసింది.

'ఈ చేయి యిలాగే ఉంచండి. ఇంక నాకు భయంలేదు. హాయిగా నిద్ర

పోతాను' అంది రమ. అతనేవో కబుర్లు చెబుతూంటే వింటూ నిద్రలో లీనమై పోయింది.

ఈ విచిత్ర సంఘటన గూర్చి తన హఠాన్నిర్ణయాన్ని గూర్చి యింకా విస్మయంగా ఆలోచిస్తున్నాడు జగన్నాథం. అతని చెయ్యి ఆమె గుండె మీదనే ఉంది. ఆ చేతి మీద ఆమె చెయ్యి వుంది. అలాగే ఎంతసేపు కూర్చుని ఆలోచించాడో అతనికే తెలియదు. గది గుమ్మం దగ్గర ఎవరో తచ్చాడుతూ న్నట్టుగా అనిపించి నిదానించి చూశాడు. ముసలది సైగ చేస్తూంది. రమ్మని చేయి వూపుతోంది. రమకి నిద్రాభంగం కాకుండా మెల్లగా తన చేయి విడిపించుకుని చప్పుడు కాకుండా గది దాటి వెళ్ళాడు.

'అమ్మాయి బాగా నచ్చిందా బాబూ' అంది.

'నచ్చింది' అన్నాడు జగన్నాథం నవ్వుతూ.

ముసలి దాన్ని కళ్ళు కుత్సిత వూహతో సన్నగా ముడుచుకున్నాయి. వెకిలిగా నవ్వి 'మారాజులు మీరు. గొప్ప గొప్ప ప్రభువులు' అంది.

జగన్నాథం రమ లేస్తుందేమోనని 'త్వరగా చెప్పు అవ్వా' అన్నాడు. ఆమె నమ్ముకున్న హస్తాన్ని ఆమె గుండెల నుండి తీయటం కూడా ఏదో దోషంలాగా అనిపిస్తూంది అతనికి.

'నువ్వేకాదు బాబూ ఏ అయ్య చూసినా నచ్చిందన్న వాడే కాని వేరు మాట పలికినవాడు లేడు. ఒక రాత్రికి రెండొందలు, మూడొందలు యిచ్చిన మారాజులే అందరూ. అందరిలాంటిది కాదు నాపిల్ల. వజ్రం, వైఢూర్యం. దాని వొళ్ళూ దాని రుచీ మీలాంటి ప్రభువులకి తెలుస్తుంది. అందుకే అయినవాణ్ణీ, కానివాణ్ణీ గుమ్మం ఎక్కనివ్వను. ఎంచుకోవడంలో దానికున్న తెలివి గొప్పది బాబూ. మనసు కాకపోతే ఎంత గొప్పవాడినైనా పొమ్మంటుంది' అంది ముసలిది.

'ఇంతకీ నువ్వు చెప్పేదేమిటి?' అన్నాడు జగన్నాథం విసుగ్గా.

'మరేం లేదు బాబూ. నీకెన్నాళ్ళు మనసైతే అన్నాళ్ళూ అనుభవించు. నువ్వు లోటు చేస్తావా బాబూ మారాజు బిడ్డవి. ఒక రాత్రికి రెండొందలు తక్కువ కాకుండా యిస్తావు. నాకు తెలుసు. నీ ఠీవి నీ మాటే చాలు బాబూ నీ లోతు తెలుసుకోవడానికి. ఏదో లేనివాళ్ళం. మీలాంటివాళ్ళు దయదలిస్తే నాలుగు రోజులు మీ పేరు చెప్పుకు తింటాం.'

జగన్నాథానికీ మాట తీరు అసహ్యం అనిపించింది.

'ఇదిగో అవ్వా, రమని నేను పెళ్ళిచేసుకోబోతున్నాను' అన్నాడు.

ముసలిది ఫక్కున నవ్వింది. ఆ నవ్వు కొన్ని వందల కప్పల్ని బట్టలో చుట్టుబెట్టి ఊపిరాడకుండా నొక్కుటూంటే వచ్చిన ధ్వనిలాగా ఉంది.

'మాకు పెళ్ళేవిటి బాబూ' అంది.

'చూడవ్వా. రమ చాలా కష్టాలు పడింది. రమ బెంగతో కృశించిపోతోంది. రమని నేను ప్రేమించాను. పెళ్లి చేసుకుంటానని వాగ్దానమిచ్చాను' అన్నాడు జగన్నాథం.

'వెర్రోడా' అంటూ మళ్ళీ విరగబడి నవ్వింది ముసలిది.

'ఏం?' అర్థంకాలేదామె నవ్వు జగన్నాథానికి.

'నువ్వు కూడా నమ్మేశావా బాబూ. అదంతా నటన బాబూ నటన. ఎప్పుడూ ప్రతివాళ్ళ దగ్గరా యిలాగా కల్పించి చెప్పుతుంది. వాళ్ళు జాలేసి యింకో వంద ఎక్కువిచ్చేవారు. నీకనుభవం తక్కువ. లేత మనిషివి. ఇట్టే నమ్మేశావ్' అంది ముసలిది అతన్ని కనిపెడుతూ.

జగన్నాథానికి కోపం వచ్చింది; సంశయమూ కలిగింది.

'రమ మోసం చెయ్యదు' అన్నాడు సందేహంగా.

'తాను దిక్కులేనిదానినని చెప్పింది కదూ. నువ్వు తను చిన్నప్పుడు ప్రేమించిన బుల్లోడివిలా ఉన్నావంది కదూ. తండ్రి ఉరిపోసుకు చచ్చిపోయాడంది కదూ. వెక్కివెక్కి ఏడ్చింది కదూ' గబగబా అడిగింది ముసలిది. జగన్నాథం స్తంభించి పోయాడు.

'అంతా నటన బాబూ నటన. ఇలాంటి తప్పుడు వేషాలెయ్యొద్దని ఎన్నోసార్లు చెప్పాను. వినదు కదా బాబూ. నాకిలాంటి అబద్ధాలూ వేషాలు నచ్చవు బాబూ. మన మామూలు మనకి చాలు అటువంటి మోసాలు చెయ్యకు ఎప్పటికైనా ప్రమాదం అని చెప్పాను. ఇదిగో ధర్మప్రభువు కాబట్టి నీతో చెప్పాను. ఎక్కడా అనకు బాబూ, మా కూడు పడిపోతుంది' అంది ముసలిది ఉత్సాహంగా.

జగన్నాథానికి నోట్లో ఏదో అరుచి పుట్టినట్లయింది. వెగటుగా అసహ్యంగా అనిపించింది. కోపంతో అతని కళ్ళు జ్వలించాయి. 'అయితే ఈ రోజు రాత్రి మీరు పిలిచి ఉండమన్నందుకు డబ్బివ్వాలి, అంతేనా' అన్నాడు.

'అంతే బాబూ. ఒళ్ళమ్ముకుని బతికేవాళ్లం మాకింకేం కావాలి బాబూ. ఇందాక నా దగ్గరకొచ్చి 'డబ్బు మాట నువ్వడుగు నాకు సిగ్గేస్తుంది' అని మరీ

మరీ చెప్పింది. 'ఆఖరికి బజానా అయినా కొంత తీసుకో అవ్వా' అని పీక్కుతింది. 'మారాజు అన్యాయం చెయ్యడు పిల్లా ఉత్తికంగారూ నువ్వూ' అని కేకలేశాను బాబూ' అంది ముసలిది వినయంగా.

'సరే అయితే' అన్నాడు జగన్నాథం. గబగబా గదిలోకి వెళ్లాడు. బద్దలవ బోతున్న అగ్నిపర్వతంలాగ ఉంది అతని మనస్సు. మంచం మీద నిశ్చింతగా పడుకున్న రమ విషపూరితమైన సర్పంలాగ కనపడింది. ఆమె పీక పిసికి చంపెయ్యాలన్నంత కోపంతో మంచం దగ్గరకు వెళ్లాడు. అప్రయత్నంగా అతని చేతులలోని కండరాలు పురిపెట్టిన తాడులాగ బిగుసుకుపోయాయి. పళ్ళు బిగించాడు. ఇంతలో మళ్ళీ ఏమనుకున్నాడో తన పెట్టె నుండి పర్సు తీసి మంచం మీదకు విసిరాడు. సూట్‌కేసు చేత్తో పట్టుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ మండువాలోకి వచ్చాడు.

చీకటి వర్షం కురుస్తూనే ఉంది.

'వెళ్ళిపోతున్నావా బాబూ?' అంది ముసలిది.

సమాధానం చెప్పకుండా మెట్టు దిగి మడుగుదాటి వడివడిగా చీకట్లోకి వెళ్లిపోయాడు. ముసలిది విజయసూచకంగా, వికృతంగా ధ్వని చేసింది.

రమకి మెలకువ వచ్చేటప్పటికి అయిదుగంటలు దాటింది. చీకటి పలచ బడుతోంది. నల్లని చీకటి బూడిదరంగుగా మారుతోంది. చావు లోంచి, భయం లోంచి ఏదో కొత్తలోకంలోకి కాంతిలోకంలోకి వచ్చినట్లనిపించింది రమకి. ఆమె కళ్ళు తెరుస్తూనే చిరునవ్వు నవ్వింది. బయట వాన కురుస్తున్నా, ఆకాశం మేఘాచ్ఛాదితమై ఉన్నా, చలిగాలి సూదుల్లాగా గుచ్చుకుంటున్నా ఆమెలో ఒకానొక వసంత ప్రభాత సూర్యుడు వెచ్చని తెల్లని కిరణాల్ని ప్రసరించాడు.

బద్ధకంగా ఆవులించి పక్కకు చూసింది రమ. అక్కడ జగన్నాథం లేడు. లేచి కూర్చుని గది అంతా చూసింది.

జగన్నాథం పెట్టె కూడా కనబడలేదు. కంగారుగా మంచం దిగి మండువాలోకి వచ్చింది. అవ్వ చీపురుతో తుడుస్తోంది. ఆతృతతో 'ఆయనేరీ అవ్వా?' అని అడిగింది.

'వెళ్ళిపోయాడు'

రమకి గుండె ఆగినంత పని. 'ఊహు వెళ్ళడు. నాతో చెప్పకుండా వెళ్ళడు' అని ఉద్రేకంతో అంది. ముసలిది మాట్లాడలేదు.

'ఎక్కడికి వెళ్లాడు?' అంది రమ.

'ఏమో నాకేం తెలుసు. పెట్టె పట్టుకుపోయాడు' అంది ముసలిది.

'ఎందుకు వెళ్ళనిచ్చావ్ అవ్వా? నేను లేచే వరకైనా ఉంచలేకపోయావా?' అంది ఏడుపు నాపుకుంటూ రమ.

'ఏవిటే ఆ కంగారు పిల్లా! నేనంత తెలివితక్కువ దాన్ననుకున్నావా? అదిగో చూసుకో నీ మంచం మీద పర్సు వదిలేసి మరీ వెళ్ళాడు.'

'డబ్బా!'

'అవును.'

రమకి అనుమానం కలిగింది. తీవ్రంగా 'నువ్విమ్మని చెప్పావా?' అంది.

'ఢంకా బజాయించి చెప్పాను. నాకేం భయమా సిగ్గా? నాలుగురాళ్ళు రాలే చోట నోరుమూసుకుండడం నా చేతకాదు పిల్లా' అంది గర్వంగా ముసలిది.

పెదవులు నొక్కి పట్టి 'ఏం చెప్పావు ఆయనతో?' అంది రమ.

'వెర్రిబాగులవాడు. నువ్వు ప్రేమించావనీ నిన్ను పెళ్ళిచేసుకుంటాననీ అన్నాడు. మరి నా గతేం కాను పిల్లా. నాకు మాత్రం ఎవరున్నారు పిల్లా నువ్వు తప్ప. వాణ్ణి తగులుకుని చల్లగా పోదామని చూస్తున్నావా? నీ ఆటలు నేను సాగనిస్తానటే పిల్లా. ముసలిదాన్ని దిక్కులేక చస్తే నీకేం? ఇన్నాళ్ళు చేసిందీ మరచిపోయి మాయచేస్తావా?' అంది ముసల్ది చేతులు వూపుతూ.

'ఏం చెప్పావ్?' అంది రమ.

'నీదంతా నటన అని చెప్పాను. వచ్చిన ప్రతివాడి దగ్గరా యిలాగే వేషం వేస్తుందన్నాను. ఆవదం తాగినట్టయింది అబ్బాయి మొహం' అంది ముసల్ది కళ్ళు చికిలిస్తూ నవ్వుతూ.

రమకి కాళ్ళ కింద భూమి బద్దలయిపోతూన్నట్టు అనిపించింది. ఆమెకి దేవుడి మీదా మనిషి మీదా విశ్వాసం ఒక్కపెట్టున తుడిచిపెట్టుకుపోయినట్లయింది. కళ్ళు తిరిగి పడిపోతున్నట్టు ఆమె గోడనానుకుని నిలబడింది.

ముసలిది అనునయంగా, 'మగవాళ్ళ మాటలు నమ్మి చెడిపోకు పిల్లా. అప్పుడు నేను నిన్నాదుకోకపోతే నీ గతి కుక్కలకీ నక్కలకీ కూడా పట్టేది కాదు. ఈ వయసులో నాలుగురాళ్ళు కూడబెట్టకపోతే యింకెప్పుడే పిల్లా పోయి చూసుకో. నీ మంచం మీదికి పర్సు గిరవాటేసి పోయాడు. ఎంత సొమ్ముందో చూడు' అంది.

'ముసలి పీనుగా, దొంగముండా, పిశాచముండా' అంటూ రమ వెర్రికోపంతో

ముసలిదాని మీద పడి దబాదబా తల మీదా వొంటి మీదా మొత్తేసింది. ముసలిది తప్పించుకుని పారిపోబోయింది.

'నా కొడుకుని నువ్వే చంపావ్. నా బతుకుని నాశనం చేశావ్.' అని వెర్రిగా అరుస్తూ అక్కడున్న ముక్కాలపీటని ముసలిదాని మీదకి విసిరింది.

'అబ్బా' అని ముసలిది నిలువునా కిందికి కూలబడిపోయింది.

ఆమె తల మీద నుండి నెత్తురు ప్రవాహంలా కారుతోంది. బలమైన దెబ్బతో ముసలిది స్పృహ తప్పి పడిపోయింది. రమ తిన్నగా గదిలోకి వెళ్లింది. మంచం మీద పర్సుని తీసి చూసింది. ఒక అర నిండా నోట్లుకుక్కి ఉన్నాయి. ఒక అరలో జగన్నాథం ఫొటో వుంది. ఆ పర్సు పట్టుకుని వెర్రిదానిలాగా అలాగే నిల్చుని పోయింది. ఆమె చేతులు వణుకుతున్నాయి. కనులమ్మట అశ్రువులు ఏకధారగా ప్రవహిస్తున్నాయి. మూర్తీభవించిన దైన్యంలాగ నిలబడిన ఆమెకు పరిజ్ఞానం నశించింది. ఒక్కసారిగా పరుగెత్తుకు వీధిలోకి వచ్చింది. చేత్తో పర్సుని గట్టిగా పట్టుకుంది. మడుగులో దిగి వేగంగా రోడ్డు మీదకి వచ్చింది. వర్షం సన్నగా పడుతూంది. ఆమె పరుగు సాగించింది. బురదనీళ్ళు వొళ్ళంతా చిందుతున్నాయి. ఆమె గోతుల్నీ గతుకుల్నీ చూడలేదు. గోతులలో కాలుపడి కింద పడుతోంది. మళ్లీ లేచి పరుగెత్తుతోంది. బట్టలన్నీ బురదతో దట్టంగా అసహ్యంగా తయారయాయి. ఆమె ముఖాన కూడా బురద చిమ్మింది. జుట్టుముడి వీడి పోయింది. వానకి వొళ్ళంతా తడిసిపోయింది. బట్టల చివరల నుండి నీళ్ళు కారుతున్నాయి.

తూర్పున వెలుతురు వచ్చేస్తూంది. తూర్పున మబ్బులు కొంచెం తెల్లబడుతున్నాయి. ఆమె పరుగు వేగం హెచ్చించింది. ఆమె రొప్పుతోంది. ఆయాసపడుతోంది. కనుచూపు మేరలో స్టేషన్ కనపడుతోంది. స్టేషన్‌కి రైలు వచ్చేసింది. పళ్ళు బిగపట్టి శక్తినంతా ఉపయోగించి ఒక్క పరుగులో స్టేషన్ చేరింది. జనం గుంపులు గుంపులుగా దిగుతున్నారు. గేటు దగ్గర జనం క్రిక్కిరిసి వున్నారు. వాళ్ళని తోసుకుని లోపలికి పోయింది. చెయ్యి అడ్డంగాపెట్టి 'ఆగు' అంటూన్న టికెట్ కలెక్టర్ని కూడా బురద చేతులతో తోసివేసింది. ప్లాట్‌ఫారం మీదకు వచ్చింది. విడిపోయిన జుట్టుతో వొళ్ళంతా, మొహమంతా బురదతో దుర్భరంగా ఉంది. వింతగా చూస్తున్నారు జనం. ఆమె ఒక్కొక్క రైలు పెట్టెనే ఆత్రంగా వెతుకుతోంది. 'బాబుగారూ' అని అరుస్తోంది. పెట్టలలోని ప్రయాణీకులు అర్థంకాక 'ఏవిటి ఏవిటి' అంటున్నారు. ఆఖరు పెట్టెలో కిటికీకి

కొంచెం దూరంలో ఉన్న జగన్నాథాన్ని చూసింది రమ. రైలుకూత వేసింది. గార్డు విజిల్ వేశాడు.

'బాబుగారూ యిదుగో పర్సు' అంటూ పెట్టెలోకి పర్సుని విసిరింది రమ.

జగన్నాథం రమని పోల్చుకోలేకపోయాడు మొదట.

ఇంతలో రైలు కదిలింది.

రైలుతోపాటు ఆమె కూడా పరుగెత్తుతూ 'నేను రమని నేను రమని... మళ్ళీ మీరు... మీరు' ఆయాసంతో ఇంక మాట్లాడలేకపోయింది రమ.

చీర మడతలో కాలు చిక్కుకుంది.

ఒక్కసారిగా ముందుకు బోర్లా పడింది.


జగన్నాథం తొందరగా వెళ్ళిపోయే రైలు కిటికీలోంచి ప్లాట్‌ఫారం మీదికి చూశాడు. నేలను కరచుకుని, బురదతో నిండిన బట్టలతో; విడిపోయిన శిరోజాలతో; బోర్లా పడివున్న దీనమైన స్త్రీమూర్తి వైపు ప్లాట్‌ఫారం మీద మిగిలిన జనం కంగారుగా రావడం చూశాడు.

అతని మొహం బాధతో నల్లబడింది.

రైలు అప్పుడే చాలా దూరం వెళ్లిపోయింది.

జగన్నాథం కిందకి వంగి పర్సును పైకి తీసి చూశాడు.

పర్సులో డబ్బంతా ఎలా పెట్టింది అలాగే ఉంది. కాని ఫొటో మాత్రం లేదు.



# డబ్బు

## బీనా దేవి

● రచనా కాలం: 1971

**బీనాదేవి:** భాగవతుల నరసింగరావు, బాలా త్రిపురసుందరి కలిసి 'బీనా దేవి' అయ్యారు. భర్త నరసింగరావు జడ్జిగా చూసినది, భార్య త్రిపుర సుందరి గృహిణిగా లోకాన్ని త్రాసులో తూచినది కథలుగా మారి పాఠకులలో ఆలోచనలు రేకెత్తించాయి. రాధమ్మ పెళ్లి ఆగిపోయింది, రిబ్బను ముక్క, రిలీవరు, థేంక్స్ ఫర్ ది పి.ఎమ్ తదితర కథలు, పుణ్యభూమీ కళ్లు తెరు నవల ప్రసిద్ధం. రావిశాస్త్రితో స్నేహం, స్ఫూర్తి ఉన్నాయి. నరసింగరావు తన 66వ ఏట 1990లో మరణించగా త్రిపుర సుందరి 'బీనా దేవి' పేరుతో కథలు, వ్యాసాలు, అనువాదాలు కొనసాగిస్తున్నారు. వయసు 82 సంవత్సరాలు.

దారి మధ్యలో అంత వాన వస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఇంకో గంట వరకు వాన రాకపోయి వుంటే హాయిగా విశాఖపట్నం చేరిపోయేవాళ్లం. రోడ్డు మీద కారు ఎగిరిపోతుందేమోనన్నంత తీవ్రంగా వీస్తోంది గాలి. అయినా మొండిగా కొంతసేపు కారు పోనిచ్చేం. కారు ముందున్న అద్దాలు కరిగిపోతున్న మంచు పలకల్లా ఉన్నాయి. కారు లైట్ల వెల్తురులో వర్షపు చినుకులు వెండి మేకుల్లా ఉన్నాయి.

ఒకచోట కారు ఆపక తప్పింది కాదు ముందు ఆగి వున్న లారీలు బస్సులూ చూసి. ఆ లారీలకు ముందు రోడ్డుకి అడ్డంగా పెద్ద చెట్టు పడిపోయిందట. అంచేత ముందుకి వెళ్లలేం. కారు దిగినా అద్దాలు దించినా కరడు గట్టిపోవడం తథ్యం. వర్షం తగ్గింది కాని గాలి హెచ్చిపోయింది. రోడ్డు పక్కనున్న చెట్లని మొదళ్ల దగ్గర్నుంచీ గిరిగిరా తిప్పేస్తోంది. గాలికి రాలిపోయిన ఆకులు రోడ్డుని కప్పేసేయి. కారుని వదిలేస్తే గాలికి ఎగిరిపోతుందేమోనన్నంత బలంగా వీస్తోంది గాలి. కాని కారులో కూర్చుంటే ఏ చెట్టో మీద పడి చచ్చిపోతామని భయం. అయినా మొండిగానే కూర్చున్నాం భగవంతుణ్ని తల్చుకుంటూ. ఇంతలో మా వెనుక 50 గజాల దూరంలో ఒక చెట్టు దభీమని పడిపోయింది. ఇంకా కారులో కూర్చొని వుండడం అసంభవం. కేవలం తెలివితక్కువ కాని ఎక్కడికి వెళ్లడం! ఎక్కడికైనా సరే. పక్కన వున్న పొలాల్లోకి పోతే పాములూ, కప్పలు ఉండొచ్చుగాని చెట్లు పడి నడుములు విరగవు. అంచేత కారు దిగక తప్పలేదు. దిగేక కనిపించింది వంద గజాలలో ఒక పాక లాంటిది. పెద్ద పెద్ద చెట్లు కూడా ఆగని ఆ గాలికి ఆ పాక ఎలా ఆగి నిలబడి వుందో ఆశ్చర్యమే.

పాకలో వున్న గేస్ లైటు వెల్తురును బట్టి అందులో ఎవరో ఒకరు వుండకపోరు. వాళ్లు ఎంత చెడ్డ వాళ్లయినా పొలాల్లో పాముల పాటి చెయ్యకపోరు. తెగించి వర్షంలో తడుస్తూ, చీకట్లో తడుముకుంటూ ఆ పాక చేరుకున్నాము. చేరుకున్నాక తెలిసింది అది కాఫీ హోటల్‌లని. మేము వెళ్లడం చూసిన కొంతమంది లారీలవాళ్లు కూడా వచ్చేరు. మరికొంతమంది అప్పటికే  అక్కడ వున్నారు. రమారమి అంతమంది ఒక్కలాగే తడిసిపోయేం.

ఆ హోటల్లో పొట్టి రాటలకి బిగించిన బల్లలు బెంచీలుగా పని చేస్తున్నాయి. వాటి ముందు రాతి పలకం టేబిల్సు ఉన్నాయి. చుట్టూ ఉన్న తడికలకు పోస్టర్లు అంటించి ఉన్నాయి. ఒక మూలగా పొయ్యి పక్కన మూడు కుక్కలు ముడుచుకొని పడుకున్నాయి. ఒక కర్ర బీరువాలో పకోడీలు, జంతికలు వగైరా నిలవవుండే టిఫిన్లు వున్నాయి. పొయ్యి దగ్గర క్లీనరు కుర్రాడు కూర్చున్నాడు. ఉన్న ఒక్క కుర్చీలోనూ ప్రొప్రయిటరు కూర్చున్నాడు. అతను కూర్చుంటే ప్రొప్రయిటరు, నిల్చుంటే సర్వర్! అతని పక్కనున్న టేబిల్ మీదున్న గేస్‌లైటు వెలుగుతోందనడం కంటే మండుతున్నదీ అనడం నిజం.

మాతో వచ్చిన లారీలవాళ్లు ఒక బెంచీ మీద కూర్చున్నారు. అందులో మధ్య కూర్చున్నవాడిని ఒకసారి చూస్తే మళ్లీ చూడాలనిపిస్తోంది. అతని జుత్తు సగం నెరిసినా దట్టంగా వుంది. అతను గళ్ల లుంగీ, కాకీ లాల్చీ తొడుక్కున్నాడు. ఆ బెంచీ మీద కూర్చున్నవాళ్లంతా కాకీ బట్టల్లోనే ఉన్నారు. అందులో ఒకడు బాగా కుర్రాడు. బహుశా లారీ క్లీనరు అయి వుంటాడు.

ప్రొప్రయిటరు వాళ్ల బల్ల దగ్గరకి వచ్చాడు 'ఏం కావాలి' అంటూ.

'సలి సలి' సణిగేడు క్లీనరు కుర్రాడు.

'మళ్లీ గనుక సలి అన్నావంటే సంపేస్తాను లంజికొడకా. ఇక్కడెవడూ ముండని కావలించుకొని లేడు. సలి నీకొక్కడికే కాదు. నోరు మూసుకొని ఒల్లకుండు' అని ఆ కుర్రాడ్ని నాలుగు తిట్టి 'నువ్వు మావోడి మాటలు యినకు. ఈడికి ఎండెక్కుతే  దాహం, పొద్దుగూకితే సలి. ఇలాంటి కుక్కపిల్ల లంజికొడకులెక్కడ దొరుకుతారో మా ప్రొప్రయిటరు తల్లికి. ఇంతకీ ఏటిస్తావ్. ఏడిగా ఏటుంది?' ప్రొప్రయిటరు వేపు తిరిగి అన్నాడు గళ్లలుంగీవాడు.

'తైరువడ...'

'అంటే ఏటి మజ్జిగ పుణుకులేనా?'

'జంతిగై, పగోడా, బజ్జీ...' రాని అరవయాసతో మాటాడుతున్నాడు

ప్రొప్రయిటరు.

'నువ్వెంత పగోడా అన్నా నువ్వు అరవ్వోడివనుకోం గాని, నాకు జంతిక పట్రా. మావోళ్లకేటి కావాలో సూడు'

వాళ్లు ఆర్డరిచ్చినవన్నీ తెచ్చేడు ప్రొప్రయిటరు.

గళ్లలుంగీవాడు ఒక జంతిక కొరికి 'హబ్బా' అని చెంప చేత్తో పట్టుకొని ఒక్క క్షణం పోయేక 'సూడు ప్రొప్రయిటరు బాబూ! ఇయ్యి పొట్లం కట్టియ్యి ఇంటికట్టికెళ్లి పిల్లలకిస్తే దొర్లించుకుంటారు సెక్రాల్లాగ. ఇంతకీ నీ తప్పేటుందిలే. ఈ రేత్తిరి యింత వరసంలో ఇన్ని టిఫిన్లున్నాయంటే యీ వారానివి అనుకోవడం మాదే తప్పు. ఆ పకోడీలట్రా అయ్యేల్లా తగలడ్డాయో సూద్దాం. సూడ్డానికి తుపాకీ గుళ్లలా వున్నాయి. గవర్నమెంటోల్లకి అమ్మీ వాటిని. మన గవర్నమెంటు ఎప్పుడూ యుద్దానికెల్లదు కాబట్టి అయ్యి పేలీదీ, పేలన్దీ నువ్వు సచ్చీలోపుగా తెల్దు'

ప్రొప్రయిటరు అతని మాటలకి నొచ్చుకోలేదు. అతడు పకోడీలు పట్టుకొచ్చి యిచ్చేడు. గళ్లలుంగీవాడు ఒక పకోడీ రుచి చూసి 'ఇది కొంత నయం లంకలో ఇభీషణుల్లా. మా అందరికీ 'కేపే'లటుకురా. అడుగో ఆ కొసోడికి మాతరం టీ. అటు సిన్నప్పుడు దొరలకాడ జోళ్లు తుడిసినోడట. అంచేత ఆడు టీ తప్ప కాఫీ తాగడు' అన్నాడు.

ప్రొప్రయిటర్ కాఫీలు, టీలు తెచ్చి వాళ్ల బల్ల మీద పెట్టి తన కుర్చీ దగ్గరకు వెళ్లిపోయాడు. ప్లేట్లు తీసుకోవడానికి వాళ్ల బల్ల మీద పెట్టిన కుర్చీ దగ్గరకు వెళ్లేడు పొయ్యి దగ్గరున్న క్లీనరు.

అప్పుడు కాఫీ రుచి చూసిన లుంగీవాడు 'మీ ప్రొప్రయిటరు ఏటేసాడ్రా డికాక్షన్లోకి? కాఫీ గింజలా? సింతపిక్కలా! ఏదైతేనెట్లే ఏడిగుంది అంతేసాలు. ఇంత సీకట్లో దొరసానైతేనేటి? దొమ్మరిసానైతేనేటి? ఆడదైతే సాలన్నాట్ట ఎనకటికెవడో?' అని కాఫీ పూర్తి చేసి 'బీడీ ముక్కుందా గురూ' అడిగేడు పక్కవాడిని.

'లేదు గురూ' అన్నాడు పక్కనున్న గురుడు.

'ఏటి.. నీ సేత బీడీ ముక్కలు మానిపించేసి బెంజి లారీ కొనేద్దావనుకుం టున్నాదేటి నీ పెళ్ళాం. బీడీ మానేస్తే దవళ్లు పేకేగాని బేడా పరక మిగల్దు. నీ మాటాయమ్మ ఎలాగా యినదుగాని నేనే సెప్తాలే'

'అబ్బే మానీలేదు గురూ' ఎపాలజెటిక్‌గా అన్నాడు పక్కవాడు.

వాళ్లలో ఒకడు బీడీల కట్ట బల్ల మీద పడేశాడు. అందరూ బీడీలు అంటించేరు.

‘ఇంత సలి..’ అనిబోయి ‘చెమించు గురూ’అన్నాడు లారీ క్లీనరు.

‘అన్నం పెట్టడానికి అమ్ముండగా పెళ్లాం దేనికి అనే వయసురా నీది. నీకే అంత సలైతే మా మాటేమిటి? సలికి ఎవికలు సుట్టుకుపోతున్నాయి. నిన్ననగా బయలెల్లినాం. ఎప్పుడు జేరుతావో కొంప. ఈలోగా ఏ ఆఫీసరు మన లారీకి గీసుకుంటే యింటికెళ్లేది వొచ్చీవారమే. ఏం బతుకుల్రా మనయి. సీ–స్సీ వట్టి కుక్క బతుకులు’ అన్నాడు గళ్లలుంగీవాడు.

‘మనం ఇలా సలికి సస్తూ వుంటే మందు కొట్టేసి కులుకుతూ ఉంటాది మన ప్రొప్రయిటరు ముండ’

‘మనకే ఆ ముండకున్నంత డబ్బుంటే’ వాళ్లలో ఒకడన్నాడు.

‘నీకు తెల్దురా బాబు. డబ్బుంటే వుండే కష్టాలు. మనకేటీ హాయిగా రాజులాగ ఉంటే తింటాం. నేకపోతే కడుపులో కాళ్లెట్టుకు తొంగుంటాం. మనం పడుకోవడానికి పంకా వొద్దు, పరుపొద్దు. మన్లాగ డబ్బునోడిని తొంగోమను సూద్దాం. ఆడు పెళ్లాన్నట్టుకు తొంగుంటాడనుకునేవ్. ఇనప్పెట్టిని పట్టుకొని తొంగుంటాడు. ఇప్పుడు నీకే డబ్బుందనుకో. ఇలాగుండగలవా? పంటలు కొట్టుకుపోనాయో యేటో.. తోటలు పడిపోనాయో ఏటో.. మేడ కూలి పడిపోనాదో ఏటో.. పెళ్లాం లేచిపోనాదో ఏటో – ఇలాటాలోచనలతో కుళ్లిపోతావ్. ఇక మనకంటావా? మన కొంపలు పడిపోతే మూడ్డబ్బులతో మళ్లీ లేపేవచ్చు. మన పెళ్లాలు యెవురుకీ అక్కర లేదు. నువ్వు లచ్చ చెప్పు ఎయ్యి చెప్పు మన బతుకులే హాయి’.

‘నువ్వు ఎంత చెప్పినా డబ్బునోడి మజా మనకెలాగొస్తాది?’ ఒకడు అమాయకంగా అడిగాడు.

‘డబ్బు లేకపోతే బాధలు నీకు తెల్దుగాని వుంటే ఉన్న బాధ నీకు తెల్దు. నీకు లచ్చ ఉంటే రెండో లచ్చ యెలాగ చేసుకోవడమా అన్నదో బాధ ఐపోద్ది. నీకు భూవి ఉంటే పక్క పంతులు పొలం యెలా కలిపేసుకోవడమూ అన్న బాధ. నీకు యాపారం ఉంటే దొంగ లెక్కలు ఎలాగ రాయడవా! దొంగ బేరం ఎలాగివ్వడమా! ఇయ్యే ఆలోసెన్లు! డబ్బుంటే సినిమాలు తియ్యేచ్చు. తీసేడ్లే మన ఊరు పంతులొకడు. పదేళ్ల కిందట మెడ్రాసు ఎల్లేడు. మరికంట పళ్లేదు. ముందుటేడు సూస్తే పట్నంలో శవాన్ని మోస్తూ అగుపడ్డాడు. దగ్గరోళ్లు ఎవరో పోనారనుకొని అప్పుడడక్కుండా మర్నాడడిగినాను. సచ్చినోడు దగ్గరోడూ కాదు. దాపలోడూ కాదన్నాడు. ఆ బాబు బాపనోడు కాబట్టి శవాలు మోసుకు

బతుకుతున్నాడు. నువ్వే ఆ బాబయితే ఆ పాటికి నీ శవాన్నే మోసీసుందురు'.

'డబ్బుంటే ఉన్నదాంతో సంతుష్టి పడి పకోడి బూములకీ మేళ్లకి ఆశ పడకుండా హాయిగా బతకలేమంటావా?'

'అంటాను. ముమ్మాటికీ అంటాను. నీకు డబ్బుంటే దాన్ని పెంచాలని లేకపోవచ్చు. కాని దాన్నెలా నిలబెట్టుకోవాలో అనే బాధ నిన్ను తినేస్తాది. కాని అది ఎల్లిపోయిన టైమొస్తే ఎల్లి పోద్ది. లచ్చిం తల్లిని కోకతో కొంగ్రుకు కట్టేస్తే కోకిప్పుకొని ఎలి పోద్ది టయిమొచ్చినప్పుడు. మీకేటి తెల్సు నాలుగాదివోరాల నక్కలు?'

'ఆ టయం రాకపోతే'

'కాని ఏదో ఒకటోస్తాది. లచ్చిందేవికి శాపముందట. ఆవిడున్న కాడ సుకం వుండకూడదని. ఆఖరికి ఆయమ్మ మొగుడ్ని సూడు. పెపంచం అంతా ఆ బాబుదే. అయినా సంద్రంలో మకాం ఎట్టేడు. ఎక్కడ పడుకుంటాడనుకుంటావ్. పందిరి మంచం మీదా, పట్టుపరుపు మీదా? కాదు పామ్మీద! ఏటనుభవించే స్తున్నాడంటావ్ ఆ బాబు. అందుకే ఆయమ్మకి శాపమంటారు. ఆఖరికి మా నాయుడు కథలోలాగ పిల్లల్లేరన్న బాదేన అట్టుకుంటాది'.

'ఎవరా నాయుడు? ఏవిటతని కథ'

'అదో పెద్ద ష్టోరీలే. సెప్తాగాని ముందో బీడీ ముక్కిచ్చుకో. ఆ తర్వాత ప్రొప్రయిటరు బాబుని మరో కాఫీ అట్టుకు రమ్మను. సూడొరే బాబు వొరసం తగ్గిందేటో. కథకేంగాని తెల్లారీసరికి ఊరు సేరకపోతే పీకట్టుకుంటాది ప్రొప్రయిటరు తల్లి'.

'వొరసం అలాగే ఉంది' అన్నాడు వొకడు గుమ్మందాకా వెళ్లి.

బీడీ అంటించి కాపీ చప్పరిస్తూ మొదలుపెట్టాడు అతను కథ.

'బాబొరే, నాకిందులో తెలిసింది తక్కువ. ఇన్నది లావూను. ఎంచేతంటే నాకు తెలిసీసరికే కదలో వోళ్లంతా పెద్దోళ్లైపోనారు. నా సిన్నప్పుడు అంటే పదేను రోజుల కోపాలి గెడ్డం గీయించుకుండే రోజుల్లో మా ఊళ్లో పెద్ద నాయుడుం డేవాడు. ఆ బాబెంతుండీ వోడంటావో! కంచు ఇగ్రహంలా అదుగో అంతెత్తుం డేవోడు. ఆ బాబు మీసాలు ఇనప మీసాల్లాగ ఇంతంతుండేవి. ఆ బాబు కొప్పు కోయిస్తే ఆరు సవరాలు కట్టించుకోవచ్చు. సెవుల కమ్మెలు కరిగిస్తే మూడు తులాలు మిగలాలన్న మాట. సేతుల కడియంతో మొడితే మూడు సేర్లు

నూనింకుతాది. సిన్నప్పుడు ఏటికెళ్లినప్పుడు తుపాకీలో గుళ్లయిపోతే సేత్తో కొట్టి సంపినాడట సిరతపుల్ని. ఆ బాబోపాలి ముండింట్లో వణ్ణం తింటూ ఏదో కోపమొచ్చి ముండ నడుం దగ్గర కోకట్టుకొని ఎడంసెత్తో ఎదురు గోడకేసి కొట్టేసినాట్ట. ముండ సచ్చీసి గోడకి అప్పడంలా అంటుకుపోనాదంట. ఆ బాబు ఎలాగుంటాడో సెప్పినానా. ఇంకా బాబు ఆస్థి మాట. ఊరు పక్క ముప్పై– ఊరవతల ముప్పై– మొత్తం అరవై ఎకరాల మాగాణీ – ఇయిగాక అంటు మామిడి తొట్లు, నిమ్మ తొట్లు, ఆరు దొడ్లు, ముప్పై గొడ్లు, మూడంతస్థుల మేడ ఈటన్నిటి తోటీ రాజుని తాతా అని పిలిస్తే ఓయ్ అని పిలికీ వోడట రాజు.'

'ఆ బాబుకెంతమంది పెళ్లాలు.'

'ఇద్దరు'

'ఏం...'

'పెళ్లాలిద్దరన్నాను గాని ఆడోళ్లు ఇద్దరన్నానా! ఓరానికో కొత్త కాతా ఎడితేనే గాని ఆ బాబుకి నిద్దరట్టేది కాదట. ఆ జిల్లా హోల్ మొత్తంలో కన్నెరికాల కాంట్రాక్టు ఆ బాబుదేనట. ఆ బాబుకి కోకల సరదా తరువాత కోర్టులు సరదా. ఆ బాబు కిర్రు సెప్పులేసుకొని అత్తా కోడలంచు పంచి కట్టుకోని నోట్లో సుట్టేసుకోని మీసం దువ్వకుంటూ ఈదిలో నడిసెళుతూ వుంటే ఇలా గెలాగుండి ఓడంటావేటి దర్బారుకెళుతున్న మైసూరు మారాజు లాగుండీవోడు...

'మరా బాబు పెళ్లాలు?'

'సెందనం బొమ్మల్లాగుండీ ఓరనడం కన్నా రాతి బొమ్మల్లా గుండీ ఓరనడం కరెక్టు. కుండంత కొవ్వూ, బానంత బొజ్జా, సెయ్యెత్తు విగ్రహం... నల్లగా ఒక్కొక్కర్తి ఎలాగుండీదంటావేటి? మనిషిని గుద్దితే మూడీశలు బంగారం రాలాలన్న మాట. ఆయమ్మలిద్దరి మద్దెల ఆ బాబు నిలబడితే గౌడు గేదెల మద్దిల డిల్లీ పోతులాగుండీవోడు'

'ఇద్దర్నెందుకు పెళ్లాడేడు?'

'అక్కడే ఉంది లిటిగీసను. ఆ ఇద్దరూ పరాయోళ్లు కారు. అప్పసెల్లెళ్లే. ఆ బాబుకి మేనత్త కూతుళ్లు. ఆ రోజుల్లో ఈ ప్రేమలూ గట్రా ఏవీ వుండేవిగావు. ఆస్థులు పోకుండా అయిన సంబంధాలు సేసుకోవడం, ఆ తర్వాత యెవడిష్టం వచ్చినట్టు వాడుండడం ఇదే మామూలు. మొదట పెళ్లయ్యాక ఆ బాబు పెళ్లాంతో పడుకున్న రోజులు కన్నా పరాయోళ్లతో పడుకున్న రోజులే యెక్కువ. వంటికి నలభై ఏళ్లొచ్చినా వొక నలుసూ కలగలేదన్న ఇచారం బాబుకి లేదు కాని ఆయమ్మకి

పట్టుకు పీడింసేసీది. అటు పూరీ మొదలుకొని ఇటు తిరుపతి వరకూ ఆయమ్మ మొక్కని దేవుడు లేడు. కాల్లు కడగని బేమ్మడు లేడు. యెన్ని సేసినా బొజ్జే పెరిగింది కాని కడుపు కానరాలేదు. ఆయమ్మకు నలభై దాటేసరికి దేముడ్ని మొగుడ్నీ నమ్ముకొని నాబంనేదని గ్రహించేసినాది. ఆయమ్మ పాట్లేవో అయమ్మపడ్డాది. ఆ పాపం నా నోట సెప్పించుకోకు. అవ్వ! సిన్నా పెద్దా, యెక్కువా తక్కువా అన్న మాటుండేది గాదు. అన్ని పాపాలు పిల్లల కోసం సేసింది. ఆ బాబు మాత్రం ఇటొచ్చి అటొచ్చి నీకు పిల్లలు పుట్టడం పాడుసేనులో పంటలు పండటం ఒక్కపాలే. నాను దత్తత చేసుకుంటాను. ఇంతాస్థి ఒగ్గేసి నాను సస్తే నా తద్దినం నువ్వెడతావా నీ బాబెడతాడా? సొరగానికి నరకానికి మద్దిల తలకిందులు గుండి పోవాల నేను? అని రోజురోజుకీ బెదిరించీ వోడట.

ఎలాగయితేనేం ఆయమ్మకి నలభై ఐదూ యాబయ్యీ, ఆ బాబుకి అరవయ్యీ వచ్చేసరికి ఆయమ్మకి వొక్కిసయం తెలిసిపోనాదట తనకింకపిల్లలు పుట్టరని. ఇంతాస్థి పోకుండా నిలబెట్టుకోవాలంటే వొక్కటే మారగం కనిపించింది. అంచేత యెంటనే సవారీ బండి కట్టించుకొని ఓ పొద్దు పుట్టింటికి పోనాదట. పోయి సెల్లెల్ని పిలిసి యిదిగో సెల్లెలూ నీ మంచికీ నా మంచికీ వొక మాట సెపుతా వినుకో. నాకు మొగుడున్నాడు. ఆ మొగుడికి లంకంత ఇల్లు, సంద్రం అంత సేనూ ఉంది కాని ఎత్తుకోవడానికి పిల్లలేదు. మాం సస్తే సాకలోడు నోట్లో నీళ్ల పొయ్యాల్సిందే గాని వేరే దిక్కు లేదు. ఇక నీకంటావా. నిలువగ ఎంతెదిగినావో అడ్డంగా అంతెదిగినావు. మన బాబు ఆస్థి తాకట్టుపోతే నీకు పసుపు కొమ్ముకు రాదు. నువ్వు సిన్నదానివి. నీకు ఏవో ఆలోసెన్లుంటాయి. నీ వుద్దేశాలకు నేనడ్డురాను. అంచేత మా నాయుడ్ని నీకు పుస్తికట్టనీ. పెళ్లయేక నీ సోకులు నువ్వు మానుకోకు. నాకు సేతనైన సాయం నేను చేస్తాను. ఆడదాని మెళ్లో నల్లపూసుంటే నూరు పాపాలు కాస్తాది. మరింకింత కంటే ఇవరంగా నన్ను సెప్పమనకు. కాని ఒక్కమాట ఎలాగో ఓలాగు ఒక్క కొడుకుని మాత్రం కనీ అంది.

అప్పకు మొగుడులాటిది సెల్లెలు. అంచేత అసలు ఇసయం ఇట్టే గ్రహించే సింది. ఇటుపైన కడుపులు దించుకోవాలన్న బెంగుండదు. ఈదిలో మెగుడు వుంటే సాలు పెరట్లో పాపాలు పైకి రావు అని సెప్పి పెళ్లి కొప్పేసుకుంది. ఆ పెళ్లి కూడా నాను సూడ్నేదు'.

'రెండో పెళ్లామన్నా కందా?'

'కనలేదు గాని ఆయమ్మ తప్పు కాదు ఆయమ్మ చెయ్యాల్సిందంతా సేసింది. ఆయమ్మ ప్రతి పనికీ అప్ప అండగుండేది. అయితే అప్పకీ సెల్లెలకీ బేదమేటంటే అప్ప మొదట్లో దేముడ్ని నమ్మేక మనిషిని నమ్ముకుంది. సెల్లెలు తొలికాడ్నుంచీ మనుషుల్నే నమ్ముకుంది. ఇదిలాగుండగా నాయుడికి అరవై ఐదో అరవై యారో వెళ్లిపోనాయి. పిల్లలేరన్న దిగులుతో నడుంజారొగ్గేసిన పాపానికి జబ్బు చేసి మంచం అట్టీసినాడు. ఆ బాబలాగ మంచం ఎక్కినాడో లేదో మూలమూలల్నించీ దిగినారు వోరసులు బొమ్మల్లాంటి పిల్లల్తో. మా కొడుకుని దత్తత సేసుకో, మా పిల్లోడ్ని సేసుకో అని ఆ బాబు పేనం గొలుక్కునీసినారు. ఆ బాబుక్కూడా యములోళ్ల నీడలు కనిపించీయో ఏటో లొంగిపోనాడు. బొందిలో పేనం ఉండగానే కొంపలో కుర్రాడు నడవాలని పట్టుపట్టినాడు. అప్పుడాయమ్మలు ఏటిసేనేరనుకున్నావ్! ఊళ్లో ఉంటే ఈగల్లాగ ఈ వోరసులు ఊరుకోరని నాయుడ్ని పట్నం తీసుకుపోయి అక్కడ పెద్ద డాక్టర్ల చేతిల్లో ఎట్టేరు. ఆ డాక్టర్ల మందులకో, ఈయమ్మలి పాతివ్రొత్యానికో తెల్దుగాని ఆ బాబు బైటపడి బట్టగట్టినాడు. మళ్లీ ఊరొచ్చీలోగానే ఆ పట్నంలోనే ఆ బాబుకి నూరిపోసినారా తల్లులు. నీకేటి తక్కువ దత్తత చేసుకోడానికి. దిమ్మిస దుక్కలాగున్నావు? ఓ జబ్బు చేస్తే చచ్చిపోయినట్టేనా? ఇప్పటికీ నువ్వొ గుద్దు గుద్దితే ఈశ్వరుడైనా మూడు కళ్లూ మూసీవలసిందే. మనకి పిల్లల్లేరంటే ఆ దోషం మాది గాని తప్పు నీది కాదు. మూణ్నెల్లు టయిమియ్యి . నీకో గుమ్మటం లాంటి గుంటని తెచ్చి పెళ్లి చేస్తాం. ఒక సంవత్సరం టయమియ్యి ఆ గుంటకి. అప్పటికీ అది కనకపోతే నీ యిష్టం. నీ ఆస్థికి దత్తతే సేసుకుంటావో, దానాలే సేసుకుంటావో. నీ కడ్డొస్తే కొప్పులు కోసి ఈదిలోకి ఈడిసీ మమ్మల్ని అని నచ్చచెప్పారు.

ముసిలోడికి మళ్లీ పెళ్లంటే మతిపోనాది.

తలపాగా ఎట్టుకొని తయారైపోనాడు సెయ్యమని.

ఆ యమ్మలు మూడ్నెల్లు టయమడిగినారా. మూడోరాల్లో పట్టుకొచ్చినారు పెళ్లికూతుర్ని. సికాకోళం అవతల్నుంచి. మూర్తాలేవని బేమ్మడేడిసినా బెదిరించి పెట్టించినారో ముహూర్తం. అదిగో నానెల్లిందా పెళ్లికి. సేతికి ఎవికలు ఇరుసుకొని కర్చెట్టినారా పెళ్లికి. పెళ్లినాడు ఊళ్లో ఎవరినీ పొయిలో నిప్పేసుకోనివ్వలేదు. రేత్తిరి మూర్తం. పెళ్లిపందిరి కిటకిటలాడిపోనాది. ఆ పెళ్లికి మా ఊరు తొలిసారి గ్యాస్ లైట్లు తెప్పిస్తా.


ఇక పెళ్లికొడుకూ పెళ్లికూతురూ అంతావా. నల్లమందు అలవాటైందేమో పీట

మీద కూసున్న నాయుడు పీట మీదే తూలుతున్నాడు. సిన్నప్పుడు తిరిగిన తిరుగుళ్లకి మనిషి ఊరిపోయి ఉబ్బిన శవం లాగున్నాడు. ఇక పెళ్లికూతురంటావా? వయసులోనే నాయుడు పెద్దా ఆమె సిన్నా. మనిషి మాత్తరం అతనంతా ఉంది. ముక్కు నోరంతా ఉంది ఎడల్పు. పట్టుకోకా, జరీ రవికా తొడుక్కొని ఇంతింత జెబ్బలతో ఆయమ్మ పీట మీద కూకుంటే కడుపు బేమ్మడి ఒళ్లో ఉంది. మొగోడికి ఆడ ఏసం ఏసినా ఆయమ్మ కంటే బాగుంటాడు.

ఇలాగ తిన్న పెళ్లి బూర్లు అరిగేయో లేదో అలా ఆ మూడో పెళ్లానికి కడుపన్నారు. రెండో నెల్నే గాజునెట్టించేసినారు మాకిదే ఆచారం అంటూ. పెళ్లయిన మూడ్నెల్లకి పురిటి కొచ్చేసినట్లయిపోనాది ఆ మనిషి. ఈ ప్రతాపమంతా తనదే అయినట్లు నాయుడు తరిగివోడు. అడిగనోడిదే పాపం. అందరికి సెప్పేవోడు తన పెళ్లానికి కడుపని. బాబురే వొరసం తగ్గినట్టుంది సూడు – లేవడానికి నాకు కీళ్లు పట్టేసినాయి' అని ఆగేడు బీడీ అంటిస్తూ...

'కద కానీ తర్వాత చూద్దాం' అన్నాడొకడు.

'కదదేటుందిరా అయిపోనాది. మరో నెల పోనాక ఆయమ్మ కడుపు పోనాది. ఏతాం కాడ ఉన్న నాయుడు ఈ మాటినగానే కళ్లు తిరిగి ఇరగబడిపోయి నూతిలో పడి సచ్చేసినాడు. ఏ బరంపురం నుంచో వోరసుణ్ణంటూ ఎవరో వచ్చి ముగ్గురు ముండలకీ మనోవర్తి పారీసి, అదిగో నాను సెప్పేనా వొరసం పోనాదని, లారీలు స్టార్టయిపోనాయి నెగండి మనోవర్తి మూడ్డబ్బులు పారీసి ఆస్తంతా పట్టుకు పోయేడు' అంటూ లేచి పోయేడు అతను.



# అదృష్టహీనుడు

## శారద

● రచనా కాలం: 1950

**శారద:** ఆకలిగొన్న పాఠకునికి ఆకులో అన్నం, పప్పులతో పాటు నాలుగు కథలు వడ్డించి మేధో క్షుద్బాధను కూడా తీర్చిన కథకులు. తమిళ దేశం నుంచి వచ్చి తెలుగు నేర్చుకుని, రాసి ఈ నేలను తనకు శాశ్వతంగా రుణగ్రస్తం చేసుకున్నారు. మనకు అక్షరాన్ని ఇచ్చి బహుమతిగా మూర్ఛ వ్యాధిని పొందారు. అసలు పేరు నటరాజన్. తెనాలి చేరాక 'శారద'గా కలం పేరు పెట్టుకున్నారు. హోటల్‌లో సర్వర్‌గా పని చేశారు. ఆ ఆకలి, కోపం, క్రోధం కూడా రచనల్లో కనిపిస్తాయి. 22వ ఏట రాసిన మొదటి కథ 'ప్రపంచానికి జబ్బు చేసింది'లోని తీవ్రత ఇవాళ్టికి ఎంత మంది కథకుల్లో చూస్తున్నాం అనిపిస్తుంది. ఆరు నవలలు రాశారు. అందుబాటులో ఉన్న కథలలో తొలి వాన కథ ఈయనదే. 1955లో తన 32వ ఏట మరణించి తెలుగు కథకు అన్యాయం చేసినా చాలా కాలం ఆయనను విస్మరించి తెలుగు కథ ఆయనకు అన్యాయం చేసింది. మిత్రుల ప్రమేయం వల్ల శారద పునరుత్థానం కొనసాగుతోంది.

రైలు నెమ్మదిగా నడుస్తోంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తోందా ఎక్స్‌ప్రెస్ బండి. వాతావరణం భీకరంగా ఉండడం వల్ల నిదానంగా పోతోంది. బయట గాలి విసురుగా వీస్తోంది. వర్షం ఎడతెరిపి లేకుండా భయానకంగా కురుస్తూ ఉంది. చాలాచోట్ల పట్టాల మీదుగా ప్రవహిస్తోంది వర్షపు నీరు.

ఎక్స్‌ప్రెస్‌లో జనం కిటకిటలాడుతున్నారు. రాత్రి పదకొండు గంటలవుతోంది. అంతా కటికచీకటి. సగానికి పైగా ప్రయాణీకులు అప్పటికే నిద్రలో పడ్డారు. పిల్లాజెల్లా గప్‌చిప్‌గా సుషుప్తిలో ఉన్నారు.

కొందరు మొండిఘటాలు మాత్రం చలినీ, గాలినీ, వర్షాన్నీ లెక్కచేయకుండా కిటికీల దగ్గర కూర్చుని బైటి బీభత్సాన్ని చూస్తున్నారు. రైలుబండిలోని దీపాల వెలుగులో అద్దాల కిటికీ మీద పడే చినుకుల ఉధృతాన్ని చూస్తూ కూర్చున్నాడు మూడవ తరగతి ప్రయాణీకుడు సత్యనారాయణ. అతనూ కిటీకీ దగ్గరగా కూర్చుని గాఢమైన ఆలోచనలో పడి ఉన్నాడు.

అతని బాహ్యనేత్రాలు ప్రకృతి విలయాన్ని చూస్తున్నాయి గాని, మనస్సు మాత్రం అంతకంటే తీవ్రమైన సంక్షోభంలో పడి అల్లాడుతోంది. సత్యనారాయణ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చాడు సంవత్సరం క్రితం భార్యాపిల్లలతో సహా. తాత్కాలికంగా ఓ ఉద్యోగం దొరికింది కూడా.

హైదరాబాద్ నగరంలో అరవై రూపాయల ఆధారంతో ఈ సంవత్సరం కాలం గడిపాడు. భార్య రోజూ ఏదో లేదనే పాట పాడుతూనే ఉందిగానీ సత్యం ఏమీ లేదనే నిరామయావస్థ కంటే 60 రూపాయలన్నా వస్తున్నాయనే ఆశతో కులాసాగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఇతని భార్య సావిత్రి చామనచాయగా

బక్కపీచుగా ఉంది. అతనికి అనుకూలంగా ఉంటుంది. వాళ్ళ ఇద్దరు మగపిల్లలూ ఇంకా చిన్నవాళ్ళు. చిన్నాడికి సంవత్సరం. పిల్లలు సత్యం పోలికగా ఎర్రగా బొద్దుగా ఉంటారు. ఇదొక ప్రత్యేక కారణం వాళ్ళంటే పంచప్రాణాలుగా ఉండటానికి.

ఆ మూడవ తరగతి పెట్టె జనసమ్మర్ధంతో నిండి కిటకిటలాడుతోంది. విజయవాడ వెళ్ళే వాళ్ళు 60 మందికి పైగా ఉన్నారందులో. కొంతసేపటి క్రితం వరకూ మెలకువగా ఉన్న పది పన్నెండు మంది కూడా ఇప్పుడు కూర్చున్న పళంగా జోగుతున్నారు.

సత్యం కిటికీ నుంచి దృష్టి మరల్చి లోపలికి చూశాడు. ఎదురుగా ఉన్న సీటులోనే సావిత్రి కూర్చుని నిద్రపోతుంది. ఆమె ఒడిలో పడి నిద్రపోతున్నారు పిల్లలిద్దరూ.

కారేజీలోని దీపాలు అట్టే ప్రకాశంగా వెలగడం లేదు.

సత్యనారాయణకు ఎదురుగా కూర్చుని ఉన్న లావాటాయన మాత్రమే మేల్కొని ఉండి దూరంగా బైట జరుగుతున్న ప్రకృతి కోలాహలాన్ని అతి శ్రద్ధగా పరీక్షిస్తున్నారు. ఆయన దుస్తుల్ని బట్టి ఆయన నైజాం నివాసి అని తేలిగ్గా తెలుస్తోంది.

సత్యం జేబులో నుంచి ఓ బీడీ తీసి వెలిగించాడు. అతనికి మౌనం భరించడం రానురాను కష్టంగా ఉంది. ఆ క్షణాన రైలు చేసే చప్పుడూ, ఉరుముల ధ్వనీ, వానగాలి విసురు తప్ప మిగతా రైలు అంతటా నిశ్శబ్దంగానే ఉంది. సత్యం తిరిగి ఆలోచనలో పడ్డాడు.

ఎలాగో తొమ్మిది పది నెలలపాటు నెమ్మదిగా కాలం గడుపుకొన్న అతనికి వారం కిందట ఉద్యోగం నుంచి విరమించమని ఆర్డరు జారీ అయింది. ఆ కంపెనీ మేనేజరు తన కింద జీతగాళ్ళందరికీ ఆర్డర్ జారీ చేశాడు. తలా ఐదొందల రూపాయల డిపాజిట్లు కట్టాలని కట్టలేని వాళ్ళని విరమించుకోమని. సత్యం నోరు మూసుకుని విరమించుకోవాల్సి వచ్చింది. అతని దగ్గర అంత మొత్తం ఎక్కడిదీ?

భార్య తరపు వారు కూడా బీదవారే కావడం వల్ల అటునుంచి సానుభూతి ప్రకటనలు తప్ప మరో ప్రయోజనం ఆశించడానికి వీల్లేక పోయింది. సత్యం తనకా నెల రావాల్సిన జీతం బాకీ తీసుకొని విజయవాడ ప్రయాణమైనాడు. తిరిగి నిరుద్యోగం, పస్తులూ, అప్పులూ!

సత్యానికి రైలు బైట గాఢాంధకారంలాగా తోచింది తన భవిష్యత్తు. అతని మనస్సు విరిగిపోయింది. ఏ ఆశా లేకుండా నీరసంగా బతకడం ఎంత దుర్భరం!

సత్యం ఈ ఆలోచనల్ని భరించలేకపోతున్నాడు.

సత్యం ఇలా ఆలోచనల్లో ఉండగానే అతనికెదురుగా కూర్చుని ఉన్న షావుకారు మెల్లగా ప్రారంభించాడు. ఇలాంటి సంభాషణలు 'వాతావరణం' గురించి ఆరంభించడం మామూలు గనుక ఆయన 'ఏంటండీ ఈ వర్షాలు. నేనెరుగను ఈ ముప్ఫై ఏళ్ళుగా' అన్నాడు సత్యాన్నిద్దేశించి.

సత్యం కొంచెం రిలీఫ్ దొరికినందుకు సంతోషిస్తూ 'నిజమేనండీ. ఏదో విలయం వచ్చిన మాదిరిగా ఉంది. ఈ వానా, ఈ గాలి ఏమిటో?' అన్నాడు.

షావుకారు 'మీదేవూరు పంతులుగారూ?' అన్నాడు చాలా సహజంగా. రైల్వే సంభాషణల్లో పరస్పర కుశల ప్రశ్నలు సహజం.

సత్యం 'విజయవాడ దగ్గర రామవరప్పాడు' అని సమాధానం చెప్పి 'మీరు ఎందాకా?' అని తిరిగి ప్రశ్నించాడు. షావుకారుగారు తన పక్కనే అతి జాగ్రత్తగా ఉంచుకొని కావలించుకుని ఉన్న చిన్న తోలుపెట్టె మరీ దగ్గరకి లాక్కుంటూ 'బెజవాడ దాకా వెళ్తున్నానండీ! వెధవరైలు నడవదేం? పేరేమో ఎక్స్‌ప్రెస్సూ' అని విసుక్కున్నాడు.

సత్యం ఆయన పక్కనే ఉన్న తోలుపెట్టె వైపు చూశాడు. అంత ప్రేమగా దాన్ని కావలించుకుంటున్నాడంటే అది డబ్బున్న పెట్టె అయిఉండాలి. డబ్బుకంటే ప్రేమాస్పదమైన వస్తువేం ఉంది ఈనాడు మనిషికి? పెళ్ళాం బిడ్డలూ, అన్నదమ్ములూ అన్నీ డబ్బు తర్వాతే. డబ్బు ప్రధానం. డబ్బును ఎంత జాగ్రత్తగానైనా కాపాడటం అవసరం. అతను ఆలోచనకు స్వస్తి చెప్పి 'ఎలా పోతుందిలెండి. ఒక పక్క వానా గాలీనూ? ఏదైనా ప్రమాదం సంభవిస్తే? అందుకని'... అని ఆపేశాడు.

షావుకారు ఒకసారి ఆవులించి రెండు చిటికలేసి 'ప్రమాదం' అని అన్నాడు కొంచెం గట్టిగా వత్తి.

'నేను ఊరకే అన్నానులెండి? ప్రమాదాలు జరుగుతయ్యా! రైల్వేవారు ఎంతో జాగ్రత్తగా ఉంటారు కదా' అన్నాడు సత్యం.

తనవంటి దురదృష్టవంతుడు ప్రయాణం చేస్తున్న బండి సర్వ జాగ్రత్తగా తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. తనింకా ఎంతోకాలం బతికుండి ఎన్నోబాధలు

అనుభవించాల్సి ఉందాయెను అని అతని ఊహ. అతనికే నవ్వొచ్చింది ఈ ఆలోచనకి. షావుకారు తిరిగి మౌనంలో పడ్డాడు. ఆయనకేం ఆలోచనలో.

సత్యం భార్య వంక చూశాడు వాత్సల్యంతో. పిల్లలు నిర్మలంగా ఏ ఆలోచనా లేకుండా సంతోషంగా నిద్రిస్తున్నారు. తూలుతూ ఉన్న భార్య మొహంలో ఏమిటేమిటో ఆలోచనల రేఖలు అగుపిస్తున్నాయి. ఆమె తనను పెళ్ళాడాక ఇంతవరకు ఏనాడూ సుఖం అనుభవించింది లేదు. ఎప్పుడూ ఏదో లోటుతో, సంసారజీవితం నరకంగా తయారయిందామెకు. తనకూ అంతే.

అప్పటికా ఆలోచన మానేసి సత్యం, సావిత్రి ఒడిలో మెదుల్తున్న చిన్న కుర్రాణ్ణి చూశాడు. సావిత్రి కూడా కుర్రాడు లేచేసరికి మేల్కొంది. ఆమె భర్తవంక చూసి 'మీరు ఒక్క కునుకైనా తియ్యలేదండీ?' అని అడిగింది.

'లేదు, నిద్రపట్టలేదే.... ఈ గోలకి' అన్నాడు బైటికి చూస్తూ.

'ఇంకా తగ్గలేదు వాన?' అంటూ కుర్రాడికి పాలిస్తోంది. కుర్రాడు పాలు త్రాగి, తండ్రివైపు తిరిగి నవ్వాడు అమాయకంగా.

'వాణ్ణిలాతే. చూడువాడు. ఎలా ఎగబడిపోతున్నాడో'అన్నాడు సత్యం చిరునవ్వు నవ్వుతూ.

షావుకారు దీన్నంతా గమనిస్తూ కూర్చున్నాడు.

సత్యం పిల్లాడ్ని అందుకుని ఆ బుగ్గా ఈ బుగ్గా ముద్దాడి 'వెధవ వీడైనా పెద్ద ఉద్యోగం చెయ్యాలి... చేస్తావా నాన్నా?' అని ప్రశ్నించాడు కుర్రాణ్ణి.

కుర్రాడు నిద్రమగతగా వున్నా నవ్వాడు. కుర్రాణ్ణి తిరిగి భార్య చేతికిస్తూ 'నిద్ర వస్తోంది వెధవకి. నిద్రపుచ్చు' అన్నాడు. సావిత్రి తిరిగి కుర్రాణ్ణి ఒడిలో హత్తుకుంది. రెండు నిమిషాలకల్లా ఆమె కూడా మగత నిద్రలో పడిపోయింది. సత్యం ప్రేమగా పిల్లల వంక చూస్తూ కూర్చున్నాడు ఏమీ ఆలోచించలేని స్థితిలో.

బండి మెల్లగా పోతూ ఉంది. దడదడ మోగే రైలు శబ్దమూ మరీ ఉధృతమైన వాన చప్పుడూ ఇప్పుడు రైలునంతా ఆవరించి భయపెడుతున్నాయి. ఇదివరకు దాకా కూర్చున్న షావుకారు ఓ చిన్న కాగితం మడత తీసి సత్యం చేతికిచ్చి 'ఇది కాస్త చదువుతారా పంతులుగారూ. ఏదో ఇంగ్లీషులో రాశాడు. నాకర్థమై చావలే' అన్నాడు.

సత్యం ఆ కాగితం అందుకొని చదివాడు లోలోపల. దాని సారాంశం తనకు రావాల్సిన రెండు వేలూ వెంటనే తెచ్చి ఇవ్వాలనీ, లేనిచో తనకు చాలా ఇబ్బందనీ,

ఇంకా ఏవో వ్యాపారపు గొడవలు కూడా ఉన్నాయి అందులో. ఇదంతా విప్పి చెప్పాడు సత్యం.

షావుకారు తిరిగి తన కాగితం జేబులో పెట్టుకొని 'ఏం వ్యాపారాలండీ పంతులుగారూ! యుద్ధం అయిపోయినాక రోజురోజుకీ ధరలు తగ్గిపోతున్నాయి. డబ్బుకి కటకటగా ఉంది. ఈ రెండువేలూ ఇయ్యాల పోగుచేసుకొచ్చే వరకు ప్రాణం అల్లాడి పోయిందనుకోండి' అన్నాడు. అనేశాక ఏదో తప్పు చేసినట్టు మొహం పెట్టి భయంగా తన తోలుపెట్టి ఇంకా దగ్గరకి లాక్కున్నాడు.

సత్యం ఇది గమనించాడు. షావుకారుగారికి భయం కాబోలు ఆ పెట్టె యెవడైనా కాజేస్తాడని. నవ్వాడతను. తనకు కూడా అందులో డబ్బుందని అనుమానమే గాని, నిజం తెలియదు కదా?... సత్యం ఏమిటో ఆలోచిస్తున్నాడు. అనుకోవటం తడవుగా ఈ షావుకారు రెండువేలు ఏ బాధోపడి పోగు చెయ్య గలిగాడు. తను? ఐదొందలు దొరుకుతాయని కల్లోనైనా అనుకోవడానికి వీల్లేక పోవడం వల్ల కదూ ఉద్యోగానికి తిలోదకాలిచ్చి ఇలా బైరాగల్లే తిరుగుముఖం పట్టాడు.

సత్యం ఒక్కసారి ఎగిరి పడ్డాడు. తలుపు దగ్గరగా ఉండటం వల్ల చప్పున తలుపు పట్టుకున్నాడు. బండంతా కదిలిపోతోంది. అదే క్షణాన ఆ రైలులో ప్రయాణిస్తున్న వందలాది జనం ఉలిక్కిపడి మేల్కొన్నారు. భీకరమైన దారుణమైన మోత వినిపించింది. చెట్టు విరిగిపడిపోతున్నట్లుగా రైళ్ళు ఢీకొన్నట్లుగా సముద్రాల్లో వాయుగండాలు ఏర్పడ్డట్టుగా... అంతా రెండు మూడు నిమిషాలే. భీకరమైన మెరుపుల క్షణికమైన కాంతిలో సత్యం ఆ మూడవ తరగతి పెట్టె నుండి విసురుగా వెళ్ళి నదిలో పడ్డాడు. అంతక్రితం క్షణమే అతని మీదికి విరుచుకుపడ్డ షావుకారు కళేబరం అతనికి దిగ్భ్రాంతి కలిగించింది. చేతికి దొరికిన దేన్నో బలంగా పట్టుకున్నాడు. అయితే ఏం, పట్టుతప్పినవాడల్లే, ప్రళయ వేగంలో సుడులు తిరిగి ప్రవహిస్తున్న నదీగర్భంలోకి పడిపోయాడు. అతనే కాదు! విజయవాడ వెళ్తూన్న ఆ మొత్తం బండి, వంతెన కూలిపోవటంతో, ఒక్కసారే భయంకరంగా మోతపెడుతూ పెట్టెలన్నీ ఒకదాన్తో ఒకటి ఢీకొని, నదిలోకి కూరుకుపోయాయి.

విజయవాడ వెళ్తూన్న ఆ మొత్తం బండి వంతెన కూలిపోవటంతో ఒక్కసారే భయంకరంగా మోతపెడుతూ పెట్టెలన్నీ ఒకదానితో ఒకటి ఢీకొని నదిలోకి కూరుకుపోయాయి. మరు నిమిషం అక్కడ తుఫాను గాలి, ప్రళయ ఘోషా,

ఉధృతమైన వాన, ఎడతెరపిలేని చప్పుడూ, గుయ్‌మని కొనవూపిరి ఉన్న వాళ్ళను సైతం చంపే గాఢాంధకారం మిగిలిపోయాయి. నదికి ఇరువైపులా చెట్లు విషాదంతో తలలూపుతూ ఈ ప్రమాదానికి సాక్షీభూతాలై నిలిచాయి.

కోడికూసే వేళ ఆ విరిగిపోయిన వంతెన దగ్గరికి సహాయ దళాలు వచ్చాయి. నది ఇంకా ఉధృతంగా ప్రళయంగా ప్రవహిస్తోంది. కట్టలు తెగబడి వాననీరు, నదీప్రవాహం ఏకమై అంతా సముద్రంలా ఉంది. చెట్ల చివరలు కనిపిస్తున్నాయి నది మధ్యన. ఇంకా దారుణమైన చీకటి ఆవరించే ఉంది. తూర్పున ఎక్కడ సూర్యోదయపు తొలికాంతి కన్పిస్తోంది.

ఇంత వానలోనూ, నదీ ప్రవాహపు జలజల శబ్దంలోనూ, అక్కడక్కడ మానవ కంఠాల మూలుగులూ, పసిపిల్లల ఏడుపులూ విన్పిస్తున్నాయి. శవాలు వొడ్డుకి చేరుతున్నాయి. అన్ని శవాలు వరుసగా పేరుస్తున్నారు. నీళ్ళు తాగి ఉబ్బిపోయి, గుడ్డలు లేకుండా, రంగు మారిపోయి, పచ్చగా, నీలంగా ఉన్నాయి శవాలు. ఆడ మొగ భేదం లేదు.

రైలు పెట్టెలు ఏమైనాయో అంతులేదు. తెల్లవారుతోంది. సత్యం పైనుంచి మెల్లగా దేకుతూ నడిచి వస్తున్నాడు. అతనికి జరిగిందేమిటో ఇందాకటి నుంచీ కొద్దికొద్దిగా  అర్థమవుతోంది.

రైలు అంతా పడిపోయిందా? తనొక్కడేనా ఇంకా చాలమందా? సావిత్రీ పిల్లలూ ఏమైనారు? ఆ షావుకారు ఏమై ఉంటాడు? సత్యానికి చలితో ఒళ్ళు కొంకర్లు పోయినట్టే భయంతో మనస్సు కూడా గడ్డకట్టుకు పోయింది. సత్యం నీళ్ళలో పడి కొట్టుకుపోతూ ఈత వచ్చి ఉండడం వల్ల ఒడ్డుకు చేరుకుని మెల్లిగా కుంటుతూ ప్రమాదస్థలానికి చేరుకున్నాడు.

సహాయక దళం వారిలో ఇద్దరు పోలీసులు అతన్ని రెక్కపట్టుకొని తీసుకు వచ్చారు తాత్కాలికంగా వేయబడిన ఒక డేరాలోకి. కాని సత్యం నిలవలేదు. అతని మనసు ఒకసారి భ్రమలోంచి మేల్కొంది. అతను పట్టుకొచ్చిన తోలు సంచిని విసిరి పుచ్చుకుని డేరాలోకి పారేసి బైటికి పరిగెత్తాడు.

తెల్లారిపోయింది బాగా. భీకరమైన చీకట్లు వెలిసిపోయాయి. అక్కడి భీభత్సం ఇప్పుడు బాగా దృగ్గోచరమవుతుంది. సత్యం 'సావిత్రీ! సావిత్రీ' అని పెద్దగా అరుస్తూ శవాల్ని పేర్చిన చోట వాటిచుట్టూ పరిగెత్తుతున్నాడు. సహాయక దళం వారూ, రైలు ప్రమాదంలో పడి బతికిన కొందరూ అతన్ని జాలిగా చూస్తూ వెంబడించారు.

అన్నీ పీనుగులు. రైలు పెట్టెలేమైనాయో అంతులేదు. కొన్ని చెక్కలు మాత్రం ఒడ్డుకు వచ్చాయి. ఇంజనూ, ఒక కారేజి వంతెన ఈవల మిగిలి నిల్చున్నాయి. మొగుడు పోయిన స్త్రీలాగా సత్యం ఒక్క నిమిషం ఆగి అంగీకరించాడు. ఈ శవాల్లో తన భార్యా పిల్లలు లేరు. వాళ్ళు బతికి ఉండకూడదా? ఆశ!

తిరిగి చిగిర్చిన ఆశతో, ఆ స్మశానవాటికలో అతను సహాయకులలో ఒకణ్ణి అడిగాడు.

'ఇంకెవరైనా ప్రమాదం నుంచి బతికారండీ?' అని.

అతను సత్యాన్ని ఓదారుస్తూ 'మేము వచ్చి కూడా అంతా రెండు మూడు గంటలే. పదండి వెతుకుతున్నాం గదా? అసలు మీ కథ ఏమిటో చెప్పండి'అని అడిగాడు.

సత్యం తన సంగతంతా చెప్పాడు. కాని షావుకారు చేతిలోని తోలుపెట్టెను తనా చివరి నిమిషంలో ఊతం కోసం పట్టుకొని నదిలో పడిపోవడం మాత్రం చెప్పలేదు.

'పాపం! వెతుకుదాం పదండి. మీరు కూర్చున్న పెట్టె మొత్తం అలాగే నదిలో పడిపోయి ఉండాలి.'

ఇప్పుడు పరిసరమంతా ప్రమాదం నుండి బతికి బైటపడ్డవారు తమ తమ బంధువుల కోసం ఏడుస్తున్న ఏడ్పులతో, గాయాలు తగిలిన వారి మూలుగులతో, నదీజలపు ఘోషతో దారుణంగా ఉంది.

సహాయకులిద్దరూ, సత్యంతో కలిసి ఆ ప్రదేశాన్నంతా వెతుకుతున్నారు. కొందరు నీళ్ళలోంచి కొత్త కొత్త శవాలను లాగి బైటపడేస్తూనే ఉన్నారు. సత్యం వొడ్డు మీద అటూ ఇటూ పరిగెత్తే వాడల్లా ఒక పెద్ద చెట్టు మొదట్లో సగం నీటిలోనూ సగం నేలమీద పడి ఉన్న ఒక స్త్రీ శవాన్ని గుర్తించి అరిచాడు. ఒకటి రెండు నిమిషాలు స్థంభించిపోయాడు.

బాగా మరుగ్గా పొదల్లా ఉండే ప్రదేశంలో పడి ఉందా శవం. సత్యం బురదలోకి దిగి శవాన్ని సమీపించాడు. వెర్రికేక వేశాడు. సావిత్రే ఆ శవం! ఆమె ఒడిలో చిన్న పిల్లాడు సురక్షితంగా ఉన్నాడు. కదులుతున్నాడు కానీ చలితోటి వణికిపోతున్నాడు. సత్యంతో పాటు వచ్చిన సహాయకులిద్దరూ సావిత్రి శవాన్ని బైటికి తీసుకొచ్చారు. కుర్రవాణ్ణి సత్యం ఒడ్డుకు తెచ్చాడు. అతను ఇప్పుడు తేటగా అగుపించడం లేదు. అతని మొహం వివర్ణంగా ఉంది. గాలిలో తేలుతున్నట్లు నడుస్తున్నాడు.

అతని వికలమైన మనస్సులో తోలుసంచీ, అందులోని డబ్బూ, సావిత్రి వికృతమైన శవం, కనపడని పెద్ద కుర్రాడూ అన్నీ ఒక్కసారే కనిపిస్తున్నాయి. సత్యంలో ప్రతి నిమిషమూ ఒక ఉద్వేగమూ, ఆవేదనా తుఫానులా పెరిగిపోతున్నాయి. తనది కాని పెద్ద మొత్తం డబ్బూ ఈ నిమిషాన తనదే అయిపో యాయి. కాని తన ప్రేమాస్పదమైన భార్యా, పిల్లలు... దూరమై చిన్నాభిన్నమై పోయారు. చిన్నపిల్లాడు కూడా ఈ చలిలో వానలో ఎంతసేపో బతకడు. సత్యం కురుస్తున్న జడివాన నుంచి డేరాలోకి పరిగెత్తాడు. అతనిలో తీవ్రమైన ఏదో సంఘర్షణ పెరిగిపోతోంది.

అతన్ని సహాయక దళం వారు పట్టుకుని కూర్చోబెట్టారు.

అందులో ఒకతను ఇంకో అతనితో సత్యాన్ని చూపిస్తూ, 'ఈయన అదృ ష్టవంతుడేనోయ్. పిల్లవాడేనా దక్కాడు' అంటున్నాడు.

సత్యం డేరా మూలన పడుకోబెట్టి కొనవూపిరితోటి మెదుల్తోన్న కుర్రాణ్ణి, ఆ పక్కనే ఉన్న తోలు సంచిని కేంద్రీకరించి ఒక్క చూపు చూస్తూ నిమిషం పాటు నిలబడ్డాడు.

సావిత్రీ– డబ్బూ.

అతని మనస్సును రెండువైపులా గుంజుతున్నాయి.

నది ఒడ్డున దిక్కులేక పడిఉన్న శవాలూ, ముక్కలైన చేతులూ, కాళ్ళూ అన్నీ అతని చుట్టూ తిరిగి చప్పట్లు చరుస్తున్నట్టుగా ఉంది.

అతని మతి భ్రమించింది.

అతని పెద్దగా 'సావిత్రీ' అని అరుస్తూ డేరా బైటికి పరిగెత్తాడు– సహాయకులు వెంటపడ్డా విదిలించుకుని.



ఆ సరుగుడు తోట వెనుక నుంచి మేఘాలు లేస్తున్నాయి.

చల్లటి నీటిగాలి జోరుగా మీదికొస్తున్నాది.

బస్సు ముందుకు పోతున్నాది. ఎండంతా మాయమయింది. వెనక నుంచి వర్షం ముంచుకొస్తున్నాది. బస్సులో చీకటి ప్రవేశించింది. గాలి దుమ్ముతో బస్సుని ఎత్తేస్తున్నాది. వాన కనుచూపు దూరంలో ధారలు కట్టి కనబడుతున్నాది. దిగిపోయింది వాన. వచ్చి మీద పడేటట్టుంది. వానకి దొరక్కుండా బస్సు ముందుకు పోతున్నాది. నా పరిస్థితే విపత్తు తరుముకొస్తున్నాది. నేను ముందుకు పరిగెడుతున్నాను.


వర్షం ఎదురుగా వున్న పొలాల్లో హోరుమని కురుస్తున్నాది.

వానధారలు స్పష్టంగా పొలాల్లో కనబడుతున్నాయి.

ఊరు మీద ఉరుములు ఉరుముతూనే ఉన్నాయి.

అయితే వూళ్లో వానలేదు.

**– చాగంటి సోమయాజులు** (ఊళ్లో వాన లేదు కథ నుంచి)



# రెండు గంగలు

## సత్యం శంకరమంచి

● రచనా కాలం: 1977

**సత్యం శంకరమంచి:** 'అమరావతి కథల'తో తెలుగువారి నదీ జీవన సౌందర్యాన్ని కథనం చేసి వారి నుంచి మురిపెం పొందిన రచయిత. ఆంధ్రజ్యోతి వీక్లీలో ఈ కథలు ప్రచురితమవుతూ విశేష ఆదరణ పొందాయి. సూటిదనం, తేటదనం, స్వీయప్రాంతం పట్ల అపేక్ష కథల్లో జీవాన్ని నింపాయి. రచయిత తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి రుణం అట్లా తీర్చుకున్నారు. మరికొన్ని కథలు, నవలలు, నాటకం ఉన్నాయి. ఆల్ ఇండియా రేడియోలో పని చేశారు. 1987లో తన యాభయ్యవ ఏట అంత తొందరగా ఆయన ఈ లోకాన్ని విడిచి పెట్టి ఉండాల్సింది కాదు.

'కథ చెప్పు తాతయ్యా' అని వేధిస్తున్నారు శాస్త్రిగారి మనమలు చుట్టూ చేరి.

'ఏం కథ చెప్పనురా?' అని ఆలోచిస్తున్నట్లు బోసినోరు విప్పి పైకి చూశాడు ఎనభై ఏళ్లు పైబడుతున్న శాస్త్రిగారు.

'ఏదో వొహటి' అంటూ నిద్రకి ఓ పక్క ఆవులిస్తూ చేతులు పట్టుకు గుంజుతున్నారు పిల్లలు.

'సరే' అంటూ మొదలెట్టాడు శాస్త్రిగారు.

'ఒకరోజున...' ఊ కొడ్తున్న చిన్నపిల్లలతో పాటు పట్నం కాలేజీలో చదువుతున్న శాస్త్రిగారి పెద్ద మనవడు కూడా చదువుతున్న పుస్తకం మూసి వింటున్నాడు.

'చాలా సంవత్సరాల క్రితం... నాకు పెళ్లయిన కొత్తల్లో...'

'అంటే నేను పుట్టిన తర్వాతనే?' అన్నాడు ఆఖరి మనవడు.

'ఇహ్' అని నోరంతా విప్పి నవ్వి వాణ్ని వొళ్లోకి తీసుకుని మళ్లీ మొదలెట్టాడు శాస్త్రిగారు.

'పెద్దింటమ్మ గుడి దగ్గర చేనికెళ్లి వస్తున్నాను. అటూ ఇటూ పొలాలు. కనుచూపు మేర భూమంతా పచ్చటి కంబళీ పరిచినట్టుంది. నేలతల్లి చిలకాకుపచ్చ చీర వొళ్లంతా చుట్టుకున్నట్టు పొలాలు. పొలం చుట్టూ తిరిగి, గట్ల పక్కన కుంటలో కాసిన్నీళ్లు తాగి అట్లా డొంకలోకొచ్చాను. మావిళ్ల చేను దాటానో లేదో చిటపట చినుకులు ప్రారంభమైనాయి. తలెత్తి పైకి చూస్తే సూర్యుడెక్కడికో పారిపోయాడు. నల్లమేఘాలు గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. ఆకాశమంతా నల్ల మేఘాలే. నల్లచీర కట్టుకున్న ఆడదాని మొల్లో బాకులాగా ఆ నల్ల మేఘాల మధ్య ఓ మెరుపు. తూర్పు వైకుంతపురం కొండమీద ఓ గర్జింపు. వాన పెద్దదైంది.

వలవల కురుస్తోంది వాన!

జలజల కురుస్తోంది వాన!

నేను గొడుగు తెచ్చుకోకపోతిని. పూర్తిగా తడిసిపోయాను. అయినా గొడుగులూ గోనె గుడ్డలూ ఏవిటి? అల్లంత ఆకాశగంగ పనిగట్టుకొచ్చి ఈ నేల తల్లిని చల్లగా కౌగలించుకుంటుంటే – ఈ మనిషన్నవాడెవడు గొడుగడ్డం పెట్టుకోటానికి?

ఉన్నట్టుండి మబ్బులు పెద్ద పెట్టున ఉరిమాయి. వర్షరాణి తీవ్రవేగంతో రథం నడిపిస్తుంటే రయ్యిన పరుగెత్తే రథచక్రాల ధ్వనిలా ఉంది ఆ ఉరుము. ఆ ఉరుము అలా దూరమవుతూంటే అదిలించినప్పుడు ఆ రథానికి పూన్చిన గుర్రం సకిలింపులా ఉంది. అల్లంతలో మబ్బుల్లో గొప్ప మెరుపు. అది వర్షరాణి కిరీటంలా ఉంది. కిరీటమే కళ్లు మిరుమిట్లు గొల్పితే ఆ రాణి ఎలా ఉంటుందో! అలంకారాలు చూడ్డానికే ఈ కళ్లు మూసుకుపోతుంటే ఇంక ఆకారాలెలా కన్పిస్తాయి?

డొంకలో బురద బురదయిపోయి కాలు సాగటం లేదు. చెప్పులు విడిచి చేతపట్టాను. 'వరె వరె! అప్పుడనిపించిందిరా! గంగమ్మ ఈ భూమి నంతటినీ చల్లబరుస్తుంటే నేను చల్లబడక ఈ పాత చెప్పులడ్డంపెట్టుకున్నానా' అని. ఇప్పుడు వర్షం నా మీద కురుస్తోంది. నా లోంచి కురుస్తోంది. జల్లు జల్లుగా కురుస్తోంది. భళ్లుభళ్లున కురుస్తోంది. వర్షపు చల్లదనం శిరస్సు నుండి పాదాల దాక పాకి శరీరంలోని సర్వాణువుల్ని కడిగేస్తోంది. ఆ చల్లదనం నరనరాల్లోకి పరుగులెత్తి వెచ్చగా ఉంది. అది ఎన్ని స్నానాల పెట్టు. ఎన్ని మునకలు దానికి దీటు. వర్షమంతా నామీద పడాలనిపించింది. నన్ను ముంచెయ్యాలనిపించింది. ఆ సమయంలో నేను నడవటం మానేసి, వొరేయ్! ఆ డొంక మధ్యలో నిటారుగా నుంచున్నారా!

అటుపక్క చూస్తే పొలాల మీద వాన. మంచి శనగ చేను మీద వాన పడుతుంటే పైరుపైరంతా ఆనందంగా వూగుతోంది. ధనియాల చేను మీద వాన పడుతుంటే ఆ మేరంతా కొత్తిమీర వాసన, వాన సుగంధం కలిసిపోయిన గాలి. వానకి జొన్న చేను నృత్యం చేస్తోంది. మొక్కజొన్న కండెలుబ్బిపోతున్నాయి. సజ్జ కంకులు పొంగుతున్నాయి. వరి ఉన్నట్టుండి పెరుగుతోంది. కందికాయలు, పిల్లిపెసర్లు కువకువలాడ్తున్నాయి. వేరుశనగ చేను విచ్చుకుని వేళ్లలోకి దింపుకుంటోంది వర్షధారల్ని. అలా నేల నేలంతా పైరు పైరంతా వర్షానికి పరిపరి విధాలుగా పులకలెత్తుతోంది. పొలాల మీద వాన కొంచెం తగ్గుముఖం పట్టినట్లనిపించింది. కుడి పక్కకి తిరిగి చూస్తే కృష్ణ మీద వర్షం జోరుగా ఉందనిపించి కృష్ణ వొడ్డుకు

బయల్దేరాను. అలా ఎందుకనిపించిందీ అని అడక్కు. రంగావఝులవారి చేను దాటి అలా కృష్ణ వొడ్డుకి వస్తిని గదా –

వరె వరె వరె! అదీ వర్షం.


అంత గొప్ప ప్రవాహంలో సంతత ధారగా వాన పడిపోతోంది. నీళ్లలో నీళ్లు. ధారలో ధార. ప్రవాహంలో ప్రవాహం. వాన చినుకులు కృష్ణలో పడుతుంటే పెద్దక్క ప్రేమగా హత్తుకుంటే వొళ్లు జలదరించినట్టు, ఆ ప్రవాహం మీద ఓ జలదరింపు, ఓ పులకరింపు, సిగ్గుతో నవ్వినప్పుడు బుగ్గమీద సొట్టలా చినుకు పడ్డ చోట చిన్న గుంట. అంతలో ఆ గుంట మాయం. మళ్లీ చినుకు మళ్లీ గుంట. మళ్లీ మళ్లీ చినుకులు. అంతలో మాయమై మళ్లీ మళ్లీ గుంటలు. కృష్ణంతా చినుకులు. కృష్ణంతా పులకరింతలు. ఇసక మీద చినుకులు. కసకస చినుకులు. రేణు రేణువుకీ చినుకులు. విసవిస, సరసర చినుకులు. రివ్వుమని రయ్యిమని చినుకులు. ఊపులా చినుకులు. తావులా చినుకులు. ఛళ్లుమని, ఫెళ్లుమని, దభిల్లుమని, పెఠిల్లుమని చినుకులు– చినుకులు – కృష్ణ నిండా, ఇసక నిండా, నేల నిండా – చినుకులు చినుకులు – రెండు గంగలు కలిసిపోయినట్టు నింగీ నేలా ఒకటే అన్నట్టు. ఈ జగత్తులో నీళ్లు తప్ప ఇంకేవీ లేనట్టు అన్నిటికీ నీళ్లే ఆధారమన్నట్టు వాన, వర్షం, గంగమ్మ, కిష్టమ్మ, సంద్రం– అదేదో దానికి నువ్వే పేరైనా పెట్టుకో.

అలా ఆ అఖండ జల ప్రపంచం మధ్య మతిపోయి నుంచున్నానా – పడవ్వాళ్లు నలుగురైదుగురు వచ్చి 'శాస్తుల్లుగారు ఈడున్నారేటి?' అన్నారు. అప్పుడీ లోకంలో పడి – నేనిక్కడే ఉంటానంటే 'ఇదేవన్నా మతి భ్రమణవేమో' అనుకుంటారే మోనని వాళ్ల వెంట ఊళ్లోకొచ్చాను.

'వర్షం ఆగిపోయిందని చెప్పకు తాతయ్యా' అన్నాడు కాలేజీలో చదువుతున్న మనవడు. అప్పటికి మిగతా మనవలు నిద్రపోయారు.

'లేదురా ఇంకా కురుస్తోంది. ఆగకుండా కురుస్తోంది. ఇల్లు దగ్గరపడుతున్న కొద్దీ కంగారెక్కువయింది. మీ నాయనమ్మా, కొత్తగా కాపరానికొచ్చిన చిన్న పిల్లయ్యె. అందులో పట్నంలో కచ్చేరీ గుమాస్తాగారి కూతురేమో వర్షంలో తడిసి జలుబు చేసి ఎక్కడ ముక్కూడగొట్టుకుంటుందో అని గబగబ నడిచాను. ఇంట్లోకొస్తే ముందు వరండాలో లేదు. మధ్య గదిలో లేదు. వంటింట్లో లేదు. 'ఓహోయ్' అని కేకేస్తే బదులు లేదు. గబగబా దొడ్లోకొస్తే దొడ్డి చివర ఆరుబయట కృష్ణవైపు తిరిగి నుంచుని కన్పించింది. వర్షం కృష్ణలో కలుస్తుంటే, కృష్ణ వర్షంలో కలుస్తుంటే, వర్షం తను కలిసిపోయి, చేతులు విప్పార్చి తల ములకలుగా హాయిగా తడుస్తోంది.





# పాలు

## బి.ఎస్. రాములు

● రచనా కాలం: 1985

**బి.ఎస్.రాములు:** తెలంగాణ ప్రాంతపు నిమ్న జీవిత లోతుపాతులను మెతుకుతో పాటు ముద్దతో సహా పట్టి ఇచ్చే కథలను అనేకం రాశారు. ఉద్యమాలు, అస్తిత్వాలు వీరి సాహిత్యంలో ఉనికి పొందాయి. నవలలు, సిద్ధాంత వ్యాసాలు, తాత్త్విక గ్రంథాలు... కృషి చేయని ప్రక్రియ లేదు. తెలుగు కథ మీద అభిమానంతో వర్క్‌షాప్‌లను నిర్వహించి, కథారచనకు మార్గదర్శక గ్రంథాన్ని రచించారు. బడి, చదువు, సహజాతాలు, వేపచెట్టు తదితర కథలు ప్రసిద్ధం. పూర్తి పేరు బేతి శ్రీరాములు. స్వస్థలం కరీంనగర్ జిల్లా జగిత్యాల. జీవితం హైదరాబాద్‌లో సాగింది. తెలంగాణ రాష్ట్ర తొలి బి.సి. కమిషన్ చైర్మన్ అయ్యారు. వయసు 68 సంవత్సరాలు.

వర్షం. ఒకటే వర్షం.

బురద. ఎటు చూసినా బురద.

చినుకులు. తుంపర చినుకులు.

ఈదర చలి.

చలి ఈదర.

వాతావరణం అంతా కసుక్కు కిసుక్కు కిసుక్కు కసుక్కు.

విడవని దుఃఖంలా వర్షం.

చీకటీ కాదు. వెలుగూ కాదు.

ఉదయమో సాయంత్రమో తెలియడం లేదు.

మూడు రోజుల్నించి యిదే వరుస.

ఎవరూ పొలం వెళ్లింది లేదు. పనులు చేసింది లేదు.

ఒకటే ముసురు.

బీటలు వారిన నేలతల్లి గుండెల్ని చెమ్మతో నింపేస్తున్నట్టుగా ముసురు.

ఎక్కడ చూసినా భూమంతా పచ్చగా. బాలెంత పెయిలా పచ్చిగ.

ఆ గుడిసె పచ్చి. అది ఉరిసి పచ్చి. అది అటు యిటు తడిసి పచ్చి. చెమ్మగిల్లిన నయనాల్లా పచ్చి.

ఈదర చీదర.

మానసిక హింసలా. నెత్తురు కారని హత్యలా. చలి ఈదర.

నానిన కట్టెలు పెట్టి, నానిన పొయ్యిలో ఊదుతూ అవస్థలు పడుతోంది ఎల్లవ్వ. కుక్కి నులక మంచం మీద జ్వరం వచ్చిన పసికందు నిద్ర పోతూ ఉన్నాడు. ఉరుసుడుకు సగం తడిసిన దుప్పటి కప్పుకుని పెద్ద కొడుకు పదేళ్ల గంగపోషం మంచం మీదే ఒక పక్కన వణుకుతున్నాడు. బయట తెరలు తెరలుగా వాన.

'మక్క ప్యాలాలు మా ఎంచత గని నువ్వు ఈ యేడన్న బడికోవాలె బాంచెన్' వూదుతూ వేడుకొంది ఎల్లవ్వ గంగపోషంను.

'నీయవ్వ. నేను పోనుపో' దుప్పటి మరింత గట్టిగా కప్పుకుంటూ అడ్డంగా ఊగుతూ అన్నాడు గంగపోషం.

'ఎందుకుర?'

'సారు గొడతడు'

'మంచిగ సదువుకుంటే ఎందుకు కొడతడు?'

'నీయవ్వ. ఎప్పుడు సదువుకోవాలె? ఇంటికత్తె ఈ పని. బల్లెకోతే సార్ల పని. ఇక ఏడ సదువాన్నే?'

'బళ్లె సార్ల పనేందిరా?'

'నేను మనింటి కాడ, నీతోనొచ్చి పంతులింటి కాడ పని జెయ్యంగ సూత్తలేరా సార్లు? బల్లెకోయినంక సార్లు గూడ గసొంటి పని జెప్పి అటీటు తోలేసిన్రు. నేను పోను'

'సదువుకుంటే మంచి నౌకరి దొరుకుతదిర' పచ్చి బాలెంతను విడిచి అక్కడెక్కడో ఉన్న భర్తను తలుచుకుంటూ బుజ్జగించింది.

'నాకేమద్దు నౌకరి'

'మరేం జేత్తవుర'

'తమ్ముణ్నెత్తుకుంట. తమ్ముణ్నాడిత్త. నువ్వు పొద్దుందాకా తెల్లందాక పంతులింట్ల పని జేత్తే తమ్ముణ్నెవలాడిత్తరె మరి?'

'నా కొడుకె' పుత్ర వాత్సల్యంతో కొడుకును రెండు చేతుల్తో నిమిరి నొసట ముద్దు పెట్టుకుంది. వేళ్లు కణతలకు విరుసుకుంది. అంతలోనే–

'మరి పెద్ద పెరిగినంక ఎట్లర? ఏం పని జేసుకుని బతుకుతవు?'

'నాయిన తీర్గ పని జేత్త'

'మీ నాయిన..! ఆయన అదేదో ఊర్ల పంతులు కార్కానాల. నేను ఈడ

పంతులింట్ల. యిద్దరం పంతులుకు పనిజేత్తె సుతం పొట్టకు గడుత్త లేదు. రేపు నీకు లగ్గమై పెండ్లామచ్చినంక నీ పెండ్లాంకేం బెడుతవు? మమ్మల్నేం జూత్తవు?'

'నీయవ్వ. నేను లగ్గమే జేసుకోను పో'

'నా కొడుకే' మళ్లీ ముద్దిడుకొంది.

'నువ్వు సదువుకోవాలె. మంచి నౌకరి జెయ్యాలే'

ఉప్పుఉప్పు ఊదుతూ మంగులంలోని మక్కలు ఏంచుతోంది. మంగులంలో ప్యాలాలు చిటపటమంటున్నాయి. ఎంత వేడి ఎక్కువ అవుతే అంత పెద్ద పువ్వుల్లాగా ప్యాలాలు వేగుతాయని యింకా ఊదుతోంది. ఊదడం ఆపింది. ఉరిసిన నీళ్లతో నిండిన పల్లెంలోని నీళ్లు అవుతల పారపోసి వచ్చి మళ్లీ కూర్చున్నాడు గంగపోషం. చాటలో పోసిన ప్యాలాలు కొన్ని తీసుకొని ఒక్కొక్కటి నోట్లేసుకుంటూ నములుతున్నాడు.

'నువ్వు పంతులింట్లనే పని జేసుకుంట ఉంటివి. మరి తమ్ముని ఎవలు ఆడిపిత్తరే?'

'మన బతుకులెట్లయిపాయెరా?'

దీర్ఘనిశ్వాసం విడిచింది.

'గడియ పురసతు లేదు. గవ్వ రాకడ లేదు. నా పాసిపని కోసం నువ్వు సదువు బందుపెడ్తె ఎట్లర? నేనే ఎట్లన్న సగమెట్టుగుంటగని ఈ యేడన్న నువ్వు బడికి మల్లవోర'

'మరి ఇంటికాడ కావలి ఎవలుంటరె నువ్వు పనికోతే?'

గడిసె అంతా కలయజూసింది.

కూలే గోడలు. రాలే మన్ను. దురిసిన కమ్మలు. ఉరిసే గుడిసె. బూరుగు చెక్కల తలుపులు. అది ఇల్లు అనే కంటే పందుల కొట్టం అంటే బాగుంటుందేమో.

నిట్టూర్చింది.

తానొక చోట. పెనిమిటి ఒకచోట. తలపులు ఒక చోట. తనువులు ఒక చోట. పిడికెడు మెతుకుల కోసం ఎంత దూరం పోవాల్సి వచ్చింది. ఎంతమందికి దూరం కావాల్సి వచ్చింది. ఎన్ని ఆప్యాయతల్ని, ఎన్ని సుఖాల్ని వదులుకోవాల్సి వచ్చింది.

బయటకు చూసింది.

అదే ముసురు. ఆకలిలాంటి ముసురు. పాపంలాంటి ముసురు.

చలినీ ఆకలినీ దూరం చేయాలని గంగపోషం నములుతున్న ప్యాలాల చప్పుడు కటకట కిటకిటమని గుడిసెలో అలుముకుంటోంది.

ఎక్కడో బల్లి 'కిచకిచ' అంది.

'చో చో చో' బల్లి పలుకుకు ప్రతిగా ఎల్లవ్వ పలికింది .

ఏదో మాటవరసకు బడికి పొమ్మన్నది గని వాడు బడికి పోతె తనకు పని యింట్ల యెల్తాదా అసలు అనుకుంది. ఒక్క కొడుకును సాదలేని బీదతనం. ఇంత భారమైన బతుకెందుకో? మళ్లీ నిట్టూర్పు. నిశ్వాస.

'మరి పోత గని. నాకు రోజు గిలాసెడు పాలు వోత్తవ?' మంచంలో అటూ ఇటూ కదులుతున్న తమ్ముని జోకొడుతూ అన్నాడు గంగపోషం.

'పాలెక్కడివి బాంచెన్?'

'పంతులింట్ల మూడు బర్లున్నయి గదనె. నువ్వే పిండుతవు గదనె. నాకు రోజు గిలాసెడు పాలు వొయ్యి. బడికి వోత'

అవును. తాను నిత్యం పిండేపాలు. తనకూ తన వాళ్లకూ చెందని పాలు. పంతులు పాలు.

'అబ్బో. అవి మనయి గాదు. పంతులోల్లయి. గట్లనద్దు కండ్లు వోతయి బిడ్డ' అటూ ఇటూ బెరుకుగా చూసింది.

'మరి పంతులు కొడుక్కు రోజు చెంబెడు పాలు నువ్వే తాగిపిత్తవుగదనే'

అవును. నిజమే. తాగిపిస్తుంది. తాగకపోతే ఎంతో బాధపడుతున్నట్టు నటిస్తుంది. కాని నోరు విడిచి అడిగి తన కొడుక్కు ఒక్క చుక్క ఒక్కటంటే ఒక్క చుక్క తాగిపిస్తే ఒట్టు– బర్రె ఈనిన తెల్లారి పంతులమ్మ పెట్టిన జున్ను తప్ప.

'మరి అవి ఆల్ల బర్లె గద కొడక'

గంగపోషం ఒక నిమిషం ఏమనలేదు. అంతలోనే అన్నాడు–

'గీ పాటిన్నవాయె. ఊరు మనదిరా. ఈ వాడ మనదిరా. బర్లు మనయిరా బర్ల పాలు మనయిరా. దొర ఏందిరా దొరతనమేందిరా' అక్కిరి బిక్కిరిగా కాకుండా చదివినట్టుగా పాడాడు.

ఉలిక్కి పడింది.

'మెల్లగా పాడు. ఎవలన్న యింటరు' అటూ ఇటూ విసుగ్గా చూసింది.

'ఈల్లు పంతులోల్లు. దొరలు గాదు గద బిడ్డ'

'మరి లచ్చిగాని వాల్లవ్వ గాల్లెవలయో బర్లు జాత్తంది గదనే. ఆల్లు సగం ఈల్లు సగం పాలు తాగుతున్నరు. మరి మనకు సగం పాలు ఎందుకు రావే'

అది మాత్రం నిజం. బర్లు సాదడంలో వాల్లకూ తనకూ తేడా లేదన్నది నిజం.

'ఆల్లేమో పాలుకు తీసుకొని సాత్తున్నరు. మనం గట్లకాదు గద. మనం వాల్లింట్ల పని సేసేటోల్లమైతిమి. మనకేమో జీతమిత్తరు'

'ఎంతిత్తరే?'

'నెలకు ముప్పయి. యింత సల్దిబుల్ది'

'నీయవ్వ. పొద్దుందాకా తెల్లందాకా నువ్వు అన్ని పనులు జేత్తవు. గడ్డి కోసుకత్తవు. పాలు పిండుతవు. బోల్లు తోముతవు. ముప్పయి జీతమానె. నీయవ్వ. జీతం బందువెట్టు'

మనసు విప్పి మాట్లాడుకునే సమయం ఎన్నాళ్లకు దొరికింది. తీరికలో బయటపడ్డ కొడుకుకు గల తల్లిప్రేమని చూసి నోట మాటరాక ఉక్కిరి బిక్కిరి అయింది. నములుతున్న ప్యాలగింజతో సరం తప్పినట్టయింది. పొడిపొడిగా దగ్గి అదుపులోకి తెచ్చుకుంది. మంగులంల ఏంచిన ప్యాలాలు చాట్ల పోసింది. మరో వాయి మక్కలు పోస్తూ ఉత్సాహంగా అంది–

'మరి బడికోతావా?'

'పోతగని. మరి నేను చెప్పినట్టు జెయ్యాలె'

'ఏంటిదిర'

'పంతులు బర్లు మన వాకిట్ల కట్టేసుకోవాలె. మనకు సగం పాలు ఆల్లకు సగం పాలు. నువ్వేమో పాలమ్ముకుంట ఇంటికాన్నే ఉండచ్చు. పంతులింటికి నువ్వు వోవద్దు. నేను పోనే పోను. యిగ సార్లు నాకు పని జెప్పరు. పంతులు కొడుకు తీర్గ నేను గూడ పాలు దాక్కుంట మంచిగ బడికోత'

'తప్పు. అట్లనద్దు కండ్లు వోతయి'

'ఎందుకే? పంతులు బర్లకు మొత్తం నువ్వే సగ వెట్టవడితివి. ఆల్ల జాగాలున్నందుకు అన్ని ఆల్లకేనాయె. మరి మన జాగల కట్టేసుకుంటె మనకు సగం పాలు రాద?'

ఆశ్చర్యం.

అమాయకత్వంలో అన్నీ నిజాలే.

తరం మారితే బలం మారుతుంది.

ఈ సంగతి తనకు తట్టనందుక్కూడా ఆశ్చర్యం.

తమాయించుకుని 'పెద్ద పెద్దోల్లు గట్ల పాలుకియ్యరు బిడ్డ. నేను గాదంటే ఆల్లు యింకోల్లను జీతం బెట్టుకుంటరు' అంది.

'ఎవలుండద్దు జీతం'

'ఎవలూరుకుంటరు బిడ్డ. పూటకు గతిలేనోల్లు మన తీర్గ ఎందరు లేరు? గిట్ల నువ్వన్నట్టుంటె మంచిగనే ఉండుగని' అంది.

బిడ్డ ఏడుపు మొదలైంది.

మంచంలో పడుకొని ఏడుస్తున్న పసికందును ఒక్క అంగలో వచ్చి తీసుకుంది. పసికందు శరీరం మసలుతోంది. వాడికి జ్వరం. మూణ్రోజుల్నుంచి విడవని ముసురులా ఒకటే జ్వరం. మందులు లేవు. ఆ ఊళ్లోనే మందులు అందుబాటులో లేవు. డాక్టరూ లేడు. పక్క పల్లె నించి ప్రయివేటు ప్రాక్టీసు చేసే కాంపౌండరు ప్రతి రోజు వచ్చేవాడు. మూణ్రోజుల్నించి బయట బురదలో కాలు తీసి కాలు పెట్టరావడం లేదు. పొరుగూర్నుంచి ఆ కాంపౌండర్ సైకిల్ మీద రావడం లేదు. పెద్ద వాగు పొంగింది. వాగులో పోసిన మట్టితోవ ప్రవాహానికి కొట్టుకపోయింది. నిన్నట్నుంచి తుమ్మలకుంట అలుగు పారుతున్నది. చెరువులు కుంటలు అన్నీ నిండాయి. ఎటు చూసినా నీళ్లే. ఆ ఊరి చుట్టూ నీళ్లే. ఆ ఊరి తోవలన్నీ బంద యినాయి. పసికందును చంకనేసుకొని పక్క పల్లెలో కాంపౌండరు దగ్గరికి పోదావన్నా పోరాదాయే. ఎట్లా ఏం జెయ్యాలి?

ఎల్లవ్వ ఆ కొడుకు ముచ్చట మరిసి ఈ కొడుకు గూర్చి మనసు కలికలి అయింది. కాంపౌండర్‌కి మతలబు చెప్పుదామన్నా ఎవరు వోతరు? పంతులింట్ల ఫోన్ ఉంది. మల్లోసారి అడిగితే? అబ్బో యింకేమన్న ఉన్నదా? ఫోనుతో పాటు పంతులు, పంతుల్తో పాటు పంతులింట్లోని పని యాదికి వచ్చి ఉలిక్కిపడింది.

'అయ్యో. యాల్లయినట్టుంది. కోపానికత్తరేమో' అనుకొంటూ పసికందును జోకొట్టింది. కుక్కి మంచంలో పడుకోబెట్టి రొమ్ము నోట్లో కుక్కింది. పసికందు పాలు చీకకుండానే మళ్లీ నిద్రపోయాడు. రొమ్ములు సలుపుతున్నాయి. పసికందు మూణ్రోజుల్నించి చీకని పాలు సేపులొచ్చి సలుపుతున్నాయి. పాలు వద్దనుకున్నా ధారలు కారుతూ రవిక తడుస్తోంది. పాలు చీకక శరీరం అంతా సలుపుతూ జ్వరం వచ్చినట్లుగా మెలి తిరిగిపోతోంది. బాధతో కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరిగాయి. కొంగుతో కళ్లొత్తుకుంది. తడిసిన రవికను కొంగుతో తడుచుకుంది.

అవి పాలు... తన పాలు... పుత్రవాత్సల్యం పాలు... అలా బాధ పడటం తన పాలు... బాధ పడుతూనే పని చేయడం తన పాలు... పని చేయడంలో మొదటి పాలు... అదే మొదటి పాలు.. చివరి పాలు...

వాన కురుస్తూనే ఉంది.

వెలుగులోని చీకటి పెరిగింది.

చీకటిలోని వెలుగు తరిగింది.

పంతులింటికి చేరుకుని ఎల్లవ్వ పనంతా చేసింది. పనెంతో చేసింది. తడుస్తు పని చేసింది. పని చేస్తూ తడిసింది. తడిసిన చలితో వణికింది. గొడ్ల కొట్టంలోకి వెళ్లింది. రెండు బర్ల పాలు పిండింది. నిండిన పాలచెంబులు ఇంట్లో పెట్టి మరో చెంబుతో వచ్చింది.

అది ఆవు.

పాలివ్వడమే తప్ప కపటం ఎరుగని ఆవు.

అది కరెంటు వెలుగుకు రొచ్చులో ఒరిగింది. దాని ముఖమ్మీద కన్నీటి చారికలు. వర్షపు నీరు ధారగా కారుతున్నట్టుగా ఆ కన్నీటి చారలు. ఆ కళ్లల్లో బూసులు. ఆ కళ్లల్లో ఎరుపు. ఆవు ఏడ్చి ఏడ్చి ఆ కళ్లల్లో ఎరుపు.

'హై' అంటూ ఆవును కదిలించింది. అది నిస్సత్తువతో లేవలేదు. పక్కనున్న చొప్పబెండుతో కొట్టింది. ఎంతకూ లేవలేదు. ఏం చేసినా లేవలేదు. పల్లిపిండి తౌడు కలిపి కుడితి తెచ్చి ముందు పెట్టింది. అయినా లేవలేదు. వంగి తోక పట్టి లేపింది. లేవలేని ఆవు తోక విసిరింది.

అది ఛాతీలో తాకింది.

ఎల్లవ్వ గుండె జల్లుమంది.

పాలచెంబు ముందేసుకుని కూలబడింది.

సేపులోంచి తీపులెక్కిపోతున్న పాలు.

మూడ్రోజుల జ్వరం వల్ల పసికందు ఒక్క బుక్క చీకని పాలు.

గడ్డ కట్టుకు పోతాయేమోనన్నట్లు సలుపుతున్న పాలు.

దుఃఖంతో కళ్లు తిరిగాయి. కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరిగాయి.

ఈ ఆవు– తాను.

దీని దూడ– తన పసికందు.

లేవలేకపోయింది.

అంతకన్నా బలవంతంగా లేపబుద్ధి కాలేకపోయింది.

నిన్నటి దృశ్యం కళ్ల ముందు కదలాడింది.

కోడె దూడ.

ముద్దుగా బొద్దుగా తెల్లగా పాలలా మెరిసే కోడెదూడ.

మూడ్రోజుల క్రితం దాకా ఉన్న కోడె దూడ.

మూడ్రోజుల ముసురుకు మొన్నటి పగటి నుండి ఏదోలా ఉండి తెల్లారేసరికి శ్వాస వదిలింది.

అదేం రోగమో. చిటుకు రోగం. చిటికెలో మాయం.

మొన్న పగటి నుంచి ముక్కులోంచి నీరు కారి కారి నాల్గుసార్లు దగ్గింది అంతే. తెల్లవారే సరికి కట్టె అయిపోయింది.

తన కళ్లెదుట తన ప్రాణం తన రూపం విలవిల కొట్టుకుంటూంటే తల్లిప్రాణం ఎంత విలవిలలాడిందో.

నోరున్న మనిషి ఏడ్వగలడు.

నోరులేని జీవి ఎలా ఏడ్వగలదు?

ప్రాణం విడిచిన దూడను శ్వాస వుందేమోనని నాలుకతో స్పర్శ చూస్తూ మృదువుగా ఆవు నాకుతున్న దృశ్యమే గుర్తుకొస్తోంది.

ఎల్లవ్వ కళ్లల్లో సుళ్లు తిరిగిన కన్నీళ్లు.

తల్లి మనసు మేల్కొంది.

అప్పుడనగా వచ్చింది.

పసికందు ఎంతగా ఏడుస్తున్నాడో.

తల్లి మనసు కీడు శంకించింది.

వీల్లేదు.

అలా కావడానికి వీల్లేదు.

కోడెదూడలా తన కొడుకు చనిపోవడానకి వీల్లేదు.

వెళ్లాలి.

పసికందును చూసుకోవాలి.

వెనుదిరిగింది.

దూరంగా నిలబడి పంతులు వేపు తిరగింది.

నిన్నటి దృశ్యం గుర్తుకొచ్చింది.

ఫోన్ చేసి డాక్టర్ను పిలుస్తే మంచిగుండుననుకున్నది.

పంతులుకు చెప్పలేక పంతులమ్మ చేత సిఫార్సు చేయించింది.

ఎవరికో ఫోన్ చేస్తున్న పంతులు చూసిన ఆ చూపు.

ఫోన్ అడగడానికి ఎన్ని గుండెలు అన్నట్టుగా చూసిన చూపు.

'ఆ డాక్టరుకు ఫోన్ లేదు' అని తనను చూసిన చూపు.

కళ్ల ముందు కదలాడి భయంతో వెనుదిరిగింది.

ఖాళీ చెంబుతో పంతులమ్మ ముందు నిలబడింది. పంతులమ్మ ఖాళీ చెంబు చూసి పంతులుకు చెప్పడానికి వచ్చింది.

'ఈ రోజు కూడా పొదుగు ముట్టనిత్తలేదట పోనీ తియ్యండి'

'నిన్నట్నించి పాలు పిండడం లేదా?'

అసహనం.

'అవును. అది నిన్నటి నుంచి ఒకటే కంటికేడు ధారలు. పోనీ తియ్యండి. ఉన్న పాలు చాలు. ముసురు గదా. తాగడానికి కొనడానికి ఎవరు రావడం లేదు. పాల వ్యాన్ రోడ్డు పాడై రావడమే లేదు. పోనీ తియ్యండి ఈ రోజుకు'

'పాలు మిగులుతున్నయనీ పాల వ్యాన్ వస్తలేదని పాలు పిండొద్దా? యివాళ పిండకపోతే రేపు పిండనిస్తుందా? పిండాలి. లేకపోతే అలవాటు తప్పుతుంది. ఆ తర్వాత పాలివ్వడమే మానేస్తుంది. అలవాటు తప్పనీయొద్దు. పాలివ్వడం మాననీయొద్దు'

'చూసుకుంట గూడ ఎట్ల పిండుమంటరు బాంచెను. నిన్నట్నుంచి కుడిత తాగుత లేదు. గడ్డి ముట్టుత లేదు. పన్న కాన్నుంచి లేత్త లేదు. పొదుగు ముట్టనిత్త లేదు. అది దూడబోయిన దుక్కంలున్నది. ఏం చెయ్యాలె బాంచెను' అంది ఎల్లవ్వ.

'ఎట్లన్న జేసి అలివి తప్పకుండ చూడాలె గద. సైకిల్ మోటార్నిచ్చి డాక్టర్ను పిలిపించినా అది బతుకకపాయె. నాకు మాత్రం దుఃఖంగా లేదూ. అది బతికుంటే రెండు వేల కోడెదూడ కాకపోవునా? అది చస్తే నాకు మాత్రం నష్టం గాదా?

అయితే పోయిందానికి ఏడ్చుకుంట కూర్చుంటే పోయింది వస్తదా? పోయింది రాదు. కాని ఉన్న ఆవు కూడా పాలు ఎగపెడుతది. నేనొస్త పద పిండుదాం'

కుర్చీలోంచి లేచాడు పంతులు.

విధి లేక మళ్లీ చెంబు తీసికొని కొట్టంలోకి వెళ్లింది ఎల్లవ్వ.

ముల్లుగర్రతో నాలుగయిదు బలంగా బాదాడు పంతులు.

'అంబా.. అంబా'

అరచింది ఆవు.

లేచింది ఆవు.

స్థాణువులా నిలబడిపోయింది ఆవు.

ఆవును కొడ్తుంటే విలవిల కొట్టుకొంది ఎల్లవ్వ.

పంతులమ్మ కళ్లు మూసుకొంది.

పంతులు పని నెరవేరింది.

పిండలేక పిండలేక పాలు పిండింది ఎల్లవ్వ.

పంతులు ఆ చిన్న పనికే అలసి పోయాడు.

వేణ్ణీళ్లతో కాళ్లు చేతులు కడుక్కుని మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు.

అతడికి చలిచలిగా ఉంది.

వెచ్చగా కడుపులో ఏదైనా పడితే బాగుండని ఉంది.

పంతులు మనసులోని మాట గ్రహించింది ఇల్లాలు. చిక్కగా కాగిన పాల గ్లాసును ఎల్లవ్వతో పంపింది.

చలి.

ముసురు.

ఎల్లవ్వకు పంతులు పాలగ్లాసు చేతుల్లో వెచ్చగా తగిలింది. వానలో తడిసిన శరీరానికి ఆ వెచ్చదనానికి ప్రాణం లేచి వచ్చింది.

పాలగ్లాసు అందుకొన్నాడు పంతులు.

ఎల్లవ్వ చేతికొచ్చిన వెచ్చదనం చేజారిపోయింది.

పని చేసి చేసి తన సత్తువంతా పోయింది.

తన చేతిలోని సత్తువనిచ్చే పాలూ పంతుల్ని చేరిపోయాయి.

ఆ పంతులు బండిపంతులు కాదు.

కరణం పంతులు కాదు.

సర్పంచు పంతులూ కాదు.

పంతులు రిజర్వుడు.

ఆ వూరే ఒక పాఠశాల అయితే అతడు పెద్ద పంతులు.

ఆ వూరే ఒక దేశం అయితే అతడు దానికి రాజు.

అందుకే పబ్లిక్ ఫోన్ వారింట్లోనే ఉంటుంది.

పోస్టాఫీసూ వారి వరండాలో డబ్బాలా వేలాడుతుంటుంది.

ఫోన్ మాత్రం యింట్లో లోపల ఉంటుంది.

అక్కడికెవరూ పోరు.

ఎవరూ పోలేరు.

అంత దూరం అది.

ఎన్నో అంతరాల దూరం అది.

పంతులు రాజు. ఎక్కడో పెట్టిన పైపుల ఫ్యాక్టరీకి రాజు.

అందుకే జిల్లా కేంద్రంలో రెండస్తుల మేడలు మూడు కట్టినా నాలుగు గదులు తప్ప అంతా ఏవేవో ఆఫీసులకు కిరాయికిచ్చాడు.

అతడు ఎంతో సాదాసీదాగా మల్లెపూలా ఉంటాడు. ఖద్దరు లాల్చీలా ఎంతో సాత్వికంగా ఉంటాడు.

అతడికి నిష్ఠ. శాకాహారం మీద నిష్ఠ. మాంసాహారం అసలు ముట్టడు. పంతులు జాతిపిత మతం. స్ట్రిక్ట్‌లీ వెజిటేరియన్. పాలు తాగుతాడు. తల్లిపాలలా శ్రేష్ఠమైన పాలు తాగుతాడు. మాట తప్పకుండా తిరిగి వచ్చిన ఆవును ప్రాణాల్తో వదిలేసిన పులి మాంసాహారమే ముట్టనని ప్రతిజ్ఞ చేసి ఆ ఆవుపాలే రోజూ నిష్ఠగా తాగుతున్నట్టుగా అతడు పాలు తాగుతున్నాడు.

ఒక్కొక్క బుక్కెడే తాగుతున్న పాలు.

రొమ్ములో ఒరిగిన గోవు పాలు.

పొదుగులోని పాలు.

ఎల్లవ్వ రొమ్ములోని పాలు.

రవికంతా పాలు. రక్తమంతా పాలు.

తన కండలు, తన పెనిమిటి కండలు, ఎందరివో కండలు.. ముక్కలు ముక్కలుగా మంచులా కరిగిన గ్లాసులోని పాలు. తన సత్తువ, తన నెత్తురు, ఎందరిదో సత్తువ, ఎందరిదో నెత్తురు కరిగి మరిగి తెల్లనైన పాలు.

ఎర్రని రక్తం, తెల్లని పాలు– అన్నీ పంతులు పాలు.

కష్టమంతా తమ పాలు.

ఫలితమంతా పంతులు పాలు.

అవును.

అలివి తప్పకూడదు.

తన పెనిమిటి చచ్చినా, తను చచ్చినా, పసికందు చచ్చినా.

అవును. అలివి తప్పకూడదు.

పనిని వదలకూడదు.

కడుపు నిండా కూడు ఉండకూడదు.

అంతే.

పంతులు అంతే.

వీల్లేదు.

అలా కావడానికి వీల్లేదు.

ఉలిక్కి పడింది.

పసికందు గుక్కపట్టి ఏడుస్తున్నట్టుగా గుండెల్లో గుబులు.

కీడు శంకించింది మనసు.

దీన్ని ఎదిరించాలి.

అప్పుడనగా వచ్చింది.


ఇంకానా?

ఎంగిలి గ్లాసు తీసి కడుగకుండానే చెప్పకుండానే గబగబ వచ్చేసింది. గబగబా వచ్చి నిద్రోయిన బాబుని హృదయానికి హత్తుకుంది.

ఒళ్లు కాలుతున్న జ్వరం.

బయట వర్షం.

ఇంట్లో కన్నీళ్ల వర్షం.
ఒకటే వర్షం.
కాదు.
అవి పాలు.
ప్రకృతి అంతటా పాలు.
అవన్నీ నెత్తుటి పాలు.



# అతడి పేరు మనిషి

## మహేంద్ర

● రచనా కాలం: 1983

**మహేంద్ర:** కథను సమర్థంగా నిర్వహించడం తెలిసిన కొద్దిమంది కథకులలో ఒకరు. మధురాంతకం రాజారాం కడుపున జన్మించినా తండ్రి పేరుగాని ఇంటి పేరుగాని చెప్పుకోకుండా సొంత గొంతునీ వ్యక్తిత్వాన్ని సాహిత్యంలో ప్రతిఫలింపజేయడంలో విజయం సాధించారు. వృత్తి రీత్యా గ్రామిణ బ్యాంక్ మేనేజర్. జీవితం తిరుపతిలో సాగింది. 14 కథలు, ఒక నవల రాశారు. వీరి 'హోగినేకల్', 'బేసిన్ బ్రిడ్జ్ దగ్గర' వంటి కథలు క్లాసిక్స్. ఇంకా ఎన్నో మేలిమి రచనలు చేయవలసి ఉండగా 1995లో తన 39వ ఏట విషజ్వరంతో మరణించడం తెలుగు కథకు జరిగిన తీరని అన్యాయం.

వర్షం అవిరామంగా కురుస్తోంది.

బంగళా ముందు వరండాలో నిలబడి వర్షధారల్లో తడుస్తూ స్పష్టాస్పష్టంగా కన్పిస్తున్న ప్రకృతి వైపు చూస్తూ ఉంది మిస్ సుధా చక్రవర్తి.

'మహల్' గ్రామం చుట్టూ ఉన్న కొండలపై మబ్బులు బద్ధకంగా దొర్లి పోతున్నాయి. వర్షం మూలంగా పొలం పనులకు అంతరాయం కలగడంతో గ్రామంలోని రైతులందరూ ఇండ్ల వసారాల్లోనూ చూర్ల క్రింద దిన్నెలపై కూర్చొని భార్యాపిల్లలతో కులాసా కబుర్లు చెప్పుకుంటున్నారు.

బంగళా ముందు పోతున్న తారురోడ్డులో ప్రవహిస్తున్న వాననీళ్లు మట్టి బాటలోకి తిరిగి కొండవాగులోకి ప్రవహిస్తున్నాయి. తారురోడ్డు నుంచి దక్షిణంగా లంబంగా పోయే మట్టిబాటపైన అర ఫర్లాంగు దూరంలో ఉన్న కుగ్రామం పేరే మహల్. తారురోడ్డులో మట్టిబాట కలిసేచోట ఆ గ్రామం ప్రెసిడెంటు ఆధునా తనమైన ఆ బంగ్లా కట్టాడు. బంగ్లానూ, గ్రామంనూ కలుపుతూ ప్రెసిడెంటుగారి మామిడితోపు. తోపునానుకుని గ్రామం మొగదలలో పాత మహిడీ ఉన్నాయి. ఆయన ఆస్తినంతా రక్షిస్తూ బలమైన యినుప కంచె ఉంది.

సుధ వర్షం చూస్తూ వరండాలో పచార్లు చేస్తూ ఉంది. టేప్ రికార్డర్‌లో నుంచి ఏవో హిందీ పాటలు విన్పిస్తున్నాయి.

'ఏమైనా నువ్వు ఇలా ఒంటరిగా వచ్చేయడం ఏం సబబుగా లేదు తల్లీ. ఏదో నీ అదృష్టం బాగుండి కారు చిత్తూరు దగ్గరాగిపోబట్టి రాత్రి ఏ హోటల్లోనో ఆగి సురక్షితంగా రాగలిగావు. ఇదే ఏ ఘాట్ సెక్షన్‌లోనో, మరే రిమోట్ ప్లేస్‌లోనో జరిగుంటే ఏమయ్యేదో నీకర్థం కాదు' ఉదయం నుంచీ మాధవి సుధనలా

మందలించడం ఎనిమిదోసారి.

'జరిగినదానికి తానూ బాధపడుతోంది కదవే. దాన్నంతటిలో వదిలేయ్' అక్కను విసుక్కున్నాడు కృష్ణమూర్తి.

వర్షంలో కొబ్బరిచెట్లు విపరీతంగా ఊగుతున్నాయి. కొండలు అప్పుడప్పుడూ లీలగా కన్పిస్తూ మాయమౌతున్నాయి. సుధ చీరచెంగును తలమీదుగా లాగి చెవుల చుట్టూ కప్పుకుంది.

సుధ మరీ డల్ అయిపోవడం గమనించిన మాధవి పాత భవంతి నుంచి పనిమనిషి చేత టిఫినూ, కాఫీలు తెప్పించింది. ముగ్గురూ టిఫిన్లు ముగించి కాఫీ తాగుతూ కబుర్లలో పడ్డారు. సుధ తాను డ్రైవింగ్ నేర్చుకున్నప్పుడు చేసిన సాహసాల్ని చెబుతూ తన మామయ్య కొడుకునూ, కూతురునూ నవ్విస్తోంది.

వర్షం తగ్గుతూ... హెచ్చుతూ కురుస్తూనే ఉంది.

ఇంతలో గేటు దగ్గరెవరో తారాడుతుండడం గమనించి ముందుకు నడిచాడు కృష్ణమూర్తి. ఆ అగంతకుడెవడో గేట్ తలుపులు త్రోసుకువచ్చి సరాసరి వరండా మెట్ల మీదే నిలుచున్నాడు.

సుధ వొళ్లు విరుచుకుని కుర్చీ నుండి లేస్తున్నదల్లా తనకేసే చూస్తున్న అగంతుకుని వైపు చూసి నిర్ఘాంతపోయింది.

వర్షంతో ఎంతగా తడవొచ్చునో అంతగానూ తడిసి వున్నాడతను. అతని ఉంగరాల జుత్తు నుంచి, కనురెప్పల నుంచి, వంటికతుక్కుపోయిన బట్టల కొసల్నుంచి వాననీళ్లు జలజల రాలుతున్నాయి. సంశయమూ, బిడియమూ మిళితమైన నవ్వు అతని ముఖం మీద దోబూచులాడుతోంది.

'రాత్తిరి బిత్తరలో దీన్ని మరిసిపొయ్యినారు. బంగారపు వస్తువుగద! తొందరపడతా ఉంటారని మద్దానమే బయల్దేరినా. మద్దిన ఈ వాన మల్లా పనిచేటు చేసింది...' తన చేతిలోని బంగారు గొలుసును సుధ చేతికిస్తూ ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా అన్నాడతను.

మాధవి అయోమయంగా సుధ కేసి చూసింది. తొట్రుబాటుతో సుధ ముఖం అంతకంతకూ వివర్ణమవుతూ ఉంది. కృష్ణమూర్తి ఏదో అడగబోయి బలవంతాన ఆపుకున్నాడు.

'అదే మరి... వస్తున్నప్పుడు కారు ట్రబులిచ్చిందని చెప్పానుగా... అప్పుడు ఇతనూ ఇంకా కొందరు వెనుక నుంచీ త్రోసారు. అప్పుడు పడిపొయ్యుంటుంది'

తత్తరపాటును కప్పిపుచ్చుకుంటూ అంది సుధ.

'ఐనా నీదేం సాహసయాత్రే తల్లీ! గలీవరూ, సిందుబాదూ కూడా నీ అంత కష్టపడి ఉండరు' మళ్లీ పాత పాటే ప్రారంభిస్తున్న మాధవిని త్రోసుకుని, 'ఆ ఉండు. ఇప్పుడు వస్తాను' అంటూ ఏదో పనివున్నదానికి మల్లే లోపలకెళ్లి కాట్ మీద బోర్లా పడిపోయింది సుధ.

'అసలేం జరిగిందని ఇంకొంచెంసేపట్లో అతణ్ణి అడిగేస్తారు. అతని మాటలను బట్టి తాను కారు చిత్తూరు దగ్గర ఆగిపోయినట్టు కల్పించి చెప్పినదంతా పచ్చి అబద్ధమని మాధవికీ, కృష్ణమూర్తికీ ఇంకొంతసేపట్లో తెలిసిపోతుంది. ఇంతా తెలిసిన తర్వాత వారికి తనమీద ఏ అభిప్రాయం ఏర్పడుతుంది? అసలు తాను జరిగింది జరిగినట్లు చెప్పివుంటే ఏ తగాదా లేకపోవును. ఐనా ఇతడిలా మళ్లీ దాపురిస్తాడని తానేం కలగందా? పాడు చైను. పోయినా బాగుండేది. పెద్ద నిజాయితీపరుడిలా పట్టుకొచ్చాడు. అంతా తన ఖర్మ. అయ్యో. ఇప్పుడెలా...'

సుధ ముఖాన్ని దిండులో దాచుకుని తనను తాను నిలవరించుకోవడంలో సతమతం అవుతూంది. ఈ అవమానాన్ని ఎలా భరించాలో, దీని పర్యవసానాల్ని ఎలా ఎదుర్కోవాలో అర్థంకాక ఆమె ఖిన్నురాలైపోతోంది. ఈదురు గాలికి గాజు కిటికీలు టపటప కొట్టుకుంటున్నాయి. కిటికీ తెరలు వికృతంగా ఊగుతున్నాయి. గడిచిన భయంకరమైన రాత్రి గుర్తుకు వచ్చింది ఆమెకు.

● ❖ ●

మంటికీ మింటికీ అలుక్కుపోయినట్టు చీకటి. ఆకాశం పగిలినట్లు కుండపోతగా వర్షం. సమయం ఏడుగంటలైనా అర్ధరాత్రిలా ఉంది. చిత్తూరు నుంచి మహలుకెళ్లే రోడ్డు మీద హెడ్‌లైట్స్ వేస్తున్న వెలుతురు మరక ఆధారంగా కారు శరవేగంగా దూసుకుపోతూంది.

భయంతో కంపిస్తున్న తన శరీరాన్ని అదుపులోకి తెచ్చుకోవడానికి వ్యర్థ ప్రయత్నం జేస్తూ దాదాపు ఉన్మత్తంగా డ్రైవ్ చేసుకుపోతుంది మిస్ సుధా చక్రవర్తి. అరచేతుల్లోనూ, నుదుట, ముక్కు మీద చెమట పడుతోంది. మహా అయితే మరో అరగంటలో తాను మహల్లో ఉంటుందన్న నమ్మకం వొక్కటే ఆమెకు కొంచెం ధైర్యం ఇస్తోంది.

ఆమె భయాందోళనలకు పతాక ఘట్టంలా కారు రోడ్డుకడ్డం పడివున్న తాడిచెట్టును ఢీకొని నిలిచిపోయింది. ఏం జరిగిపోయిందో మరి అయిదు నిముషాలకు గానీ సుధకర్థం కాలేదు. టాప్ తగిలి తల బొప్పి కట్టింది. కళ్లల్లో

నీళ్లు తిరుగుతున్నాయి. ఏడవడానికి కూడా నోరు పెగలడం లేదు. వర్షం నిరాఘాటంగా కురుస్తూనే ఉంది.

కళ్లు మిరిమిట్లు గొలిపేలా మెరుపులూ, వెంటనే మిన్ను విరిగినట్టు ఉరుములూ సుధ మాటిమాటికీ హడలిపోతోంది. ఎంతసేపు అలా నిశ్చేష్టంగా ఉండిపోయిందో ఆమెకు తెలియదు. చివరికామె ధైర్యం తెచ్చుకుని చుట్టూ పరికించి చూసింది.

కారుకు కొంచెం వెనుకగా ఎత్తున ఏదో చిన్న వెలుతురు ఎర్రగా కన్పించింది. 'హమ్మయ్య. దగ్గర్లో నరసంచారముంది' నిట్టూర్పు విడిచింది సుధ. ఇంతలో ఓ మెరుపు మెరిసింది. ఆ వెలుగులో ప్రక్కనున్న మిట్ట మీద ఒక గుడిసె కన్పించింది.

అయిదారు నిముషాల వికిత్స అనంతరం లేని తెగింపు తెచ్చుకుని కారు లాక్ చేసి గుడిసె వైపు నడవసాగింది. రోడ్డు దిగి, రోడ్డుకూ గుడిసెకూ మధ్యనున్న తగ్గులో ప్రవహిస్తున్న వాగును దాటి సెనగచేలు కడ్డంగా నడచి చిట్టచివరికెలాగో ఆమె ఆ గుడిసె చేరుకుంది.

పాదాలు మాత్రమూ తడిచేంత లోతుగా ప్రవహిస్తున్న ఆ చిన్నవాగులో తన చెప్పు కొట్టుకుపోవడమూ చీకటిలో పెద్ద అఖాతంగా కన్పించిన ఆ వాగులో తాను మునిగిపోతుందేమోననీ కొట్టుకుపోతుందేమోననీ హడలిపోవడమూ కంది మొక్క గ్రుచ్చుకుని తన కాలు కందిపోవడమూ తన చేయి చేలో కొమ్మకు తగిలినప్పుడు ఏదో పక్షి భయంకరగా అరచి టపటప రెక్కలు కొట్టుకుని ఎగిరిపోవడంతో తను కెవ్వున కేకవేయబోయి చేతితో బలవంతాన ఆపుకోవడమూ– ఏదో భయంకరమైన ద్వీపంలో సాహసయాత్ర చేస్తున్నట్టుంది సుధ పరిస్థితి.

వెదురు కంచె దాటుకుని ఆమె ఇంటి ఆవరణలోకి అడుగుపెట్టింది. కొత్త మనిషిని గుర్తుపట్టినట్టు దొడ్డిలోని మేకలు అరిచాయి. సుధ దీర్ఘచతురస్రాకారంగా ఉన్న గుడిసె దగ్గరకెళ్లి గడప దగ్గర నిలబడింది. కురుల నుంచి, చీర కుచ్చిళ్ల నుంచి, నాసికాగ్రం నుంచి, నొసటి నుంచి నీటి బిందువులు జలజల రాలుతుండగా ఆమె, సకాలంలో పంటలకు నీళ్లు లేకపోగా వాన కొరకు చాతకంగా తపించి పోతున్న రాయలసీమ రైతు గృహాన్ని పావనం చేయడానికి వస్తున్న వర్షాధి దేవతలా ఉంది.

గడపకు కొంచెం అటువైపుగా నులకమంచం మీద పడుకున్న మనిషి

కన్పించాడు. బోర్లా పడుకుని నేలమీద పెట్టిన గోధుమరంగు పుస్తకం జూసి చూరుకు వ్రేలాడుతున్న లాంతరు వెలుగులో అతడు ఏవో పద్యాల్ని కాబోలు కూనిరాగంతో చదువుకుంటున్నాడు. బహుశా నిద్రలోకి జారుకుంటున్నాడేమో కన్నెత్తి కూడా చూసేట్టు లేడు.

చివరికెలాగో ధైర్యం తెచ్చుకుని కాలికున్న ఒక చెప్పునూ విడిచి వణుకుతూ ఇంట్లోకి జొరబడింది సుధ. అతడు లేచి నిలుచున్నాడు. ఇరవైకి మించని వయసు, నల్లటి శరీరం, మరింత నల్లగా ఒత్తుగా పెరిగిన ఉంగరాల జుత్తు, మోకాళ్ల క్రిందికి జారిన పంచె, నిలుచున్నవాడు సంభ్రమంగా ఆమెకేసి చూడసాగాడు.

బిక్కుబిక్కుమని అతనికేసి చూస్తూ బిగుసుకుపోయిన పళ్లను బలవంతాన తెరచి, చేత్తో రోడ్డు కేసి చూపుతూ...

'కారు... నిలిచిపోతుంది' అప్పుడే మాటలు నేర్చిన పసిపిల్లలా అంది సుధ.

అతడు ద్వారం దగ్గరికెళ్లి రోడ్డుకేసి చూపు సారించాడు. కన్ను పొడుచుకున్నా కన్పించని కటిక చీకటి.

'ఇంకా ఎవరన్నా ఉండారా?'

'లేదు. నేనొక్కతినే'

'ఎక్కడి నుంచీ వొస్తా వుండారు'

'మెడ్రాసు నుంచీ వస్తున్నాను. మహల్‌కెళ్లాలి. మహల్లో మా మామగారింటికి.'

'అట్లనా పెసిడెంటు వాళ్లింటికా! మహల్ ఇక్కడికింకా అయిదు మైళ్లుంది. పోయిన్నెల్లో ఎలక్షన్లప్పుడు మీ మామగారు మా ఊరికి కూడా వచ్చుండిరి. పెద్దాయనకు బీదోడొకటి సావుకారొకటి కాదు. మనిషి మనిషినీ ఓటడిగినాడు. మా ఇంట్లో మూడు ఓట్లూ ఆయనకే ఏస్తిమి' వచ్చిన మనిషెవరో అర్థం గావడంతో అతడు మంచం మీది దుప్పటి దులిపి వేశాడు.

'కూచోండి. వొరసం ఈ రాత్తిరికి తగ్గేట్టు లేదు. అయినా దూరం పయానాలకు బొయ్యేటప్పుడు ఆడమడిసి వొంటిగా వొచ్చుండగూడదు. దినాలు బాగాలేవు. ఈ పోరంబోకు రోడ్లో నాలుగు చినుకులు రాలితే ఎద్దులబండికి ఏస్కాటం అయిపోతుంది. ఆడికీ ఆదురుష్టమే. కారు గనక ఇంకొంచెం అట్టా ఇట్టా నిల్సిపోయుంటే ఈ గుడిసె కూడా కనపడదు.'

సుధ ఇంకా ద్వారం వద్దనే నిలబడి చీర కుచ్చిళ్లను, పమిటను పిండుకో సాగింది. గోడ చివర వ్రేలాడుతున్న దండం మీద నుంచి పంచెను లాగి ఆమెకిస్తూ

‘తుడుచుకోండి. ఈ వానల్లో తడిసి పడిసం పట్టిందంటే పద్దినాలు పడకె య్యాల్సిందే’ అన్నాడు.

అతడే మళ్లీ ‘పెట్లో మా ఆడోళ్ల కోకలుండాలి. మీ గుడ్డలు ఆరే వరకూ అవి కట్టుకుందురా’ అని ప్రశ్నార్థకంగా జూసి ‘సమయానికి ఇంట్లోవాళ్లు తలొకదిక్కు బోయినారు. ఈ యాళకు వొచ్చేవోళ్లే. వాళ్లూ ఈ వానకు దడిసి నిలిచి పొయ్యింటారు’ అని ప్రక్కనున్న చెక్క పెట్టి మీది నుంచి ట్రంకును దించి అందులో ఉన్నవాటిలో ఒక మంచి చీరను తీసి ఆమెకిచ్చాడు.

సుధ తటపటాయించడం జూసి ‘ఇట్టాంటివి మీ ఇంట్లో చెత్తలు దోసేవాళ్లు కూడా కట్టుకోరు. అయినా ఎంతసేపు? ఇట్ట చుట్టుకోని అట్ట విప్పి పారేయండి. ఈ తేమగుడ్డల్లో తెల్లాగట్ల నానితే రేపు మద్దానానికి జరం ఖాయం’ ఆమెకు ఏకాంతం కల్పించడం కోసం కాబోలు తలుపు వెనుకనున్న రావి ఆకుల మోపును తీసుకుని అతడు మేకల దొడ్డిలోకి పోయాడు.

పొయ్యి ముట్టించి ఎసరుబెడ్తూ అతడు మళ్లీ సంభాషణకుపక్రమించాడు.

‘మేము మాలోల్లము. మా ఇంట్లో మీరు భోజనం జేద్దురా’ అని నవ్వుతూ ‘వసుదేముడంతోడు గూడ ఒక కాలంలో గాడిద కాళ్లు పట్టుకున్నాడంట. మీకీ పొద్దు చెడ్డటయిం. లేకపోతే లంకంత పెసిడెంటుగారింట్లో మెత్తల మీద పండు కోవాల్సినోళ్లు – ఈ తాటాకుల కొంపలో నులక మంచం మీద కూసోనుండారు. ఈ పొద్దైనా మీ కారు నిల్సిపోగా యిట్టొచ్చినారుగానీ లేకపోతే చెన్నపట్నం పుట్టి మునిగితే మటుకు మీరు మా గడప దొక్కుతారా?’

నిజానికతడు తన కంటే రెండు మూడేళ్లయినా చిన్నవాడుగా ఉండొచ్చు. కానీ ఆ మాట్లాడుతున్న తీరు తనకన్నా ఇరవై ముప్పై ఏళ్లు పెద్దవాడు మాట్లాడుతున్నట్టుగా ఉంది. తన అందం పట్లగానీ ఏమీ ఆసక్తి లేకుండా ఏక్సిడెంటల్‌గా చిక్కుకుపోయిన తన్ను ఎలా అయినా కంఫర్టు చేయాలన్నదే ఆశయంగా అతడు మాట్లాడుతున్న తీరు సుధా చక్రవర్తికి నవ్వు తెప్పిస్తూంది. రాత్రంతా ఇక్కడెలా గడపాలో అన్న సంశయం మినహా ఆమె తన భయ భ్రాంతుల నుంచీ పూర్తిగా కోలుకున్నట్టే ఉంది.

‘మదరాసులో నాయనగారికేం ఉద్యోగమో?’

‘బిజినెస్’

‘నెలకు వెయ్యి రూపాయలు జీతమొచ్చునా?’

'బిజినెస్ అంటే వ్యాపారం. మాకు స్వంతంగానే మూడు సినిమా థియేటర్లూ, ఒక బట్టల కొట్టూ, రెండు మూడు ఫ్యాక్టరీలలో షేర్లూ ఉన్నాయి. అవీగాక మా డాడీ బిల్డింగ్ కాంట్రాక్ట్స్ చేస్తుంటారు...' వీలయినంతగా విడమరచి చెబుతున్నా తెల్లమొగం వేసుకుని చూస్తున్న అతణ్ణి చూడగానే టక్కున ఆపేసింది సుధ.

'అయితే మనకు ఇంట్లో మనిషికొక కారు ఉండేట్టుంది' ఆశ్చర్యాంబుధి నుంచి తేరుకుంటూ అన్నాడతను.

'ఊ. మా ఇంట్లో ఉన్నది నేనూ, మా మమ్మీ, మా డాడీ ముగ్గురుమేగా. నాకొకటి మా డాడీకొకటిగాక మరో జీపు కూడా ఉంది' అంది సుధ.

మరో పది నిమిషాల్లో వంట పూర్తి చేసి అతడు సుధను భోజనాని కాహ్వానించాడు.

'ఏందో మాకు కలిగింది మీకూ బెట్టినాము. ఈ పొద్దుటికింత ఎంగిలి బడండి. పొద్దన్నే నాష్టా ప్రెసిడెంటు గారింట్లో సేద్దురు' ఓదార్పుగా అన్నాడతను.

తింటున్న పాత్రలు, పరిసరాలు మినహా వంటేమీ మరీ తీసికట్టుగా లేదు. రుచి సంగతలా ఉంచి పదార్థాలన్నీ వేడిగా ఉన్నాయి. బాగా ఆకలయిందేమో గబగబా అన్నం ముగించింది.

శారీరకంగానూ మానసికంగానూ కూడా అలసిపోయిందేమో సుధ సొమ్మసిల్లి నట్టుగా మంచం మీద వాలిపోయింది. మాగన్నుగా నిద్ర పట్టినట్టే పట్టి హఠాత్తుగా ఏ రాత్రి వేళప్పుడో మెలకువ వచ్చింది. అప్పటికే వాన మరీ కుండపోతగా మారిపోయినట్టుంది. ఉరుములూ మెరుపులూ ప్రకృతి నానా భీభత్సంగా ఉంది.

గుడిసె కప్పు ఈదురుగాలికి లేచిపోయేలా ఉంది. తలుపు ఊగి ఏ క్షణాన్నైనా విరిగిపోవడానికి సిద్ధంగా ఉంది. గోడలపై నీళ్లు చారలుకట్టి కారుతున్నాయి. తగ్గిపోయిన లాంతరు కాంతిలో చిన్న చిన్న వస్తువులు కూడా గోడలపైన నిడివైన నీడలు పరుస్తున్నాయి.

సుధకు అంతా అయోమయంగా ఉంది. ఒక్కసారి తన ఇల్లూ, బెడ్‌రూమూ, తన డన్‌లప్ గుర్తుకు వచ్చి కళ్లు చెమర్చాయి. ఏం ఖర్మ పట్టింది తనకి? అంతా స్వయంకృతం. డాడీ మాట విననందుకు తగిన శాస్తే జరిగింది. మళ్లీ నిద్ర కోసం ప్రయత్నించి విఫలురాలైంది. తర్వాత గట్టిగా నిట్టూర్చి గుడిసెనంతా పరిశీలనగా చూడసాగింది.

మరికాసేపటికి ఆవులిస్తూ ప్రక్కకు తిరిగి పడుకుంది. అతడు నేల మీద పడుకుని ఉన్నాడు. క్రింద వేసుకున్న చిరుగుల చాప కాళ్ల క్రిందికి కూడా అందడం

లేదు. తల క్రింద దిండు లేదు. కప్పుకోను దుప్పటి లేదు. కనీసం ఒంటిపై షర్టూ బనీను లేకుండా ఎలా నిద్రబోతున్నాడో?

ఎక్కడ నుంచీ వచ్చిందోగానీ ఒక పందికొక్కు పొయ్యి దగ్గరున్న మట్టికుండల్లో దూరి రభస ప్రారంభించింది. బయట కప్పల బెకబెకలు విన్పిస్తున్నాయి. ఈదురుగాలి చేస్తున్న శబ్దం ప్రళయం వచ్చేస్తున్న భ్రాంతిని కల్గిస్తుంది.

'వానకు ఈ ఇల్లు కూలిపోతుందేమో... ఈ గాలికి కప్పు ఎగిరిపోతుందేమో... ఈ రాత్రి తెల్లారదు కాబోలు... ఇదే తన అంతిమరాత్రి... ఈ గుడిసె కూల బోతోంది... తన గుండె ఆగబోతూంది... ఒన్, టు, త్రీ...' సుధ ఇబ్బందిగా కదిలి మళ్లీ అతనికేసి అసంకల్పితంగా చూడసాగింది.

ఇంతలో పందికొక్కు అతని కాళ్ల మీదుగా దొంతుల మధ్యకు పరుగెత్తింది. అతడు వెల్లకిలా తిరిగి, ఒళ్లు విరుచుకుని పెద్దగా మూలిగి నోరు తెరుచుకుని పడుకున్నాడు.

'అయినా బయట ప్రళయభీకరంగా వర్షం కురుస్తుంటే ఇతడు మాత్రం ఎలా నిద్ర పోతున్నాడు? ఇంకా మీసకట్టు కూడా ఏర్పడినట్టు లేదు. పెదవుల్ని కదలిస్తూ ఎందుకో నవ్వుతున్నట్టున్నాడు. అస్సలు నిజంగానే నిద్రపోతున్నాడా? లేక నిద్ర నటిస్తున్నాడా?'

దొడ్డిలో మేకల గోల మొదలయింది. లేస్తాడు కాబోలు. మళ్లీ మేకల మధ్య రాజీ కుదిరినట్టుంది. అతని కళ్లు అరమోడ్పులుగా ఉన్నాయి. తననే చూస్తున్నాడా ఏం కొంపదీసి... అతణ్ణి అలా చూస్తూనే విద్యుద్ఘాతం తిన్నదానిలా గజగజ వణికిపోయింది సుధ. ఏదో దుర్వాసన వేస్తుంటే అంతవరకూ ఓ మూలకు విసిరేసిన దుప్పటిని కాళ్ల దగ్గర నుంచి గొంతువరకూ లాక్కుంది. ఆమెకు అరచేతుల్లోనూ అరికాళ్లలోనూ మెడ క్రిందా గబగబ చెమట పట్టసాగింది. బుగ్గల్లో ఆవిర్లు రేగాయి. పెదవులు సన్నగా వొణికాయి.

'తానేమో ఇప్పుడు వంటింటి కుందేలు. అతడు తలచుకుంటే వారించడం తన తరంగాదు. అంత పనీ జరిగితే? అమ్మో, ఇంకేమైనా ఉందా?'

'అలాంటి ఉద్దేశమే ఉన్నవాడైతే ఇంతవరకూ ఎందుకు ఊరుకుంటాడు... చేతికి దొరికిన పిట్ట ఎలా తప్పించుకుంటుందన్న ధీమా ఏమో?'

ఆ తర్వాత సుధ బలవంతాననైనా కంటి మీద రెప్పవేయలేకపోయింది. సెకండ్లు... నిముషాలు.. బరువుగా గడుస్తున్నాయి. 'భగవంతుడా, ఎలాగయినా ఈ రాత్రి నిరపాయకరంగా తెల్లారేట్టు చూడు' అంటూ ఆమె మనసులో దేవుడిని

ప్రార్థించింది. తెల్లవారుఝామున ఎప్పుడో మళ్లీ నిద్రపట్టినా గడిచిన ఆ రాత్రంతా జాగరణగానే తెల్లారింది.

● ❖ ●

ఇది జరిగింది గతరాత్రైనా సుధ మనస్సుపై దాని తాలూకు భయంకర జ్ఞాపకాల ప్రభావం ఇంకా బలంగా ఉంది.

'ఇదేవిటండీ సుధాదేవిగారూ. ఏదో అర్జంటు పని ఉన్నట్టుగా లోపలికొచ్చి నిద్రాసనం వేస్తున్నారా. లేలే. నువ్విలా అయినదానికీ కానిదానికీ ముఖం ముడుచుకుని కూర్చుంటే నిన్ను సముదాయించటం మా తరంగాదు' మాధవి పలకరింపుతో ఉలిక్కిపడ్డట్టుగా లేచి కూర్చొంది సుధ.

'అతగాడు వెళ్లిపోయాడా?' భయం భయంగా ప్రశ్నించింది.

'ఆహా... ఎక్కడో వట్టి వెర్రి వెంగళప్పలా ఉన్నాడు. ఇంతకూ మా మామయ్య కష్టపడి సంపాదించిన సొత్తు కాబట్టి మళ్లీ చేతికొచ్చింది. అన్నట్టు కృష్ణతో అతనికేమన్నా ఇచ్చి పంపమని చెప్పాను. భోజనం చేసి ముగ్గురమూ కేరమ్స్ ఆడుకుందాం. ముందు నువ్వు నీ విషాద నాయికా వేషానికి స్వస్తి చెప్పి ముఖం కడుక్కో' అంటూ సుధ చేయి పుచ్చుకుని బంగాళా నుంచీ పాత భవంతిలోకి లాక్కుపోయింది మాధవి.

సుధకు ఉదయం తాను కూడా అతనికి డబ్బు ఇచ్చిన సంగతి గుర్తుకొచ్చింది. ఉదయం తాను లేచేసరికి అతడు మరికొందరి సాయంతో రోడ్డు కడ్డంపడ్డ చెట్టు ఆవలికి లాగించేశాడు. అందరూ కలిసి పది గజాలు తోయగానే కారు స్టార్టు అయింది.

నిజానికి అతనివైపు చూడడానికి సుధకెందుకో మనస్కరించలేదు. చూపులు ఎక్కడో పెట్టుకుని లాంఛనంగా కృతజ్ఞత చెప్పుతూ రెండు పది రూపాయల నోట్లను అతని చేతిలో కుక్కింది సుధ. అతడు తనను వారిస్తూ ఏదో చెప్ప బోయాడు. కారు స్టార్ట్ అయిన ఉత్సాహంతో తాను అతని మాటలను సరిగ్గా విన్పించుకున్నట్టు లేదు.

రేడియో డిస్టర్బెన్స్‌తో మళ్లీ ఈ లోకంలోకి వచ్చిపడింది సుధ. అనౌన్సరు చేస్తున్న సైక్లోను సూచన అస్పష్టంగా వినిపిస్తోంది. వర్షం మళ్లీ ఎక్కువైంది. మహల్ గ్రామం ప్రెసిడెంటుగారి పాతమహిడీ రెండో అంతస్థు గాజు కిటికీలపై వానజల్లు దబదబలాడుతున్న చప్పుడు విన్పిస్తూ ఉంది.

ఆ రాత్రి ప్రెసిడెంటుగారి భవంతిలో గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టిన కొన్ని క్షణాల తరువాత వీధి తలుపు తెరుచుకుంది.

కృష్ణమూర్తి ఆందోళనగా 'నాగయ్యా నాగయ్యా' అని పిలుస్తూ వరండాలోకి వచ్చాడు. వెనుకనే వచ్చిన రాజమ్మ 'నాగయ్య సందేళ కూతురింటికి పోయినాడయ్యా?' అంది.

'అయితే ఇప్పుడెట్లా? సమయానికి నాన్నగారు కూడా ఊర్లో లేరే...' ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణమూర్తి.

'మనిషి నెవరినైనా మల్లిమడుగు పంపిస్తే మునసామిని పిలుచుకొస్తాడు. మునసామి మందిస్తే పదే పది నిముషాల్లో సమాళిస్తుంది' అంది రాజమ్మ.

కృష్ణమూర్తి వీధిలైటు చేశాడు. వరండాలో ఓ మూల ఎవరో మనిషి. నిద్రబోతుండడం జూచి దగ్గరికెళ్లి అతణ్ణి లేపాడు. అతడు సాయంత్రం సుధకు గొలుసు తెచ్చియిచ్చినవాడుగా గుర్తిచడంతో 'ఏమయ్యా! నువ్వింకా మీ ఊరికి పోలేదా? సర్లే, ఈ వానలో అంత దూరం పోలేక పొయ్యింటావు. నువ్విప్పుడు ఉన్నపళంగా మల్లిమడుగు వెళ్లి మునసామి తెల్సునా? తెలీకపోతే – మంచోళ్ల మునసామి అని అడుగు. ఊర్లో ఎవరైనా చెప్తారు. అతడితో చెప్పి ప్రెసిడెంటు వాళ్లింట్లో ఎవర్నో తేలు కరచిందని ఈడ్చుకురా. దారి తెలుసు కదా. ఊర్లో దూరి, చెరువుకట్ట దాటి, మడికయ్యల మీద పోతే అరమైలు ఉండదు. లే, లేచి బయల్దేరు. ఇక్కడున్నట్టు రావాలి' అన్నాడు.

కళ్లు నులుముకుంటున్న అతడు తెప్పరిల్లి 'తేలా? నాకు తెలవని తేలు వైద్దమా? కొత్త కోట పెద్ద చెంగయ్య మా నాయనేగదా!... మీకు తెలవదేమోగానీ ప్రెసిడెంటు గారికి మా నాయన మీద శానా గ్నాపకం' అన్నాడు.

అతడలా అటుండగానే రాజమ్మ దగ్గరికొచ్చి, ముందుకు వంగి, కళ్లు పెద్దవి జేసి అతనికేసి చూస్తూ 'ఏమబ్బోడా! నువ్వు పెద్ద చెంగయ్య కొమారుడా? మీ నాయన్ని గురించి మాకు తెల్నట్టు కొత్తగా చెప్తా ఉండావే! ఈ పక్కుండే వాళ్లందరూ మీ నాయన్ను దీపంబెట్టి తలసుకోవాల. దనమంతరట్లా నిన్ను పెట్టుకోని మేము మల్లిమడుక్కా బోము. మదరాసుకూ బోము. ఎంతమంది మునుసాములైతే వొక చెంగయ్య అయ్యేది! కానీ బిరీన. ఏం మందేస్తావో ఎమో. బిడ్డ తల్లిడిల్లిపోతా ఉంది' అంది.

'బాటరీ ఒకటి తేండి. మందాకు పెరుక్కొస్తా' అన్నాడతను వెళ్లడానికి ఉద్యుక్తుడవుతూ.

'ఏం ఆకో అది. ఎక్కడబడితే అక్కడ దొరుకుతుందా?' అనుమానంగా అన్నాడు కృష్ణమూర్తి.

'అరె అది ఈడ లేకపోతే వదల్తానా. మావూరికన్నా పొయ్యి పెరక్కరానా. అయిదు నిముషాల్లో వస్తా సూడండి-' రాజమ్మ తెచ్చిన బాటరీ తీసుకుని వర్షంలో తడుస్తూ చీకట్లో కలిసిపోయాడతను.

రాజమ్మ అతడు పోయిన దిక్కుగా రెండు నిముషాలు చూసి చేతులెత్తి ఆకాశం కేసి నమస్కరిస్తూ 'బగమంతుడుండాడు. మనమెవరికీ కీడుగోరినోల్లముగాము. పెద్ద చెంగయ్యంటే ఎటుమంటోడు. ఆయన చేతి ముందుకు తిరుగుండాదా? ఒకసారైతే కొత్తకోట మాలోల్లకూ మాదిగోళ్లకూ పార్టీలొచ్చేసి కొంపనకగ్గి పెట్టేసుకుండిరి. అప్పుడు కూడా మాదిగోళ్లకు మందు లేదన్నాడా? దాంతోనే గదా మాలోల్లు ఆయన్ను కులం ఏలి ఏసేసిరి. అయితే కొండకిందన్నా ఇల్లు కట్టుకున్నాడుగానీ పట్టిన పట్టు వొదిల్నాడా పెద్ద చెంగయ్య. మొన్నమొన్నటి దాక ఉండే పెద్దాయన. అట్ట ధర్మాత్ములు బూమ్మీద మల్ల పుడ్తారా? బతకతారా... అయితే అటుమంటోని కడుపులో రత్నం పుట్టినాడు గదా' రాజమ్మ కొనసాగిస్తూనే ఉంది.

కృష్ణమూర్తి లోపలికి నడిచాడు. సుధ మాధవి వొడిలో అచేతనంగా పడి ఉంది. కాళ్లూ చేతులూ చల్లబడ్డాయి. 'ఒంటిపేగు బిడ్డ. అప్పుడే కాళ్లూ చేతులూ సలవలు గ్రమ్మతా ఉండాయి' పట్టిజూస్తూ అంది రాజమ్మ.

'ఏమని బయల్దేరిందో. అన్నీ గండాలే. దీనికేమన్నా అయితే మామయ్య వాళ్లకు ఏం చెప్పాలి' మాధవి కళ్లనీళ్లు పెట్టుకోసాగింది.

మరో పది నిముషాలు గడియారం చప్పుడు మినహా మరే శబ్దమూ లేదు. మందాకు కోసం పోయినవాడు ఉన్నట్టుండి తలుపులు త్రోసుకుని లోపలి కొచ్చేశాడు. వస్తూనే రాజమ్మచేత తనకు కావలసిన వస్తువులు తెప్పించుకుని ఆకులు దంచి మందు తయారుజేసి మాధవికిచ్చి సుధ చేత మింగించాడు. కిరోసిన్ దీపంలో ఆకువాడ్చి కాలికి కట్టు కట్టాడు. అందరికీ ధైర్యంజెప్పి వరండాలోకొచ్చి హాల్లోకి చూస్తూ కూచొన్నాడు.

పావుగంటకు సుధకు స్పృహ వచ్చింది. మాధవి రెండు చేతుల్తోనూ సుధను చుట్టేస్తూ 'నొప్పి తగ్గింది కదూ' అంది. సుధ పెదవులపై నీరసంగా ఒక చిరునవ్వు మెదిలింది.

మాధవి లేచి చరచరా ద్వారం దగ్గరికెళ్లి అక్కడ కూర్చున్న అతనితో 'నిజంగా

నువ్వెవరో మాపాలిటి దేవుడిలా వచ్చావు. సాయంత్రం పోయిన మా నగ నిచ్చినందుకు గాదుగాని ఇప్పుడు మా ప్రాణాధికమైన మా సుధను కాపాడినందుకు నీ ఋణం ఎలా తీర్చుకోవాలో మాకర్థం గావడంలేదు. ఉండుండు ఇప్పుడే వస్తాను' అంటూ ఇంటి లోపలికి దూసుకుపోయింది.

మరికొద్ది సేపట్లో అతని ముందు ఒక గాజుల చేయి, అందులో రెపరెపలాడే నోట్లు ప్రత్యక్షమయ్యా. అతడు దిగ్గున తలెత్తి గబగబ ప్రక్కకు జరిగి నిలుచున్నాడు.

'ఎందుకు? ఎందుకు నాకు మల్లా దుడ్డు ఇస్తా ఉండారు? మేము ఈ మందిచ్చిన దానికి దుడ్డు తీసుకోము. ఈ ఆకును నేనేమన్నా కొనుక్కొస్తినా. మన బాట పక్కనుండే ఆకే. మా నాయనకు ఇది నేర్పించిన బైరాగి కొన్ని కండిషన్లు బెట్టినాడు. ఈ మందిచ్చినదానికి ఎవరి దగ్గరా నయాపైస దీసుకోగూడదు. ఇది ఇచ్చినంత కాలం పర ఆడదాని సెయ్యి తాకగూడదు. ఒకేళ ఇందుకు విరుద్ధంగా సెయ్యాలంటే దీన్ని ఎవురికైనా ఒప్పజెప్పాల. మా నాయన బతికినంత కాలము అంత ఖరట్టుగానే ఉన్నాడు. నేను కూడా ఇంతవరకూ ఫర్వాలేదు. అయినా మీరిప్పటికే నాకు దుడ్డిచ్చుండారు. ఎందుకు? నేనే పొద్దన్నా మీకు కూలిజేస్తినా? మీ ఇంట్లో సేద్దానికుండానా? ఎందుకు నాకు మల్లా దుడ్డిస్తావుండారు. బాట్లో ఆకు – ఇంట్లో రోలు – సేతితో పని – ఎందుకని మల్లా నాకు దుడ్డు ఇస్తావుండారు. వొద్దొద్దు మీకాడ నయాపైసా దీసుకోను' అంటూ ఆగి అతడు స్తంభం దగ్గర చేరగిలబడ్డాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. రాజమ్మ కళ్లు తుడుచుకుంటూ ఆకులు దంచినచోట శుభ్రం చేయసాగింది. సుధ కళ్లనీళ్లు పెట్టుకుంది. చెత్తను వీధిలో పారబోసి ''ఇదేదో కాగితం. మొబ్బులో ఆకుల్తో బాటు దంచేసుండావు సూడు' అంటూ అతని చేతికొక కాగితం ముక్కనిచ్చి రాజమ్మ ఇంట్లోకి నడిచింది.

తడిసి వుండచుట్టుకుపోయి ముక్కలు ముక్కలుగా నలగగొట్టబడిన ఆ కాగితం ఉండను విప్పి చూశాడతను. తర్వాత ఒక పెడనవ్వు నవ్వి దాన్ని తిరిగి నలిపి వీధిలోకి గిరవాటేశాడు. రూపాయి నోట్లున్న జేబులోనే మందాకు కోసుకొచ్చాడు కాబోలు నోట్లు కూడా ఆకుల్తో బాటే దంచబడ్డాయి. అది చినిగిన పది రూపాయల నోటు తాలూకు ముక్క.

ఇంట్లోకి చూశాడు. సుధ దీనాతిదీనంగా తనకేసి చూస్తూ ఉంది. దాంతో తానేమైనా నిష్టూరం మాట్లాడాడేమోనన్న సందేహం కలిగింది అతనికి. 'మీకంతగా నాకేమైనా పెట్టాలనిపిస్తే ఇంత అన్నం పెట్టించండి. నిన్న పొద్దున తిన్న అన్నమే. ఈ వారసం వున్నాన పగులంతా కోమిటోళ్ల సత్రంలో గొంతు

కూసోనుంటి. రాత్తిరి మనింటికాడ ఎవురన్నా బయటకొస్తారేమోనని దీపాలు ఆర్పేదాకా సూస్తా వుంటి. చుట్టాలొచ్చింది కద. ఎవరికీ తీరుబాటు అయినట్టు లేదు. ఈ పొద్దు నాకూ, నా మేకలకూ కూడా ఉపాసమే. ఏదన్నా అంత తిని వాన తగ్గినాక మా వూరికి పోతాను' అన్నాడు.


ఛెళ్లుమని చెంపదెబ్బ కొట్టినట్టుగా సుధకు రెండు దృశ్యాలు స్ఫురించాయి. ఒకటి – అనామకురాలైన తాను అతని గుడిసెకెళ్లడం, అతడు తనను ఆదరించిన తీరు; రెండు – తనకు ఉపకారం చేసే ఉద్దేశంతో అతడు – ఈ మేడకు రావడం, తాము అతణ్ణి సత్కరించిన తీరు.

ముక్కూ మొఖం తెలియని తనకు అతడు అన్నం పెట్టాడు. బట్టలిచ్చాడు. అతను చాప మీద పడుకుని తనకు మంచం వేశాడు. ఈరోజు, ఈ చీకటిలో, ఈ వర్షంలో తనవారెవరూ తెగించి తనకోసం అడుగు ముందుకు పెట్టలేని పరిస్థితిలో మళ్లీ తనకు ప్రాణదానం చేశాడు. తానేమి చేసిందని అతడిదంతా చేశాడు? అతడు ఇంత చేసినందుకు తాను అతనికి ఏం చేయగల్గింది?

అతడు తనకోసం వర్షంలో అంత దూరం నడిచివస్తే అతనికి పట్టెడన్నం పెట్టిందా? పడుకోను ఇంత చోటు ఇచ్చిందా? కనీసం కృతజ్ఞతాపూర్వకంగా ఒక మాట మాటాడిందా? ఆశ్రయం ఇచ్చి అన్నం పెట్టిన అతని సౌజన్యాన్ని, పారబోసుకున్న నగను తెచ్చియిచ్చిన అతని నిజాయితీని, చివరకు తను ప్రాణదానం చేసిన అతని మానవత్వానికి కూడా తాను వెలకట్టింది. ఇతణ్ణి జూసేనా గత రాత్రి తాను అన్ని రకాలుగా అనుమానించింది? తాను ఒక మనిషేనా? తానొక మోడు, బండరాయి, స్టుపిడ్, ఇడియట్..! ఏడుపునాపు కుంటూ వీధి గుమ్మం వరకూ నడచిపోయింది.

రాజమ్మ అతని ముందు విస్తరివేసి అన్నం పెడుతోంది. తలవాల్చుకుని బురద బురదగా ఉన్న అరుగుపై మిడికాళ్ల మీద కూచొని ఉన్నాడు. అంతవరకూ దూరంగా పడుకున్న కుక్క అతని దగ్గరికొచ్చి తోకాడించసాగింది.

'చివరకు కుక్కకు పడేసినట్లు నీకు ఇంత అన్నం పడేస్తున్నాం గదూ' భోరున ఏడ్చేస్తూ ఆమె అతని జబ్బ పుచ్చుకుని హాల్లోకి లాక్కు వచ్చింది. అందరూ తనకేసి విస్తుబోయి చూస్తున్నారు. సుధ మళ్లీ ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చిన దానికి మల్లే అతన్ని డైనింగ్‌హాల్లోకి లాక్కుపోయింది.



# గాలివాన

## ఎ.ఎం. అయోధ్యారెడ్డి

● రచనా కాలం: 1990

**ఎ.ఎం.అయోధ్యారెడ్డి:** 90వ దశకంలో కథలు రాసి గుర్తింపు పొందిన రచయిత. స్వస్థలం తెలంగాణ ప్రాంతం. అంతకు మించిన వివరాలు తెలియడం లేదు. వీరి ప్రస్తుత అందుబాటు కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రచయిత ఈ సంకలనం చూడటం తటస్థిస్తే అదే పెద్ద సంతోషం.

గంతసేనే- గా శిన్నమాటకే దొరకోపమొచ్చింది.

మొకమంత ఎర్రంగ జేస్కోని కండ్లల్ల నుంచి నిప్కలు గుమ్మరిచ్చిండు. అమ్మని, ఆలిని బండ బూతులు తిట్టిండు. గప్పట్కి కోపం దీరక శేతులున్న వొంకె కట్టెతోని ఎనుపగోదను గొట్టినట్టు దమ్మొచ్చె దాక గొట్టిండు.

పాపం కొమురడేమన్నడని?

బస్తిదాక దొర బొయి రమ్మంటే గాపొద్దు పోనన్నడు.

కొమురయ్య గామాట కావురం బట్టి అన్లే. మెడ మీన తలకాయున్నోడెవడైనా గప్పుడు గామాటే అంటడు.

అసలు గాయాళ్ల ఎట్లున్నది? మామూలు వాననా అది? ఒకటా రెండా మూడు దినాల సంది మొగులుకు శిల్లులు పడ్డట్టు కురుస్తనే ఉన్నది. అది తుపానో.. గాలి గుండమో మరింకే నాశనగాలమోగని మింటికి మంటికి తెంపు లేదు.

గా వానకు తోడు ఈదురుగాలి శెవుల్ని మొద్దువార గొడ్తాంది. చలి వొణుకు బుట్టిస్తోంది. గాయాల్ల బుసబుస పొంగుతున్న ఏరుదాటి అవుతలి బస్తికి పోవుడంటే ఇంక కాటికి బోవుడే.

ఏరు సంగతట్ల వెట్టి కొమురయ్య ఆలత్ గప్పుడెట్లున్నది? పెయ్యిలేమన్న సత్తువున్నాది? పిడికెడు మెతుకులు కండ్ల చూసి ఎన్ని దినాలైంది?

గాలి వాన జెయ్యంగ గా మూడు దినాలు డొక్క లెండవెట్టుకొని గుడిసెల్నే ఖైదు జేసినట్టుగున్నది కొమురయ్యకు. ఉండి ఉండి యాష్టికొచ్చి గాయాల పొద్దుగూకు జామున గుడిసె ముంగ్లి కొచ్చి కూసున్నడు.

నీళ్లల్ల ముంచి పైకి లేపిన జల్లెడ తీర్గ గుడిసె అంత ఉరుస్తంది. గా నీళ్లు కొమురయ్య నెత్తి మీన సూతెం పడ్తన్నయ్.

కొమురయ్యకు నీళ్ల మీద కోపమొచ్చింది. వాన మీద కోపమొచ్చింది.

'థూ.. నీయవ్వ. మాదర్చోత్ వాన. శిగ్గు శరం లేదు దీనికి. మూడొద్దుల సంది ఇరాం లేకుంట కురుస్తాంది' తిట్టుకుంట మూలకు ముడుసుకోని కూసున్నడు. కొమురయ్య కడుపుల ఏనుగుల మంద ఉరుకుతాంది. ఆకలి కొచ్చెటి బరిసెతోని అతని డొక్కల గుచ్చుతంది.

అతని కండ్లకు సూపంత దూరం నీళ్లే కానొస్తన్నయ్. పుట్టి బుద్ధి తెల్సినంక గింత పెద్ద వాన సూడలేదనుకున్నడు.

ఒక్కసారి తలకాయ దిప్పి గుడిసెలకు తొంగి సూశిండు. గుడిసె అవుతలెంత శీదరగున్నదో లోపల సూతెం గట్లనే ఉన్నది. గుడిసెల శిన్న సప్పుడు సూతెం అయిత లేదు. మడుసులున్నా లేనట్టుగుంది. కుక్కి మంచంల పండుకోని దేవుడెప్పుడు పిలుస్తడాని ఎదురు సూత్తన్న కొమురయ్య ముసలితల్లి ఉండుండి శిన్నంగ ఏందో సణుగుతాంది. గప్పటి దాక మెతుకుల కోసురం ఏడ్చి లొల్లివెట్టి పెద్ద పోరగాండ్లిద్దరు కింద నాల మీదనే నిద్రబోయింద్రు. గుడిసెల ఓ మూలంగ మూట గట్టిగ గోనె సంచి తీర్గ పండుకున్నది కొమురయ్య పెండ్లాం రాజవ్వ. గామె బతికున్నదో సచ్చిందో ఎటు సమజుగాకుంటున్నది. మనిషి కొద్దిగ సూతెం కదుల్త లేదు.

రాజవ్వ బొచ్చె మీన తలబెట్టి తోలుతిత్తుల్ని నోటితోని పిండుకుంటున్న గడగొట్టు పోరి పాలెంతకు రాక తల్లి రొమ్ముని కసుక్కున కొరికింది. వొశంగాని బాధతోని కీసుమంది రాజవ్వ.

గా కీకె కొమురయ్యకు మూలుగు తీర్గ ఇన్పిచ్చింది. అతని కండ్లకు గుడిసెలున్నోల్లందరు సచ్చిన పీనుగుల తీర్గ కనపడ్డరు. సూడలేక తలకాయ దిప్పుకోని అవుతల వానలోకి చూడవట్టిండు.

అగ్గో... గప్పుడే వాన కొద్దిక ఎలిశినట్టయింది. శినుకులు శిన్నంగ శిటపట మనవట్టినై.

ఇషారంగ వానలకే జూస్తున్న కొమురయ్యకు దూరంగ రెండు శెత్తిర్లు తన గడిసె దిక్కే వొత్తున్నట్టు కండ్ల వడ్డది. జెరంత నిదానించి జూసి అతడు ఇచ్చెత్రపడ్డడు.

‘మనొద్దనే ఎవరో వొస్తర్ను. గింత గాలివానల నా గుడిసెలకడి కొచ్చేటో ల్లెవ్వరు? గీయాళ్ల ఏం పని పడ్డదబ్బా’ అనుకుంట కొమురయ్య లేసి నిలవడ్డడు.

శెత్తిర్లు దగ్గెరకొచ్చినయ్. గుడిసె దగ్గెరికొచ్చినంక ముడుసుకోబోయి సూరు కింద నీళ్ల ఉరుసుడు జూసి ఎనుకముందాడుకుంట ఆగిపోయినయి.

వొచ్చినోళ్లెవ్వలో తెలుసుకున్న కొమురయ్య జల్దిన బయపడుకుంట వానల కొచ్చి నిలవడ్డడు.

‘ఏంది బాంచెను. గింత వానల పని గట్టుకో వొచ్చిర్ను’ అనడిగిండు వణుక్కుంట.

‘నీ దగ్గెరికే వొచ్చినంరా. ఏం జేస్తన్నవ్ గుడిసెల గూకోని’ ఓ శెత్తిరి జెరంత ముందుకు జరిగి దొరతనం వొల్కబోసింది.

దొర గొంతుకు కొమురయ్య మరింత బయపడుకుంట ‘ఇంకేం జేస్త బాంచెను. గీ వానలేం జేస్త. ఏమన్న చెయ్యొచ్చేటట్టున్నాది’ అన్నడు.

‘ఏం జెయ్యరాదని గుడిసెల్నే పొందుగ కూసుండుడేనా? గట్ల గా గడీలదాకొచ్చి దొరకేమన్న పనివడ్డదని అరుసుకునేది లేద్రా?’

ఏం మాట్లాడాల్నో సమజ్గాక గా మాటలన్న రెండో శెత్తిరి దిక్కు సూడవ ట్టిండు కొమురయ్య. గా శెత్తిరి ఇస్వనాథం గోరిది. గాయినె సర్పంచు. దొర తాన గుమాత్తా.

‘మాట్లాడవేందిరా? గట్ల బెల్లం గొట్టిన రాయోలె జూస్తవ్. నువు గడీలకు మొకం సూపెట్టి ఎన్ని దినాలైంది?’

‘యాడ దొరా. కాల్మొక్త. దినాం వానేనాయే. కొంపల అందరు రోగాల్తోని వండుకున్నరు. పొయ్యిల పిల్లి లెవ్వక మూడు దినాలాయే’

‘నీకు పెయ్యి బల్సిందిరా. గీడ నువ్ దొరలెక్క కూసుంటె గాడ పనులెవరు జేత్తరనుకున్నవ్. నీ పెండ్లాం మిండెడా?’

దొర లోపలున్న రాచ్చసుడు నిద్ర లేశిండు. గా కోపాన్కి ఇంకింత వణికి పోయిండు కొమురయ్య.

‘చెమించుర్ని దొరా. దండం బెడ్త. నీ చెప్పులు మోస్త. పిడికెడు మెతుకులు గతి లేక ఇంట్ల అందరు పీనుగుల్లెక్క అయ్యింద్రు. నాకు సూతెం శాతగాక కాలు చెయ్యి ఆడుత లేదు’

‘సువ్వర్ ముండా కొడుకా’ దొర రంకెలు వెట్టిండు.

'నీల్గుడెక్కువైంది బే నీకు. ఏందో పాతాలు చెప్తన్నవ్. నీతోని జరూరు పనివడ్డది నడువ్‌రా బేవకూఫ్'

'ఏం పని బాంచెను'

'గా బస్తి దాక ఓయి రావాలె. మా శిన్న దొర్సానీ అల్లుడూ ఎట్లున్నరో దెల్సుకోని నాకు వార్తందించాలే'

'బస్తీ దాకనా? గీ పొద్దా దొరా?' కొమురయ్యకు బయంతోని మాట సరింగ ఇవుతలికి రాలే.

'అవ్రా. గీ పొద్దే. ఎల్లెంబోయి శిన్న దొర్సాని జూసి మంచి శెడ్డ దెల్సుక రాపో. మానేరుకు వరుదొచ్చిందట. బస్తీల ఇండ్లల్లకు నీళ్లొచ్చినయట. వొందుర్లున్న ఇండ్లన్ని మునిగిపోయినయట. జెప్పున నడువ్. నా బిడ్డ, నా అల్లుడెట్లున్నరో దెలిస్తేగాని నా మనసు కుదుటవడది'

'గీ పొద్దు పోలేను దొరా. అంత వొరుదనే. శీకటి సూతెం పడ్డది. ఏరు దాటుడు నాతోని అయితాది?'

'ఏందిరా లంజకొడుక కావురం బట్టినవా. ఏరు దాటుడు నాతోని అయిదాని నఖరాలు జేస్తున్నవేంది? ఏరు దాటకుంటె గా ఏట్లెనే పడి సావు. జల్దిన పొయ్యొస్తవా. లేక సంపి పాతరెయ్యిమంటవా?'

కొమురయ్యకు కండ్లల్ల నీళ్లు దిరగినయ్.

దొర దిక్కు దీనంగా జూసిండు.

'దొరా. గిప్పుడు పోలేను కాల్మొక్త. ఏరుదాటుడు నాతో గాదు. రేప్పొద్దుగాల వోత. అన్ని సంగతులు దెల్సుకొత్త' అన్నడు బత్తిమాలుకుంట.

దొర కోపంతోని శిగమూగిపోయిండు. ఓ అడుగు ముందటికేసి చేతులున్న వంకి కట్టెతోని జనకొద్ది గొట్టిండు. గా దెబ్బలన్ని కొమురయ్య ఎనుపగోద తీర్గ బరాయించిండు. నోరు దెర్సి 'అయ్యా.. అవ్వా' అనే వోపిక సూతెం లేదు.

కొట్టి కొట్టి యాష్టికొచ్చిన దొర ఆగిండు.

'కావురం బట్టినావ్‌రా బోసిడికే. కండ్లు నెత్తికెక్కినయా? నా మాటకెదురు జెప్తన్నవ్‌లే. ఎవలనుకుంటన్నవ్‌రా ముండకొడుక మమ్మల్ని. తెల్లారేపాటికి నీ గుడిసె నేలమట్టం జేయిస్త. నీ పెండ్లాం, పోరగాండ్లనందర్ని ఏట్లె గలిపిస్త ఏందనుకున్నవో. కుక్కసావు సావాలే బాడుకావ్ నువ్వు'

'దొరా.. బాంచెను. నీ కాళ్లు మొక్త. నీ చెప్పులు మోస్త. గంత పని జెయ్యకుర్రి'

'నడువ్ మరి. బస్తిదాక పోయిరా పో'

'దొరా బంచెను'

'తోలు దీస్త సువ్వర్ కే. నడువ్' వంకి కట్టె కొసతోని కొమురయ్య డొక్కల పోటు పొడుసుకుంట అన్నడు దొర.

'దొరా'

'పండ్లిరుగ్గొడుత మారు మాట్లాడ్తే. తెల్లారే పాటికి నా బిడ్డ వార్త నాకందాలె. నడువ్'

గా మాటన్నంక దొర ఎనుకకు మల్లిండు. ఇస్వనాథం కూడా దొర ఎనుక నడువ బట్టిండు. సూత్తుండగానే శెత్తిర్లు రెండు మెల్లంగ దూరమైనయ్.

కొమురయ్య రాతి బొమ్మ తీర్గ నిలవడి పోయిండు.

సుట్టూత శీకటి. నీళ్ల సప్పుడు తప్ప ఇంకోటి ఇన్పిస్త లేదు. కొమురయ్య నడుస్తుండు. అడుగు దీసి అడుగెయ్యలనంటె ఒక్కొక్క కొండెక్కుతున్నట్టుగుంది.

అయినా అతడు నడుస్తనే ఉన్నడు. కాళ్లతోని నీళ్లను శీరుకుంట నడుస్తండు. సర్కారు ముల్లు తీర్గ గుచ్చుతుంది చలి. అడ్డకొవ్వల మాంకాలమ్మ గుడికాడ ఏరుదాటే ధయిర్యం జెయ్యలేక పోయిండు కొమురయ్య. గట్లనే దయ్యం నీడ తీర్గ కదులుకుంట సుట్టు దిరిగి అయిదు మైళ్లు నడిసి వంతెన మీదికొచ్చిండు.

గా శీకట్ల వొంతెన పదవి లేని నాయకుని తీర్గ డీలవడ్డట్టున్నది. నీళ్లు వంతెన మించి పొర్లిపొర్లి ఉరుకుతున్నయ్. దూరంగా ఇన్పిచ్చి ఇన్పిచ్చనట్టు ఏదో హోరు కొమురయ్య శెవుల్ని తాకుతుంది.

కొమురయ్య బలిమిటికి అడుగులేస్తండు.

ఉన్నట్టుగుండి హోరు పెద్దగైంది.

నీళ్ల సప్పుడు కొమురయ్య శెవుల్ని కమ్ముకున్నది.

కొమురయ్య తల దిప్పి జూసిండు... గంతనే–

అతని కండ్లు రెప్పలు గొట్టుడు మర్చిపోయినయ్. గుండెను మంచుల ముంచినట్టయింది. ఎదురుంగ అది ఏరో.. సముద్రమో జెర సేపు సమజ్‌గాలే. గా జెరంతట్లనే పిట్టగూడు తీర్గ కూలిపోయింది వొంతెన.

తెల్లారింది.

కొమురయ్య జాడలేదు.

ఇంటి దివాన్ కాండ్ల దొర శిందులు దొక్కినట్టు అటిటు దిరిగిండు. గాయినెకు మనసు మనసుల లేదు. బిడ్డ సంగతేమైందోనన్న ఆరాటం కొమురయ్య మీన కోపాన్ని రెండింతలు చేసింది.

'కొమురడింక రాలేదేంది? గాడ్డి కొడుకు. గంతగనం జెప్పినా పని ఇన్పిచ్చు కున్నట్టు లేదు. గా బాడుకవ్ కాపురం ఎట్ల దియ్యాల్లో గట్లనే దీస్త. లంజ కొడుకు ఇల్లు పీనుగుల పెంట గావాలె' పండ్లు పటపట కొరికిండు.

గప్పుడు దొర దిమాక్‌ల కమురయ్య, కొమురయ్య కుటుంబం రేపు తన కోపాన్ని ఎట్ల కాలి బూడిదైతరో కనపడింది తప్ప ఊరికి దూరంగా తుమ్మ తుప్పల్ల పీనుగై శిక్కుకున్న కొమురయ్య కన్పియ్యలే.



నాగిరెడ్డి, అబ్బిరెడ్డి, నారమ్మా అందరూ ఒకరి మొగం ఒకరు నగుతూ సూసుకున్నారు.

మోడం కూడా నగుతాన్నెట్టు తలుక్కున మెర్సింది.

ఎట్టా ఉండారని వాళ్లను పలికరిచ్చినట్టు మెరుపు ఎంటనే బడబడా ఉరిమింది.

ఆ ఉరుము వింటానే అందరికీ లోపల్నించీ సంతోషం పైకి తన్నుకొచ్చింది. వాళ్ల సంతోసం మాదిరే మట్టివాసన గమ్మున పైకెగజిమ్మింది.

వీదుల్లో మోరలు పైకెత్తి పీల్చుకుంటున్న కుక్కలు, సెట్లల్లో రెక్కలు విదిలిచ్చు కొంటున్న పిట్టలు.. వూరూ, ఏరూ ఎండిపోతున్న పైరు అన్నీ 'రా.. రా.. ర్రా.. ర్రా'.. అని వానను పిలుస్తున్నట్టున్నాయి.


ఇప్పుటికి ఏటిని ముంచేసింది వాన.

'ఏరు కనపల్లా.. ఏరు కనపల్లా' అని ఎగిరెగిరి అరుస్తాంది ఎంగటమ్మ.

నిజానికి ఇప్పుడు వానొచ్చినా వాళ్ల పూరాగా బాగుపడేదేం లేదు. ఇప్పటికే మూడు బాగాలు పైరు ఎండిపాయె. అయితే ఇప్పుడొచ్చినా మేత, విత్తనాల కర్సు తీరతాది. దీని కంటే ముక్కెం వానెప్పుడొచ్చినా వానే.

వాన రాక పడిన కట్టాలే తప్ప వానొచ్చి పడిన కట్టాలట్టే తెల్దు వాళ్లకు.

**– పి. రామకృష్ణ** (వానొచ్చె– పెన్నేటి కతలు నుంచి)



# పేగు కాలిన వాసన

## ఎ.ఎస్. జగన్నాథశర్మ

● రచనా కాలం: 1990

**జగన్నాథ శర్మ:** తన కథల్లో వానను విస్తృతంగా కథనం చేసిన కథకుడు. కథతో పాటు వాతావరణపు తాకిడి కూడా పాఠకుడికి తెలిసేలా ఎరుక పడతారు. పూర్తి పేరు అయల సోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథ శర్మ. స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం. దాదాపు 500కు పైగా కథలు రాశారు. వృత్తిరీత్యా జర్నలిస్టు. హైదరాబాదులో ఈ టీవీ తదితర సంస్థలలో పని చేసి ప్రస్తుతం నవ్య వీక్లీ సంపాదకునిగా ఉన్నారు. 'నూరేళ్ల కథకు నీరాజనం' శీర్షిక నిర్వహించి పుస్తకం వెలువరించారు. వయసు 61 సంవత్సరాలు.

జల్లు కురిసి వెలిసింది. వాతావరణమంతా తడితడిగా చలిచలిగా వుంది. ఈ క్షణమో మరుక్షణమో మళ్లీ చినుకు పుంజుకునేట్టుంది. పదిన్నరయినా పాసింజరు బండి రాలేదు. ఆకలిగా వుంది. అసహనంగా వుంది. దీపస్తంభాన్ని అంటి పెట్టుకుని వున్న వందలాది రెక్కల పురుగులు నేల మీదికి దూసుకొచ్చి ఆత్మత్యాగాలు చేసుకుంటుంటే జాలిగా వుంది.

తురాయిచెట్టు నీడన నిల్చుని వున్నాను.

గాలి కెరటం కదిలినప్పుడల్లా కొమ్మలు కలవరపడుతున్నాయి.

అదుముకున్న నీటిని ఆకుల వేళ్ల సందుల నుండీ జార విడుచుకుంటున్నాయి.

శిరసున చినుకులు చిట్లుతున్నాయి. శరీరమంతా జలదరిస్తోంది.

పట్టాలకి అటుగా నిలిచిన జట్కా చీకటి సముద్రంలో చిరునావలా వుంది. గుర్రం తల విదిలిచ్చినప్పుడల్లా దాని మెడనున్న మువ్వలపేరు కదిలి శబ్ద తరంగాలు చెవులను స్పృశించి చెదిరిపోతున్నాయి.

సరదాపడి కొన్న మువ్వలవి. తొలిరోజుల్లో సంగీత స్వరాలను విన్పించేవి. ఇప్పుడు ఉత్త ధ్వనిని మాత్రమే విన్పించగలుగుతున్నాయి. చేతినున్న హరికెన్ లాంతరు మీద చినుకుపడి చిలికిపోయింది. పురుగుల బాధ పడలేక చిమ్నీ చుట్టూ ఆకు చుట్టానేమో వేడికి మరణయాతనతో వెల్లకిలా విరుచుకుని లుమ్మలు చుట్టుకు పోతోందది.

రైలొస్తున్నట్టుంది. పట్టాలు పలుకుతున్నాయి. చెట్టునీడను వదిలి వచ్చాను.

కనుచూపు మేర కాంతిపుంజం కన్పించింది. వచ్చి నిలిచిన బండిలో నుంచి, ఆ ఆరుగురూ కిరాణాకొట్టు శెట్టి, మేష్ట్రమ్మీ, పోలీసు, జబ్బు మనిషి గురుమూర్తి, కాలేజీ కుర్రోడు, టైపు నేర్చుకుంటోన్న అమ్మాయీ దిగారు. గుంపుగా చేరి, నా కోసం వెతుక్కొంటున్నారు.

ఇళ్లకి చేరాలని వాళ్లకెంత ఆత్రంగా వుందో నేనూ అంతగానే ఆత్రపడు తున్నాను. ఆ దేహాలను ఆయా ప్రాంతాల్లో జారవిడిచేసి చేతులు దులుపుకో వాలని వుంది.

వాళ్లు జట్కా దగ్గరికి దౌడు తీశారు. వాళ్ల వెనగ్గా నడిచేన్నేను.

సన్నగా వర్షం మొదలయింది.

అంతా ఒకరి మీద ఒకరుగా జట్కా మధ్యలో ముడుచుక్కూర్చున్నారు. లాంతర్ని వేలాడదీసి నేనూ జట్కానెక్కాను. గుర్రం నడకలు పోయింది. వర్షం పుంజుకుంది.

ఊరికి దూరంగా నాలుగు మైళ్లివతల వుందీ రైల్వే స్టేషన్. స్టేషన్ వరకు ఊరు ఎదగలేదు. ఎదిగే అవకాశమూ లేదు. పది, పన్నెండిళ్లతో చిన్న చిన్న గ్రామాలుగా వుందీ ప్రదేశం. కొండ ప్రాంతం కావడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. పట్నం నుండి ఒకటి రెండు బస్సులు వున్నాయిక్కడికి. అయితే వర్షాకాలంలో బస్సుల జాడ కనిపించదు. మైదానాల వరకూ పరుగెత్తుకొచ్చిన బస్సులు, కొండను చూసి గుండెలు చరచుకుని వెనుతిరిగి పోతాయి. ఫలితంగా నా వంటి జట్కా వాలాలు బతకగలుగుతున్నారు.

గత పదేళ్లుగా ఈ రోడ్డుని చూస్తున్నాన్నేను. దీంతో ముచ్చట్లాడుతున్నాను. మురిపాలు పోతున్నాను. నాకు బాగా పరిచయమున్న రోడ్డిది! ఎక్కడ ఎత్తులున్నది పల్లాలున్నదీ గుంటలున్నదీ అన్నీ కంఠోపాఠం. జట్కా నడపడంలో మెలకువలు చూపించనవసరం లేదు. అప్రయత్నంగా అసంకల్పితంగా బండి సజావుగా సాగిపోగలుగుతుంది. నాకంటే నా గుర్రానికి ఈ రోడ్డంతా మరీ సుపరిచితం. చిన్ననాటి స్నేహితులివి!

వొలిపిరి కొడుతోంది. గాలివాటుకి జల్లు జట్కాలోనికి తొంగిచూస్తోంది. ముందుక్కూర్చున్న మేష్ట్రమ్మ టైపు నేర్చుకుంటోన్న అమ్మాయీ తడిసినట్లున్నారు.

'వెధవ్వాన' అన్నది మేష్ట్రమ్మ.

'చలి చలి' అన్నది అమ్మాయి.

'ఇటు రారాదా' అన్నాడు మేష్ట్రమ్మను ఉద్దేశించి కిరాణాకొట్టు శెట్టి. పోలీసు పగలబడి నవ్వాడు. గురుమూర్తి దగ్గాడు. కుర్రాడెందుకో మవునంగా వున్నాడు.

ఏడు గంటలకు రావాల్సిన పాసింజరు బండి మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఈ ఆలస్యం, ఈ చీకటి, ఈ వర్షం శెట్టిని, పోలీసునీ సరదాలకు సరసాలకూ ఉసిగొలుపుతోంటే పాపం ఆ మేష్ట్రమ్మని, అమ్మాయిని, గురుమూర్తినీ బాధిస్తున్నట్టున్నాయి. కుర్రాడి గుండె గుబులు నేనెరుగను! నా విషాద నేపథ్యం వీళ్లెరుగరు!

ఉన్న ఊరు నుండి స్టేషన్‌కి, స్టేషన్ నుండి వున్న ఊరికీ జట్కాలో దిగవిడిచినందుగ్గాను వీళ్లంతా నెలసరి కిరాయిగా యాభయి రూపాయల్ని ఒక్కక్కరూ చెల్లిస్తారు. పైపై బేరాలు పోను నెల తిరిగే సరికి చేతిలో రెండు వందల రూపాయలు మాత్రమే పడతాయి. శెట్టి, పోలీసూ పైసా ఇవ్వరు. పోలీసు బాబుని కిరాయి అడిగే ధైర్యం లేదు.  శెట్టి కిరాయిని వడ్డీ కింద జమచేసుకుంటాడు.

రెండేళ్లక్రితం జట్కా బోల్తాపడింది. చక్రాలు విరిగిపోయాయి. గుర్రం కుంటి దయింది. అప్పుడు శెట్టిని ఆశ్రయిస్తే అయిదు వందల రూపాయిలు అప్పిచ్చాడు. అప్పిచ్చి ఆనాడాదుకుని నేటికీ అసలు చెల్లించ లేని నా జీవితమ్మీద స్వారీ చేస్తున్నాడు.

పట్నం ఠాణాలో పోలీసు బాబు పని చేస్తాడు. పక్కనే శెట్టి కిరాయి దుకాణం. ఫర్లాంగు దూరంలో స్కూల్లో మేష్ట్రమ్మ, కాలేజీలో కుర్రాడు, ఇన్‌స్టిట్యూట్‌లో టైపు నేర్చుకునే అమ్మాయి, ఆస్పత్రిలో రోజూ పరీక్ష చేసుకునే గురుమూర్తీ వీళ్లంతా ప్రతిరోజూ పట్నాన్ని పలకరించి, పరామర్శించి రాక తప్పదు. సెలవు దినాల్లో ఒకరిద్దరు తక్కువయినా మిగిలిన వాళ్ల కోసం నా వృత్తికి సెలవంటూ దొరకదు.

బురద గుంటలో చక్రం పడింది. జట్కా తూలి పడి నిలిచింది. గుర్రం, శక్తినంతా కూడదీసుకుని లాగుతోన్నా ఫలితం లేదు. తప్పదనిపించింది. కుర్రాణ్ణి, పోలీసుని, శెట్టినీ జట్కాను నెట్టేందుకు కిందికి దిగమన్నాను. నలుగురమూ సాయం పడితేనేగాని జట్కా పైకి లేవదు.

ఇది మామూలే! వర్షాకాలంలో దారిలో ఇటువంటి అడ్డంకులు తప్పనిసర వుతాయి.

‘కావాలంటే అప్పిస్తాను! బండికి మోటారు పెట్టించరాదురా’ అన్నాడు శెట్టి.

‘అవున్నిజం’ అన్నాడు పోలీసు. ఆ మాటలకి బతుకు భయం కలిగిందేమో! గుర్రం వణికింది. ఒక్కసారిగా శరీరాన్ని విదిల్చింది. జట్కా ఓ అడుగు ముందుకి నడిచి, నిలిచింది.

చేతినంటిన మట్టిని జట్కా అద్దాలకు పూసి వాళ్లు జట్కా నెక్కితే మట్టి వాసనను వదల్చుకోదలచక నేనదే చేతుల్తో కళ్లాన్ని అందుకున్నాను. లేచింది మొదలు పడుకునే వరకూ ఇదే మట్టిలో పరుగెడతాను. దీన్ని కాదనుకునేవాణ్ణికాదు. కాదనుకుంటే పుట్టగతులుండవు.

‘దెయ్యాల వేళక్కాని ఇళ్లకి చేరమేమో’ అన్నాడు శెట్టి.

‘మీరన్నది నిజం! పన్నెండు గ్యారంటీ’ అన్నాడు పోలీసు.

‘మరయితే రేపు మేష్టమ్మ స్కూలుకి రాదు’ అన్నాడు శెట్టి.

‘ఆవిడ సంగతేమోగాని గురుమూర్తి మాత్రం రేపు ఆసుపత్రికి రాడు’ అన్నాడు పోలీసు. ఆ మాటకి కితకితలు పెట్టినట్టుగా నవ్వాడు శెట్టి.

గురుమూర్తి చావు మీద సరస సంభాషణ సాగుతోంది. వస్తోన్న దగ్గునణచు కుని ఉక్కిరి బిక్కిరవుతున్నాడు గురుమూర్తి. తన ప్రాణంతో పరాచికాలాడడాన్ని అతను భరించలేకున్నాడు.

గాలివాటు తగ్గింది. వర్షం నిలిచి కురుస్తోంది. కాలవలు కట్టి, నీరు రొదగా ప్రవహిస్తోంది.

ఈసరికి గుడిసె నిండుగా నీరు నిలిచి వుండి వుంటుంది. గిన్నెలు, బట్టలూ తేలిపోయుంటాయి. అన్నం గిన్నె గిరికీలు కొడుతూ వుంటుంది. పల్లంలో వున్న గుడిసె మీద తల్లి గంగకి ఎల్లల్లేని ప్రేమ మరి!

ఆకలిని అణగార్చుకున్నా, అలుపును మరచి పోయేందుకు, గాఢంగా నిద్రించేందుకక్కడ అవకాశం లేదు. ఏటవాలుగా నిలిచిన జట్కాలోనే, జారుడు బల్ల మీది వాటంలా విశ్రాంతిని ఆశించాలి.

అత్తమ్మ వుంటే గుడిసెలోని నీటిని తోడి పారేసేది. ఏ వేళనయినా మంచు ముద్దలా పిడికెడు అన్నాన్ని కంచంలో ఉంచేది. మామయ్య చనిపోవడంతో అత్తమ్మ లేచిపోయింది. పట్టెడన్నం కోసం, శరీరాన్ని ఎర జూపుతూ పిచ్చితల్లి

లేచిపోవాల్సి వచ్చింది. ఎవర్ని అల్లుకుని, ఎక్కడ ఆకలిని తీర్చుకొంటోందో ఏమో!

రాయి మీంచి చక్రం నడిచినట్టుంది. జట్కా తూలిపడి నిలదొక్కుకుంది. అంతా ఒక్కసారిగా అరిచి సద్దుమణిగారు.

'కళ్లు మూసుకున్నావేట్రా బాబూ' అడిగాడు శెట్టి.

'లేదు! రోడ్డు మూసుకుపోయింది' అన్నాను జవాబుగా.

'జాగ్రత్తరా బాబు! రేపు మినిస్టరుగారొస్తున్నారు. బందోబస్తుకెళ్లాలి' అన్నాడు పోలీసు.

అతనికి బదులు పలుకలేదు. అసలా పోలీసుతో మాట్లాడాలంటేనే అసహ్యం! అతను చనిపోతే బాగుణ్ణనుకుంటాను. పట్నంలో ఏదో ఒక దొమ్మీలో ఎవరో ఒకరు పోలీసుని చంపినట్టు వార్త రాకూడదూ? అన్పిస్తుంది. అతని మీద ఎందుకనో అలవిమాలిన కసి!

గురుమూర్తి పెద్దగా ఆయాసపడుతున్నాడు. బుసలు కొడుతున్నాడు. చచ్చిపోతాడేమో! అతగాడి శవాన్ని ఇంటికి అప్పజెబుతాననిపించింది.

శెట్టిని హత్య చేయాలని వుంది. మేష్ట్రమ్మను తిట్టి పోయాలని వుంది. టైపు నేర్చుకుంటోన్న అమ్మాయిని తన్ని ఇంట్లో కూర్చోబెట్టాలని వుంది. కాలేజీ కుర్రాడి మీద కోపగించుకోవాలని వుంది. ఎందుకు? ఎందుకంటే జవాబు లేదు. ఈ ముఖాల్ని చూస్చూసి వీటితో విసిగిపోయుంటాను. బతుకులో కొత్తదనం లేదనిపించడం కూడా ఈ ఆవేశానికి, అసహనానికీ కారణం కావచ్చును.

మొహం మొత్తేటట్టు జీవించడం ఇష్టం లేకపోతోంది. ఏదో కావాలనిపిస్తోంది. ఈ అనుభవం నాకు కొత్తది కాదు. ఈ బాధా సరికొత్తది కాదు. బుద్ధెరిగిన నాటి నుంచీ నేనిలాగే ఆలోచనలు పోతున్నాను.

అప్పుడూ అంతే! ఇప్పుడూ ఇంతే!

అమ్మను ఆట పట్టించిన రోజుల్ని, నాన్నతో దోబూచులాడిన వేళల్ని, అక్కను గిల్లి అల్లరి చేసిన సంఘటనల్నీ తలచుకుంటుంటే, ఈనాడవి, అందంగా వుండి అందరాని అనుభూతులనిపించినా ఒకనాడవి రోత పుట్టించాయి. భయాన్ని కలిగించాయి. పరిస్థితుల నుండి, పల్లెపట్టు నుండి పారిపోయేటట్లు చేశాయి.

నా బాల్యం నన్ను నానారకాలుగా హింసించింది. నన్ను ముక్కముక్కలు చేసింది. నన్నెదగనీయ లేదది. కళ్లకి కలలు ముసుగేసి నన్ను నా నుండి కను మరుగుజేసింది.

నాన్న కర్రమిల్లులో పని చేసేవాడు. 'కటర్'గా వృత్తిని నిర్వహించేవాడు. నిక్కరు, బనియనూ ధరించి, తోలు పట్టానొకదాన్ని గుండెల మీద కవచంలా వుంచు కుని పెద్ద పెద్ద దుంగల్ని చీల్చి చెండాడేవాడు.

కర్రను కోసే వేళ రంపపు ధ్వని 'అమ్మకి దండం! నాన్నకి గండం' అని వల్లె వేసేది. మనసులో ఆ మాటల్ని ఉచ్చరిస్తే చాలు! పాటయ్యేదది. ఆ పాటలతో దుంగల మీంచి దూకుతూ ఆటలాడుకునేవాణ్ణి. జారిపోతున్న నిక్కర్ని ఎగదోసు కుంటూ, జుబ్బాను సర్దుకొంటూ జులాయిగా వుండేవాణ్ణి.

అమ్మ కర్రపొట్టును గోనెసంచుల్లో నింపుతుండేది. సంచిలో పొట్టును కుక్కి కుక్కి నింపడంలో నా సహాయాన్ని అర్థించేది.

'ఆ గెంతులేవో ఈ గోనెసంచి మీద గెంత రాదురా' అనేది. బ్రతిమలాడేది. అందక పరుగెత్తే నన్ను అంది పుచ్చుకుని, పొట్టుగుట్ట మీదకి లాక్కొచ్చేది. జల్లులా కురుస్తోన్న పొట్టులో పొర్లి పొర్లి, మనిషంతా పొట్టుమయమయిన తర్వాత 'పగటి వేషగాడిలా వున్నావు' అన్న కితాబు లభిస్తే అమ్మనప్పుడు ఆదుకునేవాణ్ణి. బుగ్గల్ని పొంగించి హనుమంతుణ్ణనుకుని పొట్టు బస్తాపై చిందులేసేవాణ్ణి. అలా నింపిన పొట్టు బస్తాకి అమ్మకి పావలా లభించేది. అందుకోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె నర్తించడాన్ని చూసేవాణ్ణి. బడివేళ వరకు అమ్మకి అండగా వుండి, ఆ తర్వాత నేను బడికి పయనమయితే అమ్మొక్కర్తే ఆకాశాన్ని అందుకోవా లన్నట్టుగా ఎగిరి గంతులేసేది. తోడుగా అక్కను మాత్రం రమ్మనమనేది కాదు. అక్క గంతులేయడాన్ని అక్కడంతా ఆత్రంగా చూడడాన్ని గమనించి నాన్న వద్దన్నాడు.

అక్క దుంగల మీది బెరళ్లను తీసి తట్టలో వేసుకునేది. మంచుకి, వర్షానికీ తడిసిన దుంగల మీది బెరళ్లను తీయడంలో అక్క ఎంతగానో శ్రమించేది. గోళ్లలో పేళ్లు గుచ్చుకున్నా ఖాతరు చేసేది కాదు. ఒక్కొక్కప్పుడు బెరళ్ల నడుమ జెర్రలను, తేళ్లనూ చూసి బెంబేలుపడి రక్షణగా నన్ను కేకేసేది. చీమల్ని చంపినట్టుగా నేను వాటిని చంపుతోంటే చేయి జాచి నన్ను దగ్గరగా తీసుకునేదక్క. మెచ్చుకోలుగా నా జుత్తు నిమిరేది. తోడుంటానని బడికి వెళ్లనని మొరాయిస్తే 'వెళ్లి రారా' అని

ప్రాధేయపడేది.

ఇంట్లో ఎక్కాలు పద్యాలూ, పెద్దగొంతుతో చదువుతోంటే, అమ్మ పొంగి పోయేది. 'ఆరు పావలాలు ఎంతరా' అనడి 'రూపాయిన్నర' అని చెబితే నాటి తన సంపాదనను చూసి చిన్నబుచ్చుకునేది. 'దేనికి సరిపోతుందిది' అని దు:ఖించేది. 'వళ్లంతా పచ్చి పుండుగా వుంది! కడుపు నిండా గంజి తాగి కునుకు తీద్దామంటే నా సంపాదన నాకే చాలదు' అని నెత్తి కొట్టుకునేది. 'ఇందులో పిల్లలకేం పెడతాను! పెనిమిటికేం పెడతాను' అని శోకించేది.

అక్క సంపాదనంతా అణాపైసల్లో వుండేది. నాన్న కష్టం ఆయన కల్లు చుక్కలకి పోయేది.

తాగొచ్చిన నాన్నతో అమ్మ తగవులాడేది. 'ఇలాగయితే ఎలాగయ్యా' అని ఆయన్ని నిలదీసేది. అమ్మ ప్రశ్నకి, నాన్నకి జవాబు తెలియదుగాని జబర్దస్తీ తెలుసు! ఫలితంగా అమ్మను చితక తన్నేవాడాయన.

'మళ్లీ నోరెత్తితే నరికి పోగులు పెడతాను' అనే వాడు. నన్ను దగ్గరగా తీసుకుని హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను పద్యాలను చదివించుకుని చల్లబడే వాడు.

రంపానికి దుంగనందించడంలో ఓసారి ప్రమాదవశాత్తూ నాన్న చేతివేలు చీలిపోయింది. కుడిచేతి బొటనవేలు విరిగిపోయింది. చేపలా కింద పడి పొట్టు పాలయిందది. 'గొల్లు'మన్నారంతా. స్రవిస్తోన్న నాన్న రక్తాన్ని చూసి తల్లిడిల్లి పోయారు. మిల్లు యజమానికి కేకేసి వివరించారు.

'ఎక్కడ చూస్తున్నావురా' అని నాన్నని కోపగించుకున్నాడాయన. యాభయి రూపాయిల నోటిచ్చాడు.

'ఆస్పత్రిలో చావు' అన్నాడు. పాతిక రూపాయిల మందులు తిని, నాన్న చేయి రక్తాన్ని దిగమింగుకుంటే మిగిలిన డబ్బుతో బాధను దిగమింగుకునేందుకు నాన్న కల్లుపాకని ఆశ్రయించాడు. వారంరోజుల పాటు పని లోనికి పోలేదాయన. కుడిచేతిని కళ్ల ముందుంచుకుని విలపించాడు. యాజమాని మళ్లీ పనిలోనికి తీసుకోడేమోనని దిగులుచెందాడు. అయితే నాన్నని ఓదారుస్తూ

'నాకు పని ముఖ్యంరా! నీ వేలు కాదు' అని యజమాని అనడంతో నాన్న ఆనందానికి ఆనాడు పట్టపగ్గాలు లేకపోయాయి. బొటనవేలు మొలకెత్తినంతగా సంతోషించాడు. 'మీరు దేవుడు బాబూ' అన్నాడు. యజమానికి పడి పడి

నమస్కరించాడు నాలుగు వేళ్లూ నోటికి పోనున్నాయన్న ధీమాతో రెట్టించి పనిచేశాడు.

నాటి నుంచే అమ్మ దగ్గడం ప్రారంభించింది. దగ్గి దగ్గి, గుండెలు తోడేసినట్టు గిలగిలా కొట్టుకునేది. కెళ్లలు కెళ్లలుగా కఫాన్ని కక్కుతో కుళ్లిపోయేది. రోజుకి ఆరేడు బస్తాల్లో పొట్టును కూరగలిగే అమ్మ, రెండు మూడు బస్తాల్లో మాత్రమే కూరి, డీలా చెందేది. చేతిలో రూపాయి కూడా పడని తన శ్రమని చెడ తిట్టుకునేది. బడికి పోనని బస్తాల్లో పొట్టు కూరుతానని మొండికేసే నన్ను తిట్టి, కొట్టి బడికి సాగనంపేది.

బడి వదిలిన తర్వాత మిల్లులో దుంగల మీద కూర్చొని పాఠాల్ని బట్టీ పెట్టేవాణ్ణి. అక్కడక్కడే అక్క తచ్చాడుతూ వుండేది.

అక్కనేదో పురుగు కరిచి దుంగల్లోనికి పారిపోయిందో రోజు! పెద్దగా కేకేసి అక్క నిలువునా కూలిపోయిందానాడు. మాట్లాడదు. మెలికలు తిరిగిపోతోంది. కరిచింది ఏమిటన్నదీ అంతు చిక్కలేదు. పాము కాటేసిందేమోనని అంతా భయపడ్డాం. కాసేపటికి తేరుకుని అక్క కాదన్నది. ఆ పురుగు కందిరీగలా వున్నదన్నది. తనని కరిచి దుంగ పగులులోనికి జారిపోయిందన్నది. కసిరేగి పగులులో కళ్లుంచి తీక్షణంగా చూశాన్నేను. ఏదీ కన్పించలేదు. పగులులో వేళ్లు జొనిపి దుంగంబడి నడిచాను. పురుగు దొరికితే పిసికి పారేద్దామన్నంత కక్ష రేగింది.

నోటు పుస్తకాల్లేక నోట్సు రాసుకునేవాణ్ణి కాదు. ఫలితంగా మేష్టారితో చింత బరికెతో దెబ్బలు తినాల్సి వచ్చేది. రక్తం చిప్పిల్లిన చేతుల్ని ఉమ్మి తడిజేసుకుని వూదుకునేవాణ్ణి తప్ప ఆ ఊసెవరికీ తెలియనిచ్చేవాణ్ణి కాదు. అయితే నాన్నకి సంగతి తెలిసింది. తెలిసి యజమాని ఇచ్చే యాభయి రూపాయిల కోసం కుడిచేతి చూపుడువేలుని పోగొట్టుకున్నాడు. రంపానికి ఆ వేలుని అంకితం చేశాడు.

దుంగల మీది పుట్టగొడుగుల్ని తొలగిస్తో కూర్చొన్న నా దగ్గరగా వచ్చి చేతిలో పదినోటు నుంచాడు. 'వెళ్లి పుస్తకాలు కొనుక్కో' అన్నాడు.

ఆ రాత్రి 'ఎంత పని చేశావయ్యా' అని తాగొచ్చిన నాన్నని అమ్మ నిలదీస్తే 'నా కోసం నేనీ పని చేయలేదే! నన్ను నమ్ము' అన్నాడు.

'చదువుకుని వాణ్ణయినా బాగుపడనీ' అన్నాడు. నన్ను కాటిసీను పద్యాల్ని విన్పించమన్నాడు. ఎన్నడూ లేనిది ఆనాడెందుకో ఆ పద్యాల్ని రాగయుక్తంగా నాన్నకి విన్పించాలనిపించింది.

ఏమరపాటునున్న అక్కను గిల్లి, పురుగని అల్లరి చేసినా దొరికితే కాటిసీను పద్యాల్ని విన్పించమంటాడని పెరట్లో చెట్ల మీదా, గుబురుల వెనుకా దాగి నాన్నతో దోబూచులాడినా అదంతా నాకు నాటకీయంగానే వుండేది. సహజమనిపించేది కాదు.

అమ్మ దగ్గు విషాదం! నాన్న త్యాగం విషాదం! అక్క చితుకులేరుకోడం విషాదం! విషాదాల్లో సరదాలాడడం కృత్రిమంగాక మరేమిటి?

పదోతరగతి పాసయ్యాను. నన్ను చూసి నా వాళ్లంతా సంబరపడ్డారు. మిల్లు యజమాని దగ్గరకు తీసుకువెళ్లి నేను పదోతరగతి పాసయ్యానన్నది చెప్పాడు నాన్న. 'పై చదువులు చదివిస్తావా' అని అడిగిన యాజమానితో

'ఈ చదువుకే రెక్కలు ముక్కలయ్యాయి' అనన్నాడు నాన్న.

'చదివిన చదువు చాలు! దయతలచి తమరు చిన్న నౌకరీ కల్పించండి. వాడి పొట్టకి వాడు సంపాదించుకుంటే అదే పదివేలు' అన్నది అమ్మ. కాదనలేదు యజమాని. కర్రల కొలతలు చూసేపని నాకప్పగించాడు. నెలకి యాభై రూపాయిలు జీతమని చెప్పాడు.

అయితే ఆ మిల్లులో నౌకరీ నాకిష్టం లేకపోయింది. రాకాసిలోయలో నేను జీవించలేననిపించింది.

దగ్గు రూపేణా అమ్మను అణగారుస్తోన్న జబ్బు, అక్కని కాటేసిన విషప్పురుగు, నాన్న వేళ్లని కొరికేస్తోన్న కోరలకత్తి  అన్నీ ఆ మిల్లు యజమానని నాకు తెలిసీ తెలియడంతో ఒక్కక్షణం కూడా అక్కడ నిలువలేననిపించింది. వాడికి దూరంగా పారిపోవాలనుకున్నాను. పరుగెత్తాను.

జట్కావాలా  వొకతన్ని ఆదరవు చేసుకుని నాన్నతో తెగతెంపులు చేసుకుని వున్న అత్తమ్మ ఊరికి పయనమయ్యాను. కన్నవాళ్లకి, పుట్టి పెరిగిన ఊరుకీ దూర మయ్యాను.

'అపాపు' అన్నది టైపు నేర్చుకుంటోన్న అమ్మాయి. ఆ పిల్ల ఇల్లు దగ్గరపడింది. కళ్లాన్ని బిగించనవసరం లేకపోయింది. గుర్రం ఆగిపోయింది. వోణీని నిండుగా కప్పుకుని ఆ అమ్మాయి కిందికి దూకడంతో నేలమీది నీరు పైకి చిమ్మింది. లాంతరు వెలుగులో నీటి చుక్కలు ముత్యాల్లా మెరిశాయి.

జట్కా కదలనుందో లేదో పరుగులాంటి నడకతో ఓ వ్యక్తి ఎదురొచ్చాడు.

అతను నిక్కరు, లాల్చీలో వున్నాడు. పూర్తిగా తడిసి ముద్దయి వున్నాడు. యాభ య్యేళ్ల వయసుంటుందతనికి. ఫలానా చోటుకని చెప్పి జట్కాను ఎక్కబోయాడు. చేతినందించి అతన్ని మీదికి లాక్కున్నాను. మేష్ట్రమ్మ పక్కన చతికిలబడి స్థిరంగా కూర్చున్నానని నిర్ధారించుకున్న తర్వాతగాని అతను నా చేతి అసరాను వీడలేదు. అప్పుడతని చేతివేళ్ల వైపు చూశాను. చూసి పొంగిపోయాను. అతని కుడిచేతికి బొటనవేలు లేదు. ఈ వయసులో ఈ దుస్తుల్లో నాన్న అచ్చం ఇలానే వుంటాడ నిపించింది. నాన్నే నా ప్రక్కన జట్కాలో కొలువుదీరాడనిపించింది. ఆనందం కలిగింది. నాకు మరింత సమీపంగా అతన్ని ముందుకి రమ్మన్నాను. జరిగొచ్చాడతను. కల్లువాసన వేశాడు. సంబరపడ్డాను.

జడివాన జలతారు తీవెలనిపించింది. చలిగాలి నులివెచ్చననిపించింది. అసహనం, అసహ్యాలూ గుండెల్లోంచి ఎగిరిపోయి హాయి హాయనిపించింది. జట్కాలోని వారినంతా తిరునాళ్లకి తీసుకుపోతున్నట్టుగా వుంది. చేరువున నాన్న వున్నాడన్న భావన చెప్పలేని అనుభూతి అన్పించింది. చర్నాకోలాను ఝళిపిం చాను. గుర్రం పరుగు శరవేగమయింది.

నాన్నలాంటి వ్యక్తిని ఏ వివరాలూ అడగదలుచు కోలేదు. వివరాలు తెలుసుకుని ఆయన నాన్న కాదన్న నిజాన్ని అంగీకరించదలచలేదు. చలికి వణకుతూన్న అతని చుట్టూ చేతులుంచి హుషారయ్యాను.

ఇప్పుడెందుకో మేష్ట్రమ్మకు నమస్కరించాలని వుంది. కాలేజీ కుర్రాణ్ణి అనునయించాలని వుంది. గురుమూర్తి నిండు నూరేళ్లూ బతకాలని వుంది. పోలీసు మీద పగలేదు. శెట్టిని హత్య చేయాలనీలేదు. మేష్ట్రమ్మను ఆటపట్టిస్తూ శెట్టి మాట్లాడితే బాగుణ్ణని వుంది. పోలీసు పగలబడి నవ్వితే కలిసి నవ్వాలని వుంది. అణువణువూ అందంగా ఆనందంగా వుందనిపించింది. ఈలవేసి పాట పాడాలనిపింది.

గొంతెత్తాను! బతుకంతా పాటగా సాగిపోయింది!

ఎవరిళ్ల దగ్గర వారు దిగిపోయారు. నాన్నలాంటి వ్యక్తి కూడా నన్ను విడిచి దిగి వెళ్లిపోయాడు. దిగి వెళ్లి పోతూ అతను కిరాయిగా రూపాయినోటు నాకందివ్వ నుంటే 'వద్దు నాన్నా' అన్నాను. నవ్వి జోగుతూ వెళ్లిపోయాడతను. నన్ను దీవించినట్టుగా చేతినెత్తి గాలిలో ఊపాడు. ఆలోచింపజేశాడు.

గడిచిన పదేళ్లలో ఏదో ఓ అవసరానిగ్గాను చేతులకున్న పదివేళ్లనీ నాన్న

పోగొట్టుకుని వుంటాడు. మొండి చేతుల్తో దుంగల్ని నెడుతూ అమ్మో, అక్కో తినిపించ గలిగితేనే అన్నం ముద్దని నోటికి అందుకోగలుగుతూ వుండి వుంటాడు. దగ్గు జబ్బుతో అమ్మ శల్యమయి వుంటుంది. పొట్టుబస్తాలో తనని తాను కుక్కుకోగలిగే స్థితికి చేరుకుని వుంటుంది. అక్కను ఏ తేళ్లు కుట్టాయో. ఏ పాములు కరిచాయో. ఏ పేళ్లలో ప్రాణాల్ని బలి పెడుతుందో ఏమో.

నా వాళ్లంతా ఎలా వున్నారో. ఏమయి వున్నారో.


ఏ దృశ్యాలకు భయపడి, ఏ జీవితాల్ని అసహ్యించుకుని ఎవరికి దూరంగా పారిపోదలచానో, అది నాకు సాధ్యంకాలేదు. ఎల్లెడలా ఒకటే దృశ్యం! ఒకటే జీవితం! రాకాసిలోయ అంతటా వ్యాపించి వుంది. క్రూర మృగాలు, మారణా యుధాలు, మంత్రతంత్రాలన్నీ నాలాంటి కుటుంబీకుల కోసమే పొంచి వున్నాయ నిపించింది.

నా వాళ్లను నేను రక్షించుకోవాలి.

అందుకు సన్నద్ధం కావాలనుకున్నాను.

కొరడాను విసిరి, జట్కాను మా ఊరి వైపు పరుగు తీయించాను. ఈ దీర్ఘరాత్రిలో, మైళ్ల దూరంలో నున్న మా ఇంటికి ఈ జట్కాలో నేను చేరుకో గలనో లేదో. కాని, చేరుకోవాలన్న దృఢ సంకల్పం నాలో వుంది.





# గోడ

## కుప్పిలి పద్మ

● రచనా కాలం: 1999

**కుప్పిలిపద్మ:** పాఠకులను బల్లకు ఆ వైపు కూర్చోబెట్టి స్త్రీల దృష్టితో లోకాసమానతలను కథల ద్వారా చూపడానికి ఇష్టపడే రచయిత్రి. స్వస్థలం రాజమండ్రి. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 'మసిగుడ్డ', 'వనమాల', 'సాలభంజిక' తదితర కథలు ప్రసిద్ధం. వందకు పైగా కథలు అనేక కాలమ్స్ విస్తృతంగా రాశారు. నవలలు వెలువరించారు. కవిత్వం కూడా. 'వాన'ను కథకు మకుటంగా చేసి ఎక్కువ కథలు రాసిన రచయిత్రి.

**తూ**ర్పు సముద్రంలో తుఫాన్. పగిలిన మబ్బుల్లోంచి విచ్చుకుంటున్న ప్రళయంలా పెనువర్షం. యెగిసిపడే కెరటాలు. రాలిపడే చినుకులు. యేకమవుతోన్న భూమ్యాకాశాలు.

తుఫాన్ వేళ సాయంత్రమే ముసురుకున్న రాత్రి చీకట్లు.

బీచ్ రోడ్డులో బస్టాప్. తడిసి ముద్దయిన దేహాలు. వర్షధారల్లోంచి తడవకుండా కాపాడుకోటానికి శరీరంలో అణుభాగమైనా లేదేమో! వెన్నెల్లో నిరీక్షిస్తున్నంత మామూలుగా ఆ బస్టాప్‌లో ఆ వర్షంలో చేరాల్సిన ప్రదేశాలకి చేర్చే యేదో వొక వాహనం దొరకకపోతుందాని యెదురు చూస్తున్నారంతా.

ఆ బస్టాప్‌లోకి పూర్తిగా తడిసిపోయిన సాగర్ కొత్తగా ప్రవేశించాడు. తడి చేత్తో కళ్లపై నీళ్లని తుడుచుకుంటూ నిలబడ్డాడు. కాసేపటికి చూపు కాస్త తెరిపిన పడింది. చుట్టూ చూశాడు. తడిసిన శరీరాలు. యెదురుగా చూశాడు. ఆకాశమూ సముద్రమూ యేకమైనాయి. తిరిగి చుట్టూ చూశాడు. వో చోట చూపు నిల్చింది.

అవును ఆమె... నిజమే ఆమె మహిమే. 'మహిమా' చలికి పూడుకుపోయిన గొంతులోంచి మాట పెగల్టం లేదు.

'మహిమ'... వూహూ లాభం లేదు. మాట రావటం లేదు, పెదవుల కదలిక తప్ప. అతను ఆమెకి చేరువగా వెళ్ళి భుజం మీద చేత్తో చిన్నగా తట్టాడు. ఆమె వెనుదిరిగింది. తడిసిపోయిన కళ్లల్లో ఆశ్చర్యం తడిగా.

'సాగర్'.. చలికి గడ్డకట్టుకుపోయిన పిలుపు.

మెల్లగా వొకరిమాట వొకరికి వినిపించేంత కొద్దిగా గొంతు సడలింది.

'యిప్పుడు నీకే బస్సు, ఆటో దొరకదు. అదిగో ఆ కనిపించేది నేనుండే యిల్లు.

రా నాతో వచ్చేయి...' గాలి హోరులా చెల్లాచెదురవుతున్న మాటలు.

ఆమె వంగి ట్రావల్‌బ్యాగ్ భుజానికి తగిలించుకొంది.

అడుగు ముందుకి వేయనివ్వకుండా వెనక్కి తోసేస్తున్న యీదురు గాలి. నీటి వొత్తిడి. వొకరి వెంట మరొకరు. బ్యాగ్ భుజాలు మారుతూ అడుగులో అడుగు. చేతుల్లో చెయ్యి. పడుతూ లేస్తూ యీదుతూ అతని యింటికి యిద్దరూ చేరారు.

'బట్టలు మార్చుకో. అదిగో అదే బాత్రూం' చెప్పాడతను.

అతను లోపలి గదిలోకి వెళ్ళాడు. బట్టలు మార్చుకొన్నాడు. తిరిగి ముందు గదిలోకి వచ్చేసరికి ఆమె అలానే తడిగా నిలబడి వుంది.

'మార్చుకోలేదా' అడిగాడు.

ఆమె చూపులు నేలపై. ఆమె చూపులని అతని చూపులు అనుసరించాయి.

బ్యాగ్‌లోని బట్టలు నేలపై కుప్పపోసి వున్నాయి. అవి నీళ్లల్లో జాడించిన ట్టున్నాయి. 'తుఫాన్' అంటూ అతను లోపలికి వెళ్లాడు.

తిరిగొచ్చాడు. చేతిలో లుంగీ, లాల్చీ, తువ్వాలు ఆమెకి అందించాడు. అందుకొని బాత్రూంలోకి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి అతను గదిలో లేడు. తువ్వాలుతో తల తడుచుకుంటూ లోపలికి వెళ్లింది. చీకటి వంటగదిలో స్టవ్ వెల్గులో టీ చేస్తూ కనిపించాడు.

అతను ఆమెవైపు చూసి, 'అచ్చు కేరళైట్‌లా వున్నావ్' అన్నాడు.

ఆమె నవ్వింది. స్టవ్ వెలుగులో బుగ్గపై డింపుల్ తళుక్‌మంది.

'కరెంట్ లేదు' అన్నాడతను.

'క్యాండిల్, హరికేన్‌లాంతరు లేవా'

ఆమెకి టీ అందిస్తూ 'లేవు' అన్నాడు. వో గుక్క తాగింది. చల్లబడిన శరీరంలో వెచ్చదనం వేడి టీతో మెల్లగా రాజుకుంటూంది.

'పూజ చేస్తావా' అడిగింది.

'లేదు' అన్నాడు.

'పూజామందిరమే లేదా?'

'వుంది. అమ్మ వచ్చినప్పుడు చేస్తుందిగా. యేం'

'యెక్కడుంది మందిరం.'

'ఆ మూల.'

చీకట్లో మెల్లగా నడిచి దేవుని దగ్గరున్న కుందెలో నూనె పోసింది. వొత్తివేసి వెలిగించింది.

'నూనె దీపమా... అరే పిల్లా నూనె కొంచెమే వుంది' అన్నాడు.

'వంట పూర్తిచేసేయ్. ఆకలి. తినగానే దీపం తీసేద్దాం.'

'వంటా... యేం చేద్దాం...అన్నం, పప్పుచారు. కొద్దిగా మాగాయ వుంది. కూరగాయలేం లేవ్.'

'యేదో ఒకటి త్వరగా కానీయ్. ఆ ట్రైన్‌లో కూర్చుని కూర్చుని నడుంనొప్పి వస్తుంది. నిన్నట్నుంచి సరియైన తిండే లేదు' కుక్కర్‌లో నీళ్లు పోస్తూ అంది.

'యెక్కడ్నుంచి రాక. యెక్కడికి పోతున్నావ్'

'మద్రాస్ నుంచి మెయిల్లో. దారి పొడుగునా వానే. భీమ్లీలో వుండటం. అక్కడ వుద్యోగం. యెలాగోలా భీమ్లీ వెళ్లిపోదామనుకున్నాను. ఆ బస్సు ఆర్.కె. బీచ్ వరకు వచ్చి యింక వెళ్లనని మొరాయించింది. వానలో తడుస్తూ ఆ బస్టాండ్ వరకు చేరాను. యింతలో నువ్వు కన్పించావ్. అవునూ నువ్వెక్కడ్నుంచి రాక' బియ్యం కడుగుతూ అడిగింది.

'యూనివర్సిటీ నుంచి. నిన్న కథ రాశాను. ఆ పేపర్లు టేబుల్ పైనే వుండి పోయాయి. కిటికీ తలుపులు వేశానో లేదోనని అనుమాన మొచ్చింది. పేపర్లపై వెయిట్ పెట్టానో లేదో గుర్తులేదు. గాలికి కాగితాలు యెరిగిపోతాయేమోనని బెంగ. మొదటిసారి కథ రాయటం కదా. ఆ అక్షరాలు యీ తుఫాన్ నీళ్లలో కరిగిపోరాదని వెళ్ళాను' పప్పు కప్పుతో కొలుస్తూ అన్నాడు.

'యింతకీ తలుపులు వేసొచ్చావా లేదా?'

'వెయ్యటానికి మెయిన్ బిల్డింగ్ తాళాలు వాచ్‌మాన్ దగ్గరున్నాయి. బిల్డింగ్ చుట్టూ నాలుగు ప్రదక్షిణలు చేశాను. కానీ లోపల కాగితాలు యేమయ్యాయో తెలీలేదు' దిగులుగా చెప్పాడు.

'కథలని పెన్‌తో రాయటం యేంటింకా. కథలని రమేష్‌లా డైరెక్ట్‌గా కంప్యూటర్ మీదే కంపోజ్ చెయ్యాలి.' అంది మహిమ.

'అవునూ నీకు వీళ్లంతా కనిపిస్తూనే వున్నారా?'

'వూ. హైదరాబాద్ పని మీద వెళ్లినప్పుడంతా కలుస్తుంటారు. శ్రీశైల్ కవిత్వం రాస్తున్నాడు. యేం చేద్దాం యేం చేద్దామంటూనే వున్నాడు. నీకెవ్వరూ కనిపించటం

లేదా' అడిగింది.

'ఆ మధ్య కుమారి కనిపించింది. వాళ్లాయనకి విడాకులు యిచ్చేసిందట. జీవితం యిప్పుడెంతో హాయిగా వుందట' అన్నాడు. కుక్కర్ విజిల్ రాగానే అపారు.

ప్లేట్స్ టేబిల్ పై సర్దింది. మధ్యలో దీపపు కుందె వుంచింది. నీళ్ళు గ్లాసుల్లో పోసింది. కుక్కర్ చల్లారిందో లేదో చూసి మూత తీశారు.

పళ్లాల్లో అన్నం, పప్పు పెట్టుకొన్నారు.

'అయిల్ లైట్ డిన్నరా' పప్పు కలుపుకొంటూ అంది.

'వూ' అంటూ నవ్వాడు.

'పప్పు భలే వుందే!'

'పప్పా...అది పోలూరి వాళ్ల పప్పు. పుస్తకంలో చదివాను. నచ్చింది. అప్పట్నుంచి యిలా చాలామందికి యీ పప్పుని రుచి చూపిస్తున్నా. అఫ్ కోర్స్ నీలా చాలామంది మెచ్చుకుంటున్నారనుకో' అన్నాడు.

'బాగుంది అన్నానంతే! యెంత వుపన్యాసం యిచ్చావ్. యింకాస్త పప్పు వెయ్యి.'

తింటూ తింటూ ఆమె పొలమారింది. అతను ఆమెకి మంచినీళ్ల గ్లాసు అందిస్తూ నెత్తి మీద చేత్తో తడుతూ, 'యెవరో తలచుకుంటున్నట్టున్నారు' అన్నాడు.

'యింకెవరూ ఆ రైల్లో టి.టి.యే...'

'ఆయన యెవరూ...'

'రైల్లో టిక్కెట్ లేని ప్రయాణం చేస్తున్నామో లేదో చూసే ఆయన' అంది.

'ఆ విషయం తెలుసు. నిన్నెందుకు తలచుకుంటున్నట్టు.'

'రైలేమో యెక్కడికక్కడ ఆగిపోతోంది. తెగ బోర్. యే పనీ చేయటానికి లేదు. అందుకని కాసేపు అతన్ని ప్రేమించాను' అంది నవ్వుతూ.

'నువ్వు ప్రేమిస్తే నువ్వు తలచుకోవాలి కానీ అతను నిన్నెందుకు తలచు కుంటాడు' అడిగాడు.

'యీ ట్రైన్ యెంతసేపు ఆగుతుంది అని అడిగానంతే. అతను నా సమస్త విషయాల గురించి అంచెలంచెలుగా ప్రశ్నలు వేసేశాడు. ఆడపిల్ల వో ప్రశ్న వేయగానే అలా నిలువుగుడ్లేసుకొని మాట్లాడేస్తారు. ఆ విషయాన్ని అక్కడితో

వదలరు. పైపెచ్చు అక్కడ్నుంచి ప్రేమంటూ వెంటపడతారు. అయిదు నిమిషాల్లో విడవలేనంత ప్రేమేంటిరా, ఆకర్షణ అనైనా అనరు. పెళ్ళి కాలేదా అంటారు. చేసుకోలేదయ్యా అంటే వొంటరిగా వున్నారా... లోన్లీగా అన్పించదా... మగ వాళ్ళంతా యింతేనేమో.. కడవలకొద్దీ  సానుభూతి కురిపించేసి టెంపరరీగా మీకు తోడుంటాం అంటారు. నువ్వు చాలా ఆలస్యంగా కనిపించావ్. అబ్బే! నాకు యిప్పుడున్న జీవితం నరకంగా వుంది. నీతో జీవితాంతం వరకు కలిసి వుండాలని వుంది అంటూనే అంతవరకు ముందు శరీరాలని పెనవేసుకు పోదాం... అంటూ యెన్నెన్ని కథలని చెప్పేస్తారో. మేమేదో మా వొంటరి జీవితాలకి వాళ్ళ ఆలంబన కోరినట్టు' తిన్న పళ్ళెం తీసి అంట్లగిన్నెల్లో పెడుతూ అందామె.

'నీకైతే బోల్డన్ని వ్యాపకాలు. చదువుతావ్. పాటలు వింటావ్. ఆ ప్రాజెక్ట్ వర్క్ మీద వూళ్ళు తిరుగుతావ్. అదీ కాకుండా నువ్వెక్కడున్నా ఆ పరిసరాలలో, మనుష్యులలో నీకు నచ్చిన అంశాల్ని యిష్టపడతావ్. నీలా అంతా వుండలేరుగా. వొంటరితనంతో బాధపడేవాళ్ళు లేరంటావా' అడిగాడు.

'యెవరో కొందరే వొంటరితనంతో బాధపడతారా? చాలామందిలో ఆ దిగులుంటుంది. యెప్పుడో వొకప్పుడు అంతా అందులో కొట్టుకుపోతూనే వుంటాం. ఆ దిగులు, బెంగ యెందుకో తెలిసినా మనం మన యిష్టాలని, కోరికలని, ప్రేమలని నిర్భయంగా, స్వేచ్ఛగా వ్యక్తపరిచే స్థితి మనచుట్టూ లేదుకదా. యెవరి లైఫ్‌స్టయిల్ వాళ్ళది అనుకోరు కదా! మనముందు వో వ్యవస్థని వుంచారు. మనకి యిరుగ్గా వున్నా అందులోనే వుండాలా? బయటికి రావాలా? బయటికి వస్తే మన మీద విసిరే బాణాలని మనం యెదుర్కోగలమా... మన చుట్టూ వున్న గోడలని మనం బద్దలు కొట్టగలమా.. అసలు కొట్టాలా వద్దా.... కొట్టటం వల్ల మనకి కావల్సింది మనకి దొరుకుతుందా... దొరుకుతుందని యేమాత్రం అనిపించినా బద్దలు కొట్టొచ్చు. అనిపించకపోయినా కొట్టొచ్చు. లోపల యేం లేదని తెల్సింది. బయట యేముందో లేదో తేల్చుకోటానికి యెందుకు  వెనుకాడాలి' ఆమె మాట్లాడుతుండగా దీపం వెల్తురు కొద్దికొద్దిగా తగ్గి తగ్గి అరిపోయింది.

'నూనె అయిపోయింది' అన్నాడతను.

'మంచిది. పక్కలు  వేసుకుందామా' అడిగింది.

'ఆ'

అతను చాప పరిచాడు. దానిపై బొంత పరుస్తూ 'బొంతలు భలే వుంటాయేం. మా అమ్మమ్మ వీటిని చాలా ఆర్టిస్టిక్‌గా కుట్టేది' అంది.

'యీ బొంత మా నాయనమ్మ యిచ్చింది' అన్నాడు.

ఆమె కిటికీ దగ్గరకి వెళ్ళి మెల్లగా తలుపు తెరిచింది. గాలి ఆమె ముఖాన్ని భళ్ళున కొట్టింది.

'అబ్బా యేం తుఫాన్' అంటూ ఆమె కిటికీ రెక్క వెయ్యటానికి తంటాలు పడుతోంటే అతనొచ్చి తలుపుని గట్టిగా పట్టుకున్నాడు. ఆమె బోల్టు పెట్టింది.

'నిక్షేపంలా వేసున్న కిటికీని తీయటం యెందుకు? వెయ్యటానికి యిబ్బంది పడటం యెందుకు?' అన్నాడు.

'బయటేం వుందో చూద్దామని' అంది.

'బయటేం వుంది. వర్షమని తెలుసుగా.'

'వుత్తి వర్షమేనా. తలుపు తీయకపోతే ఆ గాలికి యెంత బలం వుందో తెలిసేదా?'

'సాయంత్రమంతా నడిరోడ్డులో ఆ గాలిలో కొట్టుకుపోయావు కదా.... మళ్ళీ యిప్పుడు కొత్తగా చూడ్డానికి యేముంది.'

'నాలుగుగోడల మధ్య నుంచి తుఫాన్ని చూస్తే యెలా వుంటుందో నని.'

ఆమె పడుకొని మెడ వరకు దుప్పటి కప్పుకుంటూ, 'పాట పాడు' అంది.

'యే పాట' అడిగాడు.

'నీ యిష్టం'

'దివారో సే మిల్‌కర్ రోనా
అచ్చా లగ్‌తా హై
హమ్ భీ పాగల్ హోజాయేంగే...
ఐసా లగ్‌తాహై' అతను పాడాడు.

'నీకా పాటంటే యిష్టం కదా' అడిగాడు.

'వూ'

'నువ్వీ పాటని సిద్ధార్థని అడిగి మరీ పాడించుకునేదానివిగా. అతని దగ్గరే నేనీ పాట నేర్చుకున్నాను నీకిష్టమని. కానీ నీకు వినిపించక ముందే నువ్వు వుద్యోగం అంటూ మా అందరి నుంచి వెళ్ళిపోయావ్' అన్నాడు.

'చదువులు అయిపోయాక యిష్టమయిన బతుకుతెరువు చూసుకోవాలిగా! నీకా పాటకి అర్థం తెలుసా' అడిగింది.

'తెలియదు, చెప్పు.'

'అర్థం చెప్పనా? నీ గొంతు బాగుంది. కానీ నీకీ పాట అర్థం తెలియక యిన్వాల్వ్‌మెంట్‌తో పాడలేకపోతున్నావ్. 'కొండగాలి తిరిగింది' పాటని నువ్వు పాడినప్పుడు నిజంగా గుండె వూసులాడుతుంది' అంది.

'అర్థం చెప్పు.'

'గోడల్తో కలిసి దుఃఖించడం యెంతో బాగుంటుంది. నేను పిచ్చి వాడినైనా యిలానే వుంటుంది. యెన్ని రోజులుగా దాహంతో వున్నానో చిన్న మంచుముక్క కూడా కడలిలా కనబడుతోంది...'

చీకటి. వర్షం హోరు. గాలి గొడవ. చలి. ఆ గదిలో ఆమె గొంతు జలపాతపు లోయలో మంచు కురుస్తున్నట్లు విన్పిస్తోంది.

అతను తిరిగి ఆ పాటే పాడాడు.

చీకటి దిగంతరేఖ మీద వంగి సృష్టిరహస్యం గుసగుసగా చెవిలో చెపుతున్న ట్టుంది అతని స్వరం.

ఆమె చేయి చాపి అతని చెవిని మెలిపెడుతూ 'కొండగాలి తిరి గింది పాడవా' అడిగింది.

అతను పాడటం మొదలుపెట్టాడు.

ఆమె చేతివేళ్ళు అతని జుట్టుతో ఆడుకుంటున్నాయి.

పాట తర్వాత పాట.

కళ్ళు మూసుకుని పాటలు వింటోంది.

పాడుతూ పాడుతూ చప్పున ఆమె వైపు తిరిగి ముఖమంతా ముద్దులు పెట్టాడు. ఆమె నవ్వుతూ అతని నుంచి తప్పించుకొంటూ 'అబ్బాయ్ యేంటిది' అంది.

'తుఫాన్.'

'తుఫాన్ గాలి అంటే... వూహూ నాకు బెంగ. గోదారి గాలే యిష్టం' నవ్వుతూ అంది.

అతను నవ్వుతూ ఆమె సమస్త దేహాన్ని అల్లుకుపోతున్నాడు.

ఆమె అతన్ని తిరిగి మెల్లగా వారించింది.

ఆ క్షణంలో సాగర్ నవ్వు ఆమెకి పరాయిగా కనిపించింది. అతని ప్రతి కదలికలోనూ ఆమెకు తన సాగర్ కన్పించడం లేదు. సాగర్ లోపల్నించి మరో సాగర్ బయటకి వుబికి వస్తున్నాడా అనిపిస్తోంది. అప్పటి దాకా సాగర్‌తో తను పంచుకున్న ప్రపంచమంతా వున్నట్టుండి తెగిపోయి నట్టనిపించింది. చివరికి సాగర్‌కి కూడా తానొక శరీరంగానే కనిపిస్తోందా? ఆమె లోలోపల్నించి వొక చురకత్తి మెలిపెడ్తున్న బాధ.

సాగర్ ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు.

మళ్ళీ ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు.

ఆమె దూరంగా జరిగింది.

'యేం?'

'వద్దు.'

'మహీ! యెందుకు? వుప్పెనలా దేహాలు వువ్వెత్తున యెగిసి పడుతోంటే యీ వారింపు యేమిటి?' నిష్ఠూరంగా అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

'నిన్ను నేనే ముద్దుపెట్టుకున్నా. నువ్వు నా జుట్టు, బుగ్గలని తాకినా నీకు అభ్యంతరం లేదు. కానీ యీ విషయంలో నీకెందుకింత అభ్యంతరం? నువ్వు కూడా సోకాల్డ్ పాతివ్రత్యం, శీలం అని ఆలోచిస్తున్నావా' చికాకుగా అడిగాడు.

మహిమ పక్క మీద నుంచి లేచి అతన్ని అనుకొని కూర్చుంటూ 'శీలం... పాతివ్రత్యం... వూహూ... అవేంకాదు సాగర్. యే యే యెమోషన్స్ నన్ను యెటు తీసుకువెళితే అటు అడుగేస్తున్నదాన్ని. యీ సిస్టమ్‌లో యిమడలేకేగా పెళ్ళి చేసుకోనిది. యేదో వొక వుద్యోగం అంటూ వొకేచోట కూరుకుపోనిది. కానీ యీ విషయానికొచ్చేసరికి యే జాగ్రత్తలు తీసుకోకుండా యస్ అనలేను. యే క్షణంలోనైనా యిలాంటి యెమోషన్స్ యెదురౌతాయని యెప్పుడూ వొక శారీరక జాగ్రత్తలో వుండటం అసాధ్యం కదా' అంది.

'యేమవుతుంది? నువ్వూ అందరిలా ప్రపంచం యేం తెలియనట్టు మాట్లాడతావేం? నువ్వేదో అందరికంటే భిన్నమైన దానివనుకున్నాను' ఆశ్చర్యపోతూ అడిగాడు.

'యేమవుతుందా? యేమైనా కావొచ్చు. నీకు నాకు మధ్య వో సైకలాజికల్ క్లోజ్‌నెస్ రావొచ్చు. నువ్వూ, నేనూ, శ్రీశైల్, రమేష్ మనమంతా కాలేజీ దినాల్లో

మంచి స్నేహితులం. అల్లరి చేసేవాళ్లం. బోల్డన్ని విషయాలు చర్చించేవాళ్లం. కానీ మన మధ్య యిలాంటి విషయాలు యెప్పుడూ వచ్చేవి కావు. యీ విషయాల పట్ల మీరంతా యెలా స్పందిస్తారో నాకు తెలియదు. యీ విషయం జరిగాక నువ్వేలా రియాక్ట్ అవుతావో? యేమేమి మాట్లాడతావో, నాపై నీకు హక్కు వుందనుకుంటావో, నే ప్రెగ్నెంట్‌ని అయితే బిడ్డని కనమంటావో, అబార్షన్ చేయించుకోమంటావో? నే బిడ్డని కనాలనుకుంటే నువ్వు వొద్దనొచ్చు. అబార్షన్ చేయించుకుంటానంటే కాదనొచ్చు. లేదా అస్సలు మొత్తం వ్యవహారంతో నీకే సంబంధం లేదనొచ్చు. లేదా యిందాకా వచ్చాం, పెళ్లి చేసుకుందాం అనొచ్చు, కలిసివుందాం అనొచ్చు. యికపోతే ప్రపంచం తెలియకుండా లేను. నా రెండు చేతులూ చాచి, నాకు నేనుగా ఆహ్వానించే ప్రపంచమంటే నాకెంతో యిష్టం. ఆ మోహప్రపంచం కోసం నేనే సంఘర్షణనైనా యెదుర్కొంటాను' అని ఆగి ఆ చీకట్లోనే అసహనంగా వినిపిస్తున్న అతని వూపిరి వింటూ అతని పక్కనే వున్న పక్కపై పడుకొని దుప్పటిని మెడ వరకూ కప్పుకుంటూ 'కానీ నువ్వో ప్రపోజల్ పెట్టినప్పుడు నేను వద్దంటే, నేను యెందుకు వద్దన్నానో నీకు నిజంగా తెలియదా? తెలిసి కూడా తెలియనట్టున్నావో నాకు తెలియదు. కానీ నువ్వు నన్నేం అడిగావ్. 'నువ్వూ అందరిలా యిలానే మాట్లాడతావా? నువ్వు యింకేదో అందరి కంటే భిన్నం అనుకున్నాను' అంటూ మా వ్యక్తిత్వాలతో మానిప్యులేట్ చేసే నీలాంటి వాళ్ళ కోసం కాదు' చెప్పింది మహిమ.

ఆమె నిద్ర సవ్వడి వింటూ అచేతనంగా కూర్చున్నాడు. బయట తుఫాన్ హోరు కంటే గదిలోని ఆమె నిద్రసవ్వడి యెక్కువగా అలజడి కలిగిస్తోంది.


అతను తలుపు తీసుకొని బయటికి వచ్చాడు.

తుఫాన్ మేఘం నిర్లక్ష్యంగా కురుస్తూనే వుంది.

పొద్దున్న తుఫాన్ భయపెట్టింది.

ఆ తుఫాన్ ప్రశాంతంగా వుంది అతని లోపలి తుఫాన్ కన్నా!





# వానరాలే

## స్వామి

● రచనా కాలం: 1991

**స్వామి:** అనంతపురపు అంతులేని జీవన వేదన ఈ రచయిత కథల్లో చోటు చేసుకుని కొద్దోగొప్పో ఉపశమనం పొందగలిగింది. అక్కడి మాటా పలుకూ నడకా నడతా విస్తృతంగా కథనం చేశారు. 'సావు కూడు', 'తెల్ల దెయ్యం', 'రంకె' తదితర కథలు ప్రసిద్ధం. బహుమతులు పొందిన నవలలు రాశారు. పూర్తి పేరు బండి నారాయణ స్వామి. జననం, జీవితం అంతా అనంతపురం లోనే. టీచర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. వయసు 65 సంవత్సరాలు.

క్షయ సంవత్సరంలో వానలు కురసవు అని చెప్పేవాళ్లు కొంతమంది. అది క్షయకాదు.. అక్షయ. సంవత్సరంలో వానలు దండిగా కురిసితీరల్ల అని ఆశను లేపెట్టేవాళ్లు కొంతమంది. ఎవరి మాటను ఇనేది? ఎవరి మాటను ఇడిసిపెట్టేది?

ఊర్లో వాళ్లకేమో శానామందికి ధైర్యం సాలలే ఇత్తనం ఏసేదానికి. అప్పటికే ఒక సంవత్సరం వర్షాలు పడక సేద్యంలో దెబ్బ తినిండిరి మల్ల పాపం!

ఈ యేడు వానలు బాగా కురుస్తాయని గవర్నమెంటోల్లు రేడియోలో చెప్పినారురా అని కరణమయ్య ధైర్యం చెబితే పెన్నప్పకు ఆశ పుట్టె. ఊర్లో చానామంది రైతులు ఎనకడుగు ఏస్తాంటే పెన్నప్ప ముందడుగు ఏసె.

ఒక దినం పొద్దున్నే తలకు నీళ్లు పోసుకుండె. ఉతికుండే బట్టలు కట్టుకుండె. తలకు చారెడు సమురు పూయించుకుని పెండ్లాముతో దువ్వించుకుండె. భుజం మీద సెల్లా కూడా ఏసుకొని చెళ్లికెరలో చెనిక్కాలయ ఆసామి దగ్గిరికి ఎల్లబారి పాయ. తీరా పోయినంక క్వింటాలు చెనిగిత్తనం వెయ్యి రూపాయలు అని రేటు వినేసరికి నోరంతా ఎల్లబెట్టె.

'వెయ్యి రూపాయలంటే పట్ల సావుకారీ? నిన్న సంవత్సరం క్వింటాలు చెనిగిత్తనం నీకు ఏడు నూర్లకే అమ్మితిమి కదా. మా నుంచి ఏడు నూర్లకు కొని, మల్లీ మాకే వెయ్యిరూపాయలకు అమ్మజూపితే ఎట్ల?' అనె బాధగా.

'ఏం చెయ్యమంటవురా. అది అప్పటి మార్కెట్టు రేటు. ఇది ఈనాటి మార్కెట్టు రేటు. కోర్టులో వకీలు మాట్లాడినట్లు అంత తెలివిగా మాట్లాడతాండావు కదా. మరి నిన్న సంవత్సరం పండిన చెనిక్కాయనంతా అమ్మి దుడ్లు చేసుకునే బదులు, ఈ సంవత్సరం ఇత్తనం వేసే దానికి కొంత ఎత్తిపెట్టుకోవల్ల అనే జ్ఞానం

లేకపాయెనా నీకు?' అనె సురుకుముట్టుగా సావుకారి.

'నిరుడు పావలా పంట కూడా పండలేదు కదా సావుకారీ. పండిన పంటనంతా మళ్లీ సంవత్సరం ఇత్తన్నం కోసరం ఎత్తిపెట్టుకుంటే ఇంక సంవత్సరం పొడుగునా మేమేం తినేదీ? మీ అట్లా వాళ్లకు అప్పులేం కట్టేదీ?' అని అడిగె.

'ఆ పొద్దు ఏవో అవసరాలుండి పండిన కాయినంతా అమ్ముకుంటారు. మరి ఈ పొద్దువచ్చి మార్కెట్టు రేటు పక్కువ అని అంగలారిస్తే ఎట్లరా' అనె సావుకారి.

'అంతా మా కర్మలే ధనీ' అనుకుండె పెన్నప్ప.

'ఎన్ని పల్లాలు కావల్లరా నీకు ఇత్తనం?' అని అడిగె సావుకారి.

'ఐదు ఎకరాలకు అయితే ఒకటిన్నర పల్లా సరిపోతాయి. పది ఎకరాలకు పంట పెట్టాలంటే మూడు పల్లాలు కాబడతాయి. ఇత్తనం రేటు చూస్తే అగ్గి కురుస్తాంది. ఐదు ఎకరాలకు మాత్రం సల్లి, మిగతా ఐదెకరాలు బీడు పెట్టుకుందునా? లేక ధైర్యం సేసి పది ఎకరాలకూ ఇత్తనం కొండుబోయి ఏస్తునా?' అని కొంచెంసేపు కిందా మీదా ఆలోసించె.

అప్పుడు పోలేరమ్మతల్లి పైలో నిండి దానయ్యతో చెప్పించిన మాటలు జ్ఞాపకం వచ్చె. పోలేరమ్మ తల్లి సెప్పినంక వానలు వచ్చి తీరాల్సిందే కదా? ఏమో! పైన దేవుడుండాడు అనుకొని ధైర్యంగా మూడు మూటలు ఇత్తనం కాయిని ఏసుకొచ్చె పది ఎకరాల్లోనూ సల్లేదానికి.

'చూడప్పా! పంట పండినంక చెనిక్కాయిని మళ్లీ మాకే తోలల్ల. వేరే యాపారస్తులకు తోలి మాకు అన్యాయం చెయ్యకూడదు' అని పెన్నప్ప వచ్చేటప్పుడు ఇంకొకసారి హెచ్చరించి పంపె సావుకారి.

ఒకటి కాదు రెండు కాదు ఇత్తనం కాయిని మూడు మూటలు ఏసుకొచ్చిన మొగున్ని తిక్కోన్ని చూసినట్ల చూసె పెన్నప్ప పెండ్లాము.

'ఈసారి వానలు వస్తాయో రావో అని పెద్ద పెద్ద రైతులే ఇత్తనం ఏసేదానికి జంకుతాంటే నువ్వు మూడు మూటలు ఇత్తనం కాయిని ఎందుకు మోసుకొస్తివి సామీ? నిరుడు సంవత్సరం మాదిరి వానలు కురసక పాయ అనుకో! ఇపుడు ఇత్తనం మీద అప్పు చేసిన ఆ మూడువేలూ భూమిలోకి పారేసుకున్నట్లే కదా! ఆ మూడు వేలు అప్పును ఎట్ల కడతాము? దానికి అయ్యే వడ్డీని ఎట్ల కడతాము? మన కడుపులకు ఏం తింటాము? వచ్చే సంవత్సరం మన పాప పెండ్లి ఎట్ల చేస్తాము? వద్దు సామీ వద్దు. ఆ సేద్యమూ వద్దు ఆ అప్పులూ వద్దు. కూలీ నాలీ

చేసుకుని బతుకుదాము. ఉంటే తిందాము. లేకపోతే ఇన్ని నీళ్లు తాగి పస్తులు పడుకుందాము' అని మొగునితో మొరపెట్టుకుండె.

భార్య ఏడుపు చూసి పెన్నప్పకు గుండె జారిపాయ లోలోపల.

'థూ నీయమ్మ పిరికి లంజిముండా. అపశకునపు కూతలు కూసినావంటే చూడు మూతి మీద గుద్దుతాను. మీ ఆడోల్ల మాటలు విని బాగుపడిండే మొగోడెవడు?' అని చీమిడి చీదేసినట్ల మాట్లాడె భార్యని.

ఆ యమ్మెమో నోరు మూసుకుండెగాని పెన్నప్పకేమో ధైర్యం సాలకపాయ. 'ఆ అప్పులూ వద్దు, ఆ సేద్యమూ వద్దు' అని పెండ్లాము ఏడ్సిన ఏడ్పు చెవుల్లో గింగురుమంటా మోగబట్టె.

'ఐదెకరాలు ఇత్తుతాను సాలు. మిగతా ఐదెకరాలు బీడు పడి ఉండనీలే. ఒకయాల వానలు రాలేదే అనుకో. మూడు వేలకు మునిగే బదులు ఒకటిన్నర వేయికి మునిగేది మేలుకదా' అని యోచన చేసె. సగం ఇత్తనాన్ని అదే రేటుకు ఈడిగ రంగప్పకు ఇచ్చేసె. పెన్నప్ప భార్య 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుండె.

కృత్తికలో సేద్యం చేసిండిరి. పునర్వసులో వానొస్తే ఇత్తనం ఏయల్లని కాసుకోండిరి.

మోడాలేమో కనపడతాండె గానీ అవి గుడ్డిమబ్బులు మాదిరి యాటికి యాటికో కొట్టుకుపోతాండె. ఒక్కటీ కిందికి దిగలే.

'ప్రపంచంలో పాపాలు పెరిగిపాయ. వానలు కురసమంటే ఎట్ల కురుస్తాయి మల్ల' అనుకుండె పెన్నప్ప.

పునర్వసు పాయ. పుష్యమి వచ్చే. వాన రాలే.

దినాలు జరగబట్టె. కప్పలకు పెండ్లిల్లు చేసిరి. వాన రాలే.

భారతంలో విరాటపర్వం చదివించిరి. వానరాలే.

ఇంటికి ఒకరు గుంపుగా చేరి రాత్రి లాంతర్లు పట్టుకుని ఊర్లో సందు గొందులన్నీ తిరగతా బజన్లు చేసిరి. వాన రాలే. ఊరి బొడ్డురాయి మింద నూటా ఒకటి కడవల నీళ్లు పోయించిరి పెళ్లి కాని పిల్లలతో. కాయ కొట్టి పూజ చేసిరి. కాని వానేమో రాలే.

'ఎట్లబ్బా! వానరాలే' అని శెట్టి అంగట్లో గొంతు కూర్చుని దిగులు పడతాండె పెన్నప్ప వక్కాకు నములుకుంటా. ఆడ ఇంకా నలుగురైదుగురు రైతులు సంద కాడ ముద్ద తినొచ్చి బీడీలు కాల్చుకుంటా కూర్చోనుండిరి.

'లే. పెన్నగా. నీ దగ్గర ఒకటిన్నర పల్లానే కదా ఇత్తనాలు ఉండేది పాపం. నేను ఒకటిన్నర పల్లా ఇస్తాను. కొండబోయి ఆ మిగతా ఐదెకరాల్లో కూడా సల్లుకోరా. ఆ భూమి ఏం పాపం చేసిందని దాన్ని మాత్రం బీడు పెడతావు' అనె కువ్వాడమాడతా లింగప్ప.

బైటికి లేసిపోయి వక్కాకు ఎంగిలి వూసొచ్చి తెలివిగా నవ్వె పెన్నప్ప. 'వానరాలే కాబట్టి ఇత్తనం కొండబో అంటాండావు. అదే వాన గినా వచ్చింటే ఈ మాట అనేవానివా? నీది ఏం తెలివిరా లింగా. వాన ఎట్లా రాదు అనుకుని నీ దగ్గరున్న ఇత్తనాన్ని ఎవరికన్నా తగలగట్టి దాని మింద వడ్డి అయినా రాబట్టుకోవల్ల అని అనుకుంటాండావు. నీకే కావల్లంటే చెప్పు. నా ఒకటిన్నర పల్లా ఇత్తనం కూడా నీకే ఇచ్చి కృష్ణా, రామా అని కూలికి పోతాను నిశ్చింతగా' అనె.

'అంతే మరి. కరెట్ మాట అనె పెన్నగాడు. ఈ సేద్యాలు చేసుకునే దానికంటే కూలికి పోయ్యేది మేలు కదా అప్పా! ఎవరికయినా కావల్లంటే చెప్పండి. నా దగ్గర కూడా ఎనిమిది పల్లాలు ఇత్తనం ఉంది' అనె ఆడనే కూర్చుని బీడీ తాగుతాండే పెద్దరైతు శంకరప్ప.

శంకరప్ప మాటలు విని తృప్తిగా గాలి పీల్చుకుండె పెన్నప్ప.

'అయితే నేను మంచిపనే చేస్తి. సగం ఇత్తనం ఆ రంగప్పకు కొలిసిచ్చి బరువు తగ్గించుకుంటిలే. శంకరప్ప వంటి పెద్ద రైతులకే గుండె సాలక పోతే ఇంక నేనెంత? నా బతుకెంత' అనుకుండె.

'యాలర్రా? అంతా అట్ల నిరుత్సాహపడతారూ? చెళ్లెకెరకు చార్జీలు పెట్టుకుని పోయి అప్పు చేసి ఇత్తనం తెచ్చిండేది ఎందుకు? భూమిలో ఇత్తేదానికా? లేక ఇంకొకరికి ఇచ్చేదానికా? చింత పడద్దండి! వస్తుంది! వాన వస్తుంది!' అని ధైర్యం మాటలు చెప్పె శెట్టి.

కొంచెం సేపట్లో వాతావరణమంతా మారిపాయ. గాలి నిలిసిపాయ. 'అబ్బ. బొలె ఉడుకు పెడతాందప్పా' అని చేతిలో బనియను ఊపుకుంటా బైటికొచ్చి ఆకాశం దిక్కు చూసె శెట్టి.

'మోడెం బాగానే పట్టింది' అనె.

మెరుపులు మెరిసె. ఉరుములు ఉరిమె.

'అర్జునా! ఫల్గునా! పార్థా! కిరీటీ!' అని తలుసుకుండె పెన్నప్ప.

అంతా వాన గురించే మాట్లాడుకోబట్టిరి.

'తూర్పు గడ్డ మింద అప్పుడే రెండు పదున్లు వాన కురిసిందంట. భూమి అంతా పచ్చగైందంట'

'ఔనంట. ఆ పక్క అంతా ఆరుద్ర కార్తిలోనే ఇత్తనం ఏసినారంట'.

'పునర్వసు రాకుండానే ఏసినారే. అంత ముందుగా ఎందుకు ఏసినారబ్బా?'

'ఏమో? మల్ల మల్లా వాన వస్తుందని గారంటీ ఏముంది? ముందో, వెనకో ఇత్తనం పడితే సాల్లేరా బగవంతుడా అని ఏసింటారు.'

'వాన గినా వస్తే ఇదే కరెట్ టైము ఇత్తనం ఏసేదానికి.'

'ఔను మల్ల. పునర్వసు, పుష్యమి రెండూ బలం కార్తులు కదా'

'మొన్న మొన్న... అంటే ఒక వారం దినాల కిందట పిల్లలపల్లి మింద మంచి వానంట'

'అవును. ఆ వాన మనకు తగలాల్సింది. మధ్యలో గాలొచ్చి పిల్లలపల్లికి కొట్టుకుపాయె'

'ప్రాప్తం అప్పా, ప్రాప్తం. వచ్చేవరకూ వాన కాదు. తినే వరకూ బువ్వ మనది కాదు'

'ఈ పొద్దు మాత్రం వాన వచ్చి తీరుతుంది మామా'

'ఔను. నాక్కూడా అట్లే అనిపిస్తాందిరా'

అంతా ఇట్లా మాట్లాడుకుంటాంటే మోడం పట్టి సన్నగా చినుకులు రాలబట్టె. పెన్నప్పకు మల్లా ఆశ పుట్టె.

'ఏమో. వానలు వస్తాయేమో. ఈసారి పంటలు పండుతాయేమో. రంగప్పకు సగం ఇత్తనం ఇచ్చి పొరపాటు చేస్తినేమో. పది పకరాలకూ ఇత్తనం సల్లుకుంటే పంటలు పండి బాగుపడతానేమో. థూ. ఈ ఆడోల్ల మాట వినకూడదు. పిరికిమందు పోస్తారు లంజలు' అని తిట్టుకుండె పెండ్లాన్ని.

అంతా బయటికిపోయి వాన వచ్చే దిక్కుకు చూస్తా నిలబడిరి.

'అదిగదిగో. తిమ్మప్పకొండ మీద బొలె కురుస్తాంది.'

'బొమ్మగానిపల్లి మింద మంచి పదునువాన'

'కొండకాడ నుంచీ గాలి మన ఊరి దిక్కే తోలతాంది'

'కృష్ణా! రామా! ఆ వానని మా ఊరి దిక్కు కూడా పంపించు తండ్రీ! నీకు

చేతులెత్తి మొక్కుతాము' అని పెన్నప్ప గొణుక్కుండె.

కానీ దేవుడు పెన్నప్ప మొర వినలే.

క్షణంలో గాలి లేసె. తీటకల్లు పక్క కొట్టుకొచ్చే మోడాలన్నీ పులికల్లు దిక్కుకు కొట్టుకుపాయ. అంతే. పైకి చూస్తే ఒక్క మోడం లే. ఒక్క వాన చినుకు లే. రవంత సేపటికి ఎండ కూడా కాయబట్టె.

'ఎట్లా పని చేస్తివిరా భగవంతుడా! బాగా మోడాలు పట్టిండె వానని ఎగ్గొటేస్తివే. మా నోటి కాడ కూడు తీసేసినట్లు' అని దిగులు పడతా బీడీ ముట్టించుకుండె పెన్నప్ప.

పెండ్లాం గుర్తొచ్చె.

'పాపం. దాన్ని తిట్టినందుకు చెంపలేసుకోవల్ల. అది మంచి మాటనే చెప్పె. దాని మాట విని రంగప్పకు ఇత్తనం ఇచ్చేసినందుకు నాకు మేలే జరిగె. సగం అప్పు మీద వడ్డీ తగ్గిపాయ. అది పిరికిలంజ కాదు. నేనే ఆశపోతు నాకొడుకుని' అనుకుండె.

దినాలు గడిచె.

పుష్యమి పాయ. ఆశ్లేష వచ్చె.

జనమంతా చప్పగ అయిపాయిరి.

'కార్తి తప్పిపాయ. ఇంక వాన వచ్చినా లాభం లేదు' అనిరి.

కొత్త కార్తి మొదలైన వారం దినాలకు వాన వచ్చె.

'ఈ వానే రెండువారాల ముందు వచ్చి ఉండకూడదా! ప్చ్' అంటా చప్పరించేసిరి.

ఆశ్లేషలో చెనిక్కాయ ఏసేదానికి చానామంది రైతులకు మనసు ఒప్పలే. దేవుడు చల్లగా చూసి నాలుగు వానలు కురిపిస్తే పంట అయిపోదా అని కొందరేమో ఇంకా ఆశగానే ఉండిరి. కానీ పూర్తి ధైర్యం చేయలేక పోయిరి.

ఇరవై ఎకరాలు ఉన్నోల్లు పది ఎకరాలకే పంట పెట్టిరి. పది ఎకరాలు ఉన్నోల్లు ఐదెకరాలకే ఇత్తనం సల్లిరి. కొందరు ఉరువు సేద్యం జోలికే పోలే.

పెన్నప్ప ఐదెకరాలకు ఇత్తనమేసి మిగతా ఐదెకరాలు బీడుపెట్టె.

ఇత్తనమేసిన వారం దినాలకు మొలకలొచ్చె. తల్లి గర్భంలోని మైల పూసుకుని వచ్చినట్లు మొలకలన్నీ నెత్తి మింద మట్టి పలకలు మోస్తా పైకి లేస్తాండె. రెండు

మూడు దినాలు గడిచె. ఇత్తనం రెండు బద్దలై చెరి ఒక పక్క ఇడిపాయ. ఆ ఇత్తనం బద్దలు రెండూ పిచ్చిపిల్ల రెక్కలు మాదిరి ఆకాశంలోనికి ఎగరల్లని ఆత్రపడతా వున్నట్లుండె.

మఖలో వానొచ్చె. వానొచ్చిన మూడు దినాలకు కలుపు తీసి సేద్యం చేసిరి.

పుబ్బ వచ్చె. సెట్లు పూత పట్టె. రజస్వల అయిన ఆడపిల్ల మాదిరి బంగారు పొంగినట్లు మెరిసిపోతాండె. ఇంకా కొన్నాల్లు గడిచె. సెట్టు బాగా పుంజయి ఏపుగా ఎదిగి మంచి పొగరు మీద ఉండె. ఆ వేరుశనగ పూత మింద తేనెటీగలు వాలతాండె. పిల్లోల్ల సంతోషం తల్లి ముఖంలో కన్పించినట్లు ఆ వేరుశనగ చెట్లలోని కళ మన్నులోనికి గూడా పాకిపోతాండె.

కళకళలాడే ఆ ఐదెకరాల చేను పక్కన బీడు పడిన ఇంకో అయిదెకరాల చేను ముండమోపి మాదిరి కన్పించె పెన్నప్పకు. కొన్నాళ్లకు పూత రాలిపోయి భూమి లోనికి ఊడలు దిగుతాంటే తట్టలోకి అన్నం పెట్టినట్లు ఉండె రైతుకు.

ఉత్తరలో వాన రాలే.

హస్తలో కూడా వాన రాకుండా పగబెట్టె.

ఒక పక్క ఊడలకు పిందెలు కాస్తాంటే ఇంకో పక్క భూమిలో తేమ లేక సెట్లు వాడబట్టె. వారం దినాలు అన్నం లేక పస్తులతో సోలిపోయిన గర్భిణీ స్త్రీ మాదిరి సెట్లన్నీ ఊడలతో పిందెలతో ఒక పక్కకు ఒరిగి పోయి ఉండె. చేను పక్క చూసిన పెన్నప్పకు తన కడుపులో ఎవరో చేయిపెట్టి దేవినట్లాయ.

చిత్తకార్తె పోతుందనగా మూడు దినాలు జడి పట్టుకుండె. పైరు రవంత కళకళలాడె. పెన్నప్పకు మల్లా రవంత ఊపిరి తిరిగినట్లాయ. కానీ ఆ ఆశ కూడా పక్కువ కాలం నిలవలే.

స్వాతి పాయ. వాన రాలే!

విశాఖ వచ్చె. వాన రాలే!

సలి మొదలాయ. ఇంక వాన మింద ఆశ ఇడిసి పెట్టె పెన్నప్ప. చిత్తలో పుట్టిన రెండో పూత ఊడలై భూమిలోకి దిగకుండానే ఎండిపాయ సెట్టుమింద. తొలి పూత మాత్రమే ఊడలు దిగి కాయలు కాసె. ఆ కాయలలో గూడా రెండు మూడు కాయలు ఒక మాదిరిగా ఉండె. ఇంకో రెండు మూడు కాయలు లొత్తలు పడె. లొత్తలు పడిన కాయిలో గుడ్డు లోపలే సచ్చిపోయిన కోడిపిల్ల మాదిరి ముదరకపోయి నాసుగా ఉండె ఇత్తనం.

చెనిక్కట్టి పీకి కుప్పపెట్టి కాయిని ఇడిపిస్తే ఎకరాకు మూడు మూటలు కూడా దిగలేదు పంట. 'అయ్యో దేవుడా' అనుకుండె పెన్నప్ప.

చెళ్లికెరకు పోయి వచ్చినోళ్ల దగ్గర చెనిక్కాయ రేటు విచారిస్తాండె.

ఒక వారం క్వింటాలు చెనక్కాయ అయిదు నూర్లు అనిరి. రెండు వారాలు పోయినంక అయిదు నూటా యాభై అనిరి. ఇంకో వారం ఆరు నూర్లు అనిరి. మళ్లీ రెండు వారాలు జరిగినంక అయిదు నూటా యాభైకి తగ్గిందనిరి.

మార్కెట్ రేటు ఎక్కుతా తగ్గుతా వచ్చె. పెన్నప్ప మనసు 'అమ్ముదామా? వద్దా?' అని గునిసి గునిసి సంశయిస్తాండె. రేటు ఇంకా పెరుగుతుందేమో ఇంకా పెరుగుతుందేమో అని ఆశ పడతాండె.

మట్కా నెంబరు కోసం అర్ధరాత్రి వరకూ మేలుకున్న వానికీ, మంచి మార్కెట్ రేటు కోసం పదురు చూసే పెన్నప్పకూ భేదం లేకపాయ.

ఒక వారం ఆరు నూర్లు రేటు వచ్చె. ఆ రేటు ఇంకా ఎక్కుతుందేమో అనుకుండె. కానీ ఆ రేటు మళ్ల వారానికి అయిదునూర్ల ఎనభైకి తగ్గె. రంగప్ప అదే రేటుకు అమ్ముకుని వచ్చిండె తన చెనిక్కాయని.

పెన్నప్ప భయపడె. ఆలస్యం చేస్తే ఆ రేటు కూడా దక్కదేమో అనుకుండె. మూటలు లారీకి ఎత్తుకుని చెళ్లి కెరకు ప్రయాణమైపాయ.

ఆడ చెనిక్కాయ తూంచిరి. కాయి లొత్తలు పడి ఉండె కదా, అవటం రాలే! క్వింటాలుకు రెండున్నర మూటలు తూగాల్సిన కాయి మూడు మూటలు తూగె.

తూంచేటప్పుడు చెనిక్కాయలో తోకలూ, గీకలూ, పొట్టూ గిట్టూ ఉన్నాయని చెప్పి క్వింటాలుకు మూడు కేజీలు కాయని తీసేసుకుండ్రి తరుగు కింద. దుడ్లు లెక్క కట్టేప్పుడు క్వింటాలుకు పదహైదు రూపాయలు తగ్గించుకుండ్రి నాసిరకం కాయ అని చెప్పి. ధర్మకార్యాలకు అని చెప్పి నూటికి ఒక రూపాయి పట్టుకుండ్రి. ఇత్తనానికి ఇచ్చిన అప్పును విరగేసుకుండ్రి. అప్పు మింద పెరిగిన వడ్డీ దుడ్లను కూడా పట్టుకుండ్రి.

కడాకు షావుకారు పెన్నప్ప చేతిలో దుడ్లు పెట్టలే; ఒక పట్టీని అందిచ్చె! పట్టీలోకి చదువురాని కళ్లతో తొంగి చూసి, 'ఎంత వస్తుంది ధనీ, చేతికి?' అని అడిగె పెన్నప్ప.

'నువ్వే ఇంకా ఎనభై రూపాయలు బాకీ పడతా వప్పా' అనె షావుకారు నిదానంగా.

పెన్నప్ప ఏడ్సలే.

'అయిదెకరాల సేద్యానికి ఎనభై రూపాయలు నష్టం. పది ఎకరాల సేద్యానికి నూటా అరవై రూపాయలు నష్టం వచ్చేది. మేలేకదా! నాకు మంచే జరిగె కదా!' అనుకుండె.

'అయిదు ఎకరాల్లో నేనూ, నా పెండ్లామూ, నా కూతురూ, నా ఎద్దులూ చేసిన రెక్కల కష్టం విలువ రెండు వేలు. నా పెండ్లాం మాట వినకుండా ఇంకొక అయిదె కరాల్లో కూడా సేద్యం చేసింటే ఇంకొక రెండు వేల రూపాయలు మా రెక్కల కష్టంలో దండగైపోయేది. మేలే కదా. నాకు మంచే జరిగె కదా' అనుకుండె. అనుకుని పెన్నప్ప నవ్వె. తిక్క నవ్వు నవ్వె.

ఆ నవ్వు చూసి 'పెన్నప్పకు తిక్కపట్టింది' అని అనుకుండె ఆసామి.

నవ్వు నిలిసిపోయినంక షావుకారిని ముప్పై రూపాయలు అప్పు అడిగె పెన్నప్ప.

'పిచ్చి పట్టినోల్లు అప్పు అడుగుతారా పక్కడన్నా? అడగరు కదా! అందుకని పెన్నప్పకు పిచ్చిపట్టలే'దని తీర్మానం చేసుకుండె షావుకారు.

పాపం! అనుకుని జేబులోంచీ ఇరవై రూపాయలు తీసిచ్చె. ఎనభై రూపాయలతో చేరి మొత్తం నూరు రూపాయల అప్పు అని చెప్పి పెన్నప్ప పేరిట ఖాతాలో రాసుకుండె.

'దిగులుపడొద్దు అప్పా. ఎల్లకాలమూ ఇట్లే ఉండదులే. మంచి దినాలు వస్తాయిలే' అని ధైర్యం చెప్పి పంపె.

పెన్నప్పకు సమర్త అయి మూడేళ్లు దాటిన పెద్ద కూతురు గుర్తొచ్చె. ఆ పాప పెండ్లిని వచ్చే సంవత్సరానికి వాయిదా ఏసె.

భుజం దగ్గర పిగిలిపోయిన పెండ్లాం రవికలు గుర్తొచ్చె. ఆ రవికను వచ్చే నెలకు వాయిదా ఏసె.

పలక కావల్ల అని పోరుపెట్టే సిన్న కొడుకు గుర్తొచ్చె.

ఆ పలకను వచ్చే వారానికి వాయిదా ఏసె.

పొద్దుటి నుంచీ ఏమీ తినక కడుపులో కొక్కులు తోడినట్లు ఆకలి అయితాండె.

ఆ అన్నాన్ని ఇంకో పూటకు వాయిదా ఏసుకుండె.

అట్ల వాయిదా ఏసుకుని

చార్జీలకుపోగా మిగిలిన దుడ్లలో పప్పులూ, బొరుగులూ, బెండ్లూ, కారం

సుట్టలూ కొనుక్కొని ఇడి చేసిన అడ్డ పంచలో మూట కట్టుకుండె. ఆ మూటను కన్నకొడుకు మాదిరి సంకలో పొదువుకుని ఉత్త కడుపుతో బస్సెక్కి ఊరు చేరుకుండె.

దినాలు జరిగిపోబట్టె. పని దొరికినప్పుడు కూలికి పోతాండె.

పనిలేనప్పుడు ఎల్లమ్మ గుడికట్ట మింద కూర్చుని పులీ మేకా ఆడతాండె బీడీ ముట్టించుకుని.

ఇరవై ఏండ్ల కిందటా ముప్పై ఏండ్ల కిందటా ఏ ఏ ఊర్లలో ఎంత పెద్ద వానలు కురిసినాయో, ఏ ఏర్లు ఎట్ల పొంగినాయో ఎవరెవరో కథలు కథలుగా చెబుతాంటే నోరు ఎల్లబెట్టి వింటాండె.

మల్లీ ఆరుద్ర వచ్చె. పునర్వసు వచ్చె.

పెన్నప్ప ఆకాశంలో మోడాల కోసం చూడబట్టె.

పంచాయతీ రేడియోలో వాతావరణం గురించి వినబట్టె.


పోలేరమ్మ తల్లి పైలోకొచ్చే దానయ్యను 'వానలు వస్తాయా, రావా?' అని అడుగుతాండె.

బాపనోల్లని ప్రభవ నామ సంవత్సరంలో వానల గురించి శాస్త్రం అడుగుతాండె.

ఈసారి ఇత్తనాలు అయిదెకరాలకు సల్లుదామా? లేక పదెకరాలకు సల్లుదామా అని ఆలోచన సేయబట్టె. వానొచ్చే లోపల చెళ్లికెరకు పోయి ఇత్తనం కాయ తెచ్చి రడీగా పెట్టుకోవల్లని ఆత్రంగా ఉండె.

దినాలు జరగబట్టె. కప్పలకు పెండ్లిల్లు చేసే కాలం వచ్చె.

పైనున్న ఆకాశం కిందనున్న పెన్నప్పను నంగనాచి మాదిరి చూస్తానే ఉండె.



వాన జోరు తగ్గిందీ లేనిదీ అంతుబట్టడం లేదు.

గాలి మాత్రం గుండెల్ని హడలెత్తిస్తూంది.

ఎక్కడ్నో'ధడేల్ ధడేల్' అన్న రేకుల శబ్దం గాల్లో వినబడింది. అందరూ తల్లడిల్లిపోయారు.

'కాపా! ఏడనో పుగాకు బ్యార్నీల రేకులు గాల్లోకి లేచినట్టుంది' అన్నాడు సాకలి కోటిలింగం.

'ఒరేయ్. ఏమీ భయపడమాకండి. ఎన్ని కూలిపోయినా ఈ ఇంటికేమీ కాదు' అరిచేడు గురవయ్య. అలా అంటున్నప్పుడు అతడి కంఠం వణికింది.

ఆ ఇంట్లో వాళ్లందరికీ ప్రాణాల మీద ఆశపోయింది. సీతయ్య వణకడం కూడా ఎక్కువైంది.

వెంకట్రాముడు లాంతరు తీసుకొచ్చి తండ్రి ముఖమ్మీద వెల్తురు పడేట్టు పెట్టాడు. ఆ వెల్తురికి సీతయ్య కళ్లు తరవకుండానే 'వెంకట్రాముడూ' అని పిలిచేడు.

పిలిచి జవాబు కోసం చూడకుండా–

'ఈ సలి నన్ను బతకనిచ్చేట్టు లేదురా. ఇదే ఆఖరు గాలోన కామాల నా జీవితానికి. ఈ కట్టె నుంచి జీవి ఎగిరిపోయే సమయం వచ్చినట్టుంది' అని ఆగి 'మీ అమ్మ యాడుందిరా' అడిగేడు.


సుబ్బమ్మ నీళ్లు నిండిన కళ్లతో సీతయ్య మంచమ్మీదకు వంగింది.

'ఏమేవ్. నాదో కోరికుంది తీరుస్తావా? నాకిప్పుడు బాగా నిప్పుల్లో కాల్చిన ఎండు చేపముక్కలు తినాలనుందే' అన్నాడు సీతయ్య.

ఆ మాట చెప్పినప్పుడు ఎందుకనో దెయ్యపుగాలి కూడా కాసేపు ఆగి వింది.

సుబ్బమ్మ నిర్ఘాంతపోయి మంగళసూత్రాన్ని మరోసారి కళ్లకద్దుకుంది.

– **కాట్రగడ్డ దయానంద్** (ఎండు చేపలు కథ నుంచి)



# ముసురు పట్టిన రాత్రి

## గుమ్మా ప్రసన్న కుమార్

● రచనా కాలం: 1979

**గుమ్మా ప్రసన్నకుమార్:** ఎనభయ్యవ దశకంలో విస్తృతంగా కథలు రాసిన రచయిత. వీరి 'పిల్లి' కథ ప్రసిద్ధం. స్వస్థలం గుంటూరు ప్రాంతం అని తెలుస్తున్నది. హైదరాబాద్ ఏ.జి. ఆఫీసులో పని చేసి విశ్రాంత జీవనం గడుపుతున్నారు.

'వచ్చే స్టేషను బొబ్బిలేనా?'

'అదేటది? బొబ్బిలి కదూ'

శివరావు లేచి నిల్చున్నాడు. కాళ్లల్లో వణుకు ప్రారంభమయింది. గుండెలో బరువు చోటు చేసుకుంది. వళ్లంతా నిస్సత్తువ ఆవరించింది. తిమ్మిరెక్కిన మనిషిలా స్తబ్ధుగా నిల్చున్నాడు.

చీకటిని చీల్చుకుంటూ పోతున్న రైలు వేగం తగ్గింది. కంపార్ట్‌మెంట్ గుమ్మం దగ్గర నిల్చున్నాడు శివరావు. చినుకులు మొహం మీద పడుతున్నాయ్.

ఫ్యాక్టరీ, కోటి చెరువూ, ఆసీలు మెట్టా వెనక్కి జారిపోయాయి. రైలు బొబ్బిలి ప్లాటుఫారం మీద ఆగింది. వర్షపు జల్లు మొహానికి కొడుతుంటే జనాన్ని తోసుకుంటూ తడబడే అడుగులతో కిందకు దిగాడు శివరావు.

పదిహేనేళ్ల క్రితం –

ప్లాటుఫారం పూర్తిగా కప్పుతూ ఇప్పుడున్న షెడ్ లేదు. ఇప్పుడు ఓవర్‌బ్రిడ్జి లేదు. కాలం తెచ్చిన మార్పుకి శివరావు మనసు ఒక్కసారి ఆశ్చర్యపోయింది. తను బొబ్బిలే వచ్చాడా. ఎదురుగా తాటికాయంత అక్షరాలతో ఉన్న బోర్డు– ఊపిరి పీల్చుకున్నాడు.

టిక్కెట్టిచ్చి బయటపడ్డాడు. ఈదురుగాలి వీస్తోంది. చిన్న చిన్న తుంపరలు పడ్తున్నాయి. గూడ్స్ షెడ్ పక్క నుంచి నడిచాడు. గూడ్స్ షెడ్ ఆ చీకట్లో ముడుచుకు పడుక్కున్న ముసలమ్మలా ఉంది. ఇష్టం లేని పాత స్నేహితుడ్ని చూసినట్టు చీకట్లో కలిసిపోయింది.

ఎనిమిదేళ్ల వయసుకే రోజూ వచ్చేవాడు శివరావు ఇక్కడికి. కాపలావాళ్లకి

తెలియకుండా ఏదో ఒకటి చేజిక్కించుకునేవాడు. దొరికింది అమ్మి తప్పకుండా హోటల్‌కి వెళ్లేవాడు. సిగరెట్ తాగేవాడు. మంచేదో చెడేదో తెలియని రోజులవి. భగవంతుడనే వాడుంటే తనని చాలా అన్యాయం చేశాడు. లేకపోతే తన బతుకీ రోజు ఇలా వుండేది కాదు. ముప్పై ఐదేళ్ల వయసుకే మరొకరి మీద ఆధారపడి బతకవలసిన రోజు దగ్గరకు వచ్చేసిందని తెలిసిపోయింది శివరావుకి.

అలా జరుగుతుందని తెలిస్తే తన బతుకుని మరో విధంగా తిప్పుకునే వాడేమో. అందుకే దేవుణ్ని తిడుతుంటాడు శివరావు. మనిషి తప్పు మార్గాన పోతుంటే వాడికి సరియైన దారి చూపించి నడపడం దేవుడి బాధ్యత కాదా? నిట్టూర్చాడు శివరావు.

పదేళ్ల వయసుకే శివరావు కొంత చొరవ అలవర్చుకొన్నాడు. చోర విద్యలో మెట్టెక్కిపోయాడు. శివరావుకి వచ్చిన విద్యలు చూసి ఆశ్చర్యపోయేవాడు ముసలయ్య. శివరావుకు మంచి భవిష్యత్తున్నదని కూడా అప్పుడప్పుడూ శివరావుతోనే అనేవాడు. ఆ దీవెన శివరావులోని విద్యని మరింత విజృంభించేట్లు చేసింది. వీర విహారం చేసేవాడు. శివరావు ముఖ్యకేంద్రాలు బజారు, స్టేషను, సంత. ఆ మూడింటిలోనూ ఎటువేపు వెళ్లినా ఓ వారం రోజులకు సరిపడా గ్రాసం తెచ్చుకునేవాడు. పెద్దవాళ్లతో వినయ విధేయతలు నటించగలిగేవాడు. దొంగతనం చేస్తూ దొరికిపోయినప్పుడు ఇంట్లో దరిద్రం, తల్లిదండ్రుల అసహాయత, చెల్లెళ్లు, తమ్ముళ్లు, అమ్మమ్మ ఇంకా ఎందరో ఎలా మాడిపోతున్నారు, ఏ పరిస్థితుల వల్ల తనీ దొంగతనం చేయవలసి వచ్చిందో జాలిగా చెప్పేవాడు. తమది ఒకప్పుడు బాగా బతికిన కుటుంబమని కూడా చెప్పేవాడు. వాళ్ల సానుభూతిని సంపాదించేవాడు. ఎక్కడా ఏదీ దొరకనప్పుడు ఇంట్లో దొరికింది అమ్మేసుకునేవాడు.

అదంతా తలుచుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది శివరావుకి.

టింబరు డిపోకటూ ఇటూ రావుగారి వీధిలో కట్టిన ఇళ్లకేసి ఆశ్చర్యంగా చూశాడు శివరావు. పదిహేనేళ్ల క్రితం ఈ ప్రాంతం నిర్జనంగా ఉండేది. రాత్రి ఏడు దాటిన తర్వాత పెద్దవాళ్లు సైతం ఇటు వచ్చేవారు కారు. అప్పుడు ఎనిమిది తర్వాత తనొక్కడే ఇటువేపు వచ్చేవాడు. తన ధైర్యానికి విస్తుపోయిన ముసలయ్య వంక చూస్తూ సిగ్గుపడిపోయి, ఆనందపడేవాడు శివరావు.

తుంపరలుగా పడుతున్న వర్షం కొద్దిగా పెద్దదైంది. దానితో పాటుగా వీస్తోన్న ఈదురుగాలి వర్షం ఇంకా ఎక్కువైనట్లుగా భ్రమింపజేస్తోంది. శివరావు వీటన్నిటికీ

అతీతమైపోయినట్లు చిన్నగా నిర్విరామంగా నడుస్తున్నాడు.

అమ్మ రోజూ మొత్తుకునేది. కళ్లనీళ్లు పెట్టుకునేది. తను దొంగతనం చేసి దొరికిపోయి దెబ్బలు తిని వచ్చిన రోజున తనను కౌగిలించుకొని బావురుమనేది. ఒక్కరోజు కూడా తనని తిట్టేది కాదు. కొట్టేది కాదు. కళ్ల నీళ్లతో ప్రాధేయపడేది. ఇలాంటి పనులు చేసిన మామయ్యని దండించిన ఫలితంగా అతను కొన్ని రోజులు ఇల్లు విడిచి పారిపోయాడట. కొన్నాళ్ల వరకూ అతని జాడ కోసం మామయ్య తల్లిదండ్రులు పడ్డ అవస్థ అంతా ఇంతా కాదుట. చివరకు ఎంతో ఖర్చుచేసి ఇంకెంతో శ్రమపడిన మీదట అతను దొరికాడట. ఈ సంగతి ఎప్పుడో మాటల సందర్భంలో శివరావు విన్నాడు. అందుకే అమ్మ తనను కొట్టడం లేదని కొన్ని రోజుల తర్వాత నిర్ధారించుకున్నాడు.

నాన్నా ఏమీ అనేవాడు కాదు. ఎప్పుడూ ఉబ్బస రోగం. చలికాలం, వర్షా కాలంలో తరచూ పనిలోకి వెళ్లేవాడు కాడు. రోజంతా కంబళి కప్పుకుని పడుకునేవాడు. ఎండలోనే ఉండేవాడు. తను కాక అక్క, ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు. అక్కకి పెళ్లయింది. అయిన మరుసటి సంవత్సరం నుంచీ ఇంట్లోనే ఉండిపోయింది. కొత్తలో అమ్మ అక్క దౌర్భాగ్యానికి రోజూ ఏడ్చేది. బావ చచ్చిపోయాడు అకస్మాత్తుగా.

వర్షం కొద్దిగా నిల్చినట్లయి మళ్లీ మొదలైంది. తనకు బాగా పరిచయమున్న ఇళ్లు కొంచెం పొట్టివయ్యాయనుకున్నాడు. శివరావు పొడుగెదిగాడు. గోడల మీద పోస్టర్ల బట్టి వూర్లో రెండు మూడు హాళ్లున్నట్లు తెలుసుకున్నాడు. కాలేజీలు, ట్యుటోరియల్ కాలేజీలు, హోటళ్లు రకరకాలవి వెలిసినట్లు గోడల మీద నినాదాల బట్టి వూహించుకున్నాడు.

బస్‌స్టాండు దాటాడు. చలిగా ఉంది. బాగా తడిసిపోయాడు శివరావు. బహుశా రేపటెల్లుండిలో తప్పకుండా తనకు జ్వరం వచ్చేస్తుంది. తరచూ జైలు జీవితం శివరావు శరీర తత్వాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ నాలుగైదేళ్లలో శివరావు ఆరోగ్యం మరికొంచెం దిగజారిపోయింది. కీళ్లనొప్పులు, సీజను మారినా నీళ్లు మారినా జ్వరం రావడం జరుగుతోంది. అక్కడక్కడా శరీరం కొంచెం పొంగినట్లుగా ఉంటోంది. అది ఈ మధ్యనే గమనించాడు శివరావు. ఏం రోగమో శివరావుకి బోధపడలేదు.

చారల వీధి మొగలో ఆగాడు. గోపాలం కొట్టు అక్కడే వుంది. పరీక్షగా చూశాడు. గోపాలం కూర్చున్నాడు దుకాణంలో.

'చార్మినార్ సిగరెట్' అన్నాడు శివరావు పొడిగా.

'ఏటి? పెట్టీచ్చీమంటారేటి?' అన్నాడు గోపాలం.

'లేదు సిగరెట్.'

సిగరెట్టు వెలిగించి కాస్సేపు అక్కడే నిల్చున్నాడు. ఆ వీధిలో తను కుటుంబం గురించి అడుగుదామా వద్దా అని సంశయించాడు. చిన్నప్పటి నుండీ గోపాలానికి తమ కుటుంబం గుర్తే. తన అవతారం గోపాలానికి గుర్తుండి వుండదు. చిన్నగా దగ్గి అడిగాడు.

'... వారి కుటుంబం ఇక్కడే వుందా?'

'ఎవరూ? వాళ్లా... ఇక్కడే ఉన్నారు' అన్నాడు గోపాలం.

'మందే వూరు?' అన్నాడు మళ్లీ.

శివరావు ఏదో చెప్పాడు. అతని వేళ్లు వణుకుతున్నాయి. అక్కడ నిలబడలేక పోయాడు. చూరులోంచి బయటకు వచ్చి మళ్లీ వర్షంలో కలిసిపోయాడు. కరెంటు పోయినట్లుంది. రోడ్డంతా దీపాలు లేవు. ఆ వీధిలో తనకు తెలిసిన ఇళ్ల తాలూకూ ఆసామిలందర్నీ ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నాడు.

అదిగో ఆ టర్నింగులో ఇల్లుంది. శివరావు ఆగిపోయాడు. గుండె లిప్తకాలం ఆగిపోయింది. ఒక్కొక్క అడుగే వేస్తూ ఇల్లు చేరుకున్నాడు. ఇల్లు కొంచెం క్రుంగిపోయినట్లుంది. శివరావు కుటుంబానికి పూర్వీకులు మిగిల్చిపోయిన ఆస్తి ఇదొక్కటే. ఇంట్లో ఎవరున్నారో ఎందుకు మిగిలారో ఎవరి పేరుతో తలుపు తట్టడమో...

నిస్సత్తువతో ఆ తడిలోనే అరుగు మీద కొంతసేపు కూర్చున్నాడు. పది నిమిషాలు పోయిన తర్వాత అదురుతున్న గుండెతో తలుపు కొట్టాడు. అలా రెండు నిమిషాలు కొట్టిన మీదట ఆడగొంతు వినిపించింది.

'ఎవరూ?'

ఆ గొంతుకను శివరావు పోల్చుకోలేకపోయాడు. నేనేనని చెప్పడానికి గొంతు కూడా విడలేదు. మరో క్షణంలో తలుపు తీసిన శబ్దమయి ఒక్కడుగు వెనక్కి వేశాడు.

లాంతరు కొంచెం పైకెత్తి శివరావు మొహం చూడ్డానికి ప్రయత్నిస్తున్నట్లుగా కళ్లు చికిలించి చూస్తూ అంది ఆమె. 'ఎవరూ? ఎవరు కావాలీ?'

శివరావు మాట్లాడలేదు. గొంతుని ఎవరో నొక్కుతున్నట్లనిపించింది. ఒంట్లో

వున్న నీరంతా కన్నీటి రూపంలో బయటకు దూకడానికి సిద్ధంగా ఉన్నట్లున్నాయి అతని చూపులు.

ఆ లాంతరు వెలుగులో అక్కని పోల్చుకున్నాడు.

'అక్కా' అనగలిగాడు శివరావు చివరకు.

'ఎవరూ?' అంది శాంతి లాంతరు శివరావు మొహానికి తగిలిస్తున్నట్లు పెట్టి. ఆమె అతన్ని పోల్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

'నేనక్కా.'

'శివా?' అంది శాంతి ఆశ్చర్యంగా.

అవునన్నట్లు తలూపాడు శివరావు.

'శివా' అంది మళ్లీ శాంతి.

సన్నని ఏడుపు. కడుపులోంచి కట్టలు తెంచుకు వస్తున్న ఏడుపుని ఆపుకోవడానికి అన్నట్లు నోటికడ్డంగా పైట చెరగునుంచింది.

'లోపలికి పద' అన్నాడు శివరావు గుమ్మంలో కాలుపెడుతూ.

ఏడుపుతోనే దారి చూపెడుతూ లోపలికి తీసుకెళ్లింది శాంతి. మంచం మీద కూర్చున్నాడు శివరావు. లాంతరు కొక్కేనికి తగిలించి శాంతి కింద కూర్చుంది. రెండు చేతులతో మొహం కప్పుకుని ఏడుస్తున్న అక్కని ఆపే ప్రయత్నమేమీ చేయలేకపోయాడు శివరావు. చుట్టూ చూశాడు. ఓ మూల ఇద్దరాడవాళ్లు పడుకున్నారు. మంచం మీద ఇంకొకామె పడుకొని వుంది. వాళ్లు ముగ్గురు తన చెల్లెళ్లై వుండవచ్చుననుకున్నాడు. తమ్ముళ్లేరీ? అమ్మ ఏదీ? నాన్న ఏరీ? అని అడుగుదామనుకున్నాడు.

'అమ్మేది అక్కా?' అన్నాడు శివరావు.

అప్పటికి ఏడుపుని ఆపుకుని నిర్వికారంగా కిందికే చూస్తున్న అక్కలో మళ్లీ కదలిక వచ్చింది. దుఃఖం ముంచుకొచ్చింది ఆమెకు. ఈసారి అమ్మ లేని కొరత తీరిపోయేలా ఏడుపు ప్రారంభించింది. అప్పటికి తక్కిన ముగ్గురు లేచి కూర్చున్నారు.

వాళ్లకేమీ అర్థం కాలేదు. కావడం లేదు. నిద్ర మత్తు వదలనట్లుగా వెర్రివాళ్లలా చూస్తూ కూర్చున్నారు.

'అమ్మేది లక్ష్మీ?' ఆ ముగ్గురిలో ఎవరు లక్ష్మో తెలియకపోయినా అడిగాడు.

‘ఎవరమ్మ.. మా అమ్మా? చచ్చిపోయింది. నాన్న పోయిన మూడు నెల్లకే పోయింది’ అక్క ఎందుకేడుస్తూందో మిగిలిన వాళ్లకి బోధపడింది. అందరి కళ్లల్లో నీళ్లు నిండాయి.

‘తమ్ముడో’

‘ఎవరూ? వాసా? వాసు కోసం ఆర్నెల్లు వెతికి వూరుకున్నాం’ అంది లక్ష్మి.

‘రాఘవ సినిమా హాల్లో పని చేస్తున్నాడు. మూడు గంటల రాత్రికి వస్తాడు’ అంది లక్ష్మి మళ్లీ.

ఇంకా ఆశ్చర్యంగా చూస్తున్న మూడో చెల్లినుద్దేశించి అంది శాంతి గద్గదంగా– ‘అన్నయ్యే.. శివ’

శివరావు తల వంచుకున్నాడు. చెల్లెల్ని పలకరింపుగా చూడ్డానికి కూడా సిగ్గేసింది.

‘అవున్రా... ఇన్నాళ్లూ ఎక్కడున్నావు’ అడిగింది పెద్ద చెల్లి నిష్ఠూరంగా.

‘మీకింకా పెళ్ళిళ్లు కాలేదా?’ అని అడుగుదామనుకుని మానేశాడు శివరావు. ఈ లోపల ఈ ప్రశ్న వేసింది పెద్ద చెల్లి. చిన్నగా దగ్గి ఊరుకున్నాడు. సమాధానం చెప్పలేదు.

బయట కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది.

చివరికి శాంతి పెద్దగా నిట్టూరుస్తూ లేచింది.

‘భోజనం తయారు చేస్తాను’

శివరావు వద్దనలేదు. ఆకలి కూడా లేదు.

‘అవున్రా. ఇన్నాళ్లూ ఎక్కడున్నావురా? మేము జ్ఞాపకానికి రాలేదుట్రా’ అని అడిగింది పెద్ద చెల్లి. ఇదెప్పుడేనా పెద్దదయి బాగా మాట్లాడుతుందా అని అనిపించేది చిన్నప్పుడు. పెద్దా చిన్నా అనే భేదం లేకుండా మాట్లాడుతుండేది. అప్పుడు అలాటి పిల్ల తననిలా ప్రశ్నిస్తుంటే ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. జవాబు ఇవ్వలేదు. పెద్ద చెల్లి మరి రెట్టించి అడగనూ లేదు. చనువు చేసి అన్నయ్యను పలకరించినా సమాధానం రాకపోయేసరికి చిన్నబోయిది. ఉన్న చోటనే గోడకి చేరగిలబడి కూర్చుంది. మిగిలిన ఇద్దరూ తిరిగి పడుకునే ప్రయత్నంలో వున్నారు.

‘బయట నీళ్లు పెట్టేను.. కాళ్లు కడుక్కో’ లోపలి నుంచి పలికింది శాంతి.

శివరావు కొంత సేపలానే కూర్చుని లేచేడు. భోజనం అయిందనిపించాడు.

భోజన సమయంలో ఎవరూ మాట్లాడలేదు. శాంతి తప్ప మిగిలిన ముగ్గురు చెల్లెళ్లూ నిద్రపోతున్నారు.

శివరావు చుట్టూ చూశాడు. ఇంట్లో ఉన్న వస్తువులేవీ తనని ఆహ్వానించి నెలల తరబడి భరించి తిండి పెట్టేట్లు లేవు. ఇందాక ఎక్కడ కూర్చున్నాడో అక్కడే చతికిలపడ్డాడు.

చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది శాంతి. లాంతరు వత్తి తగ్గించింది. గుమ్మానికి చేరగిలబడి వర్షాన్ని చూస్తూ నిల్చుంది.

'నీ కోసం ఎంతో వెదికాం. వెతికించాం. నాన్న ఆ బెంగతోనే పోయారు. ఏ రాత్రేనా తలుపు చప్పుడయితే నువ్వేనేమోనని ఆతృత పడేవాళ్లం. నాన్ననీ అమ్మనీ చిత్రవధ చేశావ్'

శివరావు మాట్లాడలేదు. చిన్నగా సర్దుకుని కూర్చున్నాడు.

'ఆ రాత్రి వర్షం పడుతోంది. ముసలయ్యతో వెళ్లాను' పాత సంఘటనలను జ్ఞాపకం చేసుకోడానికన్నట్లుగా ఓ రెండు నిముషాలాగాడు.

శాంతక్క చూపు ఇంకా వర్షం మీదే ఉంది.

'ముసలయ్య దొరికిపోయాడు. ముసలయ్య చెప్పేవాడు ఇలాంటి దొంగ తనాలు చేస్తూ దొరికిపోయారంటే గట్టి శిక్షపడుతుందని. దొరికిపోయుంటే నా గతేమిటో నాకా క్షణంలో తెలిసిపోయింది. దొంగతనం'...

ఏదో ఆలోచన రాగా శాంతి ఉలిక్కిపడింది. ఆందోళనతో శివరావుని చూసింది.

'ఈ ఊర్లో ఉండే ధైర్యం లేకపోయింది. ముసలయ్య చెప్పేవాడు బొంబాయి నగరం చాలామందికి అనువైందని' ఆగిపోయాడు శివరావు.

శాంతి భయంగా చూసింది శివరావు వేపు. తర్వాత ఆమె చూపు మంచం కింద వున్న చెక్కపెట్టె మీదకు మళ్లింది. అందులో చెమటని చవి చూసిన ఎనభై రూపాయలున్నాయి. పైసాపైసా కూడబెట్టగా అయిన రూపాయలవి. ఉన్న చోటునే క్రిందికి జారుతూ కూర్చుంది. అంత చలిలోనూ చిరుచెమట పట్టింది.

'మమ్మల్నిలా బతకనియ్యవా శివా?' అంది శాంతి ప్రపంచంలోని దైన్యాన్నం తటినీ మొహంలో నింపుకుని.

శివరావు అయోమయంగా చూశాడు శాంతక్క వైపు.

కలలోంచి మేల్కొన్న దానిలా ఒక్కసారి లేచింది శాంతి. శివరావు మంచం దగ్గరకు వచ్చింది. అలసటను ఆపుకొంటున్నట్లుగా అంది–

'కొంచెం కాళ్లు తియ్యి శివా. కింద చెక్కపెట్టె ఉంది. అది లాక్కుని దాని మీద కూర్చుంటాను'

శివరావు సాయం చెయ్యబోయాడు. వద్దని వారించి తనే పెట్టె లాక్కుంది. గదికి ఓ మూలగా లాగి దాని మీద కూర్చుంది. కూర్చున్న తర్వాత తృప్తిగా నిట్టూర్చింది.

కొంతసేపలానే కూర్చుని ఏదో నిశ్చయానికొచ్చిన దానిలా అంది శాంతి.

'చూడు శివా. నీకెలా చెప్పాలో బోధపడటం లేదు. దరిద్రం నన్నిలా మాట్లాడి స్తోంది. నువ్విప్పుడిక్కడికి రావడంలో నీ ఉద్దేశం కూడా బోధడలేదు. చూస్తున్నావు కదా నా పరిస్థితి. నువ్విప్పుడు తిన్నన్నం రాఘవది. వాడీ రాత్రి మాడాలి'

'చాలక్కా.. చాలు మరి చెప్పకు' అన్నాడు శివరావు అభిమానపడుతూ.

అక్క ఆగలేదు.

'రాఘవని రోజూ కనిపెట్టుకుని కూర్చోలేక అవస్థ పడుతున్నాను. మన కుటుంబానికి ముగ్గురు మొగాళ్లున్నారు. ఎందుకూ పనికి రాలేదు. ఆడదాని కష్టం వాళ్లకి తెలీదు. నువ్వెళ్లిపోయావు. తిరిగి వచ్చేస్తే బావుండుననుకున్నాం. కొన్ని రోజులు ఏడ్చి ఊరుకున్నాం. తర్వాత వాసుకి నీ బుద్ధులే వచ్చాయి. అమ్మా నాన్నా చనిపోయిన తర్వాత ఇంట్లో ఒక్క వస్తువూ ఉంచేవాడు కాదు. వాడూ నీలాగే వెళ్లిపోతే చాలనుకున్నాం. ఒకరోజు వాడు కనిపించలేదు. చేయవలసిన ప్రయత్నాలు చేశాం. దొరుకుతాడేమోనని భయమేసింది. మా కళ్లల్లో నీరు లేదు. ఇంకిపోయింది. ఏడవడానికి శక్తి కూడా లేదు. రాఘవ నీకు తమ్ముడు. వాడి మీద కూడా నాకు నమ్మకం లేదు. ఎప్పటికైనా మమ్మల్ని మోసం చేస్తాడేమోనన్న అనుమానం వుంది. దానికి తగ్గ కారణాలున్నాయి. ఇప్పటికే రాఘవని కనిపెట్టలేకుండా వున్నాడు. ఇక మీదట మీ ఇద్దర్నీ కనిపెట్టుకుంటూ వుండలేనురా శివా' దుఃఖం చేత శాంతి కొంతసేపు మాట్లాడలేకపోయింది.

శివరావు మౌనంగా కూర్చున్నాడు.

'నేను సంపాదించే తిండి అందరికీ సరిపోవడం లేదు. మేము ఎలా బతుకు తున్నామో అడక్కు. సగం కడుపునే నింపుకుంటున్నాం. అయితే మచ్చ వచ్చే పనులేవీ చేయడం లేదు. నా నిస్సహాయతను ఎలా అర్థం చేసుకున్నా నేనేమ నుకోను' అంది.

అప్పటికి శివరావు 'నేనిక్కడే వుండిపోతానని ఎందుకనుకుంటున్నావో అర్థం

కావడం లేదు. ఉండనని మాట ఇస్తున్నాను సరా?' బింకంగా అన్నాడు.

శాంతి దుఃఖం ఆపుకోలేకపోయింది.

'రేప్పొద్దున సూర్యుడొచ్చే వేళకి ఈ ఊర్లో ఉండనని మాట ఇస్తున్నాను' అన్నాడు మళ్లీ.

'అన్నిటికీ ఒక్క ఏడుపు ఏడిచి ఊరుకుంటాను' అంది దుఃఖంలోనే శాంతి.

రాఘవ వచ్చాడు. శాంతి శివరావుని చూపెడుతూ అంది 'అన్నయ్యొచ్చాడు'

'వాసా?'

'కాదు శివ'

'వాసనుకున్నాను'

కనీసం శివరావుని చూసేందుకైనా ప్రయత్నించలేదు. చాప తీసుకుని వంటింట్లోకి వెళ్లి పరుచుకున్నాడు. ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లుగా అడ్డంగా పడుకున్నాడు. మరికాసేపటికి గుర్రు వినిపించింది.

'బాగా పొడుగెదిగిపోయాడు' అన్నాడు శివరావు రాఘవని ఉద్దేశించి.

'వాడొచ్చేడంటే మూడున్నర గంటలయి వుంటుంది' అంది శాంతి సమాధానంగా.

'ఉదయం రైలు ఎన్ని గంటలకొస్తుంది. ఐదు గంటలకేనా?' అన్నాడు శివరావు.

'రైలు కన్నా బస్సే ముందు బయల్దేరుతుంది' అంది శాంతి.

శివరావు రెండు నిమిషాలు అక్క మొహంలోకి చూశాడు.

'అయితే నేను వెళ్తాను' లేచాడు.

శాంతి వుండిపొమ్మని బలవంతం చెయ్యలేదు.

'ఇంకాస్సేపు ఉండు' అంది.

శివరావు 'హూ' అని మాత్రం అన్నాడు.

వర్షం నిలిచిపోయింది. ఈదురుగాలి హోరు తగ్గలేదు.

'రోజూ రాత్రి నాకు నిద్ర ఉండదు. మీరిద్దరూ మాకో దారి చూపెట్టకుండా మీకు నచ్చిన మార్గాలు ఎన్నుకున్నారు. రాఘవ కూడా మీ దారే అనుసరించడన్న నమ్మకేముంది? ఒక్కొక్కసారి వాడి మాటలూ చేతలూ చూస్తే మాకీ బతుకు కూడా బతికే యోగ్యత లేకుండా చేస్తాడేమోననిపిస్తుంది. వాడు ఇంట్లో వున్నంత

సేపూ నాకు నిద్ర ఉండదు. మేలుకునే ఉంటాను. వాడు లేనపుడే నాకు నిద్ర'

శివరావుకి కొంచెం కొంచెంగా అర్థమవుతోంది.

'రోజూ రాత్రి రాఘవ వచ్చే వరకైనా నిద్రపోతాను. ఈ రాత్రి నాకసలు నిద్ర లేదు. ఎందుకో తెలుసా శివా? కారణం చెప్తే కోపగించుకోకూ. మనుషుల్ని మనుషులే పీక్కు తినే రోజులివి. ఈ పెట్టెలో నా ఆరోప్రాణం ఉంది'

'తెలుసక్కా. చెప్పకు నా మీద నీకు ఎంత అసహ్యముందో బోధపడుతోంది' అతని కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఇల్లంతా ఒకసారి పరికించి చూశాడు. అందరూ ఆదమరిచి నిద్రపోతున్నారు.

'వస్తాను' అన్నాడు.

తలుపు తీసుకుని చీకట్లో కలిసిపోతున్న శివరావును చూస్తూ వెర్రిదానిలా నిల్చుంది శాంతి.



# మరికొన్ని వాన కథలు

వాన కోటు ● మధురాంతకం రాజారాం

వఱపు ● చాసో

ఒంటరి బంగళా ● పురాణం సుబ్రహ్మణ్యం శర్మ

తాజ్ మహల్ ● గొల్లపూడి మారుతీ రావు

వర్షంలో తాజ్ ● కె.వివేకానందమూర్తి

తుఫానొస్తోంది ● పవని నిర్మల ప్రభావతి

వాన చినుకులు ● వి.రాజా రామ్మోహనరావు

వాన కురిస్తే ● కేతు విశ్వనాథ రెడ్డి

పేపర్ టైగర్ ● ఎన్.ఎస్.ప్రకాశరావు

వాన కురిసిన రాత్రి ● ద్విభాష్యం రాజేశ్వరరావు

ఒక వానరోజు మా ఇంట్లో ● నందిగిరి ఇందిరా దేవి

గాలివానలో రెండ్రోజుల రైలు ప్రయాణం ● కవన శర్మ

ముసురు ● అల్లం రాజయ్య


రాళ్ల వాన ● రాప్తాడు గోపాలకృష్ణ

విధ్వంస దృశ్యం ● జి.ఆర్.మహర్షి

చెమ్మ ● సుంకోజి దేవేంద్రాచారి

వానరాయడి పాట ● వేంపల్లి గంగాధర్

పచ్చి కరువు ● డా.ఎం.హరికిషన్



# అతడు మనిషి

## అద్దేపల్లి ప్రభు

● రచనా కాలం: 2007

**అద్దేపల్లి ప్రభు:** కవిగా, రచయితగా స్థిరంగా సృజన సాగిస్తున్న సాహితీకారుడు. ఏ.ప్రభాకర్ పేరుతో కూడా రచనలు చేశారు. 1983 నుంచి దాదాపు 30 కథలు వెలువరించారు. 'అతడి పేరు మనిషి' తానా కథల పోటీలో బహుమతి పొందింది. సుప్రసిద్ధ కవి అద్దేపల్లి రామమోహనరావు వీరి తండ్రి. స్వస్థలం కాకినాడ. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వయసు 46 సంవత్సరాలు.

'మన చుట్టూ ఉండే ప్రదేశం చాలా ప్లజెంట్‌గా ఉండాలి. చాలా ఖరీదుగా ఉండాలి. అందంగా ఉండాలి. తలతిప్పి చూడగానే కనిపించే అమ్మాయి మూతికీ, బుగ్గలకీ రంగుతో, విరబోసుకొన్న జుట్టుతో, మహా బిగుతైన జీన్స్‌లో రా అని పిలుస్తున్నట్టుండాలి. ఎండ రాకూడదు. లైట్లే ఉండాలి. వేడి రాకూడదు. ఏసీ ఉండాలి. అదీ జీవితం. ఇలా లేని ప్రపంచం ఉంది. నేనొప్పుకొంటాను. కానీ అది మనకనవసరం. ఆ దరిద్రం గురించి ఆలోచించనే చించం కాబట్టి దాన్లోకి వెళ్లనే వెళ్లం...' అంటాడు మిత్రుడు మహే అనే మహేష్.

తానూ అలానే అనుకొన్నాడు. కానీ తప్పనిసరై వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడిలా ఇరుక్కుపోవాల్సి వచ్చింది.

ఎదురుగా గోదావరి పాయ. దూరంగా ఆవలి ఒడ్డు పాశర్లపూడి. వైనతేయ గోదావరి ఎర్రటి నీళ్లతో పరవళ్లు తొక్కుతోంది. అద్భుతమైన దృశ్యం. భీకరమైన వాన అలా కురుస్తూనే ఉంది.

అమలాపురంలో దిగి ఆటో పట్టుకొని ఈ బోడస కుర్రు రేవుకి వచ్చేస్తుండగానే మొదలై పెరిగిపోయింది వాన. రేవు దగ్గర దిగి ఆటోవాడికి డబ్బులు ఇచ్చి గబగబా లాంచీకోసం వస్తుండగానే పూర్తిగా తడిసిపోయాడు. రేవులో ఉన్న చిన్న బడ్డీకొట్టు చూరు కింద నిలబడి కొట్టులో అతణ్ణి అడిగాడు.

'ఆవలికెళ్లానికి లాంచీ ఉంటుందా' అని.

అతను ఓసారి చూసి 'ఇంకీయాల్టికి ఉండవండి. ఇంత వాన్లో లాంచీ ఎల్దు' అన్నాడు. అని, 'ఏ ఊరెల్లాలండి?' అడిగాడు.

'ఆదుర్రు' అన్నాడు వెంకటేష్.

'మీరెల్లలేరండి' అన్నాడతను చల్లగా.

సాయంత్రం నాలుగు దాటింది. కానీ వాన వల్లా, మబ్బులు కమ్మేసిన ఆకాశం వల్లా చీకటి పడిపోయి నట్టుంది. అలా పెరిగిపోతూ ఉంది వాన. రోజుల తరబడి తెరిపి లేకుండా కురిసేలా. వాన అపూర్వంగా ఉంది. దూరంగా గీత గీసినట్టు కొబ్బరిచెట్ల నేల. పైన ఆకాశం, కింద నది. రెండూ ఒకేలా ఉన్నాయి. ఇటూ–అటూ అంతా నదే. అంతా ఆకాశమే. నింగీ నేలా ఏకమైనట్టు వాన కురుస్తోంది.

రేవులో చిన్నాపెద్దా పడవలు గుంజలకి కట్టేసి ఉన్నాయి.

క్రైసిస్ మేనేజ్‌మెంట్!

ఇలా దిక్కుతోచని స్థితిలో ఏదో ఓ దారిని వెదకాలి. మరీ ముఖ్యంగా మానసిక నిబ్బరాన్ని కోల్పోకూడదు.

వెంకటేష్ బ్యాగ్‌ని నెత్తి మీద పెట్టుకొని గబగబా వర్షంలోకి వెళ్లాడు. ఒడ్డున కాస్తంత దూరంలో భూమికి జానెడెత్తు పాకొకటి కనిపించింది.

'ఎస్. అందులో కచ్చితంగా మనక్కావల్సిన వాళ్లుంటారు' అనుకొంటూ చిన్నగా పరుగుతోనే ఆ పాక దగ్గరకి వెళ్లి ఒంగి లోనికి చూస్తూ,

'ఏమండీ... ఏమండీ...' అని పిలిచాడు.

పాక లోపల పొయ్యి దగ్గర కూర్చుని ఉన్నాడు ఒక మనిషి. అతను తలతిప్పి చూశాడు. గుమ్మం ముందు రెండు కాళ్లు కనిపించాయి. అతను లేవకుండానే, 'ఎవరాలు?' అన్నాడు.

ఆ కాళ్ల మనిషి వంగాడు. ముఖం కనిపించింది.

'పడవ కావాలి' అంది ముఖం.

కూర్చున్న వ్యక్తి పైకి లేస్తూ 'లోనికి రండి బాబూ ముద్దయిపోతున్నారు' అన్నాడు.

వెంకటేష్ అలా ఒంగి పాకలోకి దూరాడు.

ఓ పక్కగా నులకమంచం వేసి ఉంది. అది ఇంచుమించు నేలని తాకేంత గొయ్యియి పోయింది. పాకలో మనిషి, 'అన్నన్నా. శానా తడిసిపోయారే. అలా మంచమ్మీద కూసోండి బాబూ.. పర్లేదు, అదేం ఇరిగిపోదులే' అన్నాడు.

వెంకటేష్ బ్యాగ్‌ని పక్కగా పెట్టి మంచమ్మీద కూర్చున్నాడు. తలలోంచి నీళ్లు కారి పోతున్నై. కాళ్ల మీంచి, బూట్ల మీంచి నీళ్లు కారి నేల మీద చిన్నగా మడుగు కడుతున్నాయి.

వెంకటేష్ 'అవతలి ఒడ్డుకి వెళ్లాలి. బోటులో నన్ను తీసుకెళ్లాలి' అన్నాడు.

వర్షంలో తడుస్తున్నప్పుడు అనిపించలేదు. వెన్ను లోంచీ ఎముకల్లోంచీ వణుకు బయలుదేరింది. దవడలు కటకట కొట్టుకుంటున్నై. ఇంత వణుకా...!

పాకలో మనిషి వెంకటేష్‌ని చూసి 'చ్చొచ్చొచ్చొ...' అంటూ 'శానా తడిసి ముద్దయిపోయారు బాబూ. ముందీ తువాల్తోటి తల తుడుసుకోండి' అన్నాడు ఒక పొడిగా ఉన్న తువ్వాల్లాంటి గుడ్డ ఇస్తూ.

'లేల్లేదు... నా బ్యా...గ్‌లో... టవల్ ఉంది' అంటూ బ్యాగ్‌ని తీశాడు. పైన కొద్దిగా తడిసినా లోపల పొడిగానే ఉన్నాయి. ఒక టవల్‌ని బయటకి లాగాడు. తల తుడుచు కోవడం మొదలుపెట్టాడు. ఈలోగా ఆ మనిషి పొయ్యిలోని పుల్లల్ని మండించి పొయ్యి మీద నల్లటి సత్తుగిన్నె ఒకటి పెట్టి అందులో నీళ్లు పోశాడు. వెంకటేష్ తల తుడిచేసుకొని ఆ టవల్‌తోనే పాంటు చొక్కాల మీదే ఒళ్లు కూడా తుడిచేసుకొన్నాడు. నీళ్లు ఓడడం తగ్గిందిగానీ ఒణుకు తగ్గడంలేదు. కాసిన్ని నిప్పులు ఒక పగిలిపోయిన కుండ పెంకు లో పెట్టి దాన్ని మంచం కింద పెట్టాడు ఆ మనిషి.

'కూసో బాబూ ఎచ్చగుంటది...' అని పొయ్యి మీద మరిగిన టీని రెండు గ్లాసుల్లో పోశాడు. చల్లని ఆ వాతావరణంలో టీ వాసనకి ప్రాణం లేచొచ్చిన ట్టుంది. మంచం మీద కూర్చుని అడుగు నుంచి వెచ్చదనం శరీరాన్ని వేడెక్కి స్తుండగా టీని రెండు గుక్కల్లో తాగాడు. బెల్లం వేసిన డికాషన్. చిరు చేదుతో చిత్రమైన రుచి. మెల్లిగా ఒణుకు తగ్గింది.

ఆ మనిషి ఒక బీడీని తీసి పొయ్యిలోని పుల్లతో ముట్టించి గుప్పుమని పొగ వదిలాడు.

గ్లాసు కింద పెడుతూ మళ్లీ అన్నాడు వెంకటేష్.

'నేను అర్జెంటుగా ఆదుర్రు వెళ్లాలి. చాలా అర్జెంట్. లాంచీ పోదట. మీ బోటులో నన్ను అటువేపు తీసుకెళ్లగలరా? ఎంత డబ్బయినా పర్లేదు...' అన్నాడు.

ఈసారి గొంతు వణక లేదు.

వంటి మీద తడిబట్టలు మాత్రం చిరాగ్గా ఉన్నాయి.

ఆ మనిషి బీడీ పొగని మళ్లీ ఊదుతూ...

'ఏ ఊరు మంది' అన్నాడు.

కోపం వచ్చింది వెంకటేష్‌కి.

'ఏ ఊరైతే ఏంటి?'

ఆ మనిషి నవ్వుతూ 'కోప్పడకండి బాబూ. నేను ఊరికే అడిగా అంతే...' అని 'బైట వాన చూశారా?. తుపానట. సిటం ఆక్కుండా కొడుతోంది' అన్నాడు.

'ఫర్లేదు... తడిసిపోయినా ఫర్లేదు... అర్జెంటుగా వెళ్లాలి... అంతే.'

'ఎళ్లేం బాబూ.'

'ఎంత డబ్బయినా ఫర్లేదంటున్నా కదా.'

'అబ్బే... ఇది డబ్బుల్తో తేలే యవ్వారం కాదు. గోదారి అమ్మోరమ్మలా ఉంది. ఏలు పెడితే లాగేసేలా ఉంది. హాయిగా ఈ వానలో ఇలా మునగ దీసుక్కొసోడం... వాన్నీ గోదార్నీ సూడ్డం తప్ప మరేటీ సైలేం...'

నిశ్చేష్టుడిగా ఉండిపోయాడు వెంకటేష్.

బైట వర్షపు హోరు భీతావహంగా వినిపిస్తోంది. చీకటి పడిపోయింది.

పాకలోని మనిషి లాంతరు వెలిగించి చూరుకి వేళ్లాడదీశాడు.

గుమ్మం దగ్గరకి వెళ్లి 'సోవుడూ... సోవుడూ...' అని అరిచాడు.

మళ్లీ లోనికి వచ్చి గుమ్మమ్మీద కూర్చుని 'కాస్తంత వాన తగ్గితే అమలాపురం ఎలిపోండి బాబూ. అక్కడి నించి రాజోలు బస్సులుంటై. ఎక్కేసి జగ్గన్న పేటలో దిగిపోయి అట్నుంచి ఆటోనో దేన్నో అట్టుకొని ఆదుర్రు పోవచ్చు' అన్నాడు.

నిట్టూర్చాడు వెంకటేష్. త్వరగా వెళ్లాలని ఇటొచ్చాడు తను. అందుకే అంటారు తొందర ఆలస్యానికి మొగుడని. కానీ ఇప్పుడు మన పరిస్థితి ఏంటి?

ఎక్కడికి పోవాలీ రాత్రి. ఇక్కడెక్కడా లాడ్జీలు ఉండవు. ఉన్నా ఎక్కడి కెళ్తాం.

బాగా నీరసించిన గొంతుతో అన్నాడు. 'దగ్గర్లో లాడ్జీలు ఉండవా...?'

'అమలాపురం పోవాలి బాబూ... అయినా ఎలా ఎల్తారు?' అన్నాడు.

'మరి...'

ఇంతలో బయటి నుంచి ఓ కుర్రాడు నెత్తి మీద ఒక ప్లాస్టిక్ సంచిని కప్పుకొని లోనికొచ్చాడు. చిన్న గోచీ తప్ప వాడి వంటి మీద ఇంకేమీ లేదు. నల్లటి ఒళ్లు చీకట్లో కలిసిపోయింది. వాడి చేతిలో తాటాకులతో చేసిన చిన్న బుట్టలాంటిది ఉంది. ఏడేళ్లుంటాయి వాడికి. వాడు లోనికొస్తూనే–

'ఏం వాన్రా అయ్యా' అన్నాడు. అని నెత్తి మీద సంచీని బయటే పారేసి బుట్టని చూరుకి తగిలించి పొయ్యి దగ్గరకెళ్లాడు. వాడి వెనకే ఓ ఆడమనిషి లోనికొచ్చి

కొత్త మనిషిని చూసి వంటగది పక్కనున్న గదిలోకి పోయింది.

పాకలో మనిషి పొడిగుడ్డతో ఆ కుర్రాడి ఒళ్లు, తల తుడుస్తూ 'ఏడున్నార్రా ఇంతదాకా' అన్నాడు.

లోపల్నించి ఆడమనిషి గొంతు.

'సెప్తే ఇంటడా ఎదవ సచ్చినోడు. ఒద్దురా ఒద్దూ అంటున్నా ఇనకుండా గోదాట్లోకి పోయాడు. గుండెలవిసిపోయాయనుకో. ఎలా ఉంది గోదారి?' అంది.

'ఏరా ఎదవా... ఈ వాన్లో... ఈ వరదలో గోదాట్లో దిగావా...'

ఆ కుర్రాడు లేచి ఓ కాలు కొంచెం వంకరగా పెట్టి తలని ఓ పక్కకి కొంచెం వాల్చి లేని కాలర్‌ని ఉన్నట్టు అభినయిస్తూ,

'మనం సిరంజీవోళ్లం... మన్ని గోదారేటిచేద్ది?' అన్నాడు.

వాడి నాన్న నవ్వాడు.

'ఎదవకి సిరంజీవి పిచ్చండి' అన్నాడు.

లోపల్నుంచి పొడిచీర కట్టుకొని ఆడమనిషి బయటకొచ్చి వంటగదిలోకి వెళ్లింది. దానికి తలుపంటూ ఏమీలేదు. గుమ్మం మాత్రం ఉంది. లోపల ఆమె పొయ్యిలో నిప్పుని రాజేసి పుల్లలు మంటపెట్టి వంట మొదలుపెట్టింది. పాకలో మనిషి లాంతరు చిమ్నీ పైకెత్తి ఇంకో బీడీ వెలిగించి ఒక మూలగా ముసుగ దీసుకొని కూర్చున్నాడు. ఆ కుర్రాడు వంట గదిలో వాళ్లమ్మ వీపు మీద ఎక్కి ఊగుతున్నాడు.

వెంకటేష్ ఒక్కసారి మంచం మీంచి లేచి బ్యాగ్‌ని ఓ పక్కగా పెట్టాడు. కింద నిప్పులు ఆరిపోయి ఉన్నాయి. అతను లేచి బయటికి చూశాడు.

బయట అంటూ ఏముంది?

చీకటి గుయ్యారం.

ఈ పాకలోని లాంతరు నారింజ వెలుగు ఆ చీకట్లో పడి మాయమైపోతోంది.

చిటపట చిటపట వాన చినుకులు...

కొబ్బరిచెట్లు ఊగిపోతున్నట్టు గాలి తెలుస్తోంది.

ఏంటి ఈ పరిస్థితి– అనుకొన్నాడు వెంకటేష్. ఆ మనిషితో అన్నాడు 'ఈ వాన ఇప్పట్లో తగ్గేలా లేదు'

అతను అలా ఆ చీకట్లోకే చూస్తూ 'ఔనండి... ఎన్నాళ్లయ్యింది ఇలాంటి

వానపడి...' అని ముక్తాయించాడు. లాంతరు వెలుగులో టైము చూశాడు. ఇంకా ఏడు కూడా అవలేదు.

లోకం అదృశ్యమైపోయింది.

లోపల్నుంచి అన్నం ఉడుకుతున్న వాసన కమ్ము కొంది. 'ఈ వాసన ఇంత బాగుంటుందా?' అనుకొన్నాడు.

'ఇప్పుడీ వానలో నేనెక్కడికి వెళ్లగలను' అన్నాడు.

ఆ మనిషి గుమ్మంలో పడుతున్న చినుకుల్నీ, వాటి మీద పడి మెరుస్తున్న నారింజ వెలుతుర్నీ కన్నార్పకుండా చూస్తూ... 'ఎక్కడికెళ్తారు బాబూ... ఎక్కడికీ ఎల్లలేరు' అన్నాడు.

'మరి...'

'మరేటుంది బాబూ... ఉండిపోవాల... కసింత వానైనా తగ్గితే అప్పుడు చూడాలి...' ఆ పిల్లవాడు లోన్నుంచి గెంతుకొంటూ వచ్చి వాళ్ల నాన్న వీపు మీది కెక్కాడు.

'సలి పెడుతుంటే గోసీగుడ్డతో ఉండిపోయా వేట్రా. పోయి సొక్కా అన్నా ఏస్కురా పో' అన్నాడు.

వాడు లేచి ఒక్క గెంతులో లోపలి గదిలోకి పోయి చొక్కా వేసుకొని 'అయ్యా...' అంటూ వచ్చాడు.

వాడేసుకొన్న చొక్కా వాడికి చీలమండలదాకా వచ్చింది. పొట్టిచేతుల చొక్కా వేళ్ల చివరిదాకా ఉంది. అటు లాంతరు వెలుగు, ఇటు వంటగదిలోని పొయ్యి వెలుగుల్లో వాడు గ్రహాంతర జీవిలా వింతగా ఉన్నాడు.

వాళ్ల నాన్న వాడివంక చూసి నవ్వాడు. వాడు గెంతుకొంటూ వచ్చి వాళ్ల నాన్న ఒళ్లో దూరాడు.

ఈ అపరిచిత సన్నివేశంలో తన పాత్రేమిటో తెలియక అయోమయమై పోయాడు వెంకటేష్. ఈ రాత్రికి ఈ పాకలో ఈ అపరిచిత కుటుంబంతో తెల్లార దియ్యాల్సిందే!

ఈ అగంతకుని అస్తిత్వాన్ని వాళ్లెవరూ అబ్బురంగా చూట్టం లేదు. నిత్యమూ అగుపించే చుట్టాన్ని చూట్టానికి అలవాటుపడ్డట్టుగా ఉన్నారు.

క్రైసిస్ మేనేజిమెంటులో తనకున్న అపారమైన తెలివి ఈ రాత్రి గింగిరాలు తిరిగి ఎక్కడికి పోయిందో. లక్ష్యసాధనలో ఇక్కడ ఇరుక్కుపోవడం ఒక అనివార్య

సంఘటనే. కానీ, అది మన ప్రమేయం లేకుండా మన మీద వచ్చి పడిపోతే... ఇంక క్రైసిస్సూ లేదు మేనేజిమెంటూ లేదు. పువ్వుల్లా చిందుతున్న వెలుగుబుడగల చినుకుల్ని చూస్తూ కూర్చోవడం తప్ప.

లోపల్నించి చేపల పులుసు వాసన ఆకల్ని రేకెత్తిస్తూ అలుముకొంది. వాసన తగుల్తున్నకొద్దీ తినెయ్యాలి తినెయ్యాలనే కోరిక చిందులెయ్యడం మొదలు పెట్టింది. లేచి వాచీని లాంతరు పక్కగా పెట్టి చూశాడు. ఏడు దాటింది. అప్పుడే ఇంత ఆకలా?

లోపల్నించి కుర్రాడి తల్లి, 'సోముడూ...' అని పిల్చింది. వాడు లేచి లోపలికి వెళ్లాడు. ఒక గిన్నెలో పొగలు చిమ్మే అన్నం... దానిపైన చేపల పులుసు వేసు కొని వచ్చి నాన్న పక్కన కూర్చుని తినడం మొదలు పెట్టాడు.

ఆవిడ మరో రెండు కంచాల్లో అన్నం... రెండు స్టీలు గిన్నెల్లో పులుసు వేసుకొని వచ్చి మంచం పక్కన పెట్టింది.

పాకలోని మనిషి లేచి 'వణ్ణం తినేండి బాబూ... తినేసి తొంగుంటే... తెల్లార్సంగతి భగవంతుడు చూస్కుంటాడు' అన్నాడు.

తనకి వద్దనలేనంత ఆకలి వేస్తుండటం వెంకటేష్‌కి చిత్రమనిపించింది. అతను లేచి బుద్ధిగా వెళ్లి ఒక కంచం ముందు కూర్చున్నాడు. ఆవిర్లు చిమ్ముతున్న అన్నం కంచంలో రాశి పోసినట్టు నిండుగా ఉంది. ఇంతన్నమా అనుకొన్నాడు.

గొంతు పెగలదీసి 'ఇంతన్నం తిన్లేను' అన్నాడు.

'అదెంతుంది బాబూ' అందామె గుమ్మం దగ్గర్నుండి.

'లేల్లేదు... తిన్లేనండి... కొంచెం తీసైండి ప్లీజ్...' అన్నాడు.

ఆమె అన్నం వండిన గిన్నె తెచ్చి తెడ్డుతో కొంచెం అన్నం తీసింది. పులుసును అన్నంలో కలుపుకొన్నాడు. ఆ వాసనకి నోట్లో నీళ్లూరిపోయాయి. నోరూరి పోవడం... చిన్నప్పుడు తప్పిస్తే మళ్లీ తనకీ అనుభవం లేదు. అన్నాన్నీ, కూరనీ చూస్తే నోరూరుతుందా...

వర్రగా ఉన్న పులుసు... చేపలు... కొద్దికొద్దిగా కలుపుకొని... మళ్లీ అన్నం పెట్టించుకొని తిన్నాడు. ఆకలి మొహమాటపడదు. చల్లని ఆ వానరాత్రి... వేడివేడి అన్నం... వర్రగా ఉన్న పులుసు... ఒళ్లూ ముఖమూ వేడెక్కిపోయి తలలో చిన్నగా చెమట కూడా పట్టింది. ఆహారం తినడం ఇంత అనిర్వచనీయమైన అనుభవా న్నిస్తుందా!

భోజనం అయిపోయింది. లేచి మళ్లీ టైము చూసి నడుం దగ్గర్నించి సెల్‌ని బయటకు తీసి చూశాడు. సిగ్నల్ లేదు. ఎవ్వరికీ ఏ ఫోనూ చైలేం... ఎవ్వరూ మనకీ చైలేరు... నో సిగ్నల్... ఈ సెల్లొక బొమ్మ రాయి.

ఆ కుర్రాడు తింటూనే నిద్రకి పడ్డాడు. వాళ్లమ్మ కూడా తినేసి ఆ కుర్రాణ్ణి తీసుకొని లోని గదిలో మంచం మీద పడుకుండిపోయింది.

పాకలో మనిషి తినేసి కంచాల్ని గుమ్మం అవతల పడేసి తువ్వాలుతో చేయి తుడుచుకొని బీడీ తీసి వెలిగించి కూర్చున్నాడు.

తనకి ప్రమేయం లేని ఒక చిత్రమైన పరిస్థితిలో కొనసాగిపోతున్నాను అనుకొన్నాడు వెంకటేష్.

చిత్రంగా ఆ మనిషి కూడా అలానే ఉన్నాడు. కానీ అతనికి ఏం చెయ్యాలో తెల్సు. అతని ఇంట్లో ఒక అపరిచితుడున్నా అతడు అది తనకి ప్రమేయం లేని సందర్భంలానో లేక సహజమైన ఘటనలానో ఉన్నాడు.

వెంకటేష్ లేచి బ్యాగ్ తీసి షార్టుని బయటకు తీశాడు. వంటి మీద ప్యాంటు షర్టులు ఇంకా తడిగానే ఉన్నాయి. టవల్‌ని చుట్టుకొని వాటిని తీసేసి షార్టు వేసుకొన్నాడు. మరో పొడి షర్టు వేసుకొని తడిబట్టల్ని చూరులో తాటికమ్మకి వేళ్లాడేశాడు. అతనలానే కూర్చుని బయటకి చూడ్డం మొదలుపెట్టాడు. ఈ చిన్న పాక... వంటిమీద బట్టలేని కుర్రాడు... కరెంటు లేదు... టి.వి. లేదు... సోఫాల్లేవు... డైనింగ్ టేబులు లేదు... ఫ్రిజ్ లేదు... మంచాల్లేవు. ఏమిటీ బతుకు? అనుకొన్నాడు. ఈ బతుక్కి ఒక లక్ష్యంలేదు. ఉన్నత స్థితికి ఎగబాకి పోవాలనే కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్ లేదు. ఎలా బతుకుతున్నారీ బతుకుని? ఎందుకు బతుకుతున్నారు? ఒక జంతువు లాగా... బతికున్నాం కనక తినడం... తింటున్నాం కనక బతకడం... ఇంతేనా... ఒక ఐన్‌స్టీన్ తెలీదు... న్యూటన్ తెలీదు... జార్జిబుష్ తెలీదు. బిల్‌గేట్స్... కనీసం సత్యం కంప్యూటర్స్ తెలీదు... ఈ అజ్ఞానం, అజ్ఞానం వల్ల దరిద్రం... ఎందుకీ బతుకు... తన ఆలోచనల్కి తనకే నవ్వు వచ్చింది వెంకటేష్‌కి. బయట వర్షపు చప్పుడు అలానే వినిపిస్తోంది. దాంతో పాటు ఒకలాంటి హోరు... నది ప్రవహిస్తున్న ధ్వని... ఉండి ఉండి నేలని పేల్చేస్తాయా అన్నట్టు మెరుపులు...

పాకలోని మనిషి లేచి లోనికెళ్లి ఒక చిరిగి పోయిన చాప... ఏ శతాబ్దంనాటిదో ఒక బొంత తెచ్చాడు. ఆ బొంత చాలావరకూ పీలికలైపోయి ఉంది. అతను వాటిని మంచం పక్కగా పడేసి, 'పడుకోండి బాబూ... తెల్లారెలా ఉంటదో

సూద్దాం...' అన్నాడు. అని అంత వరకూ కూర్చున్న చోటనే ఒక గోనిపట్టాని పర్చుకొని పడుకొండిపోయాడు.

లాంతరు బాగా తగ్గి నిశ్చలంగా వెలుగుతోంది. నిజానికా వెలుగులో ఏమీ కనపడకపోయినా అది స్నేహితుడి స్పర్శలా ఆప్తంగా ఉంది. వెంకటేష్ చాపని పరిచాడు. కానీ బొంతని మంచంపైన వదిలేశాడు. ఇందాకా తను నిలబడ్డ చోటా కూర్చున్న చోటా నేలంతా చెమ్మగా ఉంది. కాస్త ఇవతలికి చాపని లాగి తన బ్యాగ్‌లోంచి ఒక దుప్పటిని తీసి పరిచాడు. ఇంకో పల్చటి దుప్పటిని తీసి– బ్యాగ్‌ని తలగళ్లా అమర్చుకొని వాలాడు.

బయట అంధకారంలోకి ఊహ కూడా పోవడం లేదు. కానీ మెరుపు మెరిసినప్పుడల్లా కాస్త బంగారం కలిసిన వెండిలా ఒక అనంత నీటిప్రవాహం తటిల్లున మెరిసి మాయమైపోతోంది. సెల్ తీసి టైము చూశాడు. ఎనిమిది. తను కల్లో కూడా ఈ టైమ్‌కి పడుకోలేదు.

కళ్లు తెరవగానే కోసిన ముక్కలాగా వెలుగు కనిపించింది. అది గుమ్మం... వాన అలానే ఉంది. చప్పుడు అలానే ఉంది. గాలి అలానే ఉంది. కొద్దిగా వెలుగు... ఈ రాత్రి వేళ వెలుగొచ్చిందేంటి అనుకొన్నాడు. లేచి కూర్చున్నాడు. రాత్రి కాదు, తెల్లారింది.

వాళ్ల నాన్న కూర్చున్న చోట్లో పిట్టలా కూర్చుని బయటికి చూస్తున్నాడు కుర్రాడు.

ఆ కాస్త వెలుగు తప్ప ఏ మార్పు లేదు.

ఆ కుర్రాణ్ణి చూస్తూ 'మీ అమ్మానాన్నా... ఎటు వెళ్లారు?' అడిగాడు.

ఆ కుర్రాడు అతని వంక చూసి రెండు వేళ్లు చూపించాడు.

మెల్లిగా లేచాడు వెంకటేష్. గుమ్మం దగ్గరగా వెళ్లి బయటికి చూశాడు. గోదావరి ఇంచుమించు గట్టుని తాకుతోంది. అక్కణ్ణించి అలా చూస్తే ఆవలి ఒడ్డు అంటూ ఏం కనపడ్డం లేదు. నది అలా పరుచుకొని లేచి ఆకాశంలోకి పోయింది. గుమ్మంలోంచి కాలు బయటపెట్టి చూరు కిందగా నిలబడ్డాడు. జల్లు మీద పడింది.

గుండె ఝల్లుమంది. ఏంటిది!

ధారలుగా పడుతున్న వాన కమ్మేసి చూపు ఎక్కువ దూరం పోవడంలేదు. అంతా తెల్లరంగు తెరలు దిగవేసినట్లు చుట్టూ మూసుకొనిపోయింది. ఆ తెరల వెనగ్గా చెట్లజాడ అల్లుకొనిపోయి ఉంది.

తెర వెనక నుంచి ముద్దయిన కాకిలా బయట కొచ్చాడు పాకలోని మనిషి.

అతడు ప్లాస్టిక్ సంచీని మీద కప్పుకొని ఉన్నాడు.

కానీ అదేం ఆగుతుంది? ఉరుకుతో వచ్చి అతను సంచీని చూర్లో వేళ్లాడేసి వెంకటేష్ పక్కకొచ్చి 'పిచ్చి వానండి బాబూ. ఈ గట్టు కింద తోటంతా మునిగి పోయింది. ఆ రేవు రేవంతా మునిగిపోయింది. గోదార్చూశారా... ఇంకొంచెంగానీ పెరిగిందా మనం ఈ పాకొదిలి పోవాల్సిందే...' అన్నాడు గజగజలాడుతూ. అని, 'మీరు బయటకి పోవాలంటే ఈ సంచి మీదేస్కుని యియ్యేపెళ్లండి. అంతా నీళ్లే కదా... ఎక్కూ దూరం పోక్కర్లేదు...' అని చెప్పి లోనికి వెళ్లాడు.

'అమ్మింకా రాలేదురా' అని అతడు కొడుకును అడగడం వినిపించింది.

వెంకటేష్ కళ్లు ఆరిపోయాయి. టపటప వాన గాలిహోరు... ఉండుండి మీద పడుతున్న జల్లు. అర్జెంటుగా అయిపోవాల్సిన పని అతీగతీ లేకుండా పోయింది. అదవక పోతే కొంపలంటుకు పోతాయనుకొన్నాం. ఏం కొంపా అంటుకోలేదు. కాలం వానలోనూ, తుఫానులోనూ చిక్కుకొనిపోయి కదల్డంలేదు. అర్జెంటూ లేదూ... ఏమీ లే... నిర్వ్యాపకంగా ఈ అపరిచిత హోత ఇంట్లో ఆతిథ్యం... ఈ ఇల్లు ఉంటుందా... మునుగుతుందా!

అతను మెల్లిగా సంచిని తలమీద వేసుకొని వానలోకి దిగాడు.

సగం తడిసీ, కాళ్ల నిండా బురద అంటించుకొని అతడు వచ్చేసరికి పాకలో మనిషీ, అతని భార్య, పిల్లాడూ కూర్చుని ఉన్నారు. అతణ్ణి చూసి ఆమె కొద్దిగా వెనక్కి జరిగి కొడుకుని ఒళ్లోకి లాక్కుంది. వెంకటేష్ లోనికి వచ్చిన తన చాప మీద కూర్చుండి పోయాడు.

'కూసంత టీ ఎట్రాదే...' అన్నాడు ఆ మనిషి.

కొడుకుని ముద్దులాడుతున్న ఆమె ఓరకంట వెంకటేష్‌ని చూసి మళ్లీ మొగుడి వంక చూస్తూ, 'సిన్న బెల్లమ్ముక్కైనా లేదు' అని ఆగిపోయింది.

ఆ మనిషి తల ఊపి, 'పోన్లే ఉత్తదైనా ఎట్టి...' అన్నాడు.

'ఇప్పుడా పొయ్యి నే ఎలిగించలేను బాబూ... నువ్వే ఎట్టేస్కో' అందామె.

అతను లేచి వంటగదిలోకి వెళ్లాడు. కాసేపు చెమ్మదేరిన పుల్లల్ని తిట్టి పోసి... ఉఫ్ ఉఫ్... అని ఊది ఊది ఎట్టకేలకి మంటపెట్టాడు. ఇల్లంతా పొగ... మంట రావడంతోనే అమ్మ ఒళ్లో ఉన్న కుర్రాడు జువ్వలా లేచి నాన్న పక్కన దూరాడు. కాస్సేపటికి పొడుగాటి స్టీలుగ్లాసుల్లో నల్లటి రంగునీళ్లు... ఆవిర్లు చిమ్ముతూ ఉండగా వెంకటేష్ కిచ్చాడు. వెంకటేష్ దాని వంక కాసేపు చూసి మెల్లిగా ఓ

గుక్క తాగాడు. ఏ రుచీ లేదు. వేడినీళ్లు. నాలుగైదు గుక్కలు తాగాక ఏదో రుచి తగిలింది. వగరు వగరుగా ఉన్న ఆ రుచి బాగున్నట్టు కూడా అనిపించింది.

టీలు తాగేశాక ఆవిడ లేచి గ్లాసుల్ని వాననీటిలో పెట్టి తొలిచేసింది. లోపలికి పోయి మంచం మీద వాలింది. పాకలో మనిషి బీడీ తీసి పొయ్యి దగ్గర వెలిగించి బయట కొచ్చి కూర్చున్నాడు.

తన బ్యాగ్‌మీద వెనక్కి వాలి కూర్చున్న వెంకటేష్ 'మీ అబ్బాయి పేరేంటండి' అనడిగాడు.

'సోమరాజండి. మా అయ్య పేరెట్టాను.'

'కుర్రాడు మంచి చురుగ్గా ఉన్నాడు. చదువు తున్నాడా?'

'అబ్బే ఏం సదూతాడండీ... పనీపాటా లేకుండా బళ్లో కూర్చుంటానంటే మనకి గడవదు కదా.'

'ఓర్నీ... అంటే పనీపాటా లేనోళ్లు చదువు కొంటారా' అనుకొని, 'అలాక్కాదు... చదువుకొంటే మంచి ఉద్యోగం వస్తుంది. డబ్బులు సంపాదించ వచ్చు. కుర్రాడు బాగుపడతాడు కదా' అన్నాడు.

'ఆయ్... ఎందుక్కాదండీ... కానీ యేట నేర్చు కోకపోతే ఎట్టా బతుకుతా డండి.'

నవ్వొచ్చింది వెంకటేష్‌కి. ఉద్యోగం వస్తుందిరా అంటే ఎలా బతకాలంటాడు. అందుకే వీళ్లు పైకి రావడంలేదు అనుకొని–

'అదికాదండీ... చదువుకోవడం వల్ల చాలా విషయాలు తెలుస్తాయి. పెద్ద పేరు సంపాదించవచ్చు. నాకు తెల్సిన కుర్రాడు ఒకతనున్నాడు. అతనూ ఇంతే ఉంటాడు. అతణ్ణి కూర్చోబెట్టి అడిగామనుకోండి... ఇరవై ముప్పై దేశాల పేర్లు, వాటి అధ్యక్షుల పేర్లు టకటకమని చెప్పేస్తాడు. అతణ్ణి ఒకసారి టి.వి.లో చూపించారు కూడా. ఇదంతా ఎలా వచ్చింది? చదువువల్లనే కదా...'

ఆ మనిషి బీడీని అవతలికి విసిరేస్తూ, 'నిజమే బాబూ... సదుంకోబట్టే అన్ని తెలివితేటలు...' అని ఆగాడు. ఆగి మళ్లీ 'మావోడు కూడానండీ శానా తెలివైనోడేనండి. ఇంతున్నాడు ఆడు. ఎన్ని విషయాలు తెలుసో తెలుసాండి. గోదాట్లోనూ సముద్రంలోనూ దొరికే చేపల్ని బలే గుర్తు పట్టేస్తాడండి. మీరడగండి ఎన్ని రకాల చేపలు చెప్తాడో.ఈ సుట్టుపక్కలెవరికీ అన్ని సేపలు తెల్నేతెల్దు' అని, 'ఒరేయ్ సోవుడూ మనకి దొరికే చేపల పేర్లు చెప్పరా' అన్నాడు.

ఆ కుర్రాడు వెంకటేష్‌ని చూసి మళ్లీ వాళ్ల నాన్న వంక చూస్తూ 'మట్టగిడసలు, చేతిపరిగెలు, వంజరం, పులస, ఇలస, పండుగప్ప, వాలుగ, మోసు, బొచ్చు, ఎల్ల, కొర మీను, ఇసకదొందులు, మార్పు, రొయ్య, గండమీను, గొయ్యింకలు, తాటిగిలస, బొమ్మి డాయిలు, గొరస, బేడిస, శీలావతి, బెత్తుపరిగ, సొరచేప, కానాగదులు, సందువ, సావిడాలు, పీతలు, టేకి, కవళ్లు, చుక్కపీతలు...' అంటూ ఊక్కుంటూ చెప్పాడు.

'నాన్సెన్స్' అనుకొన్నాడు వెంకటేష్. నేను చెపుతున్న విషయమేంటి... ఈ బోడిచేపల విషయమేంటి...

కొద్దిసేపటికి అతని పెదాల మీద వంకర నవ్వులోనికి ఇంకిపోయింది.

అవును... ఆ కుర్రాడు తను ఎందులో ఉన్నాడో... తను ఎందులో ఉంటాడో దాని గురించి అపారమైన జ్ఞానాన్ని సంపాదించాడు. వరద గోదావర్ని కటిక చీకట్లో ఈదగల సాహసి. తన కొడుకు ఇరవై దేశాల పేర్లు, అధ్యక్షులు చెప్పగలిగేవాడు ఆటలు పాటలు లేకుండా ఐదేళ్ల వయసు నుంచీ నూరి నూరి పోస్తే చెప్తు న్నాడు. కానీ వాడికి ఆ వయస్సులో... ఆ దేశాలతోను... అధ్యక్షులతోను పనేంటి? వాడికీ, వాడి బుర్రకీ అక్కర్లేని విషయాల్ని జి.కె. పేరు మీద అంట గడుతున్నాం. దాన్ని జ్ఞానం అనాలా... ఇంత చిన్న వయసులో తన చుట్టూ ఉన్న ప్రకృతి గురించి ఇంత అపారమైన ఎరుక సంపాదించిన ఈ కుర్రాడిది జ్ఞానం అనాలా?

ఇది విద్య కాదా... చదువు కాదా...

అతడి ఆలోచనలు అలా సాగిపోతున్నాయి.

తండ్రీకొడుకులిద్దరూ అలా వాలి కళ్లు మూసుకొన్నారు.

అవును, ఈ కుర్రాడు పెద్ద డబ్బు సంపాదించ లేడు. పేరూ సంపాదించలేడు. కానీ నీళ్లు... నదులు... సముద్రాలు... చేపలు... ఈ బ్లూగోల్డ్‌కి సంబంధించిన మార్కెట్లో వీడూ వీడి జ్ఞానమూ భస్మమైపోతాయి. పనికిమాలినవాడెవడో లక్షలు పోసి ఇంజనీరింగో, ఇంకోటో చదివి చేపల స్పెషలిస్ట్ ఔతాడు. వీళ్లని ఇక్కణ్నుంచి గెంటేసి నీటినీ, చేపల్నీ కంప్యూటర్లో వెదికి సముద్రాన్ని జల్లెడ పట్టేస్తాడు. కోట్లు గడించేస్తాడు. ఇంత సాహసం... జ్ఞానం ఉన్న ఈ కుర్రాడు ఏ బురదగుంటనో వెదుక్కొని మట్టగిడసల్ని దేవులాడుకొంటూ బతుకు తాడు... ఏంటో ఈ చిత్రం... కునుకు పట్టేసింది.

మళ్లీ కళ్లు తెరిచేసరికి చారు పోపు వాసన కమ్ము కొని ఉంది. బయట అంతగా

చప్పుడు లేదు. అతడు గమ్మున లేచి గుమ్మంలోంచి చూశాడు.

వాన తగ్గిపోయింది. చిన్నచిన్న చినుకులు పడుతున్నాయి. అయినా ఫర్వాలేదు, పోవచ్చు.

అతను చిన్నపిల్లాళ్లా వెనుక్కు తిరిగి ఇంట్లో వాళ్లని చూస్తూ,

'వాన తగ్గిపోయింది' అన్నాడు. అని మళ్లీ 'నాన్సెన్స్, ఏంటీ వింత ప్రవర్తనా' అనుకొని–

'నేను బయలుదేరవచ్చు' అన్నాడు.

పాకలో మనిషి తల ఊపుతూ 'అవును బాబూ బేగెల్లిపోతే అమలాపురం పోవచ్చు' అని 'వణ్ణం పెట్టెయ్యే' అన్నాడు భార్యతో.

'అబ్బే ఎందుకండీ ఎలాగూ అమలాపురం పోతానుగదా' అన్నాడుగానీ ఆకలి దంచేస్తోంది. అతను గబగబా రాత్రి తీసిన దుప్పట్లు, తడిగా ఉన్న బట్టలు బ్యాగ్‌లో కుక్కేసి ఆ షార్టూ, చొక్కాలతోనే తయారై పోయాడు. చారు పోసిన అన్నంగిన్నె తెచ్చి ఆమె మంచం దగ్గర పెట్టింది. వెంకటేష్ గబగబా తినేశాడు. సాక్స్ లేకుండానే బూట్లు తొడిగేసుకొని బ్యాగ్‌ని భుజాన తగిలించుకొన్నాడు. లేచి ఒక్కసారి ఆ ఇంటిని చూశాడు.

గుమ్మం దగ్గర ఆమె– ఆమె కొంగు పట్టుకొని కుర్రాడు నిలబడి ఉన్నారు. పాకలో మనిషి తనతో రావడానికి సిద్ధంగా ఉన్నాడు. వెంకటేష్ అసంకల్పితంగా ఆమెకి నమస్కారం పెడుతూ, 'సొంత అక్క కన్నా బాగా చూశారు నన్ను... మీకు నా... నా...థాంక్స్' అన్నాడు.

ఆమె నల్లటి మొహం ఎర్రబడిపోగా తల పక్కకి తిప్పుకొని బిడ్డని దగ్గరగా లాక్కుంది.

'వస్తానండి' అంటూ బయటకొచ్చాడు.

'అబ్బే అటెళ్లలేమండీ... ఆ రేవంతా మునిగి పోయింది చూశారా' అన్నాడు పాకలోని మనిషి.

అటు చూశాడు. నిన్న తాను నడిచొచ్చిన గట్టు కొంతదూరం కనిపిస్తోంది. ఆపైన అంతా ఎర్రటినీళ్లు.

పక్కని గోదావర్ని చూస్తే గుండె ఝల్లుమంది. సుడులు తిరుగుతూ ఒక ఇంద్రజాల శక్తిలా వెళ్తోంది. ఒక్క నిమిషం అలా చూస్తే మనకీ అందులోకి పోవాలనే వాంఛ కలుగుతుంది.

‘కానీ ఇంత అందమైనదీ... ఆత్మనీ, మనసునీ కడిగేసిన అద్భుత దృశ్యాన్ని తాను జీవితంలో చూడ లేదు’ అనుకొన్నాడు.

పాకలో మనిషి గట్టు దిగి మోకాల్లోతు నీటిలో నడుస్తున్నాడు. వెనకే జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు వెంకటేష్. చినుకుల వడి తగ్గింది కానీ అలా జల్లులా పడుతూనే ఉంది. ఒక అరగంటపైనే నడిచాక అకస్మాత్తుగా సన్నటి రోడ్డు తగిలింది. అక్కడ ఆగి అన్నాడు పాకలో మనిషి, ‘ఇదే బాబూ మీ దారి... ఇదుగో ఇలాగెల్లి పోయారనుకోండి... ఆ కనపడేదే సెంటరు’ అని చేతిని కళ్లకడ్డం పెట్టుకొని చూసి, ‘ఒక ఆటోవాడున్నట్టున్నాడు. రండి వస్తాడేమో’ అని నడిచాడు.

ఆటో ఉంది. ఎవరూ లేరు. పాకలో మనిషి రోడ్డు పక్కగా ఉన్న ఇళ్లలోంచి లోనికెళ్లి మళ్లీ తిరిగొచ్చాడు, ‘ఆటో నట్టం లేదంట’ అంటూ.

వెంకటేష్ తడుస్తూ నిలబడ్డాడు. ఆ మనిషి అన్నాడు.

‘ఇంక చేసేదేముంది బాబూ... ఈ రోడ్డు మీంచి పోతే కాస్తంత దూరంలో పేరూరగ్రహారం వస్తది. ఇంకక్కణ్ణించి ఏదో ఒకటి దొరుకుతుంది. అమలాపురం పోవచ్చు. రోడ్డులవీ బాగుంటే ఆదుర్రు కూడా పోవచ్చు.’

‘ఎలా వెళ్లాలి.’

పాకలో మనిషి ఆటోలోకి ఒంగి బీడీ వెలిగించి నవ్వుతూ...

‘నడిచి’ అన్నాడు.

అవును నడిచిపోవచ్చు కదా. రెండు కాళ్లున్న సంగతి, వాటితో నడవచ్చన్న సంగతి కూడా బుర్రకి తట్టలేదు. వెంకటేష్ కూడా నవ్వుకొంటూ ‘అవును కదా’ అన్నాడు.

‘మరైతే నే ఎల్తాను బాబూ. గోదారిగానీ పొంగిందంటే పాక లేచిపోద్ది’ అన్నాడు అతను.

వెంకటేష్ ‘అవును...’ అంటూ ఆటో ముందు సీట్లో బ్యాగ్‌ని పెట్టి దాని ముందు పాకెట్లోంచి పర్సు తీసి రెండు వందలు తీశాడు.

‘ఉంచండి’ అంటూ అతనికివ్వబోయాడు.

అతను బీడీ విసిరేసి ‘ఒద్దు బాబూ... తప్పు’ అన్నాడు.

‘ఫరవాలేదు. రాత్రి ఉన్న పరిస్థితిలో... మీరు లేక పోతే నా పరిస్థితి ఏంటో... తల్చుకొంటేనే భయమే స్తోంది... నేనెవరో తెలియకపోయినా సొంత చుట్టంలా ఆదరించారు గదా... అందుకని...’

అతను నవ్వి అన్నాడు.

'మనిషి సుఖంగా ఉన్నప్పుడు యాపారం చెయ్యొచ్చు బాబూ... కష్టంలో ఉన్నప్పుడు యాపారం చైకూడదు. రాత్రి మీరు కష్టంలో వచ్చారు. మీరు మడిసి... నేను మడిసిని... వానకి ముద్దయిన పిట్ట చెట్టు మీద వాలబోతే చెట్టొద్దంటదా... ఇదీ అంతే...' అని ఆగాడు.

వెంకటేష్ మెల్లిగా డబ్బుల్ని పర్సులో పెట్టేసుకొని బ్యాగ్‌ని భుజం మీద పెట్టుకొన్నాడు.

ఆ మనిషి అంటున్నాడు.


'రాత్రి ఉన్న పరిస్థితి అన్నారు కదా బాబూ. అలాంటి పరిస్థితిలో మడిసికి మడిసి సాయపడకపోతే ఇంకాణ్ణి మడిసనెలా అంటాం... ఇలాగే నాలాంటి మడిసి నీ ఇంటిముంగిట నిలిస్తే లోనికి రమ్మంటావా... బయటగ్గెంటేస్తావా...' అని ఆగి,

'సరే వస్తాను బాబూ... జార్తగెల్లిరండి...' అంటూ వెనక్కి తిరిగాడు.

వెంకటేష్ అతను వెళ్తున్న వైపే చూస్తూండి పోయాడు.

'లోనికి రమ్మంటావా... బయటగ్గెంటేస్తావా...'

ఈ ప్రశ్నకి సమాధానం మనసులోనైనా అనుకోవడానికి అతడికి భయమేసింది.



# నిశ్శబ్దపు పాట

## శ్రీకాంత్. కె

● రచనా కాలం: 2002

**శ్రీకాంత్ కె:** వర్తమాన కవితా వేదికపై ప్రముఖంగా వెలుగుతున్న కలం. విస్తృతంగా, గాఢంగా రాయడం వల్ల పాఠకుల గుర్తింపు పొందారు. సుప్రసిద్ధ కవి కె.శివారెడ్డి వీరి తండ్రి. 'ఇతర' వీరి కవితా సంపుటి పేరు. 'నిశ్శబ్దపు పాట' కథకు న్యూఢిల్లీ 'కథ' పురస్కారం దక్కింది. రాసిన కథలు తక్కువే అయినా ఉత్తమ పాఠకుల గమనింపు పొందాయి. వృత్తిరీత్యా ఇంగ్లిష్ అధ్యాపకులు. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వయసు 44 సంవత్సరాలు.

అజ్మత్ ఉదయాన్నే లేచి, ఆరోజు శెలవు దినం కావడం వల్ల పనిముట్లన్నీ ముందు వేసుకొని ఇంటి ఆవరణలోని వేపచెట్టు కింద కూర్చున్నాడు. అప్పటికే లేచి, ముఖాలు కడుక్కుని, టీ తాగి వీధిలో గెంతుతున్న పిల్లలు తండ్రి వేపచెట్టు కింద చేరటం గమనించి, అలవాటైన ఆనందంతో ఆటల్ని వొదిలి, గేటు తీసుకుని అతడి ముందు చేరారు.

'నాన్నా ఈవేళ పూర్తవుతుందా?'

ఎదురుగా మోకాళ్ల చుట్టూ చేతులు కట్టుకుని, ఆసక్తి నిండిన కళ్లతో, పనిముట్లనూ, పక్కగా కుప్పపోసిన కాగితాలనూ నిండుగా తెరుచుకున్న కళ్లతో, వేపాకుల నీడలు పడి మెరుస్తున్న, నాలుగేళ్ల కొడుకు ముఖం గమనించి అజ్మత్ చిర్నవ్వాడు.

'ఈవేళ అవుతుంది తప్పకుండా' కొడుకు పక్క గా నిల్చుని, నడుంపై రెండు చేతులూ బిగించి చూస్తున్న ఆరేళ్ల కూతురు చెప్పింది. వాళ్లిద్దరినీ పరిపూర్ణమైన శాంతి నిండిన ముఖంతో గమనించి, 'మీరు అల్లరి చేయకూడదు. నన్ను మధ్యలో విసిగించ కూడదు. మరి మీరు లోపలికి వెళ్లి మీ అమ్మేం చేస్తుందో చూసి రండి' అని వాళ్లని పురమాయించి తలవంచుకుని, పనిముట్లని తనకు అవసరమైన పద్ధతిలో అమర్చుకోవడంలో నిమగ్నమయ్యాడు.

పిల్లలు లోపలికి పరిగెత్తుకు వెళ్లి వంటగదిలో స్టవ్ వద్ద ఉదయపు ఫలహారం చేస్తున్న తల్లి వద్దకు చేరారు. కొడుకు తల్లి నడుం చుట్టూ చేతులు వేసి అడిగాడు, 'అమ్మా నాన్నీపూట తయారుచేస్తాడా?'

'నేను చెప్పానుగా ఈవేళ అయిపోతుందనీ' కూతురు బదులిచ్చింది.

స్టవ్‌పై ఉన్న పాలగిన్నెను పక్కకు దించి, వెనుదిరిగి కొడుకు జుత్తును వేళ్లతో నిమురుతూ, నవ్వుతూ అయేషా అడిగింది 'ఆడుకోకుండా అప్పుడే వచ్చేశావేం?'

'నాన్న పనికి కూర్చోగానే లోపలికి వచ్చేశాడమ్మా. క్రితంసారిలాగే పాడు చేస్తాడు. అంతా అయిపోతుందనుకున్నప్పుడు తొక్కాడు' కూతురు ఆరోపించింది.

'వాడు చూసుకోలేదులేవే' అని కూతురితో అంది కాని, రెండు వారాల క్రితం పండుగ శెలవునాడు పగలంతా కూర్చుని భర్త తయారు చేస్తున్నది అయిపో తుందనగా, కొడుకు చూడక దానిని తొక్కిన తర్వాత, తీవ్రమైన తన భర్త ముఖం గుర్తుకు వచ్చింది. తనకు తెలుసు భర్తకి అదంటే ఎంత ప్రాణమో. పెళ్లయిన కొత్తలో, వొకరాత్రి తనకు ఆ విషయం చెప్పినప్పుడు వింతగా అనిపించింది. భర్త సరదాగా మాట్లాడుతున్నాడేమో అనుకుంది. అటు పిమ్మట, అతడు నిజంగానే చెబుతున్నాడని గ్రహించాక, పిచ్చివాడేమోనని భయపడింది. అతడు చెప్పాడు, అతడికి చిన్నప్పటి నుంచీ అది ప్రాణప్రదమైన కోరికని. కానీ అదేం కోరిక? మతి వున్న మనిషికెవరికైనా అటువంటి కోరికలు వుంటాయా? పెళ్లయిన నాలుగోరోజు, అతడు తన ఇంటి వెనుక గదిలో దాచి ఉంచిన సామానునీ, పనిముట్లనీ, కట్టలుగా కట్టి ఉంచిన వేలకొలది కాగితాల్ని చూపించాక భయ పడింది. అతడు ఉద్వేగంగా, చిన్నప్పటి నుంచి దాని నిర్మాణానికై తను వ్రాసుకున్న సమాచారం నిండి ఉన్న ఆ వేలకొలది కాగితాల్ని చూపించాక విస్మయం చెందింది. ఎటువంటి భర్త తనకు లభించాడు! ఇతనితో జీవితాంతం కాపురం చేయాలి! తన తల్లిదండ్రులు ఒక పిచ్చివానికి తనను కట్టబెట్టలేదు కదా!

అయితే ఆ తర్వాత ఆమె గ్రహించింది. అతనిలో ఆ ఒక్క వాంఛ మినహా పేరు పెట్టాల్సిన నెపమేమీ లేదని. అతడు నెమ్మదస్తుడు. మితభాషి. పైగా తనను అమితంగా ప్రేమిస్తాడన్న విషయం త్వరలోనే గ్రహించింది. ఇంట్లోకి ఏ లోటూ లేదు. అద్దెకు ఉన్న ఇల్లయినా సౌకర్యవంతంగా ఉంటుంది. అతడు చేసే ఉద్యోగానికి వచ్చే జీతానికి సరిపోయేటట్టుగానే వుంటుంది. ఎటువంటి ఆరోపణలూ లేవు. ఉంటే ఏవన్నా, అప్పుడప్పుడూ చుట్టుపక్కల వాళ్లు, అతడు ప్రతి ఆదివారం లేదా శెలవు దినాన సామాన్లన్ని ముందు వేసుకుని ఇంటి ఆవరణలో తయారుచేస్తున్నదేమిటో తెలుసుకుని ఆట పట్టించడం తప్ప.

'వాళ్ల మాటలు నువ్వు పట్టించుకోకూడదు' అతడు అనేవాడు.

'వాళ్లు మీపై నవ్వుతారు. ఏవంటారో తెలుసా? ప్రపంచంలోని వింత హైదరాబాద్‌లో మీ రూపంలో వుందని'

'అలాగా. వాళ్లకి ఇది ఎందుకు ఆశ్చర్యం కలిగిస్తుందో నాకు అర్థంకాదు. కానీ ఆయేషా, మా ఊర్లో దాదాపు ప్రతి ఒక్కరూ దానిని తయారుచేసినవాళ్లే. వాళ్లకి అది పెద్ద విద్యేం కాదు. కాకపోతే వర్షంలోనే వెళ్లాలన్న నియమం వల్ల మరింత దూరం పోలేకపోయేవాళ్లు. కానీ, చక్కటి నైపుణ్యం ఉన్నవాళ్లు ఎంత చక్కటి రూపాలతో తయారు చేసేవాళ్లో తెలుసా?'

'ఏమో నాకు తెలీదు. వాళ్లలా మాట్లాడుతుంటే నాకు బాధగా ఉంటుంది. అదీగాక, వాళ్లు వాళ్ల ఇళ్లకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ చెబుతుంటారు. మీకిది తెలుసా, మా ఇంటి పక్కన ఉన్నాడే అజ్మత్. అదే ఆ అబ్బాయే, అతనికి వేపకాయంత వెర్రి ఉంది అని. నేనేం చేసేది?'

'వాళ్ల మాటలేం పట్టించుకోకు' అని భర్త చెప్పేవాడు కానీ తనకే అప్పుడప్పుడు అసంబద్ధంగానూ అసహనంగానూ అనిపించేది. పెళ్లయిన కొత్తలో ఏమను కునేదంటే, త్వరలో దానిని మరచిపోతాడని. కానీ ఇన్నేళ్ల తర్వాత కూడా అతడు దానిని వదిలిపెట్టకపోవడం గమనించాక, తను వొదిలిపెట్టమని చెప్పడమూ మానివేసింది. మొదట్లో చుట్టుపక్కల వాళ్ల మాటలు ఇబ్బంది గానూ అసహ నంగానూ అనిపించేవి. ఇప్పుడు వుంటున్న ఇంటిలో తాము గత మూడేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. ఇంటి చుట్టుపక్కల వాళ్లు మొదట్లో అతణ్ణి వింతగా చూసినా తర్వాత తర్వాత వాళ్లకు మామూలైపోయింది. అతణ్ణి వాళ్లు ఇబ్బందిపెట్టడం మానివేశారు. అది వాళ్లకు ఎంత క్రమబద్ధమైన చర్యగా మారిందంటే, ఏనాడైనా ఒక శెలవు దినాన అతడు వేరే పనిపై బయటకు వెళ్లి ఇంటి ఆవరణలో పనిముట్లతో కనిపించకపోతే అలవాటైన దృశ్యమేదో, చర్యేదో తమ జీవితాల్లోంచి తప్పుకున్నట్టుగా అనిపించేది.

అతడు సాయంత్రం ఇంటికి వచ్చాక, వచ్చి పలుకరించి అడిగేవాళ్లు 'అజ్మత్, ఈ దినం ఏమయ్యావు? పగలంతా కనిపించలేదు. ఎంతవరకు వచ్చింది నీ పని' అని.

అయితే అన్నింటికంటే, అందరికంటే అతడు చేయాలనుకున్న పని గొప్ప ఆనందాన్ని ఇచ్చేది, పిల్లలకి. వాళ్లు మాత్రమే అతడు చేసే పనిని ఎటువంటి సందేహాలు లేకుండా, అతడు చాలా సహజమైన దానినేదో చేస్తున్నట్టుగా, పూర్తి సమ్మతితో, ప్రతి శెలవు దినాన అతడి పక్కన చేరి, నవ్వులతో, తమ సందేహా లతో, అతడి పనిలో పూర్తిగా నిమగ్నమయ్యేవారు.

'నాన్నా నువ్వు తయారుచేసిన తర్వాత అదెలా తయారుచేయాలో నువ్వు

నాకు నేర్పాలి' కూతురు అడిగేది. ఆ వరండాలో, శీతాకాలపు ఎండ వేపకొమ్మ ల్లోంచి గోరువెచ్చగా శరీరాన్ని చుట్టుకుంటుండగా, తదేకంగా భర్త చేతులవైపూ, ముఖంవైపూ, పక్కగా కూర్చుని శ్రద్ధగా చూస్తున్న కూతురి ముఖంవైపూ చూస్తూ అప్పుడప్పుడూ విస్మయం చెందేది. 'పొరపాటున దీనికి తండ్రి అలవాట్లు రావుగదా!'

'ఎలా పనిచేస్తున్నానో చూడు. దానంతట అదే నీకు వస్తుంది' అతడు సమాధానమిచ్చేవాడు.

అయితే, తను గర్భంతో ఉండగా ఒక రాత్రి, అతడు చెప్పాడు. 'ఒకవేళ నేను పూర్తి చేయలేకపోతే ఇది తప్పక చేయగలుగుతుంది. ఎంత తెలివిగలదో ఎప్పుడైనా గమనించావా?'. మరొకరోజు, అతడు దానికి సంబంధించిన చరిత్రనంతా ఆమెకు వివరించేందుకు ప్రయత్నించాడు. ఒకానొక సమయంలో, తమ వంశంలోనే కాక దేశంలో ప్రజలందరూ వాటిని తయారు చేయటమే కాక గ్రామాల్నుంచి గ్రామాలకు ప్రయాణం కూడా చేసేవాళ్లట. ఆ తర్వాత గొప్ప కరువు తర్వాత, రోగాల వల్లా, దొరకని తిండి వల్లా, నాయకుల వల్లా నేల విడిపోగా, వాటిని గొప్ప నైపుణ్యంతో తయారు చేసే ప్రజలు చెట్టుకొకళ్లూ, పుట్టకొకళ్లూ విడిపోయాక, కాలంతోపాటు రానురానూ వాటిని తయారుచేయటం తగ్గిపోయిందట. అతడి తండ్రి సమయానికి వచ్చేసరికి ప్రపంచం మొత్తంమీద వాటిని తయారు చేసి ప్రయాణం చేయగలిగే వాళ్లు అతి కొద్దిమంది మాత్రమే మిగిలారట.

'నువ్వు నమ్మవుగానీ, నాకు ఆరేళ్లు ఉన్నప్పుడు, మా నాన్న ఎంత చక్కటిదానిని తయారు చేశాడంటే, ఎంత పటిష్టంగా ఉండేదంటే, వర్షపు పండుగనాడు నన్ను ఎక్కించుకుని పందెంలో పాల్గొని గెలిచాడు. అది గొప్ప ఘనకార్యం. ఎందుకంటే అప్పట్లో ఒక్కరు మాత్రమే పట్టి ప్రయాణం చేయగలదానిని తయారు చేయటం గొప్ప. నేను నాన్న తయారుచేసినలాంటి దానిని తయారు చేయలేనేమో కానీ ఒక్కరు వెళ్లేదానిని తయారు చేయగలనేమో'నని అతడు చెప్పేవాడు. అది నమ్మాలా వద్దా అనే సందిగ్ధంతో తను అడిగింది.

'మీరుకాక ఇప్పుడు వాటిని తయారుచేస్తున్న వాళ్లెవరైనా వున్నారా?'

'తెలీదు. ఉండి వుండవచ్చు. ఆయేషా, నా బాల్యంలో ఊర్లో చాలామంది ఉండేవాళ్లు. అయితే వాళ్లంతా వయసు మళ్లినవారు. ఆ తర్వాత తరంలో ఎవరికైనా జ్ఞాపకం ఉందో లేదో తెలియదు. ఎందుకంటే చాలామంది పట్నాలకు

వచ్చేశాం కదా' అతడు చెప్పే వాడు.

అయితే, తను భర్తకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు గానీ, ఒక సందేహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఇప్పుడు కూడా ఉంది కానీ మునుపటంతటి తీవ్రతతో కాదు. అంతెందుకు. తనకు తన బాల్యపురోజులు జ్ఞాపకం. వర్షాకాలం బయట వీధులలో ఆడుకునేందుకు కుదరదు కనుక స్కూళ్ల నుంచి వచ్చాక మబ్బు పట్టిన ఆకాశం కింద రాబోయే వర్షంలో రెండురకాల ఆటలు మాత్రమే సాధ్యం అయ్యేవి. ఒకటి, వర్షాన్ని పట్టించుకోక వర్షంలో తనలాగే ఇళ్లలోంచి తప్పించుకు వచ్చిన పిల్లలతో గెంతడం లేదా అది సాధ్యం కానప్పుడు, మబ్బులు చిక్కగా అలుము కోగానే కాగితాలు చించి రకరకాల పడవలు తయారు చేసి కురవబోయే వర్షం కోసం ఎదురుచూడడం. అటు పిమ్మట, గుమ్మం ముందు తడవకుండా ఉండేందుకు అవస్థలు పడుతూ, పారుతున్న వర్షపునీటిలో కాగితపు పడవలను వొదిలి అవి కానరాకుండా పోయేదాకా గమనించడం. కానీ అటువంటి సమయాలలో తనకు వూహ మాత్రమైనా తట్టలేదు, తను మరికొంతకాలం తర్వాత, ఒక కాగితపు పడవను తయారుచేసి, దానిలో వర్షపునీటిలో ప్రయాణిం చాలనుకునే మనిషితో జీవిస్తుందని. ఎటు వంటి కోరిక! అది సాధ్యమేనా? అతడు సాధ్యమేనంటాడు. అంతేకాక, తను తన తండ్రితో అటువంటి కాగితపు పడవలో పందెంలో పాల్గొని గెలిచానని చెబుతాడు. ఎటువంటి మాటలు! లేకపోతే, మనిషి పట్టేంత కాగితపు పడవను తయారుచేసి దానిలో ప్రయాణించాలనుకోవడం ఏమిటి? తను ఎవరికీ చెప్పలేదు గానీ, రాత్రుళ్లలో అతడు గంటలకొలదీ తన కోరికలను వివరించేవాడు. అతడు ఒక కాగితపు పడవను తయారు చేసి, దానిలో సముద్రాలపై ప్రపంచాన్ని చుట్టి రావాలనుకుంటాడు. కానీ, అది ఎలా సాధ్యం?

ఒక రాత్రి, తను సరదాగా అతడ్ని ఆట పట్టించేందుకు అడిగింది.

'ఇంకా వేటితో పడవల్ని తయారుచేసి ప్రయాణించాలని మీ కోరిక? పోనీ మేఘాలతో చేస్తే?'

అతడు మహా గాంభీర్యంతో యోచించాడు.

'నిజమే. ఎంత అద్భుతమైన ఆలోచన' అన్నాడు. ఆ తర్వాత, వారంరోజులు, అతడు నిజంగానే మేఘాలతో తయారు చేసే పడవల గురించి తీక్షణంగానూ, దీర్ఘంగానూ ఆలోచించాడు.

'బరువు వొక్కటే సమస్య మబ్బులతో... వాటిని భూమిపైకి ఎలాగో అలాగ తీసుకురావచ్చు. కానీ నీకు తెలుసుకదా, ఒక పడవని అది ప్రయాణించబోయే

నీటి సాంద్రతను బట్టి తయారుచేయాలని.' ఆమె నవ్వింది. కానీ, మూడేళ్ల క్రితం కొత్తగా ఈ ఇంటికి వచ్చిన తర్వాత, అతడు మొదట చేసిన పని, ఇంటి ముందున్న వీధి వెడల్పూ, సగటు వర్షం పడితే ఎంత నీరు ప్రవహిస్తుందో, దాని సాంద్రత ఏమిటో కనుక్కునే ప్రయత్నం చేయటం.

'ఏం చేస్తున్నావు నాన్నా?' అని కూతురు అడిగేది.

గర్వం నిండిన స్వరంతో, మెరుస్తున్న కళ్లతో అతడు చెప్పేవాడు.

'పడవ తయారు చేసేందుకు కొలతలు తీసుకుంటున్నాను.'

ఎటువంటి సమాధానం. తనైతే ఎవరికీ చెప్ప లేదు, కానీ పిల్లలు తమ తోటి స్నేహితులతోనూ, ఆఖరుకు స్కూల్లో టీచర్‌కూ చెప్పారు. ఒకరోజు స్కూలులో పిల్లలందరినీ ఆదివారం పూట ఇంటివద్ద ఏం చేశారని అడిగారట. అందుకు కూతురు తను, నాన్న కాగితం పడవ తయారుచేస్తుంటే సహాయపడ్డానని చెప్పిందిట. ఆ సమాధానపు అసలు అర్థం అర్థం కాని మాష్టారు దీనిని, 'నీవు ఆడుకునేందుకా?' అని అడిగితే, 'ఊహూ, మా నాన్న దానిలో వెళ్లాలి. వర్షం నీటిలో' అని చెప్పిందిట. ఆ తర్వాతి ఆదివారం, తన క్లాసులోని పిల్లలు సగం మంది ఇంటికి వచ్చారు. కాగితపు పడవని చూసేందుకు మాష్టారుతో సహా! ఆ మాష్టారు అన్నాడు–

'అజ్మత్. గొప్ప ఆలోచన. నా బాల్యంలో మా తాతగారు చెప్పేవారు. ఒకప్పుడు కాగితపు పడవలతో నదులు దాటే మనుషులుండేవారని. కాని అటువంటి వాళ్లని ఇదే మొదటిసారిగా చూడటం. మీ ప్రయత్నం ఫలించాలని ప్రార్థిస్తున్నాను.'

ఇతడ్ని చూసి స్కూల్లో మరుసటి రోజు నుంచి పిల్లలు పడవలు తయారు చేసేందుకు ప్రయత్నించడం మొదలుపెట్టారనీ, ఇంటివద్ద చదవటం లేదనీ, పడవలు తయారుచేయటం చదువుకి ఆటంకం కలిగిస్తుందనీ, చాలామంది తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారట.

'చాలా మంచి పరిణామం. వాళ్లని తయారుచేయనివ్వండి. ఎందుకంటే ఒకరోజు ఈ ప్రపంచం మొత్తం కాగితపు పడవలు తయారుచేసి వాటిలో ప్రయాణించగలిగే వాళ్లతో నిండిపోతుంది' అజ్మత్ అన్నాడు.

కానీ, తనకీ అప్పుడప్పుడూ కొద్దిగా అసహనం, చికాకు. వారంలో దొరికే ఒక్క శెలవు దినాన కూడా అతడు తనతో గడపకుండా, పనిముట్లన్నీ ముందేసు కుని కాగితపు పడవను తయారు చేస్తున్నానని కూర్చోవడం.

‘అమ్మా నువ్వు బయటకు రావా. నాన్నను చూద్దాం. ఈవేళ తప్పక పూర్తవుతుంది. సాయంత్రం వర్షం పడితే నాన్న దాంట్లో వెళ్లడం చూడొచ్చు’ కూతురు అంది.

పొట్టలో దాచుకున్న కొడుకు ముఖం లేపుతూ ‘మీరు వెళ్లి కూర్చోండి. నేను వంట చేయొద్దూ. మీకు ఆకలిగా లేదూ?’ అని అడిగింది.

పిల్లలిద్దరూ తల అడ్డంగా ఊపారు.

ఆమె నవ్వి, ‘నాకు ఆకలిగా ఉంది. మీరు వెళ్లి నాన్న వద్ద కూర్చోండి. చికాకు పెట్టకండి’ అంది.

పిల్లలు తలలు ఊపి ఇంటి ఆవరణలో చేరేసరికి అజ్మత్ కాగితాలను జాగ్రత్తగా, మందంగా ఉండేటట్టు అంటించడం పూర్తి చేసి, వాటి అంచుల చుట్టూ మేకులు కొడుతున్నాడు. అతడికి రెండడుగుల దూరంలో, పిల్లలిద్దరూ మొక్కలకు పక్కగా ఉన్న రాళ్లపై కూర్చుని పని చేస్తున్న తండ్రిని గమనించసాగారు.

అజ్మత్ ముందుగా అంటించిన కాగితాలన్నిటికీ జాగ్రత్తగా మేకులు కొట్టి, వివిధ గణితాకారాలలో వున్న ఆ కాగితాలన్నిటినీ పక్కకు పెట్టాడు. అతడు సంవత్స రాల తరబడి, తను ప్రయాణించగలిగే కాగితపు పడవను తయారుచేసే క్రమంలో గమనించినది ఏమిటంటే, పడవ పొడవూ, దాని బరువూ మధ్య తులనాత్మకమైన నిష్పత్తి ఉండాలనేది. రెండోది, ఒక కాగితపు పడవలో ప్రయాణించాలంటే తన బరువుకన్నా పడవ బరువు రెండింతలు ఎక్కువగా ఉండాలి. మూడోది ఏమిటంటే, తన ప్రాథమిక లక్ష్యం ఏటవాలుగా ప్రవహించే వర్షపు నీటిలో ప్రయాణించటం కాబట్టి, పడవ ముందుకు సాగేందుకు శక్తి నీటి ప్రవాహం ఇస్తుంది కాబట్టి, ఆ వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటుచేసే పడవ కింది రెక్కలు పటిష్టంగా ఉండాలి. (ఇంతకుముందుపోసారి పడవను తయారుచేసి, దాంట్లోకి ఎక్కి విజయవంతంగా పది అడుగులు ముందుకు పోగానే, రెక్కలు పటిష్టంగా లేకపోవటం వల్ల, పడవపై నియంత్రణ లేక, ఎదురుగా ఉన్న రాయిని ఢీకొని పడవ మొత్తం ధ్వంసం అయింది.) నాలుగోదీ, ముఖ్యమైందీ ఏమిటంటే, నీరు కాగితపు పడవలోకి అడుగుభాగం నుంచి ఇంకకుండా చూసుకోవడం.

చాలా ప్రయత్నాల తర్వాత, చాలా పడవలు విఫలమైన తర్వాత అతడు దానికొక మార్గం కనుగొన్నాడు. పడవ అడుగుభాగంలో ఏర్పరిచే కాగితపు పొరల మధ్య పల్చటి ఇసుకతెరను అమర్చటం ద్వారా, పడవలోకి నీరు ఇంకడాన్ని చాలామటుకు అరికట్టవచ్చునని. ప్రాథమిక పనులన్నీ అయిన తర్వాత,

కాగితాలతో పడవలో ఉండవలసిన భాగాలన్నిటినీ తయారు చేశాడు. గాలి దిశ మారినప్పుడల్లా పడవను అదుపు చేసేందుకు కాగితపు తెరచాప, తను కూర్చునేందుకు దృఢమైన కాగితపు కుర్చీ, చిన్నచిన్న కదలికలకు అవసర మైన చిన్న చక్రం, ఒకదాని తర్వాత మరొకటి పూర్తి చేశాడు.

'అయిపోయిందా నాన్నా?' పిల్లలు అడిగారు.

'ఇంకా కొద్ది పని మిగిలి ఉంది' నెత్తిన చుట్టుకున్న తువ్వాలు విప్పి ముఖం తుడుచుకుని, 'అమ్మేం చేస్తుంది?' అని అడిగాడు.

'లోపల ఉంది నాన్నా' అని బదులిచ్చిన కూతురితో, 'కొద్దిగా టీ పెట్టమను' అని చెప్పి కొడుకు వైపు తిరిగి, 'వొరేయ్. నువ్వు నా గది లోకి వెళ్లి పెన్నూ, పుస్తకం పట్టుకురా' అని పురమాయించాడు. ఆ తర్వాత కొడుకు తెచ్చి ఇచ్చిన పుస్తకంలో తయారుచేసిన భాగాలన్నిటి కొలతలనూ, వాటి బరువునూ జాగ్రత్తగా పుస్తకంలోకి ఎక్కించాడు.

'ఈ కొలతలన్నిటినీ ప్రతిసారీ వ్రాసుకోవలసిం దేనా?' అయేషా ఒకసారి అడిగింది.

అతడు తలూపాడు.

ఆమెకు ఒక గది నిండా పేరుకుని ఉన్న కొలత లున్న పుస్తకాల కట్టలు జ్ఞాపకం వచ్చాయి.

'ఈ కొలతలు చాలా ముఖ్యం. ఒకవేళ ఈ ప్రయత్నం విఫలమైతే, ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి' అతడు చెప్పాడు. ఆమెకు తెలుసు. అది చాలా కష్టమైన పనని. వీధికి తగ్గట్టు, దానిలో ప్రవహించే నీటిధారకు తగ్గట్టు పడవను తయారుచేయాలి కాబట్టి, గత తొమ్మిది సంవత్సరాలలో ఇల్లు మారినప్పుడల్లా కొలతలు మారేవి. ఇల్లు మారినప్పుడల్లా పడవ నిర్మాణమూ మారేది. అతడు గతంలో చాలాసార్లు అని ఉన్నాడు, 'ఎక్కడైనా కొంతకాలం కదలకుండా ఉండే ఇల్లు దొరికితే బావుండు. నేను త్వరగా పడవను తయారుచేయగలుగుతాను.' అతడు ఇంతకుమునుపు కంటే, ఈ మూడు సంవత్సరాలూ మరింత సంతోషంగా ఉన్నాడు, తన పని తను చేసుకోగలుగుతు న్నందుకూ, ఇల్లు త్వరగా మార్చే పరిస్థితి రానందుకూ.

అయితే ఆమె ఒకరోజు తన భర్తను అడిగింది, 'మీ నాన్నగారు ఇటువంటి కాగితపు పడవలను తయారుచేసేవారని చెప్పేవారు కదా...'

'ఒక్కరు కాదు, ఇద్దరు ఎక్కి ప్రయాణం చేయగల కాగితపు పడవలు' అజ్మత్ సరిదిద్దాడు.

'అదే. మరి మీ నాన్నగారు మీకు వాటిని తయారు చేయటం నేర్పించలేదా?' తను అడిగింది.

'ఊహు. అదేమిటంటే, పిల్లలకు వాటిని తయారుచేయడం నేర్పించడం నిషిద్ధం. పిల్లలే స్వంతంగా నేర్చుకోవాలని నాన్న చెప్పేవాడు. నీకు చెప్పడం మరిచి పోయాను. ఈ పడవలు తయారుచేయడం అంటూ జరిగితే భార్యలే నేర్పించాలి. అంటే నాన్నకు, అమ్మ నేర్పించింది. అది ఆచారం... భార్యలు భర్తలకు నేర్పిస్తారు. ఆ తర్వాత ఆ కుటుంబంలో అమ్మాయిలు పుడితే వాళ్లు స్వంతంగా నేర్చుకుని, వివాహమైన తర్వాత భర్తలకు నేర్పిస్తారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇదే పద్ధతిని నాన్న నాకు చెప్పాడు. మీవైపు ఊళ్లలో ఈ సాంప్రదాయం లేదు కానీ నాకు తెలిసినంతవరకూ మావైపు ఇలాగే ఎప్పట్నుంచో కొనసాగుతూ వస్తుంది' అతడు చెప్పాడు.

ఆయేషా పిల్లలకు అన్నం పెట్టి, వాళ్లు ముందు గదిలో అన్నం తింటుండగా, భర్తకు ఒక టీ కప్పు ఇచ్చి, తను మరో టీ కప్పుతో వరండాలో కూర్చుంది. భర్త ఆ పని పూర్తయ్యేదాకా భోజనం కూడా చేయడని తెలుసు. శీతాకాలం త్వరలో మరింత గాఢంగా మారబోతుందన్న సూచనగా గాలి మధ్యాహ్నంపూట చల్లగా ఉంది. అప్పటిదాకా ఉన్న ఎండ నెమ్మదిగా కనుమరుగవ్వసాగింది. టీ తాగడం పూర్తి చేసి, తిరిగి పనిలో నిమగ్నమైన అతడు తలయెత్తి కొమ్మల మధ్య నుంచి ఆకాశాన్ని గమనించాడు. నల్లటి మేఘాలు నెమ్మదిగా ఆకాశాన్ని ఎటువంటి తొందరపాటూ లేకుండా అలుముకుంటున్నాయి.

'ఇది సరైన దినం' అతడు అనుకున్నాడు.

'మరో అరగంటలో వర్షం పడుతుండవచ్చు. ఈ లోపల తను పడవను పూర్తి చేయడం అయిపోతే, ఈ పూటే ఈ కాగితపు పడవ విజయవంతమయిందోలేదో తెలుసుకోవచ్చు. మళ్లా వర్షంపడే రోజు దాకా ఆగనవసరం లేదు.'

అతడు మరింత వేగంతో పని చేయడం ప్రారంభించాడు. పక్కన పెట్టిన విడి కాగితపు భాగాలను, అనేక సంవత్సరాలుగా అలవాటైన నైపుణ్యంతో బిగించ నారంభించాడు. ఈలోగా భోజనం ముగించి పిల్లలు తల్లి పక్కగా చేరారు. ముగ్గురూ తదేకంగా మేకులు కొడుతున్న తండ్రినీ, అప్పటిదాకా ఒక పక్కగా అట్టిల్లా పడివున్న మందపాటి కాగితాలు ఒక ఆకారాన్ని సంతరించుకోవడం

గమనించసాగారు. తను గత తొమ్మిది సంవత్సరాలుగా గమనిస్తోంది, మేకులు కొట్టే అతడి చేతుల్ని, ముడిచిన కనుబొమ్మల్నీ, ముఖం కొద్దిగా అదురుతుండగా, ఒచ్చే కాగితాలపై మెత్తగా దిగబడే మేకుల శబ్దాల్నీ.

భార్యాపిల్లలు కూర్చుని చూస్తుండగా, ఆకాశం పూర్తిగా మబ్బులతో కమ్ముకుంటుండగా, అతడు నలభై ఐదు నిమిషాలలో పడవను అమర్చడం పూర్తి చేశాడు.

'నేను చెప్పాను కదా! ఈవేళ పూర్తవుతుందని' కూతురు తన తమ్ముడితో అంది.

అతడు పూర్తి చేసిన కాగితపు పడవను మరెక్కడైనా తప్పులున్నాయేమోనని సరిచేసుకుంటుండగా సన్నగా వర్షం మొదలయ్యింది.

మొదలవుతున్న వర్షాన్ని చూడగానే అతని ముఖం వికసించింది. తల్లితో పాటు పిల్లల ముఖాలూ విచ్చుకున్నాయి. వర్షపునీరు పడవపై పడకుండా ప్లాస్టిక్ సంచులతో తయారు చేసిన పొడుగాటి దుప్పటిలాంటి దానిని దానిపై కప్పి, వరండాలోకి వచ్చి, భార్యపక్కగా కూర్చుని పెద్దగా మారుతున్న వర్షంవైపూ, ఆకుల మధ్య నుంచి తప్పించుకుని రాలుతున్న వర్షం వైపూ చూస్తుండగా, అతడి కూతురు అడిగింది, 'నాన్నా ఇప్పుడు వెళ్లవచ్చా'

'ఇప్పుడే కాదు. వర్షం ఇంకా పెద్దది కావాలి. పడవ వెళ్లేందుకు కావాల్సినన్ని నీళ్లు వచ్చేదాకా ఆగాలి.'

'నాన్నా...! నేను కూడా వస్తాను' కొడుకు తండ్రి పక్కగా చేరి అతణ్ణి ఆనుకుంటూ అడిగాడు. అతడు మాట్లాడలేదు. .

ధారగా కురుస్తున్న వర్షం వైపు చూస్తుండగా అతడి గుండె వేగం పెరిగింది. ఈసారన్నా తన ప్రయత్నం ఫలిస్తుందా? ఫలించాలి. ఎందుకంటే, ఎటువంటి తప్పులూ లేకుండా, మునుపు తన ప్రయత్నాలలో జరిగిన తప్పులు ఎక్కడా పునరావృతం కాకుండా జాగ్రత్త పడ్డాడు. అయినా? ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? కానీ, ఇన్నేళ్లుగా వచ్చిన అనుభవంతో పటిష్టంగా నిర్మించాడు. ఈసారి విఫలం కాకపోవచ్చు. తప్పక తను ప్రయాణిస్తుండవచ్చు. ఈ వర్షం ఇంకా పెద్దది కావాలి. అప్పుడే వీధిలో ప్రయాణానికి కావాల్సిన తగినంత నీరూ, నీటిధారా లభిస్తాయి. అందుకు వేచి చూడటం తప్ప చేయగలిగిందేమీ లేదు.

ఒక అరగంట తర్వాత ఇంటిముందు ప్రవహిస్తున్న వర్షపునీరు మందంగా మారింది. పది నిమిషాల క్రితం పెద్ద చినుకులతో, చెట్లన్నీ ఊగిపోయే గాలులతో

కురిసిన వర్షం కొద్దిగా నెమ్మదించింది. అతడు నెత్తిపై గుడ్డ వేసుకుని, గేటు తీసుకుని బయటకు వెళ్లి, ప్రవహిస్తున్న నీటిలో పాదాన్ని మోపాడు. దాదాపు మోకాళ్ల వరకూ వచ్చాయి. ఈ ఉధృతి సరిపోతుందా? సరిపోతుండవచ్చు. ఇంకా కొద్దిసేపు పెద్దగా వర్షం పడుంటే మోకాళ్ల ఎత్తు నీళ్లు ప్రవహించేవి. తన ప్రయాణానికి సరిగ్గా సరిపోయేవి. అతడు వెనుదిరిగి వచ్చి, వరండాలోంచి ఆకాశంలోకి చూశాడు. మరి కొంతసేపు వర్షం పడుతుండవచ్చు కానీ, ఎంతసేపనేది ఖచ్చితంగా తెలిసేటట్టు లేదు. మేఘాలు దట్టంగానే ఉన్నాయి. కానీ, గాలి ఉధృతి తగ్గింది. తను మరికొద్ది సేపు ఎదురు చూడాలా లేక ప్రయాణం మొదలు పెట్టాలా? అతడికి ఏం చేయాలో తోచలేదు.

ఈలోపల, ఎదురింటి మొదటి అంతస్తులో నిలబడ్డ నలభై ఐదేళ్ల చంద్రం కేకేశాడు. 'అజ్మత్! ఈ వేళన్నా నీ పడవ పూర్తయ్యిందా? పెద్ద వర్షం పడుతోంది. నీళ్లూ నిండుగా ప్రవహిస్తున్నాయి. ఈవేళ ప్రయత్నం చేస్తావా లేదా?'

'మా పడవ పూర్తయింది' అతడికి బదులుగా, పెద్దగా అజ్మత్ కూతురు కేక వేసింది.

ఆ సంభాషణ వినబడ్డ పక్కింటిలో అద్దెకు ఉంటున్న ముగ్గురు కుర్రాళ్లు వరండాలోంచి కొద్దిగా తలలు బయటకు పెట్టి, 'శుభాకాంక్షలు. అయితే మీ ప్రయాణాన్ని ఈపూట చూడవచ్చునన్న మాట' అని అన్నారు. అతడేం సమాధానం చెబుతాడోనని ఆయేషా తదేకంగా చూస్తోంది. అప్పటిదాకా ప్రయాణం చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్న అజ్మత్ తల విదిల్చి, కొంతసేపు ఆలోచించి, ఆపై ముఖంపై పెద్ద నవ్వుతో, ఒక నిర్ణయానికి వచ్చినట్టు బదులిచ్చాడు.

'ఇప్పుడే మొదలుపెట్టబోతున్నాను. ఆ దేవుడి దయవల్ల అంతా సవ్యంగా జరగాలని కోరుకుంటున్నాను'

వాళ్లకు బదులిచ్చాక, మరేమాత్రం ఆలస్యం చేయక, గేటు బార్లా తెరిచి, గేటు గుమ్మం వద్ద నుంచి వీధిలో ప్రవహించే నీళ్లలోకి వెడల్పాటి చెక్కను అమర్చాడు. భార్యాపిల్లల సహాయంతో, ప్లాస్టిక్ సంచులను తొలగించి పడవను చెక్కపైకి చేర్చి, అతి నెమ్మదిగా దానిలోకి అడుగుపెట్టి, కూర్చుని, భార్యతో పిల్లలతో చెప్పాడు, 'నెమ్మదిగా ముందుకు తోయండి.'

ఎదురింటిలోని చంద్రం అతడ్ని గమనిస్తూ తన పక్కింటివాళ్లకు కేకవేసి ఆ విషయం చెప్పాడు. మరి కొద్దిసేపట్లో అజ్మత్ కాగితపు పడవప్రయాణాన్ని

మొదలు పెడుతున్నాడన్న విషయం వీధంతా పాకిపోగా, ఆ ఇరుకైన వీధిలో ఇరువైపులా ఉన్న ఇళ్లలోని జనం వరండాలలోకి వచ్చి ఎదురుచూడసాగారు. ఉత్సుకత, కంగారూ, ఆనందం ఆగలేని పిల్లలు మాత్రం తల్లిదండ్రులు అరుస్తున్నా వినిపించుకోక, వర్షంలో తడుస్తూ పరిగెత్తుకు వెళ్లి అజ్మత్ ఇంటి ముందు నిలబడి విస్మయం నిండిన కళ్లతో అతడినీ, నాలుగు అడుగుల ఎత్తున్న కాగితపు పడవనూ గమనించసాగారు.

అతడు ఉద్విగ్నమైన హృదయంతో పడవలో కూర్చుని ఉండగా, అతడి భార్యాపిల్లలు నెమ్మదిగా పడవను ముందుకు తోశారు. పడవ ముందు భాగం ప్రవహిస్తున్న నీటిని తాకగానే కుదుపునిచ్చి, ఆపై నెమ్మదిగా పడవ మొత్తం నీటిపైకి వచ్చింది. ఒక్కక్షణం కదలక అలాగే ఆగింది. తన బరువుని తీసుకోగలుగు తుందనే నమ్మకం కలగగానే, అతడు బిగించి పట్టిన పడవ కింది రెక్కల్ని ఒదులు చేశాడు. ఒక చిన్న కదలికతో పడవ ముందుకు కదిలింది. ఉత్కంఠతతో చూస్తున్న పక్కింటి కుర్రాళ్లు, పడవ ప్రవాహంలో తమ ఇల్లు దాటగానే హర్షంతో చప్పట్లు చరిచారు. అయితే ఆ చప్పట్లు కానీ, మాటలుకానీ, వర్షపు చినుకుల శబ్దంకానీ అతడికి వినిపించటంలేదు. అతడి ధ్యాసంతా సన్నటి కుదుపులతో కదులుతున్న పడవపై ఉంది. ఏటవాలు వీధి కావడంవల్ల, నీరు వేగంగా ప్రవహిస్తుండటంవల్ల, పడవ అతడు ఊహించనంత తొందరలోనే వేగం పుంజుకుంది. అప్పటిదాకా, మనస్సులో కదలాడుతున్న సందేహాలు కనుమరుగవుతుండగా, అతడి ముఖంపై చిర్నవ్వు పరుచుకుంది. కదులుతోంది. ఎటువంటి ఆటంకమూ లేకుండా ముందుకు వెడుతోంది. తన లెక్కలన్నీ సరిగ్గానే ఉన్నాయి. చివరకు, తను వర్షపు నీటిలో ప్రయాణించగలిగే కాగితపు పడవను తయారు చేయగలిగాడు.

పడవ ముందుకు సాగుతుండగా, దాని వెనుకగా కొంతమంది పిల్లలూ, దానిపక్కగా మరికొంతమంది పిల్లలూ కేకలతోనూ, కేరింతలతోనూ పరిగెత్త సాగారు. వీధిలో ఇళ్ల ముందు నిలబడి ఉన్న ప్రజలు అతడికి శుభాకాంక్షలు తెలియజేయసాగారు. వీధిలో ఉన్న కరెంటు స్తంభాలను తాకకుండా పడవను జాగ్రత్తగా కదుపుతూ, అతడు దృష్టినంతా తన ముందుగా పారుతున్న నీటిపై కేంద్రీకరించాడు. అతడి మనస్సు నిశ్శబ్దంగా మారింది. అప్పటిదాకా నిటారుగా కూర్చున్న అతడు, కొద్దిగా వెనక్కు వాలి విరామంగా కూర్చునేందుకు ప్రయత్నిస్తూ, ముఖంపై కురుస్తున్న వర్షాన్ని ఎడమ అరచేతితో తుడుచుకుని, రెండిళ్లకావలగా ఇంటిముందు గొడుగు కింద నిలబడి, పడవవైపు నవ్వుతూ చూస్తున్న పిల్లలకు చేయి ఊపుతుండగా జరిగిందది. కానీ, మరుక్షణం అతడి

దేహమంతా నీటితో నిండిపోయింది. క్షణం క్రితం వరకూ దృఢంగా ఉన్న కాగితపు పడవ ముందుభాగం, ఎడమవైపు భాగమూ ఒరిగిపోయి, అతడు అర్థం చేసుకునే లోపలే, రెండో వైపూ నీటిలో కుంగి, అతడు నీటిలో పడ్డాడు. తన దేహాన్ని ముందుకు తోస్తున్న ఉధృతిని తట్టుకుంటూ, వేగంగా జారిపోతున్న పడవ భాగాలను కంగారుతో అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించి, విఫలమై, అర్థంకాని ముఖంతో, కొట్టుకుపోతున్న కాగితపు భాగాలవైపు చూస్తూ లేచి నిలబడేందుకు ప్రయత్నించాడు. ఏం జరిగింది? తప్పు ఎక్కడ జరిగింది? అతడు నిలదొక్కుకుని లేచి, కాగితపు భాగాలన్నీ కనుమరుగయ్యేదాకా వర్షంలో తడుస్తూ అలాగే నిలబడ్డాడు.

వీధంతా నిశ్శబ్దం అలుముకుంది.

'నాకు తెలుసు ఇది సాధ్యం కాదని. ఇంతకుమునుపే చెప్పాను ఆ ప్రయత్నాన్ని వొదులుకోమని. కానీ అతడు వినలేదు. అయినా, కాగితపు పడవలో ప్రయాణిం చడం ఎలా సాధ్యం?' ఎవరో అంటున్న మాటలు అతడు విన్నాడు.

వెనుదిరిగి, నీటిలో పాదాలతో బలవంతంగా ఎదురీదుస్తుండగా, అప్పుడే ఇంటిలోంచి బయటకు వచ్చిన మరో వ్యక్తి, వర్షపు శబ్దంలో తన మాటలు వినిపించవేమోనని పెద్దగా అరిచాడు, 'కంగారుపడకు అజ్మత్. వచ్చేసారి సరిగ్గా పని చేస్తుందిలే.'

ఎవరికీ ఒక మాటతోనైనా జవాబివ్వకుండా, నెమ్మదిగా నడుస్తూ ఇంటికి వచ్చి, గేటు వద్ద నిలబడ్డ భార్యాపిల్లల్ని దాటుకుంటూ లోపలికి వెళ్లాడు. అతడి భార్య లోపలికి వెళ్లి తువ్వాలు తెచ్చి ఇచ్చింది. దానితో తలను తుడుచుకుం టుండగా, కూతురు అడిగింది–

'ఏమయ్యింది నాన్నా? పడవ ఎందుకు మునిగిపోయింది?'

బలవంతంగా ముఖంపై నవ్వును తెచ్చుకుంటూ తువ్వాలులోంచి కూతురు వైపు చూస్తూ తెలీదన్నట్టు తల అడ్డంగా ఊపాడు. ఆ తర్వాత రాత్రి పిల్లలు త్వరగా భోజనాలు ముగించి పడుకునేదాకా అతడు మౌనంగా కుర్చీలో కూర్చుండిపోయాడు. అప్పటికి అతడికి అరగంట క్రితం నుంచి తుమ్ములు ప్రారంభమయ్యాయి. అమృతాంజన్‌ను ఛాతిపై రుద్దుకుంటూ అడిగాడు, 'ఆయేషా, జలుబు చేసినట్టుంది. అయినా పడవెందుకు వర్షపునీటి ధాటికి ఎక్కువసేపు నిలబడలేకపోయింది?'.

అయేషా సమాధానం ఇవ్వకుండా అతడి ఎదురుగా కూర్చుంది. అతడు లేచి,

తను వ్రాసుకున్న కొలతల పుస్తకాలన్నిటినీ ముందు వేసుకుని కూర్చున్నాడు. రెండు గంటలు తిరగవేసిన తర్వాత కూడా అతడికి లోపం ఎక్కడుందో అర్థంకాలేదు.

అప్పటిదాకా గమనించని గొంతులోని వేడిమీ, మండుతున్న దేహం స్ఫురించాయి. జ్వరం వచ్చినట్టుంది. చిన్నగా తలనొప్పి. లేచి మందుల డబ్బాలోంచి మాత్ర వేసుకుని, తిరిగి పుస్తకాల్నీ, కాగితాల్నీ వరసలో పెట్టి, వాటి స్థానాలలో భద్రపరచి వెళ్లి మంచంపై పడుకున్నాడు. అతడి పక్కగా పడుకున్న ఆమెకు రాత్రంతా కాలిపోతున్న అతడి శరీరం తెలుస్తూనే ఉంది. పెళ్లయిన ఇన్ని సంవత్సరాలకు ఆమె పెళ్లయిన మొదటి రోజుల్లో కంగారూ, ఆందోళనా చెందిన క్షణాలను మళ్లా అనుభూతి చెందింది. ఎంతమంది చెప్పారు అతనికి. అది సాధ్యంకాదు వొదిలివేయమని. అతనికి ఎందుకంత మొండి పట్టుదల? దానివల్ల అతనికి ఏం వస్తుంది? దానివల్ల ప్రయోజనం ఏమిటి? ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా అతడు చేసే ప్రయత్నాలని ఏమనాలి?

ఆమెకు మరిక, రాత్రంతా ఒక అరగంట తప్ప నిదురపట్టలేదు. ఆ అరగంట మగతనిద్రలో, కల లాంటి దానిలో, ఆమె తన భర్త అటువంటి పడవలో, వర్షపునీటిలో జాడ లేకుండా కొట్టుకుపోవడం కాంచింది. ఆమె ఉలికిపాటుతో, దేహమంతా చమటలు పట్టగా లేచి, జ్వరంతో కంపిస్తున్న భర్త నుదుటిపై తడిగుడ్డను వేసి రాత్రంతా మేలుకొని వుంది. తెలవారుతుండగా అతడికి జ్వరం కొద్దిగా ఉపశమించింది. ఆ రోజు కూడా శెలవు దినం కావడంతో, భర్తకానీ, పిల్లలు కానీ ఎక్కడికీ వెళ్లే హడావిడి లేకపోవడం వల్ల, ఆమె తీరికగా ఫలహారం చేస్తుండగా, కొద్దిగా తేరుకున్న భర్త ముందుగదిలో పిల్లలతో మాట్లాడుతూ ఉండటం వినిపించింది. ఆ సంభాషణ ఎటు మళ్లుతుందో ఆమె ఊహించి, తల విదిల్చి నిట్టూర్పు విడిచింది.


అజ్మత్ పిల్లలతో అంటున్నాడు–

'నిన్న వర్షం పడిన ఛాయలు కూడా లేవు. చూడండి దినం ఎంత కాంతివంతంగా ఉందో. పని చేయాల్సిన సరైన సమయం ఇదే. నా గదిలో వ్రాసుకునే పుస్తకాలు తీసుకురండి. అలాగే పనిముట్లను వేపచెట్టు కిందకు చేర్చండి. ఈలోపల నేను బయటకు వెళ్లి మేకులూ, గమ్మూ కొనుక్కు వస్తాను. అయేషా, వేపచెట్టు కింద కొద్దిగా తడిగా ఉంది. శుభ్రంగా వూడ్చి పట్టా వేయి. నేను బజారు నుంచి రాగానే పని మొదలుపెట్టాలి.'

ఆరోజు సాయంత్రం అయ్యేసరికి, వరండాలో వెచ్చగా పరుచుకున్న

శీతాకాలపు తొలి ఎండలో భార్యా పిల్లలు కుర్చీలలో కూర్చుని తదేకంగా చూస్తుండగా, అజ్మత్ ఉదయం నుంచి, మళ్లా కొత్త లెక్కలతో పూర్తయిన కాగితం పడవకు చివరి మెరుగులు దిద్దుతూ, ఆ వీధివెంట వెళ్లే ప్రజలు అలవాటైన కళ్లతో చూస్తుండగా, సన్నగా, తనలో తాను, వేసుకున్న లెక్కలను గొణుక్కుంటూ, నిశ్శబ్దపు పాటను నిశ్శబ్దంలో పాడుతున్న వాడిలాగా కనిపించాడు.





# ఉత్తరపొద్దు

## స.వెం.రమేశ్

● రచనా కాలం: 2003

**స.వెం.రమేశ్:** తెలుగు భాషను, ఇంకా తెలుగులో చెప్పాలంటే తెలుగు 'నుడి'ని ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా చేసుకుని పని చేస్తున్న భాషా సిపాయి. ఇరుగు పొరుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగువారిని గుర్తించి వారికి తెలుగు వాచకాలను మాధ్యమాన్ని చేరువ చేసే పనిలో ఉన్నారు. స్వస్థలం నెల్లూరు జిల్లా సూళూరు పేట. ప్రళయకావేరి (పులికాట్) సరస్సు జీవనాన్ని 'ప్రళయకావేరి కతలు'గా రాస్తే విశేష గుర్తింపు పొందాయి. మరో కథల సంపుటి 'కతల గంప' వెలువరించారు. విస్మృతమైన అచ్చ తెలుగు మాటలను వీరి కథలలో గమనించవచ్చు. వయసు 47 సంవత్సరాలు.

మా ఊరిని ఆనుకొనే ఉంది ప్రళయకావేరి. సుమారు ముప్పై మైళ్ల పొడవు, పది మైళ్ల వెడల్పు ఉన్న సరస్సు అది. ప్రళయ కావేట్లో నలభై వరకూ దీవులు న్నాయి. వాటికి రకరకాల పేర్లు. వాటిల్లో కొన్ని దీవుల్లో మాకు చుట్టాలున్నారు.

ఆ దీవుల్లో ఒకటి 'జల్లల దొరవు.' విసిరేసినట్లు ఒక మూలగా ప్రళయకావేరి ఒడిలో ఒదిగి ఉండేది. ఆ దీవిలో నాకు వరసకు మామ ఒకాయన ఉండేవాడు. వాళ్లింటికీ మా ఇంటికీ రాకపోకలు ఉండేవి. నేను కూడా అప్పుడప్పుడూ అక్కడకు పోతుండేవాడిని.

జల్లల దొరువు ప్రయాణమంటే చిన్న విషయం కాదు. తెల్లవారి అయిదు గంటలకు మొదలుపెడితే రాత్రి ఏడుకో, ఎనిమిదికో ఆ దీవికి చేరేవాళ్లం. అంటే ఒక పగలంతా ప్రయాణమే. కాసేపు నీళ్లల్లో నడిచి కాసేపు దీవుల్లో నడిచి ఒక దీవి నుంచి ఇంకో దీవిని దాటి చేరుకోవాలి. ఇంతా చేసి మా ఊరికీ, జల్లల దొరువుకి నడుమ దూరం పాతిక కిలోమీటర్లలోపే.

ప్రళయకావేట్లో ప్రయాణం ఒక వింత అనుభూతి. నడిచి నడిచి కాళ్లు పీకుతున్నా, ఇంకా నడవాలనే మనసు పీకుతుంటుంది. ఎండా, వానా, మంచు... ఇవన్నీ కాలానికి అనుగుణంగా సరస్సులో ఎరగనన్ని వన్నెలు చూపించేవి. మా ప్రయాణం ముచ్చట్లు మొదలుపెడితే మీకూ తెలుస్తాయి ఆ వన్నెచిన్నెలు.

ఒకసారి నేనూ, మా వెంకటన్న, నా నేస్తాలు శీనయ్య, చెంగయ్య నలుగురం ప్రయాణం కట్టినాము ప్రళయకావేరిలో. శీనయ్య, చెంగయ్యలు 'రాగన్న పట్టెడ'కు, నేనూ, మా అన్న జల్లల దొరువుకు. అప్పుడు నా వయస్సు పన్నెండో, పదమూడో ఉండొచ్చు. అప్పటికి ఉత్తరకార్తె పెట్టి రెండు దినాలయింది. ఆ ఏడాది మఖ,

పుబ్బల్లోనే గట్టి వానలు పడినాయి. అందుకే మా అమ్మకూ, మా అవ్వకూ మా ప్రయాణమంటే దిగులు.

'దార్లో వానొస్తే 'రాగన్నపట్టెడ'లోనే నిలిచిపోండి. ఉత్తరపొద్దులో కావేట్లో దిగబాకండి' మా అమ్మ హెచ్చరించింది.

'ఉత్తరపొద్దంటే వాళ్లకేం తెలుస్తాదమ్మే' అని మాయమ్మని ఒక్క కసురు కసిరింది మా అవ్వ.

మావైపు తిరిగి 'నాయినా! మద్దినేళ మడకలిప్పే పొద్దులో పెళయకావేట్లో నడవబాకండ్రా' అనింది.

'పునమాల తిప్ప దాటినాక, చిన్నతోటకు పొయ్యే దాకా దిగులుతిప్పలెక్కువ. చూసి నడవండి' మా పెద్దమ్మ సలహా ఇచ్చింది. 'దిగులుతిప్ప' అంటే ఒక రకమైన బురదగుంట. ఊబి కాదు. ఇందులోకి దిగితే నడుములదాకా కూరుకుపోతాము.

'ఉత్తరపొద్దు బిడ్డల్ని ఏమారస్తాదేమో' మా అమ్మ గొణగసాగింది.

ఆడవాళ్ల సణుగుడంతా విన్న మా తాత లేచి, 'మేయ్! గమ్మునుంటారా? లేదా? అయినా పంట రంగస్వామి లేడా. ఏదన్నా అయితే చూసుకొనేదానికి. పోయిరానీ వాళ్లని' అన్నాడు.

మా వైపు చూసి, 'అబయా. నలగామూల దాటినాక పెళయకావేరమ్మకు సక్కలగిలెక్కువ. మునేళ్లు అదిమిపెట్టి నడవండి. లేకపోతే గెబ్బిడు గెబ్బిడు ఎంట్ర కాయల్ని జవరాల్సిపడతాది' అన్నాడు. అంటే నలగామూల దగ్గర జారుడు ఎక్కువ. జాగ్రత్తగా నడవకపోతే పడతామని చెప్పడం.

అప్పటికి మా పల్లెల్లో తమదల (రాగుల) వాడకం ఇంకా ఉంది. చిక్కటి మజ్జిగ కలిపిన గట్టి అంబలిని స్టీలు టిఫిన్‌లో పోసిచ్చినారు. అట్లే రెండు పులుసన్నం పొట్లాలు కట్టిచ్చినారు. తెల్లవారి ఆరుగంటలకు 'అటానితిప్ప'కు పొయ్యే బస్సు ఎక్కి కూచున్నాము. బస్సు బయల్దేరి కసారెడ్డిపాళెం, చెరువుకండ్రిగ, దావాది గుంటలు దాటి కుదిరికి వచ్చింది. కుదిరి వస్తే మా ఆనందం ఎక్కువవుతుంది. కుదిరి దాటగానే ప్రళయ కావేరి మొదలవుతుంది. ఇక కనుచూపు మేరా నీలాలు ఆరబోసినట్లు నీళ్లు.

అరగంట ప్రయాణించి 'అటకానితిప్ప'లో మమ్మల్ని దించింది బస్సు. ప్రళయ కావేరిలోని దీవులకు కేంద్రం 'అటకానితిప్ప' దీవి. దీవులలో ఉండేవాళ్లు కూడా పేటకు (మా ఊరికి) రావాలంటే 'అటకాని తిప్ప'కు వచ్చే బస్సు ఎక్కాలి.

మూడునాళ్లుగా ముసురుపట్టిన మబ్బుల చాటు నుంచి సూర్యుడు తొంగి తొంగి చూస్తున్నాడు. అటకాని తిప్పలోని వినాయకుడి గుడి దగ్గరకు పోయి తెచ్చుకొన్న అంబలిలో కొంచెం తాగినాము.

'ఏ ఊరికి సిన్నా?' ఒక ముసలాయన అడిగి నాడు.

'మేము జల్లల దొరువుకీ, వీళ్లు రాగన్నపట్టెడకీ' ఇద్దరి తరఫునా నేనే చెప్పినాను.

'జల్లల దొరువా! నాయినా దూరాబారం బొయ్యేవోళ్లు. బిన్నా బయల్దేరండి. తూరుపుగాలి మళ్లింది. వానొస్తాదేమో! ఇప్పుడు పెళయకావేట్లో దిగితేగానీ సద్దికూట్లేళ్లకు 'కొరిడి'కి పోలేరు. ఉత్తరపొద్దులో యాడ్నో ఒక దెగ్గిర నిలబడిపోండి' అన్నాడా ముసలాయన.

మేము ఆ మాటతో దెబగుబా ప్రళయకావేట్లో దిగినాము.

తూరుపు నుంచి చల్లగాలీ లేత ఎండా కలిసి మమ్మల్ని గిలిగింతలు పెడుతు న్నాయి. వానలు బాగా పడి సరస్సంతా నిండుగా ఉంది. అడుసు మీగాళ్లనూ, నీళ్లు మోకాళ్లనూ దాటుతున్నాయి. వలసపక్షులు కూడా కొంచెం ముందుగానే వచ్చినట్లుండాయి. ఉల్లంకి పిట్టలు వేలకు వేలు బార్లు కట్టి నిలబడి ఉన్నాయి. వాటి రెక్కల పసిమిఛాయ, నీటి నీలివన్నె, ఎండ బంగరు రంగు కలిసి ప్రళయ కావేరి కొత్త హొయలు పోతోంది.

రెండుగంటలసేపు నీళ్లల్లో కాళ్లీడ్చుకొంటూ సాగిన మా నడక 'కొరిడి' దీవికి చేరి కుదుటపడింది. దీవంటే గట్టినేల. కాలు చకచకా సాగుతుంది. అప్పటి దాకా గిలిగింతలు పెట్టిన సూర్యుడు చుర్రుమనిపిస్తూ పైకి లేస్తున్నాడు. పేముపొదల దొరువులో కాళ్లు కడుక్కొని, తియ్యని ఆ నీళ్లు తాగి, నడక సాగించినాము.

కొరిడి దీవంతా చిట్టడవి. ఆ అడవిలోని పాల పండ్లు, కలిగిపండ్లు, బీరపండ్లు, బిక్కిపండ్లు, నిమ్మకాయలు, ఊటిపండ్లు, గొంజిపండ్లు, బలిజపండ్లు, ఎలికిచెవులూ, పిల్లొట్టలూ కోసుకొని తింటూ సాగుతున్నాం. అడివంతా చిన్న చిన్న, రంగురంగుల పిట్టలు. వింత వింతగా పలుకరించుకొంటూ, కులుక్కుంటూ, గిలుక్కుంటూ, చెట్టు చెట్టుకు చెంగున ఎగురుకొంటూ చెటాలున దోవకడ్డంగా పరుగెడుతూ మమ్మల్ని పలుకరిస్తున్నాయి.

కొరిడి దాటిన తరువాత మళ్లీ ప్రళయకావేరిలో గంటన్నర ప్రయాణం. తరువాత కొల్లపట్టు దీవి. కొల్లపట్టు నుంచి గంట ప్రయాణంలో తోటకట్ల. తోటకట్లకు చేరేసరికి మిట్టమద్దినేళ అయింది. ఎండ కసిగా కొడుతోంది. గాలి ఎంత చల్లగా తగులుతున్నా చెమట కారుతూనే ఉంది. తోటకట్ల తరువాత గంట

నడిస్తే 'రాగన్న పట్టెడ' వస్తుంది.

మాతోపాటు తెచ్చుకున్న తిండి ఎప్పుడో అయిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటప్పుడు రాగన్న పట్టెడకు చేరుకొన్నాం. మా నేస్తాల ఊరు అదే. మేమ ుతే సగం వచ్చినట్లు. మా నేస్తాల ఇళ్లలో మమ్మల్ని చూసి చాలా సంతోషించినారు. చెంగయ్య వాళ్ల అమ్మ ఆదరాబాదరాగా సంగటి గెలిగి, చెనిగపప్పుల ఊరిబిండి నూరి కడుపు నిండా పెట్టింది.

'ఈ పొద్దు ఈడ్నే ఉండి రేపు బయదేలిపోండి నాయినా. ఉత్తరపొద్దు పెయాణం మంచిది కాదు' అన్నారు వాళ్లింట్లోని పెద్దలంతా.

ఎప్పుడెప్పుడు జల్లలదొరువు పోదామా అని ఆత్రుతలో ఉన్న మేము వారి మాటలను వినలేదు. నేనూ, మా అన్నా బయలుదేరినాము.

ప్రళయకావేట్లో మిట్టమద్దినేళ ప్రయాణం కొంచెం కష్టమే. ఎండకు నీళ్లు తళతళలాడుతూ కళ్లను జిగేలుమనిపించి దారి తప్పేటట్లు చేస్తాయి. దారి తప్పి మిట్టకు పోయినామా నీళ్ల వేడికి కాళ్లు బొబ్బలు లేస్తాయి. పల్లానికి పోయినామా, ఏ దిగులుతిప్పో తగిలి నడుము లోతు అడుసులో కూరుకుపోతాము. దోవ పొడవునా అనుభవం ఉండే పెద్దలు అక్కడక్కడా కట్టెపుల్లలు నాటి ఉంటారు. వాటిని చూసుకొంటూ నడవాలి.

రాగన్నపట్టెడ తరువాత గంటన్నర నడకలో 'పంట రంగం' ఉంది. ఆ దీవిలో ఎవరూ కాపురం ఉండరు. పాతకాలం నాటి శివాలయం ఉంది అక్కడ. ప్రళయ కావేరి ప్రయాణీకులు ఆ శివాలయం దగ్గర విశ్రాంతి తీసుకొని పోతుంటారు. త్వరగా పోవాలనుకునే వారు శివాలయానికి పోకుండానే మరో గంట ప్రయాణంలో వచ్చే 'చిన్నతోట'వైపు సాగిపోతారు. మేమూ అట్లాగే పోవాలనుకొన్నాం. కానీ మేమనుకొన్నట్లు జరుగ లేదు.

రాగన్నపట్టెడ తరువాత అరగంట నడిచినామో లేదో తూరుపు నుంచి పశువుల పండక్కి పరుగెత్తే బర్రెల మందలాగా గుంపులు గుంపులుగా మొయిళ్లు (మబ్బులు) బయలుదేరినాయి. మరుక్షణంలోనే నల్లగా మూసుకొనింది. కంటికి మింటికి ఏకధారగా వాన మొదలయింది.

ఇక మేము చిన్నతోటకు పోయే ఆలోచన మానుకొని పంటరంగం చేరుకొనేందుకు త్వరత్వరగా నడవసాగినాము. ఎగువ నుంచి ప్రవాళం వాగో, కాళంగి నదో పరుగెత్తుకొచ్చి ప్రళయకావేట్లో పడినట్లుంది. ప్రళయకావేట్లో సుళ్లు పుట్టినాయి. దోవ పక్కన నాటిన పుల్లలు కొట్టుకొని పోయినాయి. మాకు

పంటరంగం దీవి కంటి కానడంలేదు.

మధ్యాహ్నం మూడు గంటలు కూడా అయి వుండదు. కానీ చీకట్లు ముసురు కొన్నాయి. మేము గుడ్డి గురుతులలో చాలాసేపు నడిచి, నడిచి చివరకు పంటరంగం చేరుకొన్నాము. ఆ దీవంతా పెద్ద పెద్ద మానులతో చిక్కటి అడవి. వాటి మధ్యలోనే శివాలయం ఉంటుంది. ఆ గుడి దగ్గరకు పోతే, ఎవరో ఒకరు ప్రయాణీకులు ఉంటారు. కానీ గుడి దగ్గరకు పోవడానికి కాలిబాట కూడా దొరకడం లేదు. చివరకు నీటివరవను పట్టుకొని ఎదురు నడిచినాము. ఆ వానలోనే గంటకుపైగా ఆ దీవిలో నడిచినాము. శివాలయం జాడే లేదు. నాకు చలికి తోడు, భయం కూడా మొదలై వణుకు ఎక్కువయింది. తిరిగి, తిరిగి గుడి కనబడక ఒక మర్రిచెట్టు కింద నిలబడినాము.

చీకటి చిక్కబడుతోంది.

ఏనుగు తొండంతో చల్లినట్లు వాన కురుస్తూనే ఉంది.

నేను భయంతో మా అన్నకు దగ్గరగా జరిగి నిలబడినాను. ఆయన పరిస్థితీ నాలాగే ఉన్నట్లుంది. నాకన్నా ఒక ఏడాది పెద్దవాడంతే. ఇద్దరమూ ఏమీ మాట్లాడుకోవడం లేదు. ఒకరికొకరం బాగా ఆనుకొని నిలబడినాము. ఇంతలో–

'ఎవుర్రా ఆడ, ఇయ్యాళప్పుడు ఈడకొచ్చింది?' అని కేక వినపడింది.

మెరుపుననుసరించే ఉరుము లాగా, కేకతోపాటు మనిషీ మా ముందుకొచ్చినాడు. నల్లగా, నిలువెత్తు మనిషి. తెల్లజుట్టు, ముడుతలు పడిన మొహం, వయసుడిగినా కండలు తిరిగిన దేహం.

'మేము జల్లల దొరుకువు పోవాల తాతా! రాగన్న పట్టెడ దాటినాక వానొచ్చింది. పంటరంగం గుళ్లో తల దాచుకొందామని వచ్చినాము. గుడి కనబడక ఈడ నిలబడినాం తాతా' మా అన్న అన్నాడు.

'ఓరి కొడకా! ఉత్తరపొద్దు ఏమార్చెను గదరా మిమ్మల్ని. పెద్దోళ్లే ఉత్తర పొద్దులో పెళయ కావేట్లో పెయాణం చెయ్యరు. ఏలిడంత లేరు మీరిద్దరూ. ఎట్ట దాటదామనుకున్నార్రా? సూడబోతే మిడిమాళపు బిడ్డలుగుండారే?' అన్నాడు ఆ తాత.

మాకేమీ అర్థంకావడం లేదు. మళ్లీ ఆ తాతే అడిగినాడు. 'ఒరే! ఇప్పుడు మీరు యాడుండారో తెలుసా?' అని.

మేమిద్దరమూ అయోమయంలో పడి ఏమీ మాట్లాడలేదు.

'రాగన్నపట్టెడ నుంచి ఉత్తరానికి పోతే పంట రంగం. మీరు దోవతప్పి తూరుపుకు నడిచి 'రెట్టమూల'కు వచ్చుండారు. ఇది నరమానవులు తిరిగే దీవి కాదు. తెలుసా మీకు?' తాత కంఠం ఖంగుమనింది.

మా పై[ప్రాణాలు పైనే పోయినట్లయింది. రెట్టమూల గురించి మా అవ్వా తాతలు అప్పుడప్పుడూ మాట్లాడుకొనే మాటలు గుర్తుకొచ్చినాయి.

'రెట్టమూల' కూడా ఒక దీవే. కానీ మనుషులెవరూ ఆ దీవికి పోరంట. కాలభైరవుడు ప్రేత గణాలతో ఆ దీవిలో తిరుగుతూ ఉంటాడంట. ఏడాదికొక సారి మాత్రం ఆ దీవిలో కాలభైరవుడి బొమ్మ దగ్గరకు చుట్టూ దీవుల్లో ఉండే వాళ్లు పొయ్యి పొంగళ్లు పెట్టి వస్తారంట. ఇవన్నీ గురుతొచ్చి నాకు ఏడుపొచ్చింది. గట్టిగానే ఏడవడం మొదలుబెట్టినాను. ఎంతసేపటి నుంచి అణుచుకొని ఉన్నాడో, మా అన్నా ఏడవడం మొదలుపెట్టినాడు.

'రేయ్! అబ్బియ్యల్లారా! ఏడవబాకండ్రా, నేనుండ్లా' అని ఆ తాత మాకు ధైర్యం చెప్పి ఆయనతో కూడా తీసికొని పోయినాడు.

కొద్దిదూరం నడిచి ఒక చిన్న గుడిసె దగ్గరికి పోయినాము.

'రాండ్రా లోపలికి' అన్నాడు తాత.

లోపల తాత పొయ్యి రాజేసి మంట పెట్టినాడు. మేము మంట దగ్గర కూర్చుని చలి కాసుకొన్నాము. తాత అన్నం వండి, తక్కోలం (టమోటా) కాయలు పులుసు పెట్టి నాడు. చుట్టూ కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి. పొయ్యి మంట చీకటినీ, చలినీ గుడిసెలో నుంచి తరిమేస్తూ ఉంది. తాత మట్టి మూకుడులో అన్నం కలిపి మాకు చెరి నాలుగు పిడచలు చేతిలో పెట్టినాడు.

మాకు ప్రాణం కుదుటపడింది. తాత ఏవో తత్వాలు పాడడం మొదలు పెట్టినాడు. నాకు కడుపులో ముద్దపడి, ఒంట్లోకి వెచ్చదనం వచ్చేసరికి, బుర్ర పని చేయడం మొదలయింది. పొద్దున్నించీ నన్ను పీడిస్తున్న ఒక సందేహాన్ని తాత ముందు పెట్టినాను.

'తాతా, తెల్లారినించీ చానామంది ఉత్తరపొద్దు, ఉత్తరపొద్దు అంటుండారు. అంటే ఏంది తాతా?' అడిగినాను.

'ఓహోహో! ఎద్దు గిట్లో ముల్లంత లేవు. అప్పుడే ఇయ్యన్నీ నీకు దేనికిరా?' అన్నాడు తాత.

నేను వదల్లేదు. 'చెప్పు తాతా, చెప్పు తాతా' అని విసిగించసాగినాను.

'అబ్బ! బొక్కలాడ బాక చెప్తానుండ్రా' అని మొదలుపెట్టినాడు తాత.

'ఒరే అశ్విని, బొరణి, కిర్తిక, రోయిణి... ఈ మాదిరిగా మనకు ఇరవై యేడు కార్తిలుండాయిరా. దాంట్లో ఉత్తరకార్తి ఒకటి. ఈ ఉత్తరకార్తిలో సూరయ్య మన పెళయకావేరమ్మతో కూడతాడురా.'

'కూడేదంటే ఏంది తాతా?' మధ్యలో అందుకున్నాన్నేను.

'ఆ?! గోగాకు పులగూర్రా. అందుకే ఇప్పుడు నీకర్థం కాదు. నేను చెప్పను అనింది' అన్నాడు తాత.

'సరే, సరే. నడిమిద్దిలో మాట్లాడను. చెప్పు తాతా' అన్నాను.

'అబయా! ఉత్తరకార్తిలో పెళయకావేరమ్మ కట్టుకొనొస్తాది. సూరయ్యకు ముడిడస్తాది. ఇద్దరూ కూడతారు. దానికే ఉత్తర పొయినాకనే పెళయకావేట్లో చేపా, రొయ్యా ఎచ్చయ్యేది. ఉత్తరకార్తి పన్నెండు, పదమూడు దినాలుంటది. ఈ దినాల్లో మద్దినేళ గాలి బిగేసే పొద్దులో వోళ్లిద్దరూ కూడేది' అన్నాడు తాత.

'గాలి బిగేసే పొద్దంటే ఎప్పుడు తాతా?' ఈసారి మా అన్న అడిగినాడు.

'మద్దినేళ రెండూ, మూడు మద్దిలోరా. వాళ్లు కూడేటప్పుడు ఎవురన్నా పెళయ కావేట్లోకి దిగితే సూరయ్యకు కోపమొస్తాది. దోవ తప్పించో, దిగులుతిప్పలో ఇరికించో కసి తీర్చుకొంటాడు. దానికే ఉత్తరపొద్దులో మరీ అవసరమైతే తప్ప ఎవురూ పెళయ కావేట్లో దిగరు. దిగినా సూరయ్యకూ, పెళయ కావేరమ్మకూ తప్పు చెప్పుకొని దిగతారు. మీకు తెలియక దిగి ఎన్ని అగచాట్లు పడినారో చూడండి. నేను లేకపొయ్యుంటే మీ గతేం కావాల?' చెప్పినాడు తాత.

మా మనసంతా తాతంటే ఒక రకమైన ప్రేమతో నిండిపోయింది.

మాకిద్దరికీ గోతాలు పరిచి, పడుకోమని చెప్పి పొయ్యి దగ్గర కూర్చుని తత్వాలు పాడసాగినాడు తాత. మాగన్నుగా కన్ను మూతబడి మంచి నిద్రపట్టింది మాకు. తాత ఆ రాత్రి తిన్నాడో, నిద్ర పోయినాడో లేదో తెల్లవారి వెలుగుపడే వేళకు మమ్మల్ని తట్టి లేపినాడు తాత.

'నేను కూడా మీతో ఆడదాకా వస్తాను పదండి' అని బయలుదేరినాడు.

తాత వెనుక చకచకా నడిచినాము. పొద్దు పుట్టేటప్పటికి పంటరంగం చేరుకొన్నాము. కోనేట్లో మునిగి, పంట రంగేశ్వరునికి మొక్కినాము. తాత రాత్రి మిగిలిన గంజి అన్నాన్ని సొరకాయ బుర్రలో పోసుకొని వచ్చినాడు. మమ్మల్ని తినమని దోసిట్లో పెట్టినాడు.

మేము తినిన తరువాత, 'నేను ఈడనే నిలస్తాను. మీరు బద్దరంగా పొయి రండి' అన్నాడు.

మేము తాతకు వీడుకోలు చెప్పి బయలుదేరి నాము. చిన్నతోట, పెద్దతోట, పాములతేరి, నలగా మూలలు దాటుకోని, గొడ్లు విప్పేవేళకు జల్లల దొరువుకు చేరినాము.

ఆ సమయంలో వచ్చిన మమ్మల్ని చూసి మా మామ ఆశ్చర్యపోయినాడు.

'ఇంత పొద్దున్నే ఎట్టొచ్చిన్నారా?' అని అడిగి నాడు. మేము జరిగిందంతా చెప్పినాము.

మా మామతోపాటు, ఊర్లోవాళ్లు నలుగురయిదుగురు విన్నారు మేము చెప్పిన మాటలు.


అంతా విన్న కుమ్మరోళ్ల రమణన్న లేచి 'అయ్యా! సుధాకరయ్యా... ఆ పంటరంగ సామే మీ బిడ్డల్ని కాపాడినాడు. రెట్టమూల్లో ఇన్ని తరంతాలుగా నరమానవుడున్నట్లు ఎరగం. ఆ సోమే పెద్దాయన మాదిర వొచ్చి బిడ్డల్ని ఉత్తరపొద్దు నించి కాపాడినాడు. శివురేత్తిరికి కూటిపొరుపు (అన్నదానం) జేస్తానని మొక్కో' అన్నాడు.

మా మామ పంటరంగం వైపు తిరిగి చేతులెత్తి మొక్కి, మమ్మల్ని గట్టిగా గుండెల కదుముకున్నాడు.

ప్రళయ కావేరమ్మతో కూడడానికి సూరయ్యా చరచరా పైకి లేస్తున్నాడు.







# వాన కురిసింది!

## గంగుల నరసింహారెడ్డి

● రచనా కాలం: 1993

**గంగుల నరసింహారెడ్డి:** 80–90వ దశకాల్లో వారపత్రికలు నిర్వహించిన అనేక కథల పోటీలలో బహుమతులు పొందిన రచయిత. స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజీపేట. బ్యాంక్ ఉద్యోగిగా హైదరాబాద్‌లో త్వరలో రిటైర్ కాబోతున్నారు. మూడు నవలలు, అరవైకి పైగా కథలు వెలువరించారు. కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, చండీదాస్‌ల రచనలతో స్ఫూర్తి పొందారు. ఆరోగ్యకరమైన కథను గౌరవిస్తారు. వయసు 60 సంవత్సరాలు.

వెన్నెల పత్తిపువ్వులా ఉంది. ఆకాశంలో అక్కడక్కడా తెల్లని మేఘాలు పత్తికుప్పల్లా ఉన్నాయి. చంద్రుడు పగులుతున్న పత్తికాయలా ఉన్నాడు. ఇంటి ముందు వాకిట్లో మంచంపైన వెల్లికిలా పడుకొని తలకింద రెండు అరచేతులు పెట్టుకుని ఆకాశంలోకి చూస్తున్న అనంతరెడ్డి మనసు నిండా దిగులు మేఘాలు కమ్ముకొని ఉన్నాయి. కూతురి పెళ్ళికని చేసిన అప్పు పచ్చపురుగులా గుండెకాయను తొలుస్తోంది. భవిష్యత్తు తెల్లదోమలా భయపెడుతోంది.

'వానొస్తే బాగుండు. గొంగడి తడుపు వాన వచ్చినా చాన బాగుండు'

ఇలా అనుకోవడం ఈ పది రోజులలో ఏ వందసార్లో అయి ఉంటుంది. వర్షానికై ఎదురుచూస్తూ అతని కళ్లు పత్తికాయలయ్యాయి. కాని ఆ వర్షానికి దయ రావడం లేదు. ఒక్క వర్షం పడితే చాలు కనీసం పెట్టుబడి అయినా తప్పక వస్తుంది. ఒక్క వర్షం వస్తే చాలు పత్తి చేను ఇంకో పదిహేను రోజుల దాకా ప్రాణం నిలుపుకుంటుంది.

అతని నరనరాల్లో పత్తి చేను. అతని క్షణక్షణాల్లో పత్తి చేను.

'వానల్లు కురవాలి వానదేవుడా.. పత్తి చేలు పండాలి వానదేవుడా' – అతని మనసు శతకోటి గొంతులతో వర్షానికై ప్రార్థిస్తోంది.

వైశాఖ మాసంలోనే కూతురి పెళ్లి చేశాడు అనంతరెడ్డి. కట్న కానుకలు, పెళ్లి ఖర్చులకు లక్షకు పైనే అయింది ఖర్చు. అందులో యాభై వేలు అప్పుగా తెచ్చాడు. అప్పు తీరాలంటే పత్తి చేనయితేనే లాభం అనుకొని ఏకంగా పదెకరాలు వేశాడు. పెట్టుబడికై మళ్లీ అప్పే. ఇప్పటికే మందులకు, ఎరువు సంచులకు ఇరవై వేల దాకా అయింది. ఇంకా పది వేలయినా ఖర్చు పెట్టాలి. ఎకరాకు అయిదారు

క్వింటాళ్ల పత్తి వచ్చినా పెట్టుబడి పోను పెళ్లికి చేసిన అప్పులు సగం తీరిపోతాయి.

'వానొస్తే బాగుండు. వానొస్తే బాగుండు.'

ఎవరో వచ్చిన అలికిడి అయితే తలతిప్పి చూశాడు అనంతరెడ్డి. గొల్ల రాములు. భుజంపైనున్న గొంగడిని నేలపై వేసుకుంటున్నాడు కూర్చోవడానికి.

'పండుకున్నావా పటేలా?' కూర్చుంటూ అడిగాడు రాములు.

'గింత పొద్దుకే పండకునేటట్లుండాదిరా కాలం? అయినా ఇంకా అన్నం కూడా తినలే.'

'అవునయ్యా!పెద్ద కరువొచ్చేట్లుండాది కాలం. చెర్లకు నీళ్లు రాకున్నా భూమి తడిసే వానొచ్చినా చాన బాగుండేది.'

'అవు(న్రా నాకేం సమజయితలేదు. పత్తి చేనంతా పాడయిపోతున్నది' లేచి కూర్చుంటూ అన్నాడు అనంతరెడ్డి.

'మీరు రేగడి భూముల్లోల్లే గిట్లంటే మా మిట్ట పొలాలవాళ్లం ఏమనాలె? నా పత్తి సేను సూడబుద్దయిత లేదయ్యా. మొత్తం ఎండిపోయినట్లయి గూడంతా రాలిపోతున్నది.'

'గూడ రాలిపోకుండ మందులు కొడ్తలేవా?'

'ఏం మందులయ్యా? నా రొండెకరాల సేనుకు ఈడికే మూడు వేల రూపాయల మందులు కొట్టిన! ఒక్క వాన పడినుంటే బతికిపోతుంటి. అంతా సచ్చే కాలమొచ్చింది.'

'నీ చేను బాగానే ఉందంటగదరా.'

'ఇప్పటికయితే చెట్టుకు అరవై డెబ్బై గూడలున్నవి. కాని నిలుస్తలేవు.'

'మోనో కోటోపాస్ మందు కొట్టినవా?'

'ఏం మందులో. వారానికోసారి కొడ్తనే ఉన్న. మందులోడు ఇంక ఉద్దెర ఇయ్యనంటున్నడు. జర నీవు సెప్పాలయ్యా. నీవు సెప్తే ఇస్తడంట.'

'గట్లనే చెప్తలే. మావోడే.. మంచోడు... పత్తి అమ్మిన రోజే నీ బాకీ మొత్తం కట్టేస్తడు.. అని చెప్తలే ఫికర్ చెయ్యకు.'

వాళ్లిలా మాట్లాడుతూండగానే ఇంట్లోంచి భోజనానికి పిలుపు వచ్చింది.

'తిను పో పటేలా! నేను పోత' అంటూ లేచాడు రాములు.

'సరే మంచిది.' తనూ మంచం దిగాడు అనంతరెడ్డి.

అతనూ, అతని తల్లి, పిల్లలు ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. భార్య వడ్డిస్తోంది. మగపిల్లలిద్దరూ చిన్నవాళ్లు. పక్క ఊరికి నడిచి వెళ్లి చదువుకుంటున్నారు. ఒక్కతే ఆడపిల్ల – పెద్దది. పెళ్లయినా ఇంకా కాపురానికి వెళ్లలేదు. తల్లి పార్వతమ్మ వ్యవసాయపు పనులు చూస్తే, భార్య సుశీల ఇంటి దగ్గర పనులు చూస్తుంది. ఇదే అతని కుటుంబ సరళి.

'రేపు జీతగాళ్లేం చేస్తున్నార్రా. అంతయ్యా?' అడిగింది తల్లి పార్వతమ్మ భోజనాల దగ్గర.

'పత్తి చేనుకు దంతెలు కట్టాల్సి ఉండె. కాని మొన్న ఓ దంతె విరిగిపోయింది. రేపు వడ్లోనితోని సరిచేయించి, ఎల్లుండయినా కట్టాలె. లేకుంటే పొలం ఇంకా వర్రెలు వచ్చేట్లుంది' అన్నంలో చారు కలుపుకుంటూ అన్నాడతను.

'దంతెలు రేపు కట్లనట్లయితే ఆడ కూలోల్లను పిలుస్త. అక్కడక్కడ గడ్డల మీద గర్కగడ్డి మొలిసింది. కలుపు తీయిస్తా.'

'అట్లనే కలిపియ్యి కాని మంది దొరుకతరో, లేదో?'

'అవున్నాయినా. పది రూపాయలు ఇస్తామన్నా ఒక్క మనిషి కూడ దొరుకుత లేదు. అర్ధ ఎకరం ఉన్నోడు పత్తి చేనే, అరవై ఎకరాలు ఉన్నోడు కూడా పత్తి చేనే అయితే కూలి మంది ఎక్కడ దొరుకుతారు.'

'అయిదారు మంది వచ్చినా చాలు.'

'పెరుగు వేసుకోవా నాన్నా' చారుతోనే ముగించి చేతులు కడుక్కుంటున్న తండ్రిని అడిగింది భార్గవి.

'వద్దులే అమ్మా! నెత్తి బరువుగున్నది' అంటూ లేచాడు.

వంటరిగా వాకిట్లోకి వచ్చేసరికి పత్తి చేను గురించిన దిగులు మేఘాలు మళ్లీ కమ్ముకున్నాయతన్ని.

'వానొస్తే బాగుండు.. వానొస్తే బాగుండు' వాకిట్లో పచార్లు చేస్తున్నాడు అసహనంగా.

ఇంట్లో ఉక్కబోస్తుందని పిల్లలు పడుకోవడానికి మిద్దె పైనికి వెళ్తున్నారు. తల్లి వసారాలోనే మేను వాల్చింది.

'నీవు ఈడనే పండుకుంటవా. మిద్దె పైనికి వస్తవా?' ఇంటికి తాళం వేసుకుని వాకిట్లోకి వస్తూ అడిగింది సుశీల భర్తను.

'ఇంటి ముందల అమ్మ ఒక్కతే అయితది. నేనీ వాకిట్లోనే పండుకుంటలే.

చెంబులో మంచినీళ్లు బయటకు తెచ్చినవా.'

'తెచ్చిన. అరుగు మీద పెట్టిన.'

'కూర్చో' అన్నాడు అనంతరెడ్డి తను మంచంపైన కూర్చుంటూ.

'కింద కూసుంటలే' అత్తగారి భయంతో మంచంపైన కూర్చోకుండా కింద నేలపైన కూర్చుంది.

'పంతులు తానికి పోయొస్తివా' అడిగింది భర్తను.

'ఎందుకు?'

'అయ్యో మర్చిపోయినవా, ఉలవసేను పెట్టుకుని ఊకుండక పత్తి సేను పెట్టుకుని పాణం మీదికి తెచ్చుకున్నండట వెనకటికి నీలాంటాయన' చిన్నగా నవ్విందామె. 'పత్తి సేను ఫికరు మీద నీవన్నీ యాది మరుస్తున్నవు. బిడ్డ పెండ్లి చేసి కాపురానికి పంపకుండా ఎన్ని రోజులుంచుకుంటవు ఇంట్ల? ఈ శావన మాసంల మంచి రోజులుంటవని పంతులు సెప్పినుండే.'

'అవును గదా. నిజంగానే యాది మర్చిన. రేపు పొద్దుగాల్నే పోయొస్త. జర ధ్యాసకు జేయి.'

వైశాఖ మాసంలోనే భార్గవి పెళ్లి చేశాడు. తరువాతి శుభకార్యం కూడా జరిపిద్దామని ముహూర్తం నిర్ణయిస్తే ఆ రోజు భార్గవికి ఇంట్లోకి రాని రోజయింది. జ్యేష్ఠ మాసంలో అల్లుడి తల్లిదండ్రులు ఒద్దన్నారు. ఆషాఢం దాటి పోయిం తరువాత శ్రావణ మాసంలో అన్ని విధాల బాగుంటుదనుకున్నారప్పుడు. అందుకే పెళ్లయినా భార్గవి ఇంకా కాపురానికి వెళ్లకుండా పుట్టింట్లోనే ఉంది.

'వారం రోజుల ముందుగా నిర్ణయించుకుంటే మంచిది. రమ్మని అల్లునికి ఉత్తరం కూడా రాయాలిగా.'

'అవునవును. రేపు పొద్దుగాల్నే పంతులు తానికి పోయొచ్చి అల్లునికి ఉత్తరం రాస్తాలే.'

'సరే నేను పండుకుంట మరి' అని లేచిందామె.

వెన్నెల పత్తి పువ్వులా ఉంది. మేఘాలు పత్తి కుప్పల్లా ఉన్నాయి. అనంతరెడ్డి గుండె కాయను పచ్చ పురుగు తొలుస్తుంది. 'వానల్లు కురవాలి వానదేవుడా, పత్తి చేలు పండాలి వానదేవుడా' భారంగా కళ్లు మూసుకున్నాడతను.

● ❖ ●

మిద్దెపైన పడుకున్న భార్గవికి నిద్రపట్టడం లేదు. కింద తల్లిదండ్రులు

మాట్లాడుకున్న సంభాషణ లీలగా వినపడిందామెకు. తల్లి పైకి రావడమూ, గురక పెట్టి నిద్రపోవడమూ తెలుస్తూనే ఉంది.

పిండారపోసినట్లుగా ఉంది వెన్నెల. దూదిపింజల్లా తేలిపోతున్నాయి మేఘాలు. ముద్దబంతి పువ్వులా ఉన్నాడు చంద్రుడు. ఆకాశంలోకి చూస్తూ పడుకున్న భార్గవికి మనసు ఆహ్లాదంగా ఉంది. మెల్లగా వీస్తున్న చిరుగాలి ఉద్వేగ పూరితంగా ఉంది. తలలో పెట్టుకున్న మల్లెపూల పరిమిళం ఉత్తేజంగానూ ఉంది.

'రేపు పొద్దుగాల్నే పంతులు తానికి పోయొచ్చి అల్లునికి ఉత్తరం రాస్తాలే' అన్న తండ్రి మాటలు పదే పదే చెవుల్లో గింగురుమంటున్నాయి. 'వస్తాడు నా రాజు' అని పాడుకుంటుంది మనసు. మహా అయితే ఇంకో వారం రోజులు ఆగాలేమో.

ఈ మూడు నెలల నుండి విరహంతో రాజశేఖర్ రాసిన ఉత్తరాలన్నీ మనసు తెరమీద ప్రత్యక్షమయి, అప్రయత్నంగానే పెదాలపై చిరునవ్వు నాట్యం చేస్తోంది. మరికొంతసేపటికి వెన్నెల వేడెక్కుతున్నట్లు అనిపించేసరికి తొట్రుపడి మనసును స్తిమితపరుచుకుంది. ఆమెకప్పుడే వీపు కింద ఎగుడు దిగుడుగా మట్టి పెడ్డలు గుచ్చుకున్నట్లయి తన తండ్రి ఇంటి పరిస్థితిలోకి వచ్చింది. మట్టి మిద్దెపైన పరచిన చవుడుమన్ను వర్షం లేక కరగక మట్టిపెడ్డలుగానే ఉన్నది. చాప పైన జంపుఖానా వేసుకున్నా వీపు కింద ఎగుడు దిగుడుగానే ఉంది.

ఆమెకు అప్పుడు తన పెళ్లికై తండ్రి చేసిన అప్పు గుర్తుకొచ్చింది. అది తీర్చడానికై ఆశతో ఎక్కువగా వేసిన పత్తి చేను గుర్తుకొచ్చింది. ఆ పత్తి చేను పండాలంటే పడవలసిన వర్షం గుర్తుకొచ్చింది.

'వాన రావాలి దేవుడా.. వాన రావాలి' అనుకుంటూ బలవంతంగా కళ్లు మూసుకుని నిద్రలోకి జారుకుంది భార్గవి.

● ❖ ●

'రేపటి శుక్రవారం కాకుండా మళ్లొచ్చే శుక్రవారం రోజు చాలా మంచి రోజంట. పంతులు చెప్పిండు' అన్నాడు అనంతరెడ్డి భార్యతో – మరునాడు ఉదయం.

'గట్లయితే అల్లునికి ఇప్పుడే ఉత్తరం రాయి – శుక్రవారం పొద్దుగాల్నే రమ్మని. పది గంటలకు పాలెం కాడికి బండి తోలిస్తమని కూడా రాయి' అంది సుశీల.

తల్లిదండ్రుల సంభాషణ వినబడుతనే ఉంది భార్గవికి. మనసులోనే మధ్యలో ఉన్న రోజుల్ని లెక్కపెట్టుకుంది. ఈ రోజు బుధవారం. బుధవారం పోతే

గురువారం నుండి గురువారానికి  ఎనిమిది రోజులు!

'ఇంకో సంగతి కూడా చెప్పిండు. ఈ ముహూర్తానికి ఇద్దరి పేరు బలం మీద కూడా చాన బాగుందట. ఇది తప్పితే ఇంత మంచి ముహూర్తం కొరకు ఇంకా రెండు నెలలు ఆగాల్నంట.'

'అయ్యో. ఇంత మంచి ముహూర్తాన్నెందుకు తప్పిస్తం. మనకు అల్లుడొస్తే చాలు. సెలవు దొరకతలేదని ఆయన రాకపోతే చాన కష్టమయితది. గిట్ల సంగతి – తప్పనిసరిగా రావాలె అని ఉత్తరం రాయాల మరి.'

'ఆయన రాకుండా ఉంటారా. శుక్రవారం ఉదయం వరకు ఆగలేక గురువారం రాత్రికే వస్తారేమో' అని భర్తను తలుచుకుని మనసులోనే చిన్నగా నవ్వుకుంది భార్గవి.

● ❖ ●

వర్షం రావడం మాట అటుంచి ఎండలు తీవ్రంగా రోహిణీ కార్తె ఎండల్లా ఉండటంతో అన్ని పంటల పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. రైతులందరూ డీలాపడిపోయారు. అనంతరెడ్డికి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ఎక్కడ లేని నిస్సత్తువ ఆవహించిందతన్ని.

ఏ ప్రాజెక్టూ లేని, ఉన్నా నీరందని ఎత్తులో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని మారుమూల కుగ్రామం అది. వర్షాలు బాగాపడి చెరువులు నిండితే కానీ వరి నాట్లు పడవు. రేగడి, మిట్ట పొలాల్లో ఒకప్పుడు మిర్చి, ఆముదం, జొన్నలు వేసుకుని ఏదో కాలాన్ని నెట్టుకొచ్చేవారు. నాలుగయిదు సంవత్సరాల నుండి పత్తిని ప్రారంభించి వేలకు వేల రూపాయలు కళ్లజూసేసరికి ఈ సంవత్సరం పిచ్చిగా ప్రతి ఒక్కరూ పత్తి రైతులయ్యారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల వారిని భయకంపితులను చేసిన తెల్లదోమ ఇప్పుడు ఈ వైపుకు తన దారిని మరల్చుకుంది. దానికి తోడు వర్షాభావ పరిస్థితి.

ఒక్కొక్క రోజు గడుస్తున్న కొద్దీ అనంతరెడ్డి ఒక్కో సంవత్సరం మీద పడ్డట్టుగా కుంగిపోతున్నాడు. పత్తి చేను దగ్గరికి వెళ్తే ఏడుపు వస్తోంది. తమలపాకుల్లా నవనవలాడిన ఆకులు వాడి మడతలు పడి ఉన్నాయి. రోజు రోజుకూ చెట్టు కింద రాలిపడిపోతున్న గూడల సంఖ్య పెరిగిపోయి చెట్టు బోసిపోతూ ఉంది.

ఇప్పుడైతే పత్తి చేను వైపే వెళ్లడం మానేశాడు. కానీ వర్షం మీద నమ్మకం మాత్రం పోలేదతనికి.

● ❖ ●

ఒక్కొక్క రోజు గడుస్తున్న కొద్దీ ఉత్సాహం రెట్టింపవుతోంది భార్గవికి. గురువారం వెళ్లి గురువారం రానే వచ్చేసింది. ఎందుకో పెళ్లి జరగబోతున్నప్పుడు కూడా ఇంత ఉద్వేగం పొందలేదామె. అలా అని శోభనం గురించి కూడా కాదు ఆ ఉద్వేగం. దాంపత్య జీవనం! ఎడబాటు తొలగిపోయి తాము గడవబోయే ఈ దాంపత్య జీవనం గురించే ఆమె ఉద్వేగం! పెళ్లయి కూడా కార్యమంటూ, ముహూర్తాలు లేవంటూ ఇలా ఎడబాటుతో జీవించడమే ఇన్నాళ్లూ ఆమెను బాధించింది. అది ఇప్పుడు అంతమైపోతున్నందుకే ఆనందం.

'ఏమేం తీసుకురావాలి' అడుగుతున్నాడు అనంతరెడ్డి సుశీలను.

'పూలు, పండ్లు...' చెబుతుందామె.

తండ్రిని చూస్తున్న భార్గవికి ఎందుకో చెప్పలేని బాధ అనిపించింది. వర్షం పడి ఉంటే తన తండ్రి ఎంత ఉత్సాహంగా ఉండేవాడో కదా అనుకుంది.

'వానల్లు కురవాలి వానదేవుడా.. పత్తి చేలు పండాలి వానదేవుడా'

● ❖ ●

భార్గవి అంచనా నిజమయింది. శుక్రవారం ఉదయం రావాల్సిన రాజశేఖర్ గురువారం రాత్రికే వచ్చి వాలిపోయాడు. అతనలా రావడం ఇంట్లోవాళ్లందరికీ ఆనందదాయకమే అయింది. మనసంతా భార్గవి దగ్గరున్నా తప్పనిసరి పరిస్థితుల్లో రాజశేఖర్ బావ మరదులిద్దరితో కాలక్షేపం చేశాడు.

మరునాడు పగలంతా చాలా తొందరగా గడిచిపోయినట్లు తోచింది భార్గవికి. తనకేమో ఒక్కో నిమిషం భారంగా గడుస్తుందన్నాడు రాజశేఖర్.

ఆ రాత్రి అందరూ తొందరగా భోం చేశారు. ఆ ఇంటిలో పడకింటిగా మార్చే అవకాశమున్న ఒక్క గదిని సుశీల తనకు తోచిన రీతిలో అలంకరించింది. నిజానికి ఈ కార్యం కార్యక్రమాన్ని అందరికీ తెలిసే కార్యక్రమంగా చేయడం ఈ ప్రాంతంలో తక్కువ. సుశీల పుట్టింటివారి వైపు దానిని ఘనంగా చేస్తారు. భోజనాలయినాక వెంటనే కూతుర్ని అలంకరించే పనిలో నిమగ్నమయింది సుశీల. భోజనాలకు ముందే పడక గదిని సిద్ధం చేసి ఉంచింది.

పార్వతమ్మ వసారాలో పడుకుని అప్పుడే గురక ప్రారంభించింది. మగపిల్లలిద్దరూ బట్టలు తీసుకుని మిద్దె పైనికి వెళ్లిపోయారు. వాకిట్లో మంచంపైన కూర్చుని మామా అల్లుడు పాడయిపోతున్న పంటల గురించి రాబోయే కరవు

గురించి మాట్లాడుకుంటున్నారు.

ఉన్నట్టుండి పడిందొక వాన చినుకు.

అది సరిగ్గా అనంతరెడ్డి చేతిపైనే.

ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాడు.

ఆకాశం అమాయకంగానే ఉంది.

'వర్షం పడుతున్నట్లుంది మామయ్యా' అన్నాడు రాజశేఖర్ అతని మీద కూడా రెండు చినుకులు పడ్డాయి.

'అవును! కానీ మొగులే లేదు. ఇంకెక్కడయినా పడుతుందేమో' అన్నాడు అనంతరెడ్డి.

మరో అయిదు నిముషాల దాకా నాలుగో చినుకు పడలేదు.

వర్షం సంగతి మరిచి మాటల్లో పడ్డారిద్దరూ.

అప్పుడు మొదలయింది చల్లని చిరుగాలి. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో దాక్కుని ఉన్నట్లున్న నల్లని మేఘాలు ఆ ఊరి మీద కమ్ముకోవడం ప్రారంభించాయి.

'మొగులయితుంది. వాన వచ్చేట్లున్నది'

ఆ మసక చీకటిలో ఆనందపు మెరుపు అతని మొహం మీద ప్రతిఫలించింది.

టపటపా వాన చినుకులు రాలుతున్నవి. దడేలున ఉరుము ఉరిమింది. చెమక్కున మెరుపు మెరిసింది. తడిసిన నేల మీంచి వస్తున్నట్లుగా గాలి మట్టి వానను మోసుకొస్తున్నది.

'లోపలికి పోదాం పద రాజా.. తడిసిపోయేట్లున్నాం' అంటూ లేచాడు అనంతరెడ్డి.

'మంచం కూడా పట్టుకుపోదాం. నీవా సైడుకు పట్టుకో' అన్నాడు రాజశేఖర్.

'నీవు పట్టుకుంటావా – వద్దు వద్దులే. నేనొక్కన్నీ తెస్తాలే నీవెళ్లు' ఇంకా శోభనం కూడా కాని కొత్త అల్లుడు తనకు సహాయంగా మంచం పట్టుకుంటానంటే కదిలిపోయాడతను.

'పరవాలేదులే మామయ్యా. తప్పేంటి పట్టుకో.'

ఇద్దరూ కలిసి మంచాన్ని వసారాలోకి తెచ్చారు. మిద్దెపైన పడుకున్న పిల్లలిద్దరి బట్టలు చుట్టుకుని కిందికి పరిగెత్తుకొచ్చారు.

'ఈ రోజు నిజంగానే మంచి రోజే తల్లీ, వాన కూడా పడుతున్నది' కూతురి పూలజడ సరిచేస్తూ అన్నది సుశీల.

'నిజమే అమ్మా! ఇన్నాళ్లూ నాన్న మొహం సూస్తుంటే చాన బాధయితుండే. నాన్నకెంత సంతోషమయిందో' అద్దంలో చూసుకుంటూ నుదుటను బొట్టు దిద్దుకుంటోంది భార్గవి.

వర్షం ఉధృతంగా పడుతున్నట్లు బయట నుండి శబ్దం వినపడుతోంది.

'అమ్మో ఇంట్లో పొటుకు పెడుతున్నట్లుందే' చీర మీద నాలుగయిదు చుక్కల వర్షం పడేసరికి దిగ్గున లేచింది భార్గవి. (మట్టి మిద్దెల రంధ్రాలు పడి నీళ్లు ఇంట్లో పడడాన్ని పొటుకు అంటారు)

'ఆ రూంల చూసొస్త ఉండమ్మా. మిద్దెంతా అట్లనే ఉండది' అంటూ లేచి గబగబా కార్యం గదిలోకి వెళ్లింది. అప్పటికే ఆ గది మూడు చోట్ల కురుస్తుంది. సరిగ్గా మంచంపైన కూడా ఒకచోట తడుస్తున్నది.

'భాస్కరూ! జల్దీ ఇక్కడ్రా బాబూ' పెద్ద కొడుకును కంగారుగా పిలిచింది.

'ఏందే అమ్మా' ఇద్దరు పిల్లలు పరుగెత్తుకొచ్చారు లోపలికి.

'రెండు మూడు గిన్నెలు తీస్కరాపొండి. రూమంతా పొటుకు పెడుతున్నది' పరుపును చుట్టుతూ అంది.

భార్గవి కూడా వచ్చింది. ఎక్కడయితే నీళ్లు కారుతున్నవో అక్కడ కింద గిన్నెలు పెట్టినా మరో మూడుచోట్ల కారడం మొదలుపెట్టింది. మంచాన్ని ఎత్తి మార్చడా నికి కూడా చోటు లేకుండా పోయిందా గదిలో.

'అరే మీ నాయిన్ను లోపలికి పిలువుండ్రి' ఆదుర్దా ఎక్కువైపోయిందామెకు.

లోపలికి వచ్చిన అనంతరెడ్డి పరిస్థితి చూశాడు. పడుకోవడానికి వీల్లేకుండా ఉంది గది.

'మిద్దె మీదికి పోయి నేను చూసి తొక్కివస్తా' అంటూ గొంగడి కప్పుకొని బ్యాటరీ తీసుకుని మెట్లెక్కిపోయాడు.

వానకు తడిసిన చవుడు మిద్దెపైన జారుతోంది. అయిదారు నిమిషాల కంటె ఎక్కువగా ఆ వాన ఉధృతిలో నిలబడలేకపోయాడు. తిరిగి కిందికి వచ్చాడు. ఇప్పుడు ఆ గదే కాకుండా మధ్య హాలు, సామాను గది, వంట గది కూడా కురుస్తున్నాయి.

భార్గవి బయటకు వచ్చి రాజశేఖర్‌కు లోపలి పరిస్థితి చెబుతోంది. వర్షం

తగ్గితే కానీ ఈ రోజు పడుకోవడానికి చోటు లేదు.

వర్షం నిముష నిముషానికి పెరిగిపోతున్నది. గాలి కూడా ఎక్కువైంది. దానికి తోడు కరెంటు కూడా పోయింది.

ఊరు ఊరంతా చీకటి తెర కప్పుకుంది. బుడ్డి దీపాలు మిణుకు మిణుకున వెలగడానికి ప్రయత్నిస్తున్నాయి.

'ఛీ! పాడు వాన! ఇన్ని రోజులాగీ ఈ రోజునే రావాలా' అంటున్నాడు అనంతరెడ్డి లోపల.

'ప్చ్. ఈ రోజు ఆగిపోతే రెండు నెలల దాకా మంచి రోజులే లేవంట' అంటోంది సుశీల.

భార్గవి, రాజశేఖర్‌లకు వినబడుతున్నాయి లోపలి మాటలు.

'వాన రావాలి వాన రావాలి' అని ఇన్నాళ్లూ ప్రార్థించిన అనంతరెడ్డికి వానపైన చెడ్డ కోపం వచ్చింది.

'ఈ పాడు వాన ఇప్పుడయినా ఆగిపోతే బాగుండును' అంటూ వసారాలోకి వచ్చాడు అల్లుడు దగ్గరికి.

తన కొరకు వాన ఆగిపొమ్మంటున్న తండ్రి మాటలకు ఆశ్చర్యంతో పాటు తండ్రికి తన పైని ప్రేమకు కించిత్ గర్వం కూడా కలిగింది.

ఆ తండ్రికి కూతురు దాంపత్యం మీద కల ప్రేమను వానదేవుడు సైతం చలించిపోయాడన్నట్లుగా, మంత్రం వేసినట్లుగా వర్షం ఆగిపోయింది.

'ఈ వర్షం సరిపోతుందా నాన్నా మన పత్తి చేనుకు' అడిగింది తండ్రిని.

'ఎంత భూమి తడిసిందమ్మా. రెండు ఈంచులు కూడా తడిసి ఉండదు. కాని పోతేపోనీ ఈ పాడువాన' విసుక్కున్నాడు తండ్రి.

'అట్లా అంటారేంటి మామయ్యా? కార్యం ఆగిపోతున్నదని బాధ పడుతున్నారా? ఇంత సంతోషం ముందు అది ఎంత మాత్రం బాధ కానే కాదు' అన్నాడు రాజశేఖర్.

'అవున్నాన్నా! మా కొరకు బాధపడకండి. ఈ వర్షం ఇంకా బాగా పడనీ. మన పత్తి చేను విరగకాయనీ' అంది భార్గవి.


మూడు నెలల విరహం తరువాత కార్యం మళ్లీ రెండు నెలలకు వాయిదా పడుతున్నా వర్షానికై నిండు గుండెతో స్వాగతం పలుకుతున్న ఆ పడుచు జంట ఆహ్వానానికి స్పందించినట్లుగా కాబోలు మళ్లీ వర్షం కురవసాగింది.

ఈ మారు మరీ ఉధృతంగా.

అనంతరెడ్డి కళ్ల నుండి జారిన ఆనందాశ్రువుల్లో మెరుపు కాంతి కిరణం పరావర్తనం చెంది ఆ పడుచు జంట మొహాలపై ఇంద్ర ధనుస్సులా విరిసింది.

పత్తి చేలు పండేట్లుగా వానదేవుడు వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాడు తెల్లారిందాకా.





# మృగశిర

## బి.అజయ్‌ప్రసాద్

• రచనా కాలం: 2011

**అజయ్ ప్రసాద్:** కొలతలకూ స్థిరీకరణాలకూ ఆవల ఉండే– చూపులకు దొరకక మూలల దాగే జీవితాల్లో సరిగ్గా వినిపించని విష్పర్స్‌ని కథాంశాలుగా స్వీకరించి కథనం చేయడం వీరి శైలి. దాదాపు 40 కథలు రాశారు. స్వస్థలం ప్రకాశం జిల్లా. స్టెనోగ్రాఫర్‌గా హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. వీరి కథలు 'ఆమె నీడ', 'యు.ఎఫ్.ఓ', 'లోయ' తదితరం తప్పక చదవతగ్గవి. వయసు 44 సంవత్సరాలు.

మండువేసవిలో ఎండతీవ్రతకు అరణ్యం నిశ్శబ్దంగా ఉంది. అక్కడక్కడా ఆకులు రాలిపోయిన చెట్లు ఒట్టికొమ్మలతో నిస్తేజంగా నుంచుని ఉన్నాయి. నిలువెత్తు రాక్షసుడెవరో భగభగమని మండే అగ్నిగోళాన్ని పట్టుకుని పెద్దపెద్ద అంగలతో అరణ్యాన్ని దాటుతున్నట్లుగా ధగధగమని రోజులు గడిచిపోతున్నాయి.

ఉదయాన తనే నీడలు సృష్టించి సాయంత్రానికి తన నీడలను తనే వెనక్కు లాక్కుని పోయే సూర్యభగవానుడు పగలల్లా నలుదిశలా నిప్పులు చిమ్ముతూ ఉన్నాడు. కణకణమని మండే రోజుల కాల పరంపరలో నిశ్శబ్దపు నిర్జనారణ్యంలోకి ఒక గోధుమరంగు బెల్లగువ్వ ఎగురుకుంటూ వచ్చింది. చాలాదూరం నుంచి ఎడతెరిపిలేకుండా ఎగురుకుంటూ దారితప్పి ఆ అరణ్యంలోకి చిక్కుబడి అలసిపోయి ఉంది. దాని తీరు చూస్తే దేన్నో చూసి బెదిరి పోయినట్లుగా చిన్న అలికిడైనా ఉలిక్కిపడి అటూ ఇటూ మెడతిప్పి భయంతో చూస్తూ ఉంది.

అంతకంతకూ తీక్షణమవుతున్న ఎండవేడిలో, అటూ ఇటూ హోరుమని తిరుగాడుతున్న వడగాలిలో కనుచూపుమేరలో ఎక్కడా పురుగుపుట్రా అలికిడి లేదు. నిర్జనమైన ఆ అరణ్యం, ఎండవేడిమి బెల్లగువ్వ ఒంటితనాన్నీ భయాన్నీ మరింత ఎక్కువ చేస్తూ ఉన్నాయి.

బెదరిన చూపుతో బెల్లగువ్వ దిక్కులు చూస్తుండగా 'డిగు డిగు... డిగు డిగు...' మంటూ చెట్ల మధ్య నుంచి ఒక విచిత్రమైన శబ్దం చెవిన పడటంతో తత్తరపడి చెట్ల కొమ్మల్లోకిపోయి కూర్చుంది. ఆ కలవరపాటులో నిర్మానుష్యమైన ఎండ గాలిలో దాని కళ్లకు విచిత్రమైన రెండు రంగులు కనిపించాయి. మొదట దాని కళ్ళకు ఎండిన గోధుమరంగు చెట్లకొమ్మల మధ్య విచిత్రమైన ఎరుపు పసుపురంగు,

ఆ తరువాత చిక్కటి చీకటి నలుపురంగు కనిపించాయి. తేరిపార చూడబోయి ఎండపొడ కంట్లో పడటంతో క్షణంసేపు కళ్లు మూసుకుంది. దాని చెవుల్లో మళ్ళీ అదే చప్పుడు. ఎవరో డమరుకం మోగించినట్లు 'డిగు డిగు'మంటూ.

ఏమయితే అదయిందని బెల్లగువ్వ కళ్ళు తెరచి చూస్తే అక్కడ బారెడు పొడుగున్న జెముడు కాకి, ఎక్కడ నుంచి వచ్చిందో మద్ది కొమ్మ మీద కూర్చుని ఉంది. ఎరుపు, పసుపు కలగలిసిన జాజు రంగులో పొడవాటి రెక్కలున్నాయి దానికి. ఆ సమయంలో జెముడుకాకిని చూడగానే గువ్వకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

'నువ్వా సావి! ఎవురో అనుకున్న' అన్నది బెల్లగువ్వ తెప్పరిల్లి.

'నేనే అన్నా. రెండుదినాలుగా ఇదే ప్రయాణం. నిన్నగాక మొన్న ఆ సూర్య బగవానుడు లేవక ముందే ప్రయాణమైనాను. అమాసరోజు గదా, మంత్రగాళ్ళను తప్పించుకు తిరిగే సరికి తల ప్రాణం తోకకొస్తా ఉంది. గాలి ఎటీస్తే అటు తీరూ తెన్నూ తెలవక పోతండా. ఈయాల్టికి ఈ తావుకు వాలినాను. రేపెక్కడవతదో తెలవదు' అన్నది జెముడు కాకి ఆయాసం తీర్చుకుంటూ.

'మంత్రగాళ్ళేంది సావి?' అన్నది బెల్లగువ్వ జెముడుకాకి కేసి వింతగా చూసి.

'నీకు తెలవదా అన్నా! అమాసరోజు మంత్రగాళ్లు నా మావసం కోసం ఎగబడతారు. ఆ రోజు జెముడు కాకి మావసం తింటే మంచిదని వాళ్ళ నమ్మకం'

'మంత్రగాళ్ళింకా ఉండారంటావా సావి?' అన్నది బెల్లగువ్వ పైనున్న మరో కొమ్మకు చటుక్కున ఎగిరి నలుదిక్కులా తేరిపార చూస్తూ.

'మంత్రగాడు 'ఓహో నేను మాయలోడిని' అంటూ కపాలం సేత్తో బట్టుకుని తిరగుతాడా ఏందీ? ఆళ్ళూ మామూలు మడుసులల్లే ఉంటారు. సూపే కాసింత తేడా ఉంటది. నా సంగతట్టా ఉంచు. నువ్వేంది ఒంటిగా ఉన్నావు? నీకు గూడు, జతగత్తె లేవా ఏంది?' అన్నది జెముడు కాకి.

'లేకేవి సావీ! అందురూ ఉండారు. ఐదుమైళ్ళవతల' అంది బెల్లగువ్వ నిట్టూర్చి.

'మరి ఈ అడివికెందుకొచ్చినావన్నా?'

'ఏమిసేద్దు సావి. కరమకాలి. ఇయ్యాల శనీశ్వరుడు తగులుకున్నట్టు బెల్లగాడు తగులుకున్నాడు'

'బెల్లగాడా!'

'వేటగాళ్ళలో వాళ్ళోరకం. బెల్లగువ్వ బెల్లగాడి కంటబడితే చాలు. పట్టి తినందే నిద్రపోడు. ఒక్కసారి కంట్లోబడితే దానికోసం ఏడు సవుద్రాలైనా ఈదుకుంటా పోతాడు. అందుకే వాడికి ఆ పేరు. ఎండిన కొమ్మను బట్టుకుని ఎగురుకుంటా పోయిపోయి బెల్లగాడి కంటబడ్డాను. పొద్దున పిల్లిపెసర చేనులో సాలాయన దగ్గర వల కోసం దారం తీసుకుంటా ఉండాడు. కొంగ మావసం కొట్టి తెస్తానని సాలాయనకి మాటిచ్చాడు. అదిగో అప్పుడే వాడి కంటబడ్డాను సావి. తప్పించుకు తిరగతా దారితప్పి ఇంతదూరం వచ్చి వాలినాను. అయినా ఈ అడివి నాకు కొత్తేంగాదు సావి. తిరిగి గూటికి పొదామంటే మళ్ళీ వాడి కంటబడతానేమోనని బయం. అంతే.'

జెముడు కాకి అంతా అర్థమయినట్టు తలాడించింది.

జెముడుతో మాట్లాడిన తరువాత బెల్లగువ్వ కాస్తంత స్థిమితపడిరది. ఈ అరణ్యంలో తనిక ఒంటరిని కాననీ, ఇక ప్రమాదమేమీ లేదనే భావనలో అది తన భయాన్ని కొంత మరచిపోయింది.

బెల్లగువ్వ బెదురును గమనించి, 'చూస్తంటే మనిద్దరి కత ఒకేలా ఉందన్నా. ఎవడో బెల్లగాడు తరిమితే నువ్వీ అడివికి జేరినావు. ఎవడో మంత్రగాడు ఎంటబడితే నేనీ తావుకు వచ్చినాను. నువ్వూ, నేనూ ఒకటే' అన్నది జెముడు.

'ఈ ఆపదలో ఈ జెముడుకాకిని ఆ పరమాత్ముడే నా దగ్గరకు పంపించినాడు. ఈ దినం ఏదోవిధంగా గడిపి ఇతడి సాయంతో రేపు నేను నా వారిని చేరుకో వచ్చును' అనుకుంది బెల్లగువ్వ.

జెముడుకాకి బెల్లగువ్వని మరింత ఓదార్చడానికన్నట్లు మాటలు పొడిగించి 'ఇదేంది? నువ్వు నన్ను సావి అని పిలుస్తావేందన్నా' అన్నది నవ్వుతూ.

'సావివి గాకపోతే ఏంది సావి? ఒంటి నిండా ఆ నల్లటి ఈకలు జూడు. బైరాగోడు భుజమ్మీద కాషాయవస్త్రం సుట్టుకున్నట్టుగా ఆ ఎర్రటి రెక్కలుజూడు. ఎప్పుడు జూసినా ఒంటిరిగా తిరుగుతావు. నువ్వు సావివి గాకపోతే ఇంగెవురు సావి? పైగా సావులోరు డమరుకం మోగించినట్టు డిగుడిగుమని ఆ కూత. అది సరే, పిడికడంత లేను నీకు నేను అన్ననెట్టవుతాను సావి?' అన్నది గువ్వ.

'పెద్దోడు పిడికెడున్నా పెద్ద పెద్దనే' అని నవ్వింది జెముడు.

ఇంతలో కాస్తదూరం నుంచి కీక్క్... కీక్క్... అని శబ్దం రావడంతో బెల్లగువ్వ బిత్తరపోయి జెముడు మొకంలోకి చూస్తా నిశ్శబ్దంగా ఉండిపోయింది. కాసేపు నిశ్శబ్దం తరువాత దూరంగా పైనుండి రాళ్ళు పడుతున్న శబ్దం వినిపించింది.

'ఏంది సావి ఆ సప్పుడు?' అన్నది బెల్లగువ్వ గుజగుజ వణుకుతూ.

'నువ్వేమీ బయపడబాకన్నా. ఏమైందో పోయి చూసొస్తా' అని బెల్లగువ్వ వారించేలోపే రెక్కలిప్పుకుని పైకెగిరింది జెముడు. జెముడుకాకి కనిపించినంతమేర చూసి 'ఇతడు చూడటానికి జెముడులా ఉండాడు. ఎగరడానికి గద్ద మాదిరి ఎగురుతుండాడు. ఇంతకూ వచ్చిన ఆ చప్పుడు యాడది? ఈ తావుకు బెల్లగాడు రావడం కల్లో మాట. ఒకవేళ జెముడుకోసం వెతికే మంత్రగాడా? బెల్లగాడైనా మంత్రగాడైనా తమను చూడందే రాయి విసరడు. ఈయాల్టికి ఆపద గట్టెక్కిందనే అనుకుంటిని. చూడబోతే అపాయం ఇంకా కాసుకునే ఉన్నట్టుంది...' బెల్లగువ్వ ఆలోచనలో ఉండగానే జెముడుకాకి తిరిగి వచ్చింది.

జెముడు ఏమి చెబుతుందా అన్నట్లు కుతూహలంగా చూసింది బెల్లగువ్వ.

'ఈ తావుకు రెండుమైళ్ళవతల పెద్ద రాళ్ళగుట్ట ఉండాదన్నా. దాని పక్కనే లోయ కూడా ఉండాది. ఆ లోయ నిండా రాళ్ళే. ఆ రాళ్ళగుట్ట మద్దెన ఇరుక్కు పోయిన కళేబరం కోసం రాబందులు కొట్టుకుంటా ఉండాయి.'

'రాబందులా?' అన్నది గువ్వ పరికించి చూసి.

'అవునన్నా రాబందులే. వాటి కొట్లాటకి రాళ్ళు దొర్లి లోయలో పడినట్లుండాయి. అదే చప్పుడు. చూడబోతే ఇక్కడ కరువున్నట్లుంది. ఏదేమైనా ఇక ఈ తావున ఉండటం ప్రమాదం. ఇక్కడ నుంచి వెళ్ళిపోవడం మనకు మంచిది.'

'కరువుకాలాన చచ్చిన జీవుల కళేబరాలతో రాబందుకు పండగగావాల' అన్నది బెల్లగువ్వ రెక్కలిప్పుకుని ఉన్నచోటు నుంచి పైకెగురుతూ.

'నిజమేనన్నా. ఒగిరికి సావు ఇంగోరికి పండగ. ఇదే లోకరీతి. ఇదే కాల మహిమ. ఇంతకూ ఇది కరువేనంటావా?' అన్నది జెముడు కూడా గువ్వతో కలిసి ఆ చోటు విడిచిపెడుతూ.

'కరువుగాకపోతే ఏంది సావి! ఈ అడివిలో ఇంత నీరు దొరికితే ఒట్టు. జీవాలు తిండిలేక మలమల మాడతండాయి. పిట్టలు అందుకొనేదానికి సిగురులేదు. పట్టుకు తినేదానికి పురుగు లేదు. పశువులు తిండి లేక నకనకలాడతండాయి. ఇంత అగ్గి పోయినేడాది కూడా లేదు సావి. ఎప్పుడూ సూడలేదు. వానలెప్పుడు వస్తాయని వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుండాను సావి.' బెల్లగువ్వ తనగోడు ఏకరువు పెట్టసాగింది.

గువ్వ మాటలు వింటూ జెముడు కాకి ఎగురుతూనే అడవిని పరికించి చూస్తూ

ఉంది. ఒక పక్క రోహిణి తన ప్రతాపం చూపిస్తూ ఉంది. అంతకంతకూ పెరుగుతున్న వేడికి గాలి అల్లాడుతూ ఉంది. అడవి వాన చినుకు చూసి చాన్నాళ్ళయినట్లుంది. కొన్నిచోట్ల కొమ్మలన్ని ఎండిపోయి ఆకులు రాల్చిన చెట్లు ఇక జీవం పుడుతుందా అన్నట్లున్నాయి. మరికొన్ని చోట్ల వడలిపోయిన ఆకులు సన్నటి కొమ్మలకు నిస్సత్తువుగా వేలాడుతున్నాయి. కనుచూపు మేరలో జంతుజాలం ఆచూకీ లేదు. దానికి అడవిని చూస్తుంటే అక్కడ తామిద్దరమే ఉన్నట్లు తోస్తూ ఉంది. దానిచూపు కొంతదూరంలో ఎండిపోయిన నీటికుంట మీద పడింది. కుంటపైన ఎండిన తుమ్మకొమ్మకు చెదిరి చీకిపోయిన గిజిగాడి గూడు కనిపించింది.

'కుంటపైన గిజిగాడి గూడు చెదిరిపోయింది. వాడిక్కడ లేడేమో...' అన్నది జెముడు.

'ఇంకెక్కడ గిజిగాడు సావి! ఈ అడవిలో గుక్కెడు నీరున్న కుంట దొరకడం కల్ల. నీటి తెరువు వెతుక్కుంటా ఆడెక్కడికో పోయింటాడు. అయినా గిజిగాడెందుకు నీటికుంట పైనే గూడు కడతాడు సావి?' అన్నది బెల్లగువ్వ.

బెల్లగువ్వ సంభాషణ పొడిగిస్తూ 'గిజిగాడి సంగతలా ఉంచు. సానాకాలంగా చూస్తా వుండా సావి. కాలం మారతా ఉండట్టుంది. ఒట్టి ఎండాకాలమేగాని యాడజూసినా వానలు లేవు. ఈ ఎండ మడుసుల పాపం పెరిగినట్లు పెరిగిపోతా ఉంది. నక్కలు డొక్కలు మాడ్చుకుంటా డొంకలబడి తిరగుతండాయి. పురుగులూ సిగుళ్ళూ లేక పిట్టలు అంగలారస్తాండాయి. ఆ మోడువారిన సెట్లుజూడు. మళ్ళీ మొలకెత్తుతాయో లేదో అన్నట్టుగా లేవూ?'

గువ్వ ప్రశ్నకు జెముడుకాకి సమాధానం చెప్పలేదు.

'చూడబోతా ఉంటే ఎండకు జడిసినట్లుండావే?' అన్నది జెముడు కాకి మెడ వెనక్కి తిప్పి బెల్లగువ్వని క్రీగుంట చూస్తూ.

'నేను జెప్పేది నిజం సావి. సిన్నప్పుడు మా నాయిన జెప్తా ఉండేవాడు– సరిగ్గ ఎవురో పైనుంచి చక్రం తిప్పినట్టు కార్తెలుండేవంట. బగబగమని మండే ఎండాకాలం పోయినాక దనదనమని వాన పడితే పురుగుపుట్ర భూమిలోంచి బుసబుసమని పైకొచ్చేదంట. అయన్నీ మనబోటి పిట్టలకు పండగ దినాలంట.'

'మృగశిరలో పుట్టిన జీవికి మూణ్ణాల ముచ్చట. ఆరుద్రలో పుట్టిన జీవికి ఆరుగాలం ఆయుష్షూ'

'కార్తె సంగతలా ఉంచు సావి. ఈ కాలానికేమొచ్చిందో! మనబోటి జీవాలకు

ఇవి రోజులుగావు.'

'నువ్వంత బయపడే పని లేదన్నా. నేను జూస్తానే ఉన్లా! ఈ ఏడు శివరేత్రికి గాలి మార్పు నా కళ్ళతోనే జూస్తిని. సెంద్రుడు సిత్తతో గలిసిననాడు సిగురోసన జూస్తిని. కడకు ఇయ్యాల రోహిణికి కరువుబారినపడ్డ కళేబరం కొమ్ములుగూడా జూస్తిని. ఒకదాని వెనక ఒకిటి అంతా సరిగానే ఉందన్నా. రాలేయి రాలతానే ఉండాయి. పుట్టేవి పుడతానే ఉండాయి. పైన బగమంతుడుండాడు. కాలమొస్తే ఈ ఎండే నీడవుద్ది. ఈ గాలే సల్లబడుద్ది. దేని పని దానిది. దీనికి దేనితో నిమిత్తం లేదు. అయినా నీకు తెలవందేవుంది? ఎంత ఎండితే అంత వాన. ఎంత తడిస్తే అంత ఎండ. ఎండలు నలుదిక్కులకుబోవాల. బూవిలో అంగుళం అంగుళం జూడాల. తరవాత వానలో తడపాల. మట్టికి మళ్ళీ ఊపిరూదాల'

'లేదు లేదు సావి. నీకు తెలవనట్టుంది. అసలిది కాలం సేసే కీడో లేక మడుసులు సేసే మాయో తెలవకుండా ఉంది' అన్నది బెల్లగువ్వ తల్లడిల్లుతూ.

'అంతగా చింతించబాకన్నా. ఆ రెండూ కావు. దేవుడు సేసే మాయే ఇదంతా. ఈ మడుసులేంది. ఎవ్వురైనా ఆ పరమాత్ముడి మాయలో కొట్టుకుపోవలసిందే. వానికి నరులతో పని లేదు' అన్నది జెముడు.

ఇద్దరూ అలా ఎగురుకుంటూ ఎటువైపు వెళుతున్నారో తెలియదు. దారితప్పి మరింత దట్టమైన అరణ్యంలోకి వెళుతున్నారో లేక గాలివాటున దిక్కులు తప్పి అరణ్యాన్ని దాటి బయటకి వస్తున్నారో తెలియదు. దేని నుంచో దూరంగా పారిపోవడమే కావలసింది.

అక్కడక్కడ కొమ్మల మీద వాలి కొంతసేపు ముచ్చటించుకుంటూ అలుపు తీరాక మళ్ళీ ఎగురుకుంటూ చివరికి చీకటిపడే సమయానికి ఒక పొడవాటి చెట్టు మీదకు వచ్చి చేరారు. అక్కడ కొమ్మపైన కూర్చుని చూస్తే అడివంతా చివరిదాకా కనిపిస్తున్నట్లుగా ఉంది. చీదరవాదరగా పెరిగిన చెట్ల కింద దట్టమైన గడ్డిపొదలు వేసవి తాపానికి ఎండి పసుపురంగుకు మారి ఉన్నాయి. దూరంగా కొండరాళ్ళగుట్ట చీకట్లో పెద్ద జంతువేదో కాళ్ళు ముడుచుకుని కూర్చున్నట్లుగా ఉంది. ఎండిన పసుపురంగు గుడ్డిపొదల మధ్య అక్కడక్కడా రాతిగుండ్లు సాయంత్రపుటెండకు బూడిదరంగులోకి దిగుతూ వున్నాయి.

అప్పటివరకూ నిప్పులు చెరిగిన సూర్యగోళం క్రమంగా దిగంతంలోకి కుంగిపోయి పడమటి దిక్కున మబ్బులు ఎర్రగా కాలిన బొగ్గుపెళ్ళల మాదిరి కనబడ్డాయి. పగలంతా ఎండకు ఈసురోమన్న చెట్లు వేసవి సాయంత్రపు చల్లటి

గాలికి తలాడిస్తా సేద తీరుతున్నాయి. ఎటునుంచో దిగిన చీకట్లు నలుదిశలా నిదానంగా నల్లగా పరుచుకుంటూ పోతున్నాయి.

జెముడుకాకి కొమ్మమీద కూర్చుని పరిసరాలను చూస్తూ 'మనకీ తావు బాగుందన్నా. ఎవురొచ్చినా మనం అగుపడము. వచ్చినోళ్ళు మనకి అగుపడ కుండా పోరు. ఏ జంతువైనా కింది నుంచి ఇంతపైకి రావడం కల్లోమాట.' అన్నది.

'అవునుసావి. ఇక్కడే బాగుంది. ఈ రేత్రికి ఇక్కడే ఉండి పొద్దున్నే మనదారిన మనం బోవచ్చు. నాకింకా ఈ బూమ్మీద నూకలు రాసిపెట్టుంటే రేపు నా గూటికి పోతాను'

పగలంతా తిరిగి తిరిగి అలసి, నిద్రముంచుకు వస్తుండటంతో బెల్లగువ్వ చెట్టుకొమ్మ మీదే కళ్ళు అరమోడ్చి కూర్చుంది.

సమయం గుడిచేకొద్దీ చీకటి ముసురుకుంటూ ఉంది. చీకటి చిక్కబడేకొద్దీ నిద్ర ముంచుకొస్తూ ఉంది. నిద్ర ముంచుకొచ్చేకొద్దీ ఇద్దరి మధ్యా మాటలు తగ్గుతూ ఉన్నాయి.

బెల్లగువ్వకు అల్లంత దూరంలో కొమ్మ మీద చోటుచేసుకుని నింపాదిగా కూర్చుంది జెముడు. రేపేమిటన్న చింత దానిలో లేదు. చీమ చిటుక్కుమన్నా సగం కళ్ళు తెరిచి అటూఇటూ క్రీగుంట చూసి మళ్ళీ కళ్ళు మూసుకుంటూ ఉంది. దానికెదురుగా బెల్లగువ్వ దిగులుగా ముడుచుకుని కూర్చుంది.

బెల్లగువ్వని చూస్తూ జెముడుకాకి, 'పిడికెడంత లేని ఈ గువ్వగాడు ప్రాణ భయంతో ఇంతదూరం ఎగురుకుంటూ వచ్చాడు. ఇతగాడి జతగుత్తె, పిల్లలు ఎంత తల్లడిల్లుతున్నారో' అనుకుంటూ కళ్ళు మూసుకుంటున్నంతలో...

ఉన్నట్లుండి చీకటిని చీలుస్తూ సన్నటి మెరుపు మెరిసింది. జెముడుకాకి ఉలిక్కిపడి చూపులకి చెట్లకొమ్మలు అడ్డం రావడంతో ఎగిరి పైనున్న మరో కొమ్మకి వాలింది. దాని కళ్ళ ముందు ఆకాశం చిట్టచివర దిగంతంమీద సన్నటి మబ్బుతునక పైకి లేచింది. జెముడు కాకి ముక్కుపుటాలకు చల్లటి గాలి తగిలింది. తెలిసీ తెలియని సన్నటి గాలికి చెట్ల కొమ్మలు ఊగుతున్నాయి.

'బహుశా ఈ రాత్రికి లెక్క తెలుస్తుంది' అని గొణుక్కున్నది జెముడుకాకి.

'లెక్కేంది సావి?' అన్నది బెల్లగువ్వ కళ్ళు తెరిచి.

జెముడు సమాధానం చెప్పకుండా తనలోతాను 'రెండు దినాలుగా మంత్రగాడి బయంలో పడి ఈ గాలిమార్పు తెలవలేదు నాకు. అయినా నేను అనుకున్నది

జరగవచ్చు, జరగకపోవచ్చు. రోహిణి కడకు వచ్చింది. అది తిరగబడితే పెళ్ళున కాచే ఎండ బళ్ళున చల్లబడుద్ది' అనుకుంటూ పైకి చూసింది. కొమ్మల మధ్య నల్లటి ఆకాశంలో చుక్కలు ఒకసారి నిశ్చలంగా నుంచున్నట్లున్నాయి; సమయం గడిచేకొద్దీ మళ్ళీ దిక్కులు మారుస్తున్నట్లున్నాయి.

మాటిమాటికీ నల్లటి ఆకాశంలోకి చూస్తా 'సుక్కలు' అన్నది జెముడు.

'అమాసరోజు చుక్కలేంది సావి?' అన్నది గువ్వ కళ్ళుమూసుకునే. బెల్లగువ్వ కళ్ళు మూసుకుని మగతనిద్రలో ఉండటంతో దానికేమీ కంటబడలేదు.

'అమాసకు ఇంకా రెండు దినాలుందన్నా. ఆ సుక్కలు సూడు. సీకట్లో పొదమాటున సెవలపిల్లుల్లా కూసుని సూస్తన్నట్లు లెవ్వా'

బెల్లగువ్వ ఒక్కసారి కళ్ళుతెరిచి నిక్కిడిచి పైకి చూసి ఏమీ కనపడక నిశ్చింతగా మళ్ళీ కళ్ళు మూసుకుంది.

'సుక్కలు' అన్నది జెముడు మళ్ళీ కిందకు చూసి. బెల్లగువ్వ ఈసారి కళ్ళు తెరవలేదు.

మసక చీకట్లో తెల్లటి చుక్కలు నిదానంగా జరుగుతూ నేలమీద చుట్టుకుంటూ ఉన్నాయి.

జెముడు చూపంతా ఆకాశమ్మీదనే ఉంది. అది దేనినీ పట్టించుకునే స్థితిలో లేదు. ఊరికే ఒక కొమ్మ నుంచి మరోకొమ్మకు ఎగురుతూ చుక్కల్ని గుణిస్తూ ఉంది. మరోపక్క అన్ని దిక్కులనుంచి మబ్బుతునకలు ముక్కలు ముక్కలుగా విడిపోయి మళ్ళీ కలుసుకుంటూ వస్తున్నాయి.

జెముడుకాకి ఒక కొమ్మమీదకు ఎగిరి 'ఎద్దు' అన్నది. మబ్బులు మందలు మందలుగా ఎవరో పిలిచినట్లు తరలిపోతున్నాయి.

'ఈ అడవిలో ఎద్దేంది సావి? ఎప్పుడూ జూళ్ళా! ఏంది సావి దేనికోసం జూస్తండా?' అన్నది బెల్లగువ్వ కళ్ళు మూసుకునే.

'ఎద్దుగాదు మబ్బు. కాదు గొర్రెపిల్ల' అన్నది జెముడు మళ్ళీ చెట్టు కిందకు చూసి. దాని చివరిమాట గువ్వ చెవుల్లో పడలేదు.

నల్లటి, గుండ్రటి మబ్బులు ఒక్కొక్కటే విడిపోతూ, మళ్ళీ కలుస్తూ, అంతలోనే నక్షత్రాలను మింగేస్తూ ఆకాశం నిండా పరుచుకుంటున్నాయి. ఉన్నట్లుండి మళ్ళీ మెరుపు మెరిసింది. మెరుపు వెలుగులో బూడిదరంగు నక్క ఒకటి చెట్టు మొదలు తొర్రలో దూరడం జెముడుకాకి గమనించింది.

‘ఈ జిత్తులమారి నక్క సమయానికి ఎవురో పిలిచినట్లే వచ్చి కూర్చుంటాది!’ అనుకున్నది జెముడు. బెల్లగువ్వ కూర్చునే నిద్రలోకి జారుకుంది.

ఉన్నట్లుండి చీకటిని ఎవరో విరిచినట్లు చటుక్కుమని అడివంతా మెరిసింది.

ఆ తరువాత ధనధనమని వచ్చిన ఉరుములతో అడివంతా దద్దరిల్లింది.

బెల్లగువ్వ గుబుక్కున కళ్ళుతెరిచి అటూ ఇటూ మిటకరించి చూసింది. దాని కళ్ళకి ఒకసారి గాలికి చీకటి ఊగుతున్నట్లు, మరొకసారి చీకటికి గాలి ఊగుతున్నట్లనిపించింది.

‘ఏంది సావి ఈ పిడుగు! పైన రాచ్చసులెవరో కొండపలకలు జరపతా బూమిని చీలస్తా ఉండారు. వాన పడిద్దా ఏంది?’ అన్నది బెల్లగువ్వ కలవరంతో. జెముడుకాకి చిటారుకొమ్మకు ఎక్కినట్లు అది గమనించలేదు. నిద్రమత్తులో వినిపించిన ఉరుముకి అది తత్తరపడి జెముడుకాకి కంటికి కనపడకపోవడంతో చిటారుకొమ్మకు ఎగిరి వెంటనే జెముడుని చేరుకుంది.

సరిగ్గా అదే సమయానికి మబ్బులు మూడు చుక్కల్ని మింగేసాయి. జెముడుకాకి డిగు డిగుమంటూ చప్పుడు చేసింది. అది ఎందుకని చప్పుడు చేసిందో బెల్లగువ్వకు అర్థంకాక జెముడుకాకి వంక తేరిపారచూసింది.

‘అద్గదిగో’ అన్నది జెముడు ఆకాశంవైపు చూస్తూ.

బెల్లగువ్వ పైకి చూసింది. ఏదీ కనపడలేదు. ఎవరో మంత్రమేసినట్లు మబ్బులు తమలోకి తాము చుట్టుకుంటున్నాయి.. సొరంగంలా... గుహ చివర... తలెత్తుతున్న పులి! ఆకాశాన్ని చించుకొస్తున్న మెరుపు. వెలుగు!

ఇంతలో కింద ఏదో చప్పుడవటంతో గువ్వ కిందకు చూసి భయంతో నోరు తెరిచింది.

మెరుపు వెలుగులో ఎటునుంచి వచ్చిందో పెద్దపులి, ఒక పొద పైనుంచి ఒక్క ఉదుటున దూకి నోరు తెరిచి తటాలున గొర్రెపిల్ల మెడను కరుచుకుంది. దాని ఒంటి మీద కరవు ఛాయలు లేవు. బలంగా ధృఢంగా ఉండి మెరిసే పసుపు రంగుపైన నల్లటి చారలతో స్వర్గం నుంచి ఊడిపడినట్లుగా ఉందది.

‘ఇదేంది సావి ఈ గొర్రెపిల్ల యాడ్నించొచ్చింది?’ అన్నది బెల్లగువ్వ ఒణికిపోతూ. దానికి ఈకలు నిక్కబొడుచుకున్నాయి.

‘దేని జాతకం దేనికుందో తెలవదన్నా. కాలం వచ్చిందంటే ఎర దానంతటదే వస్తది. పేడ పురుగువుద్ది. పసుపుగడ్డి పులవుద్ది. మొక్క నక్కవుద్ది. కాలం

కలవాలంతే' అన్నది జెముడు నిర్లిప్తంగా కిందికి చూస్తూ.

బెల్లగువ్వ పులికేసి తేరిపార చూసింది. దానికి పులి ఎక్కడ నుంచి వచ్చిందో అర్థం కాలేదు. కొన్ని గడియల క్రితం జెముడుకాకిని చూసినప్పటి భ్రాంతి దాని కళ్ళకు ఇంకా ఆవరించుకుని ఉంది.

ఒంటి మీద చుక్కలుగల కొండచిలువకు ఏదో దొరికినట్లుగా ఉంది. గబగబ మెలికలు తిరుగుతూ ఉంది.

గొర్రెపిల్ల మెడని ఇంకా తల విదిలిస్తూ కరకరా కొరుకుతూనే ఉంది పులి.

చెట్టు మొదట్లో కూర్చున్న బూడిదరంగు నక్క ఎక్కడ చూసిందో కుందేలుని టక్కన నోటకరుచుకుని చీకట్లోకి పారిపోయింది.

అప్పుడే పైనుంచి ఎవరో ఎత్తిబోస్తున్నట్లుగా ధనధనమని వాన మొదలెంది.

అంతా కన్ను తెరిచి మూసుకున్నంతలోపే జరిగిపోతూ ఉంది.

బెల్లగువ్వ నిర్ఘాంతపోయి చూస్తూ, 'ఇదేంది సావి ఇదంతా! కల మాదిరి... ఏదెక్కడ నుంచి వచ్చిందో తెలవదు. ఇప్పటిదాకా అడివంతా తిరిగి చూసినామా... ఒక్క పురుగన్నా కంటబడ్డదా? నువ్వే చూస్తివి గదా. అదేంది సావి. ఉన్నట్టుండి ఈ జీవాలన్ని ఇక్కడికే వచ్చి వాలాయి. ఆ గొర్రెపిల్ల ఇక్కడుందని నీకూ దెలవదు. నాకూ దెలవదు. ఆ పులికెట్టా తెలిసింది సావి! ఈడ ఏది దేనికోసమొచ్చిందో తెలవదు. ఎప్పుడొస్తదో తెలవదు' అంటూ పక్కకు తలతిప్పి చూసింది బెల్లగువ్వ. అక్కడ జెముడుకాకి లేదు.

బెల్లగువ్వ ఉలిక్కిపడి జెముడుకాకి కోసం కొమ్మకొమ్మకూ తిరిగి చూసింది. అప్పటికే అది వర్షపుధారలమధ్య, చెట్ల కొమ్మల మధ్య నుంచి అంతర్ధానమైంది.

అటూ ఇటూ వెదకి ఇక ఎటూ దారి లేక, 'ఈ జెముడు ఎలా వచ్చినాడో అలానే పోయినాడు. ఈయన ఈ తావుకి వస్తాడని నేను కలగనలేదు. దేని పని అది జేసుకుపోతుందని జెప్పిన జెముడు ఇంత రాత్రివేళ తన పని తను జేయకుండా వెళ్ళిపోతాడని ఊహించనైనా లేదు. ఈ అడివి దాటేదాక ఈయన నాతోనే ఉంటాడనుకున్నా. జెప్పకుండానే పోయినాడు. ఒకటి తలిస్తే మరొకటి జరుగుతా ఉన్నింది. ఈ జీవాలు కాట్లాడుకున్నట్లు ఆయన కూడా తన తిండి కోసం పోయినాడేమో. ఒకానొక ఆపద నించి గట్టెక్కించడానికి ఆ బగమంతుడే నాకు తోడు పంపినాడనుకున్నాను. ఆ సంగతలా ఉంచి ఇక్కడ జరిగినదీ, జరుగుతున్నదీ తెలవదు! అంతా మాయ!' అనుకున్నది బెల్లగువ్వ. ఎడతెరిపిలేని

దాని ఆలోచనలు ఎండుటాకులవలె బలమైన ఈదురుగాలులలో కొట్టుకు పోతున్నాయి.

పైనుంచి ఎవరో నీటిరథంమీద పోతూ మేఘాలను చెర్నాకోలతో అదిలిం చినట్టుగా మళ్ళీ మెరుపు మెరిసింది. చీకటి నోరు తెరచిన వెలుగులో గుయ్యిమనే ఈదురుగాలికి చెట్లు ఊగిపోతున్నాయి. మళ్ళీ మూసుకున్న చీకటిలో పులి గుర్జిస్తున్నట్లుగా ఆకాశం ఉరిమింది. సన్నటి తుప్పర గాలికి చిలికి చిలికి విస్తరిస్తూ ఒకదాని వెంట ఒకటి పరిగెడుతూ ఉన్నట్లు ధనధనమని చినుకులు. నీళ్ళు నృత్యం చేస్తున్నట్లు దబదబమని ఒకటే జడివాన!


బెల్లగువ్వ గబుక్కున అటూ ఇటూ ఎగురుతూ, ఈదురుగాలికి కొమ్మలమధ్య తల దాచుకుంటూ, తడిసిన ఈకలను విదిలించుకుంటూ కలవరపడుతూ ఉండగా చివికిన సన్నటి చెట్లకొమ్మల మధ్యగా రివ్వున వీచేగాలి బెల్లగువ్వను ఎటో ఈడ్చుకుపోయింది.

వాన ధనధనమని నిర్దాక్షిణ్యంగా అడివంతా కురుస్తూనే ఉంది. మబ్బుల రథయాత్ర గుంపులు గుంపులుగా తరలిపోతూనే ఉంది. దట్టమైన వర్షానికి తడిసి చెట్లు బరువుగా వంగినాయి. నిర్విరామంగా రొదచేస్తున్న వర్షపు చినుకులతో ఆ రాత్రంతా గడిచిపోయింది.

తెల్లవారింది. తూరుపు పగిలి ఎర్రటి కన్ను తెరిచింది. నేలలోని చెమ్మని కలుపుకుని కొత్తగాలి పైకిలేచింది.

చెట్టు కొమ్మపైన చిటారుకొమ్మన చివర కొత్తచిగురు తొడిగి చల్లటిగాలికి రివ్వుమని కొట్టుకుంటూ ఉంది.





# నగరంలో వాన

## పూడూరి రాజిరెడ్డి

● రచనా కాలం: 2012

**పూడూరి రాజిరెడ్డి:** సాహితీ ప్రముఖుల ప్రసంశలు పొందుతున్న వర్తమాన రచయిత. కథలు, వ్యాసాలు, వ్యాఖ్యానాలు.. ఏవి రాసినా వచన సౌందర్యం ఉంటుందని గుర్తింపు పొందారు. స్వస్థలం కరీంనగర్ జిల్లా నర్సింగాపురం గ్రామం. వృత్తిరీత్యా జర్నలిస్టు. ప్రస్తుతం 'సాక్షి' దినపత్రిక సాహిత్యం పేజీ నిర్వహిస్తున్నారు. 'మధుపం', 'పలక– పెన్సిల్', 'రియాలిటీ చెక్' వీరి పుస్తకాలు. వయసు 40 సంవత్సరాలు.

ఎంతలో ఎంత మార్పు!

నిన్నటిదాకా 'ఎండలో తిరగొద్దు' అని పిల్లల్ని వారించిన తల్లిదండ్రులు ఇవ్వాళ్టి నుంచి 'వానలో తడవొద్దు' అంటారు. నిన్నటికీ ఇవ్వాళ్టికీ ఏం తేడా ఉందో ఏం ప్రత్యేకంగా జరిగిందో అర్థం కాకుండానే వానాకాలం వచ్చేసింది.

మొన్నటిలాగే నిన్న కూడా ఇక్కడ బాగా వాన పడింది. అందుకే కావొచ్చు ఇవ్వాళ వేకువ మరింత బాగుంది. వాతావరణంలో ఏదో ఒక తేటదనం కనబడుతోంది. గాలిలోకి చల్లదనం వచ్చి చేరింది. హుహుహు. మాయగాలి ఇది. హాయిగాలి కూడా!

మల్లె, గన్నేరు, మందార చెట్లు ఎవరో ఆకూ ఆకూ శుభ్రం చేసినట్టుగా తళతళ లాడుతున్నాయి. కరివేపాకు చెట్టొకటి... గాలి మద్దతు ఉన్న చినుకుల ధాటికి వంగిపోయింది.

వాకిట్లో నిలిచిన నీటిని గృహిణి కిందకు ఊడుస్తోంది. మరో ఇల్లాలు రాబోయే వానను లెక్క చేయకుండా ముగ్గులు పెడుతోంది. రాత్రి నిద్దట్లో పిల్లాడు తడిపిన దుప్పటిని ఒక తల్లి దండెం మీద ఆరేస్తోంది. కొట్టుకొచ్చి ఇంటి ముందర ఆగిన చెత్తాచెదారాన్ని ఏరవేయడానికి వృద్ధ దంపతులు నడుం బిగించారు. వర్షం అన్నింటినీ శుభ్రపరుస్తుందంటారు. నిజమే. కాకపోతే దాని శుభ్రత ఎలా ఉంటుందంటే ఇక్కడ శుభ్రపరిచింది కిందకు వెళ్తుంది, పైన శుభ్ర పరిచింది మనకు వస్తుంది. ఇది మహా తుంటరి.

పిట్టల కోసం పెట్టిన రాగుల ముంతలోని గింజలు కిందకు జారి ఆగిన్నై. దళసరి కాగితం మీద రాసిన 'టు లెట్' బోర్డు తడిచి పడిపోవడానికి సిద్ధంగా

ఉంది.

'మున్సిపాలిటీ చెట్టు' విరగబూసిన ఎర్రటి పూలు కుప్పగా నేల రాలినై; దోసిట్లోకి తీసుకోవాలనిపించేట్టుగా. పక్షుల గుంపొకటి నిశ్శబ్దంగా వెళ్తోంది. వీధిలో నిలిచిన నీటిని తొక్కకుండా ఫుట్‌పాత్ మీద నడుస్తున్నారు పెద్దలు. అదే నీటిని కాలితో తన్ని అలలు లేపుతున్నాడు పిల్లాడు. మూతి మీది నల్లచార కుక్క తెల్ల కుక్కతో సరసం ఆడుతోంది.

ఎలాంటి కాలం ఇది! ఎండిన ఆకుల్ని కూడా చిగురింపజేసే కాలం. శక్తి ఉడిగిన ముసలమ్మను సైతం దవడల వణుకు ద్వారా చైతన్యపరిచగలిగే కాలం. రాళ్లూ రప్పల్లోనూ మొలకలు వచ్చే కాలం. అందరూ ఎదురుచూసిన కాలం. రైతులు భూమిని మరింత ఆత్మీయంగా తడుముకునే కాలం.

ఫోన్ చేస్తే చెబుతున్నాడు బాపు– 'నారు మందం మడి దున్నుడైపోయిందిరా. ఇవ్వాళిక ఎటూ అమావాస్య. రేపు పాడ్యమి. ఎల్లుండి గురువారం నాకు ఘాతవారం. శుక్రవారం నానబోస్త వడ్లు'

ఆకాశం ఏ మర్మాన్ని బయట పడనీయకుండా మౌనంగా ఉన్నట్టనిపిస్తోంది. తేరిపార గనక చూస్తే తెల్లటి దట్టమైన పొగ నెమ్మదిగా కదులుతున్నట్టుగా ఉంది. ఇవ్వాళ కూడా వాన పడుతుందా?

నిన్న సాయంత్రం ఇలాగే చిన్న పని మీద వెళ్తున్నాను.

ఆకాశం ఉన్నట్టుండి మెత్తబడింది. పిల్లాడు తండ్రి డైరీ లాక్కుని అస్పష్ట చిత్రాలు గీసినట్టుగా... మేఘాలు కొత్త కొత్త ఆకృతులు దాలుస్తున్నాయి. నలుపు వర్ణంలోనే ఎన్నో ఛాయలు.

నిర్మాణంలో ఉన్న బిల్డింగు మీద వేసిన గోనెసంచీ ఊగుతోంది. గాలి చెవుల్లో దూరి చక్కిలిగిలి పెడుతోంది. ఏదో అద్భుతం జరగబోతున్నట్టుగా ఉంది. ఇలాంటి వాతావరణంలో మనం ఎవరినైనా క్షమించేయొచ్చు.

ఎక్కడి నుంచో తొలి చినుకు చేయిని తాకింది. అయితే, వర్షం పడేట్టుగానే ఉంది. తొందరపాటు చినుకులు కొన్ని చిటపటమని మీద రాలినై. నిజంగానే అద్భుతం జరగబోతోంది. వాన కురవడంకన్నా అద్భుతం ఏముంటుంది!

ముందు జాగ్రత్తగా సెల్లు, డబ్బులు, కాగితాలు కవర్లో చుట్టి, జేబులో భద్రంగా పెట్టుకున్నాను.

జనంలో కదలిక మొదలైంది. వర్షం పడేలోగా ఇళ్లకు చేరుకోవాలన్న ఆత్రం

కనబడుతోంది. అయినా వాన అందుకుంది.

జోరు వాన! హోరు వాన! భోరుమనే వాన!

మొగ్గలుగా ముడిచివున్నవి కాస్తా పూవుల్లాగా గొడుగులు విప్పుకోవడం ప్రారంభమైంది.

దార్ల వెంబడి ఒక క్రమం ఏదో చెదిరిపోయినట్టు, లేదా కొత్త క్రమం ఏర్పడినట్టు, ఏదో ఒక భయం వల్ల మనుషులు ఒదిగి ఒదిగి నడుస్తున్నట్టుగా ఉంది. వాహనాలు నెమ్మదిగా వెళ్తున్నాయి. రోడ్ల మీద నీరు నిలువ కావడం ప్రారంభించింది.

చెట్ల కింద మనుషులు గుమిగూడుతున్నారు. దుకాణాల అరుగుల వెంబడి తలదాచుకుంటున్నారు. రెయిన్ కోట్లు, టోపీలు తమ ఉనికిని చాటుకుంటున్నాయి. చేతుల్తో ముఖాన్ని తుడుచుకున్నట్టు కారు వైపర్స్ అద్దాల్ని తుడుస్తున్నాయి. తడవడం తప్పదని తెలిసీ కొందరు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

'ఇక తడుద్దాం' అని సిద్ధపడ్డాక పెనుగులాట ఉండదు. అందుకే తడుస్తున్నాను. చినుకుల్ని ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాను. ఎలాంటి వాన ఇది!

ఒక్కోసారి కొత్తగా కళ్లాపి జల్లడం నేర్చుకుంటున్న కన్నెపిల్ల నీటిని అసమంగా చిలకరించినట్టుగా కొడుతోంది. ఇంకోసారి చినుకుల్లో సూదుల్ని జారవిడుస్తోంది. మరోసారి పూవుల్ని జల్లినట్టుగా సుతిమెత్తగా తాకుతోంది. ఇంకొకసారి గచ్చకాయల్ని తల మీద ఎగరేస్తోంది.

ప్యాంటు కొనలు తడుస్తున్నాయి. అమ్మాయిలు చున్నీలు కప్పుకుని నడుస్తున్నారు. ఒకావిడ బొట్టు నీటిలో కరిగిపోతోంది. బండి మీది నుంచి ఒక ప్యాకెట్ జారిపడింది. ఒకతను తీసిచ్చాడు. తడిచిందా అని చూసుకుంటూనే కృతజ్ఞతా నవ్వు.

బస్సుల అద్దాలు బిగుసుకున్నాయి. మనిషి ఖాళీ చేసిన సీట్లో ఇప్పుడు వెచ్చగా కూర్చోవచ్చు.

కొబ్బరికాయొకటి దబ్బుమని నేలకూలింది. చెట్టుకున్న చివరి మామిడికాయ పుటుక్కున తెగిపడింది. చలివేంద్రంలోని మట్టి కుండలు బోసిపోయి ఉన్నాయి. మట్టికుండల అవసరం తీరిపోయింది. తీరిపోయిందా?

కుక్క ఒకటి వెచ్చటి తావు కోసం వెతుక్కుంటోంది. మిర్చీ బజ్జీలు వేగుతు

న్నాయి. వేడి ద్రవాలు వెచ్చగా గొంతుల్లోకి వెళ్తున్నాయి. పొద్దున్నే తీగ మీద మంచు కురిసినట్టు, నీటి బిందువులు వాళ్ల తలల మీద.

చెత్త కుండీ తడిసి దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాపులో భిక్షకుడు బీడీ వెలిగించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. చక్రాలబండిలో అల్లనేరేడు పళ్లు తడుస్తున్నాయి. భవంతి పైపు నీటిని జారవిడుస్తోంది. పిల్లాడొకడు వాటి కింద చేయిపెట్టి ఆడుతున్నాడు.

గాలి మరింత వీస్తోంది. ఈ చెట్లు కొమ్మలు ఊపుతూ ఏం మాట్లాడుకుంటాయి? నిర్దయగా కురిసిందనా? ఇప్పటికైనా కురిసిందనా?

ఇంతలో... చరచర చరచర చరచర... అర్జునా ఫల్గుణా!

ఏం శబ్దం అది! భూమి గుండె పగిలే శబ్దం. వీరుడి వెన్నుని సైతం జలదరింపజేసే శబ్దం. యుద్ధం చేస్తున్నవాడు కాసేపు కత్తి తిప్పడం మరిచిపోయే శబ్దం. కరుణామూర్తి కంట కనబడిన తీవ్రమైన ప్రకోపం. ఎక్కడ పడివుంటుంది? ఎవరికి ఏమైవుంటుంది?

చిగురుటాకును మంటల్లో వేసినట్టు, పాలుతాగే పసివాణ్ని పాతిపెట్టినట్టు... నేనైతే ఎప్పటికీ మరిచిపోలేని శబ్దం.

ఇలాంటి ఒక పిడుగుపాటుకే మా కొత్తోళ్ల సత్యం బలైపోయాడు. ఇంకా కౌమారం కూడా దాటనివాడు, అయినా ఇద్దరు అన్నలను పక్కన పెట్టి పని చేయగలిగే శక్తి ఉన్నవాడు. వాన కురిసింది. వెలిసింది. ఇక బర్రెకు గడ్డి కోసుకొద్దామని వెళ్లాడు. అంతే. చరచరచర... మోసపు యమఘోష... సకల చరాచరాన్ని భీతిల్లజేసే కఠోర ధ్వని. రెప్పనిమిషాల క్రితం ఉన్నాడు. ఇప్పుడు లేడు. మసైపోయాడు. కన్నీరు, వాననీరు కలిసిపోయే జ్ఞాపకాలు!

ప్రకృతి మంచిది కాదు, చెడ్డది కాదు. అది ప్రకృతి. అదే దాని ప్రకృతి. అయినా ఏడవడం మన ప్రకృతి.

ఆగినట్టుగా కనబడుతూ, మళ్లీ ఉధృతమవుతూ, సమస్త వ్యవహారాలు కట్టిపెట్టి, నన్ను మాత్రమే చూడమన్నట్టుగా వాన పడుతోంది, కొడుతోంది, కురుస్తోంది, నీటిని గుమ్మరిస్తోంది.

ప్యాంట్లు పైకి లేపుకుంటూ, కుచ్చిళ్లు దోపుకుంటూ, చేతిరుమాళ్లు కప్పుకుంటూ, కాగితాల్ని పొట్ట కింద దాచుకుంటూ, పిల్లల్ని పొదువుకుంటూ, 'వర్షంలో ఉన్నాను' అని జవాబిచ్చుకుంటూ, బళ్లను నిలుపుకుంటూ, కాసింత

చోట్లోనే శరీరాల్ని సర్దుకుంటూ, భుజం భుజం రాసుకుంటూ, చేతులు ముడుచుకుంటూ, నవ్వుకుంటూ, తుళ్లుకుంటూ... పిల్ల, పెద్ద, వయసు, ముసలి, లేమి, కలిమి, సన్నం, లావు, పొట్టి, పొడుగు, ఆడ, మగ... ఆగుతూ, వెళ్తూ, ఆగాలా వెళ్లాలా అని సంశయిస్తూ, కాళ్లల్లో బరువుతనాన్ని అనుభవిస్తూ... కొంత తడిచి, మొత్తం తడిచి, భుజాల వరకు తడిచి, తలమాత్రం తడిచి, తడవాలనుకొని తడిచి, తడవకూడదనుకున్నా తడిచి...

చక్రాలబండిలో అడుక్కుంటున్న అమ్మా మనవరాళ్లు పూర్తిగా తడిసిపోయారు. నిలువెల్లా తడిసిపోయిన ఒకమ్మాయి కురుల్లోంచి నీరు కారుతోంది.

ఈ వానచినుకులు మేఘంలోంచి జారుతున్నాయా? ఈమె శిగలోంచా?

నేను కూడా పూర్తిగా తడిసిపోయాను. తనువెల్లా తడిసి ముద్దయ్యాను. నిలువెల్లా జలాభిషేకం చేయించుకున్నాను.


ఇంటికొచ్చి, స్నానం చేసి, పొడి బట్టలు మార్చుకుని, వేడి వేడి టీ గొంతు దింపుకుంటూ, కిటికీ పక్క నిల్చుని వానని మరో కోణంలో దర్శిస్తూ...

ఇది రుషులు కార్చిన కన్నీరు కావొచ్చు, మన తాతముత్తాతల ఆనందాశ్రువులు కావొచ్చు, శ్రమదేవతల స్వేదబిందువులు కావొచ్చు, భూమ్యాకాశాల సంగమ ఫలితంగా పుట్టింది కావొచ్చు, ఇది రంగూ రుచీ వాసనా లేని ఒక మామూలు ద్రవపదార్థమే కావొచ్చు...

ఏమైనా...

ఇది కుంట. ఇది చెరువు. ఇది నది. ఇది సముద్రం. ఇది పాట. ఇది తోట. ఇది నృత్యం. ఇది మర్త్యం. ఇది నెమలి. ఇది కమలి. ఇది చిత్తడి. ఇది మత్తడి. ఇది పాడి. ఇది పంట. ఇది వెలుగు. ఇది చీకటి. ఇది పుట్టుక. ఇది చావు. ఇది అమృతం. ఇది సమస్తం. ఇది వర్షం. మన హర్షం.





# ఒక సాయంత్రపు అదృష్టం

## మహమ్మద్ ఖదీర్‌బాబు

● రచనా కాలం: 2010

**మహమ్మద్ ఖదీర్‌బాబు:** స్వస్థలం నెల్లూరు జిల్లా కావలి. 'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు', 'న్యూ బాంబే టైలర్స్', 'బియాండ్ కాఫీ' తదితర పుస్తకాలు వెలువరించారు. బాల సాహిత్యంలో 'పుప్పుజాన్ కతలు', సినీ సాహిత్యంలో 'మన్ చాహే గీత్', 'బాలీవుడ్ క్లాసిక్స్' ఉన్నాయి. తెలుగు కథకు సంబంధించి 'నూర్రేళ్ల తెలుగు కథ', 'కథలు ఇలా కూడా రాస్తారు' గ్రంథాలు పాఠకుల గమనింపును పొందాయి. తాజాగా మెట్రో నగర జీవనంపై 'మెట్రో కథలు' కథనం చేశారు. వృత్తి రీత్యా జర్నలిస్ట్. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వయసు 44 సంవత్సరాలు.

నదులు ఎండిపోయాయి. అడుగున ఉన్న చేపలు పొట్ట నీలుక్కుని బురద మీద పైకి తేలాయి. అడవులు చాలా మటుకు తగలబడ్డాయి. సముద్రాలు పొర్లుకొచ్చి నేలను చేతులతో కమ్ముకున్నాయి. అదుపు చేయలేని క్రిమి ఏదో సోకి మను షులు కుప్పలు తెప్పలుగా రాలిపోయారు. ఏ కారణం చేతనో ఒక తల్లి తన బిడ్డల గొంతు నులిమి ఆత్మహత్య చేసుకుంది. ప్రాణస్నేహితుడొకడు చెప్పా పెట్టకుండా ఆ పూట యాక్సిడెంట్‌లో ప్రాణాలు వొదిలాడు. చుట్టూ మబ్బుపట్టిన చీకటి. మసక. ప్రాణవాయువు రెపరెపలు లేని నిశ్వాసల గాలి.

ఇంకా ఏం మిగిలింది ఈ సాయంత్రానికి అనిపించింది అతనికి.

కాదు. ఇంకా ఈ ఒక్క సాయంత్రమే మిగిలింది బతకడానికి అని అనిపిం చింది అతనికి.

టైమ్ చూసుకున్నాడు. ఆఫీసు ముగియడానికి యింకా సమయం ఉంది. రోజూ అతడు ఆఫీసు సమయం కంటే ముందే వస్తాడు. రోజూ అతడు ఆఫీసు సమయం అయిన చాలాసేపటి తర్వాతే ఇంటికి బయలుదేరుతాడు.

ఇవాళ– 'చేసింది చాలు' అనుకున్నాడు. మిగిలిన ఈ ఒక్క సాయంత్రాన్ని ఈ ఒక్క సాయంత్రం మొత్తాన్ని బతికేస్తే చాలు అనుకున్నాడు.

బాస్ దగ్గరకు వెళ్లి 'సార్. పనుంది. వెళుతున్నాను' అన్నాడు.

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అతడు అలా అడగడం అదే మొదలు.

బాస్ అతడి వైపు చూశాడు.

'ఉండు' అన్నా వెళ్లిపోతాడు.

'వెళ్లు' అన్నాడు.

అతడు బ్యాగ్ సర్దుకున్నాడు. అంతవరకూ నిరాసక్తిగా వదిలేసిన టక్‌ను సరిచేసుకున్నాడు. రెస్ట్‌రూమ్‌కి వెళ్లి చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని టిష్యూ పేపర్‌తో కళ్లు నుదురు చెంపలు పొడిగా తుడుచుకున్నాడు. తల దువ్వుకుని అద్దంలో చూసుకున్నాడు. బాగున్నాను సంతోషంగా ఉన్నాను అని నవ్వుకొని ఆ నవ్వును పరిశీలించుకున్నాడు. బ్యాగ్ భుజాన వేసుకొని బైక్ స్టార్ట్ చేశాడు.

బైక్ ముందుకు వెళుతూ ఉంది.

అతడు గతాన్ని వెనక్కు వదిలేస్తూ ఉన్నాడు.

గతంలో అతడు చాలా బాధలు పడ్డాడు. నగరానికి వచ్చిన కొత్తల్లో ఉద్యోగం దొరక్క చాలా అవస్థలు పడ్డాడు. తినడానికి తిండి లేకపోతే పక్క రూమ్ వాళ్లు తాళం ఎక్కడ దాచుకుంటారో జాగ్రత్తగా కనిపెట్టి వాళ్లులేని సమయంలో ఆ తాళం తీసి వాళ్లు వొండుకున్నది దొంగిలించి తిని నిద్రపోయాడు. ఊళ్లో ఉన్న అమ్మా నాన్నలతో ఫోన్ మాట్లాడి చాలా రోజులు అయ్యిందనుకున్నప్పుడల్లా పరిచయస్తుల ఇంటికి వెళ్లి వాళ్లకు ఆ కబురూ ఈ కబురూ చెప్పి వీలైతే మాటలతో నవ్వించి ఒక ఫోన్ చేసుకోమంటారా అని అడిగి వాళ్ల ఖర్చుతో మాట్లాడి రూమ్ దారి పట్టేవాడు. దోమలు పైకి రేగే నల్లటి సాయంత్రాల్లో అతడు మంచి మంచి రోజులను కలలుగనేవాడు. రాబోయే ఆ రోజులను తలుచుకొని వాటి కోసం ఎదురు చూసేవాడు. రాబోయే రోజులు, మంచి ఉద్యోగం వచ్చేరోజులు, జీతం పెరిగే రోజులు, మంచి అమ్మాయి దొరికి పెళ్లి జరిగే రోజులు పిల్లలు పుడితే వారిని బైక్ మీద కూర్చోబెట్టుకొని షికారు తిరిగే రోజులు... అవన్నీ తన ఊహకు తగినట్టుగా తలుచుకొని మురిసిపోయేవాడు.

ఆ రోజులన్నీ వచ్చాయి.

కాని, అతడు ఆ రోజుల్లో ఉండేవాడు కాదు. వీలైతే వాటికి ముందు ఉండేవాడు. లేదంటే వాటి వెనుక.

ఏ రోజుల్లో అయితే తాను సంతోషం పొందుతానని అనుకుని వాటి కోసం ఎంతకాలంగా అయితే ఎదురు చూశాడో ఎన్ని సంవత్సరాలుగా అయితే ఎదురు చూశాడో ఎన్ని యుగాలుగా అయితే ఎదురుచూశాడో ఆ సంతోషం దక్కుతున్న క్షణాల్లో అతడు ఉండకుండా ఆ సంతోషాన్ని విస్మరించేవాడు.

పెళ్లి జరిగిన రోజు ఆ వెంటనే తీసుకోవాల్సిన అద్దె ఇల్లు దిగులు. ఉద్యోగం వచ్చిన రోజు ఇంకా పెరగవలసిన జీతం దిగులు. బిడ్డ పుట్టిన క్షణాన ఆ బిడ్డ

ఆరోగ్యానికి  చెందిన దిగులు. భార్య సమక్షంలో ఉన్న క్షణాన రేపు ఎలా అనే దిగులు. అతడు ఎప్పుడూ రాబోయే రోజుల్లో ఉన్నాడు. గడుస్తున్న రోజులో లేడు.

తొలి కాన్పు. కూతురు పుట్టింది. పుట్టగానే కళ్లు రెండూ తెరిచి తండ్రిని మిట కరించి చూసి అంతలోనే ఆవలించి ఆ వెంటనే ఏడ్చి గుప్పిళ్లు బిగించి నిద్ర పోయింది.

అతడు కాసేపే ఆ అద్భుతమంతా చూశాడు.

ఆ వెంటనే మనోవేగంతో మరుసటి రోజు చెల్లించవలసిన హాస్పిటల్ బిల్లు గురించి ఆలోచించాడు. ఆఫీసులో మరి రెండు రోజుల లీవు శాంక్షన్ అవుతుందో లేదోనని దిగులు పడ్డాడు. తల్లి కోరినట్టుగా సొంత ఊళ్లో కాన్పు చేయించనందుకు ఆమె ఏమైనా అనుకొని ఉంటుందా అని క్షోభ పడ్డాడు. ఇక్కడే ఉన్న చెల్లెలు ఇంకా చూడ్డానికి రాలేదేమిటా అని ఆందోళన చెందాడు. మొత్తం మీద తన కళ్ల ఎదురుగా తన శ్వాస ఎదురుగా తన స్పర్శ ఎదురుగా తన సమస్త ఉనికి ఎదు రుగా ఉన్న మనోహరంగా నిద్రిస్తూ ఉన్న తన పాపాయి దగ్గర మాత్రం లేడు.

ఆ క్షణాలు మళ్లీ వస్తే ఎంత బాగుండో కదా అనుకున్నాడతడు బైక్ నడుపుతూ. అవి రావు. వచ్చినప్పుడు? అతడు వాటి దగ్గర లేడు.

ఈ సాయంత్రం అలా కాదు అనుకున్నాడతడు.

ఆ మాట చాలా గట్టిగా అనుకున్నాడతడు.

ఈ ఒక్క సాయంత్రమే మిగిలింది. నా దగ్గర కేవలం ఈ ఒక్క సాయంత్రమే మిగిలింది. రేపు లేదు. జీవించడానికి  రేపు సాయంత్రం లేదు. అసలు బతకడా నికి మరు నిమిషమన్నదేలేదు. అలా గడిపేయాలి అని అనుకున్నాడతడు.

చినుకులు మొదలయ్యాయి.

అవి పైనుంచి సమయం చూసుకొని కురవడానికి సిద్ధపడినట్టుగా మొదల య్యాయి.

అతడు వాటిని చూసి– ఇది నగరాన్ని అతలాకుతలం చేసే వాన అని అనుకున్నాడు. అంతలోనే– కాదు– ఇది ఏ మంచికో కురుస్తున్న వాన అని మాట మార్చుకున్నాడు.

దారిలో ఒక పశువు జగత్తంతా మరిచి చాలా రోజులు అయ్యింది స్నానం చేసి అన్నట్టుగా కదలక మెదలక ఆ చినుకుల్లో అలా తడుస్తూనే ఉంటే అతడు

ఒక క్షణం బైక్ ఆపి చినుకు తాకినప్పుడల్లా రెప్ప వేస్తున్న ఆ పశువు కళ్లలోని సౌందర్యాన్ని చూస్తూ గడిపాడు.

చొక్కా పలుచగా తడిచింది.

అతడు కంగారు పడలేదు.

తడిచిన చొక్కా ఛాతీని అంటుకోవడంలోని హాయిని అలాగే ఉండి మనస్ఫూర్తిగా అనుభవించాడు. తల తడుస్తున్న అనుభూతిని తల తడుస్తున్నదా అని గమనిస్తూ అనుభవించాడు. చెప్పులు తడుస్తూ ఉంటే అయ్యో లెదర్ పాడవు తోందే అని అనుకోక చెప్పులు తడవకపోతే ఇంట్లో ఉన్న ఇనుప బీరువా తడుస్తుందా అని నవ్వుకున్నాడు. ఆ చెప్పులు ఇవాళ ఉన్నాయి. రేపు తెలియదు. వాటికి ఇవాళ ఇలా వానలో తడవడమే ధన్యత అని అనుకున్నాడు.

ఆ క్షణంలో అతడు సంపూర్ణంగా ఒకవాన చుక్కలా మారిపోయాడు. అతడూ వానా ఒకటి. వానా అతడూ ఒకటి. వాన తాకే అనుభవాన్ని అతడు సంపూర్ణంగా అనుభవించాడు. ఇక మరి కొన్ని యుగాల వరకూ వాన అతణ్ణి తాకక పోయినా ఆ వెలితి అతడు అనుభవించడు.

టీ తాగాలనిపించింది. ఇరానీ చాయ్. బ్యాచిలర్‌గా ఉండగా జేబులో పది రూపాయలుంటే రోజంతా ఇరానీ కేఫ్‌లోనే గడిచిపోయేది. అక్కడే కూర్చుని టీల వెంట టీలు తాగుతూ గడిపేసేవాడు. ఆకలి వేస్తే ఆకలి కడుపును కాల్చేస్తున్నదా అని అనిపిస్తే ఆరు రూపాయలకు దొరికే దాల్ రైస్‌ను ఆరగించేవాడు. అక్కడ ఉన్నంత సేపూ అతడికి ఈ లోకంలోని చైతన్యంతో కలిసిపోయినట్టుగా అనిపించేది. తన మనుషుల మధ్య ఉన్నట్టుగా అనిపించేది.

అక్కడ కూర్చుని అతడు వచ్చేపోయే వాళ్ల చేతులను గమనించేవాడు. పని చేసి సిమెంటు కడుక్కొని ఆ పొరలు అలాగే ఉన్న చేతులు, వేళ్లకు సైకిల్ తాళాలు గుచ్చుకొని వాటిని వేగంగా కదిలిస్తూ సంభాషణలు జరిపే చేతులు, టీలు వొంపు కుంటూ వొంపుకున్న టీను పంచుకుంటూ ఆత్మీయంగా కరచాలనం చేసుకునే చేతులు... ఆ స్పర్శతో తాను అనుసంధానం అయి ఉన్నట్టుగా అనుకునేవాడు.

కాని, ఆ చేతులు వదిలి చాలా కాలమయ్యింది.

ఇవాళ వాటిని తిరిగి పట్టుకోవాలి అని అనుకున్నాడతడు.

టీ వచ్చింది. అలవాటైన సిగరెట్ పొగల పాతవాసన మళ్లీ కమ్మేసింది. టీతోనే కడిగారా అనిపించే సాసర్‌ల ముదురుగోధుమ వర్ణపు సౌందర్యం చేతులను

తాకింది. మాసిన టేబుళ్ల మీద మాసిన జ్ఞాపకాల చెమ్మ.

ఫోన్ తీశాడు. స్క్రీన్ మీద గమనిస్తూ గ్యాలరీలోకి వెళ్లాడు. ఇమేజెస్‌ను తెరిచి బొటన వేలితో నొక్కుతూ స్నేహితుడి ఫొటో ఓపెన్ చేశాడు. రింగుల రింగుల జుట్టుతో పలుచటి మీసాలతో డొప్పల వంటి చెవులతో 'ఒరే.. నేను నీ ఫ్రెండ్‌ని రా' అని అనిపించేటట్టుగా చూడరా నేను  సాధించాను అని అన్నట్టుగా ఊళ్లో కొత్త ఇంటి ముందు నిలుచుని సంబరంతో తీయించుకొని మూడు నెలల క్రితం స్నేహితుడు పంపిన ఫోటో.

గృహప్రవేశానికి వెళ్లలేకపోతే ఏమాత్రం నొచ్చుకునే మాటలు మాట్లాడక సరేరా... ఫొటో అన్నా చూడరా అని సెల్ నుంచి సెల్‌కు పంపిన ఫొటో.

వాడికి ఇల్లు కట్టుకోవాలని కల. రెండు జతల బట్టలతో మొత్తం డిగ్రీ అంతా చదివేసినప్పటి నుంచి ఉన్న కల. అది వాళ్ల నాన్న కోసం వాడు కన్న కల. ఒకరోజు వాళ్ల నాన్న చనిపోయాడు. పేదరికం. అద్దె ఇళ్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన చిన్నజీవితం. కాని, హాస్పిటల్ నుంచి శవాన్ని ఇంటికి తేవడానికి వీల్లేదు అన్నాడు ఓనర్. ఆ మైల మాకు అంటడానికి ఏ మాత్రం వీల్లేదుఅని ముందే చెప్పేశా డతడు.

అప్పుడు కూడా ఇలాగే వాన.

షామియానా వేసి వీధిలో శవాన్ని పడుకోబెడితే వాన పెరిగి పెద్దదయ్యి శవం ముద్దముద్దగా తడిసిపోయింది.

అప్పుడు వాడు చిన్నవాడు. లోకం మంచి చెడ్డలు తెలియనివాడు. హఠాత్తుగా తండ్రి చనిపోతే దిక్కుతోచక ఉన్నవాడు. అలాంటి వాడు తండ్రి శవం దగ్గర నిలబడి వీధిలో నుంచి పారుతున్న వర్షం నీటికి శవం ఉన్న బల్ల కదిలిపోతుందే మోనని అది కదలకుండా గట్టిగా పట్టుకొని గుండెలవిసేలా ఏడ్చాడు.

ఆ తర్వాత శాశ్వతంగా వాడు ఆ రోజులోనే ఉండిపోయాడు.

ఎలాగైనా ఇల్లు కట్టుకోవాలి. సొంత ఇల్లు కట్టుకోవాలి. నేను పోతే నా శవం వీధిలో పెట్టి తడవకుండా చూసుకునే బాధ నా వాళ్లు పడకుండా ఉండాలి. అందు కోసం వాడు పరుగు పెడుతుండేవాడు. సాయంత్రం వరకూ టీచర్ పని. ఆ తర్వాత పాలసీల పని. ఆ పైన రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగుందని ఆ బ్రోకర్ పని. అలా వాడు ఎప్పుడు చూసినా రాబోయే రోజులు అందుకోవడానికి తాపత్రయ పడుతుండేవాడు. అంత వేగంగా వెళ్లి ఆఖరుకు మళ్లీ గతంలోనే తేలుతుండేవాడు. వాళ్ల నాన్న శవం వానకు తడిసిన రోజులోనే నిలబడి ఉండేవాడు. ఇవాళ ఇల్లు

సాధించేశాడు. వాడు అనుకున్నది సాధించేశాడు. కాని– వాడే లేడు. వాడు గతంలో గడిపిన రోజులకు లేడు. భవిష్యత్తులో గడపాలనుకున్న రోజులకు కూడా లేడు.

వాన పెద్దదయ్యింది.

స్నేహితుడి భార్యకు ఫోన్ చేసి పలకరించాలనిపించింది.

నోరారా అన్నయ్యా అని పిలిచే స్నేహితుడి భార్య.

ఆమె ఏడుస్తుందనుకున్నాడు.

'అవునన్నయ్యా. పొద్దున జరిగింది. లారీ గుద్దేసి ఉండొచ్చని అంటున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రాణం పోయింది. బాడీని ఎక్కువ సేపు ఉంచడం మంచిది కాదంటే రాత్రికే ఎత్తుబడి పెట్టుకున్నాము' ఆమె గొంతు శీతలంగా వినిపించింది.

'పిల్లలు ఎలా ఉన్నారమ్మా'

'వాళ్లకు ఏం తెలుస్తుంది అన్నయ్యా. ఏదో తెలిసీ తెలియక ఏడుస్తున్నారు. ఇద్దరు రత్నాల్లాంటి పిల్లలు గదా. వాళ్లతో అయినా సరిగ్గా గడిపి పోయాడా ఆ మనిషి'

అతడు ఏం మాట్లాడకుండా ఫోన్ పెట్టేశాడు. ఏడుపు వస్తుంటే ఏడుపు రాకుండా ఉండేలా ప్రయత్నించి టైమ్ చూసుకున్నాడు.

ఆరు.

కాని మబ్బులు ముంచుకొచ్చి నలుపు కమ్ముకొచ్చి ఏడైనట్టుగా అనిపిస్తోంది.

వాన– కాలాన్ని ముందుకు నెట్టేసిందా అని అతడికి అనిపించింది. మళ్లీ టైమ్ చూసుకున్నాడు. టైమ్ లేదు. మిగిలింది ఈ సాయంత్రమే. రేపు లేదు. అసలు మరునిమిషమే లేదు.

అలా అనుకుంటూ చుట్టూ చూశాడతడు.

వానలో నుంచి వీధిలో నుంచి చుట్టూ ఉన్న పరిసరాల్లో నుంచి ఆ మొత్తంగా కనిపిస్తున్న దృశ్యంలో నుంచి అంతా పరికించి చూశాడతడు. మనుషులు. ఆదుర్దా ముఖాల మనుషులు. అమాయక ముఖాల మనుషులు. హడావిడి ముఖాల మనుషులు. పాపం పుణ్యం ఎరగని మనుషులు. కళ్ల నిండా కలలు నింపుకున్న మనుషులు. నవ్వుతూ తుళ్లుతూ ఉన్న మనుషులు. భారంగా కనిపిస్తున్న మనుషులు. తేలిగ్గా సాగిపోతున్న మనుషులు. అందంగా అనాకారిగా పొట్టలు ముందుకు తోసుకువచ్చి చెక్కిళ్లు నునుపుదేలి రంగు రంగుల బట్టల్లో రకరకాల

గమ్యాలతో... బస్సులలో కార్లలో టూ వీలర్ల మీద... గొడుగులు వేసుకొని... కర్చీఫ్‌లు కప్పుకుని... తలలకు చేతులు అడ్డం పెట్టుకొని.

తాను ఈ అనంత చైతన్యమంతటిలోఒక భాగం కదా అని అనిపించింది అతనికి. తనకు ఈ అనంత చైతన్యపు తోడు ఉంది కదా అని అనిపించింది అతనికి. తాను ఈ క్షణంలో ఈ అనంతచైతన్యంతో అనుసంధానమై సజీవంగా ఉన్నాను కదా అని సంతోషం కలిగింది అతడికి.

బైక్ స్టార్ట్ చేశాడు. పూలు గుర్తుకొచ్చాయి. అమీర్‌పేట చౌరస్తాలో ఎప్పుడూ పూలు ఉంటాయి. వెదురు బుట్టల్లో మాలలను బయటకు జారవేసి వాటిని అమ్ముతూ ఉంటారు.

భార్యకు మల్లెపూలంటే ఇష్టం.

'అప్పుడప్పుడైనా వాటిని తెస్తూ ఉండండి' అంటుంది అతడితో.

అతడు తేవాలనే అనుకుంటాడు.

కాని గుర్తు ఉండదు.

ఆ మల్లెల బుట్టలను దాటి వెళుతున్నప్పుడు అతడు ఆ మల్లెల బుట్టల దగ్గర ఉండడు. ముందు ఉంటాడు. రేపు ఉదయం చెల్లించవలసిన పాలసీ ప్రీమియం దగ్గర ఉంటాడు. మరునాడు ఆఫీసులో చేయవలసిన పని దగ్గర ఉంటాడు. లేదంటే అంతకు ముందే తాను దాటి వచ్చిన విశాలమైన పిరుదుల స్త్రీతో రతీక్రీడలో ఉంటాడు. ఆమె వొంటి మీద ఒక్క వస్త్రాన్ని కూడా లేకుండా చేసి పండు మిరప రంగు గోళ్లతో ఉన్న ఆమె పాదాలను నడుము చుట్టూ చుట్టుకొని....

అప్పటికి బుట్టలు దాటేసి ఉంటాడు.

ఇంటికి వెళ్లాక అయ్యో మర్చిపోయానే అని నొచ్చుకుంటాడు.

ఆమె అప్పుడు అతణ్ణి మామూలుగా చూస్తుంది.

కాని– 'ఆ మాత్రం సంతోషపెట్టవు కదా' అని చూసిందేమో అని అతడు బాధ పడతాడు. ఆ సాయంత్రమంతా అలా బాధ పడుతూనే ఉంటాడు. ఆ సాయంత్రమూ ఆ బాధా సమానం. ఆ సాయంత్రం ఆ బాధలో కొట్టుకొని పోతుంది. అది మళ్లీ రాదు.

ఇవాళ అలా కాదు అని అనుకున్నాడతడు.

అందుకే ఆ బుట్టల దగ్గరకు వచ్చేసరికి అతడు పూర్తి స్పృహలో ఉన్నాడు. ఆ బుట్టల మీదుగా వ్యాపించి ఆ చుట్టుపక్కల గాలితో కలిసిపోయి ఆ ఆవరణా

న్నంతా పవిత్రం చేస్తున్న ఆ పూల పరిమళాలను తాకే స్పృహలోనే ఉన్నాడు. వానకు తడిసిన పూలు... వాన చినుకులతో తమ పై సోకిన దుమ్మును ప్రక్షాళనం చేసుకున్న పూలు... వానలో తడవడం వల్ల ఒళ్లు త్వరగా విరుచుకొని మరింత పరిమళం వెదజల్లుతున్న పూలు... అతడు వాటిని అందుకున్నాడు. ఆ క్షణంలో అతడు పరిమళం అయ్యాడు. ఆ క్షణంలో అతడు పరిమళంలోని సంపూర్ణత్వం అయ్యాడు. ఆ క్షణంలో అతడే పువ్వుగా మారిపోయాడు. ఇక కొన్ని యుగాల పాటు ఏ పూల పరిమళం తాకకపోయినా ఆ వెలితి అతడికి అంటదు.

ఇల్లు వచ్చింది.

సెల్లార్‌లో బైక్ పార్క్ చేసి థర్డ్ ఫ్లోర్‌లోఉన్న ఫ్లాట్‌కి మెట్ల మీదుగా బయలు దేరాడు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండగానే పాప కేరింతలు వినిపించాయి. సంగీతంలాంటి కేరింతలు పాటల్లాంటి కేరింతలు సంతోషాన్ని విసిరేస్తున్నట్టున్న కేరింతలు... వానకు కళ తెచ్చుకుని పాప కొడుతున్న ఆ కేరింతలన్నింటినీ అతడు మనసారా విన్నాడు. చాలా సంతోషంగా విన్నాడు. వింటూ గబగబా పైకి నడిచాడు.

పాప ఆశ్చర్యపోయింది.

ఆ సమయంలో అతడు ఇంటికి రావడం చూసి భార్య కంగారుగా ఆశ్చర్యపోయింది. ఇక అతడి చేతిలో ఉన్న పూల పొట్లం చూసి ఆమె మాటలు తడబడింది.

'పాపా... పాపా' నవ్వుకుంటూ ఎత్తుకున్నాడతడు.

అప్పుడే వేణ్ణీళ్లతో స్నానం చేసి రెండుజడలు చుట్టుకొని మెత్తటి నైట్ డ్రస్ తొడుక్కుని బుగ్గన కాటుక చుక్క పెట్టి కళ్లలో దీపాలు ఉన్నాయా అన్నట్టుగా చూస్తున్న ఐదేళ్ల పాప.

అతడు పాపను ముద్దు పెట్టుకున్నాడు.

పాప అతడికి ముద్దు పెట్టింది.

'నాన్నా.. నాన్నా' అంటూ తండ్రిని అల్లుకుపోయింది.

ఆ తల్లీకూతుళ్లిద్దరికీ ఎంతో సంతోషకరమైన సాయంత్రం అది. అతడు సంతోషం ఇచ్చిన సాయంత్రం.

భార్య తల గీరుకుంది. చెప్దామా వద్దా అన్నట్టుగా తబ్బిబ్బయ్యింది. అతడు బట్టలు మార్చుకున్నాక– టీ యిచ్చి– అతడు తాగుతూ ఉండగా 'కూరగాయలు లేవు. బజారు దాకా వెళదామా' అని అంది.

అలా సాయంత్రం పూట భర్తతో బజారుకు వెళ్లి ఇంటికి కావలసినవన్నీ తెచ్చుకోవాలని ఆమెకు కోరిక. అది దాదాపుగా సాధ్యం కాని కోరిక. అతడు నెరవేర్చని కోరిక. రావడమే ఆలస్యంగా వస్తాడు. వచ్చాక పాపను పలుకరించి లుంగీ చుట్టుకుంటాడు. ఆ తర్వాత పనేదైనా చెప్తే అది ఎంత సాధ్యమయ్యే పని అయినా చాలా సాధారణ పని అయినా చికాకు పడి కుదర్దని చెప్పి టీవీ ఆన్ చేసి దానిని చూడటంలో మునిగిపోతాడు.

కాని అతడు టీవీ ఎదురుగా ఉండడు. గతంలో ఎప్పుడో చేసిన పాపం దగ్గర ఉంటాడు. లేదంటే ఏదైనా చేసిన తప్పు దగ్గర ఉంటాడు. కాదంటే జరిగిపోయిన పొరపాటు దగ్గర ఉంటాడు. సాధారణంగా ఎక్కువసార్లు అతడు వీలైతే బాస్ దగ్గర లేదంటే కొలీగ్స్ దగ్గర ఉంటాడు. ఆ రోజు బాస్ అలా అంటే ఎందుకు అన్నాడు కొలీగ్స్ ఇలా అంటే ఎందుకు అన్నారు... అనుక్షణం వాళ్ల దగ్గరే ఉంటాడు. గతం... గతం...గతం.... కాని అతడు టీవీ ఎదురుగానే ఉంటాడు.

ఆ వేళ అలా కాదు అనుకున్నాడతడు.

భార్యవైపే చూస్తూ 'వెళదామా సరే' అన్నాడు.

ఆ మాత్రం దానికే భార్య కరిగిపోయి భర్తను పూర్తిగా క్షమించేసి సుఖపెట్టదలచి 'పోనీలేండి... చినుకులు పడుతున్నాయిగా. మళ్లెప్పుడైనా వెళదాం' అంది.

'అక్కర్లేదు. గొడుగు తీసుకొని వెళదాం. పాపను తీసుకొని అలా నాలుగడుగులు వేసి చాలా రోజులవుతుంది' అన్నాడతడు.

వాన ఆ వేళ డాన్స్ చేస్తోంది. ఆ సాయంత్రం నుంచి ఊగుతూ తూగుతూ వయ్యారాలు పోతూ నేలకు తాకే ముందు మెలి తిరుగుతూ సన్నగా లేతగా సుతారంగా చిందులు తొక్కుతోంది.

పెళ్లయ్యి ఎనిమిదేళ్లవుతోంది. కాని మొదటిసారిగా మగవాడి స్పర్శను అనుభవిస్తున్నట్టుగా భార్య గొడుగు కింద అతణ్ణి కరుచుకుపోయి నడుస్తోంది. అతడు పాపను ఎత్తుకొని గొడుగును ఒక చేత్తో పట్టుకొని నడుస్తున్నాడు. ఒక భుజాన భార్య ఒక భుజాన కూతురు పూర్తిగా తనవారైన తన మనుషుల సాంగత్యంలో అతడు అడుగులు వేస్తున్నాడు. వాళ్లు తప్ప తన సమక్షాన మరొకరు లేరు అన్న స్పృహతో ముందుకు నడుస్తున్నాడు. సంతోషమైన అలాంటి అడుగులు... వాళ్లతో మళ్లీ నడవలేనేమో అన్నంత అపురూపంగా వేసే అడుగులు... ఆ అడుగుల్లోని సంపూర్ణత్వాన్ని అతడు అనుభవిస్తున్నాడు.

మార్కెట్ వచ్చింది. కూరగాయల రంగులు అతడి కంటికి అద్భుతంగా అని

పించాయి. మొదటిసారి జీవితంలో వాటిని పరికించి చూస్తున్నానా అన్నట్టుగా చూశాడు. వానకు తడిసిన కూరగాయలు– పచ్చగా ఎర్రగా నీలంగా ఫ్రెష్‌గా...

'ఏం వొండమంటారండీ' అంది భార్య.

ఆమె అలా అడగదు. అతడి ఇష్టాన్ని కనుగొని, వొండి, అతడు తృప్తిగా తింటూ ఉంటే పక్కన నిలబడి చూసి...

'ఏం వొండుకుందాం చెప్పు' అన్నాడతను, తనతో కలుపుకొని మరికాసేపటిలో ఆ వంటలో ఆమెకు సాయపడబోతున్న వాడిలా.

ఆమె దిగ్భ్రమగా అతణ్ణి చూసింది. ఆ దిగ్భ్రమను చూసి అతడు సిగ్గుపడ్డాడు. చాలా సాధారణమైన సంతోషాన్ని ఆమె జీవితంలో దిగ్భ్రమ స్థాయికి తీసుకెళ్లి నందుకు నిజంగానే సిగ్గుపడ్డాడు.

వాళ్లు పాపను ఆడిస్తూ మధ్య మధ్య కబుర్లు చెప్పుకుంటూ వంట పూర్తి చేశారు. అసలు ఆ యింట్లో అప్పటి వరకూ వంటే జరగనట్టుగా మొదటిసారే వండుకుం టున్నట్టుగా ఎంతో సంతోషంగా సంబరంగా వొండుకున్నారు. ఆ సంతోషమంతా తమకు తెలిసేలా తమలో నిండిపోయేలా వొండుకున్నారు.

బయట వాన.

కాని అది మనసు పట్టలేనట్టుగా వీళ్ల ముచ్చట చూద్దామా అన్నట్టుగా అప్పు డప్పుడు కిటికీలో నుంచి జల్లులా లోపలికి తొంగి చూస్తోంది. నిజానికి ఆ రోజు వాన కూడా చాలా సంతోషంగా తిమ్మిరిగా రేపన్నదే లేదన్నంత ఆత్రంగా అంత లోనే నిమ్మళంగా కురుస్తున్నట్టు అతడికి అనిపించింది.

ఆమె ఆ రోజు చాలా శ్రద్ధగా వొండింది. ప్రపంచంలోని అద్భుతమైన రుచి అంతా ఆ పాత్రలలో ఇమిడిపోయేంత మహత్తుతో వొండింది. సాధారణంగా అతడు అన్నంతోపాటు టీవీని తోడు తెచ్చుకుంటాడు. అన్నం తింటూ టీవీ ఆన్ చేసి టీవీలో ఉంటాడు. లేదంటే మేగజైన్ తిరగేస్తూ మేగజైన్‌లో ఉంటాడు. ఫోన్ వస్తే అక్కడి నుంచి అదృశ్యమయ్యి దాదాపుగా అవతలి పక్కఉంటాడు.

కాని అతడు కంచం ముందే ఉంటాడు.

ఆ వేళ అలా లేడు.

అనుక్షణం సొంతం చేసుకునేలా ఉన్నాడు. అందుకే అతడు మెతుకులో మెతుకు అయ్యాడు. ముద్దలో ముద్ద అయ్యాడు. రుచి అంతా నాలుకలా మారిపోయాడు. నాలుక అంతా రుచిలా మారిపోయాడు. అసలు అతడే ఒక సంపూర్ణమైన భోజ

నంలా మారి అందులోని సంపూర్ణత్వమంతా అనుభవించాడు. ఆ తృప్తి అంతకు ముందు ఎరగడు.

పాప నిద్రపోయింది.

బయట వాన పడుతూనే ఉంది.

మెల్లగా నిశ్శబ్దంగా జోల పాడుతున్నట్టుగా లలితమైన సవ్వడి చేస్తున్నట్టుగా.

ఆమె గబగబా వెళ్లి చీర మార్చుకుని మెడ నిండా బుగ్గల మీదా పౌడరు రాసుకొని అతడు తెచ్చిన మల్లెపూలను సగం తుంచి ఫ్రిజ్‌లో దాచుకోకుండా అన్నీ పెట్టుకొని వచ్చి సోఫాలో అతడి పక్కన కూర్చుంది.

అతడు ఆమెను హత్తుకున్నాడు. మొదటిసారి హత్తుకున్నట్టుగా హత్తుకున్నాడు. ఆమె వీపును తాకుతూ ఆ స్పర్శ ద్వారా తనలోకి ప్రవహిస్తున్న ఆమె ప్రేమనూ కరుణనూ అనుభవిస్తూ అతడే ఆమెలా మారిపోయి అతడంతా ఆమెగా మారి పోయి ఆమెను హత్తుకున్నాడు. ఇప్పుడు కాకపోతే మళ్లీ హత్తుకోలేనేమో అన్నంత గాఢంగా హత్తుకున్నాడు. మళ్లీ జన్మలో హత్తుకోలేనేమో అన్నంత అపురూపంగా హత్తుకున్నాడు.

ఆ క్షణం వరకూ వాళ్లు స్త్రీ, పురుషులు. ఆ క్షణంలో తల్లీబిడ్డలు. అంతటి కరుణ ఆమెలో అంతకు మునుపు ఎప్పుడూ లేదు. అంతటి పసితనం అతడిలో కూడా.

'ఏమైందండీ' అందామె.

అతడు మౌనంగా సజలమై ఉన్నాడు.

'ఏమైందండీ' అందామె అతణ్ణి ఊరడిస్తున్నదానిలా.

అతడు విడివడి నవ్వుతూ 'ఏం లేదు'అన్నాడు.

ఆమె నవ్వింది.

అతడు ఆమె చేతిని తీసుకొని తన చేతులతో ఊరడిస్తూ అలా చేయడం వల్ల తనే ఊరడింపు పొందుతూ అన్నాడు–'నేను ఎంత అదృష్టవంతుణ్ణి. ఈ క్షణంలో నేను ఉన్నాను. ఈ క్షణంలో నువ్వు ఉన్నావు. ఈ క్షణంలో మన పాప ఉంది. ఈ క్షణంలో బయట వాన పడుతూ ఉంటే చల్లటిగాలి వీస్తూ ఉంటే నిలువ నీడ లేనివాళ్లు తల మీద గూడు లేని వాళ్లు వానకు తడుస్తూ వొణుకుతున్న వాళ్లు ఈ రాత్రి గడవడం ఎలా అని బాధపడుతున్నవాళ్లు ప్రమాదాల్లో చిక్కుకున్నవాళ్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవాళ్లు శవాల దగ్గర జాగారం చేస్తున్నవాళ్లు జైళ్లలో

మగ్గుతున్నవాళ్లు యుద్ధాల్లో నిమగ్నమైనవాళ్లు ఎందరో ఉండగా ఈ క్షణంలో నువ్వూ నేనూ పాప ఇలా కడుపు నిండుగా భోజనం చేసి వెచ్చగా భద్రంగా సురక్షితంగా నిద్రకు ఉపక్రమిస్తున్నామంటే నిజంగా ఎంత అదృష్టం చెప్పు' అన్నాడు.

ఆమె అతడి వైపు చిత్రంగా చూసింది.

'ఏమైందండీ... మీకు యివాళ' అంది.

అతడు నవ్వాడు.

'నువ్వు ఇవాళ సంతోషంగా ఉన్నావా చెప్పు. నా వల్ల' అన్నాడు.

'చాలా సంతోషంగా' అందామె.

'రోజూ ఇంతే సంతోషంగా ఉంటే ఎంత బాగుంటుందో చెప్పు' అన్నాడు.

ఆమె అతణ్ణి అల్లుకుపోయింది. అతడు ఆమెను అల్లుకుపోయాడు. వాళ్లు ఇద్దరూ ఒక్కరైపోయారు. వాళ్ల ఆత్మలు ఏకమయ్యి తాకి వొరుసుకొని శూన్యమయ్యి తిరిగి ఆకారం పొంది విముక్తమయ్యాయి.

ఆ క్షణంలో కలయికలోని మాధుర్యమంతా అతడు సంపూర్ణంగా అనుభవించాడు. అసలు అతడే కలయికలా మారిపోయి విశ్రమించాడు. అలాంటి ఆనందం అతడు జన్మలో ఎరగడు.

బయట వాన శాంతించింది.

ఆమె ఒళ్లు మరిచి నిద్రపోయింది.

అతడు నిద్రపోయే ముందు ఎప్పటిలాగే పాప దగ్గరకు వెళ్లి పాప మంచం మీద నుంచి దొర్లిపోకుండా అడ్డంగా దిండు పెట్టాడు. అలా చేస్తున్నప్పుడు అతడికి ఎందుకనో కృతజ్ఞతగా అనిపించింది. ఇన్నేళ్లుగా తాను నిద్రపోయాక ప్రతిరోజూ రాత్రి నిద్రలో తాను దొర్లిపోకుండా కాపాడుకుంటూ ఈ సృష్టిలోని అనంతచైతన్యం తన పక్కన ఒక రహస్య దిండును అమర్చిపెడుతోంది కదా అని అర్థమయ్యి కన్నీళ్లతో హృదయం నిండిపోయింది.

తెల్లవారింది.

ఈ విశ్వంలో ఈ చరాచర జగత్తులో ఎటువంటి వ్యత్యాసమూ కనిపించకుండా ఎప్పటిలాగే సూర్యోదయం అయ్యింది.

నదులు ఎప్పటిలాగే తుళ్లుకుంటూ పరుగులు తీస్తూనే ఉన్నాయి. ఎండిన చోట వాన పడి తిరిగి ప్రాణం పోసుకుంటూనే ఉన్నాయి. వాటి గర్భంలో చేపలు కువకువమని కదులుతూ గుంపులుగా ఈదుతూనే ఉన్నాయి. సముద్రాలు ఆదిమ

ఆజ్ఞకు లోబడి చెలియలికట్ట దాటకుండా వెనక్కు మరలుతూనే ఉన్నాయి. అవి పొర్లివచ్చిన చోట కూడా ఒక తల్లి ఎంతో సురక్షితంగా చోటు చూసుకొని ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తగలబడిన అరణ్యాలలో ఆ రాత్రి రహస్యంగా కొన్ని తీగలు కొత్త చిగుళ్లు తొడిగి అవి పాకిన చెట్లను మరింత బలంగా పెనవేసుకు న్నాయి. ఈ సృష్టిలోని అనంత చైతన్యం– తనకు కావలసిన సమస్తాన్ని యథా తథంగా ప్రాణప్రదంగా కాపాడుకుని ఆ ఉదయం మళ్లీ యధాతథంగా నిద్రలే పింది.

అతడూ నిద్ర లేచాడు. తాను జీవించడానికి మరో రోజు దొరికినందుకు కృతజ్ఞతను ప్రకటిస్తూ నిద్రలేచాడు. మరి అతడు– మరుసటి రోజనేదే లేనట్టుగా ఆ రోజు పని చేస్తాడు.  మరి అతడు– మరుసటి సాయంత్రమే లేనట్టుగా ఆ సాయంత్రం ఇంటికి చేరుకుంటాడు.

అతడు సంతోషంగా లేచి భార్యను పలకరించాడు.

సంతోషంగా కదిలి పాపను ఎత్తుకున్నాడు.



**కృతజ్ఞతలు**

కథా నిలయం నిర్వాహకులకు
అక్షర సీత గారికి
గొరుసు జగదీశ్వర రెడ్డికి

## Best Rain Stories in Telugu

Edited by

**Mohammed Khadeer Babu**

- పాలగుమ్మి పద్మరాజు
- రావిశాస్త్రి
- దేవరకొండ బాలగంగాధర తిలక్
- బీనా దేవి
- శారద
- సత్యం శంకరమంచి
- బి.ఎస్.రాములు
- మహేంద్ర
- ఏ.ఎం. అయోధ్యా రెడ్డి
- జగన్నాథ శర్మ
- కుప్పిలి పద్మ
- స్వామి
- గుమ్మా ప్రసన్నకుమార్
- అద్దేపల్లి ప్రభాకర్
- శ్రీకాంత్.కె
- స.వెం.రమేశ్
- గంగుల నరసింహారెడ్డి
- అజయ్ ప్రసాద్
- పూడూరి రాజిరెడ్డి
- మహమ్మద్ ఖదీర్‌బాబు

